సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 145

శుక్రవారం 15-8-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సోనోవిజన్ ఇండిపెండెన్స్‌డే సేల్

ఇండిపెండెన్స్‌డే సేల్ సందర్భంగా సోనోవిజన్ అందించే డిస్కౌంట్‌లో అన్ని కంపెనీల LED, వాషింగ్‌మెషిన్స్, రిఫ్రిజిరేటర్స్, AC, ఎయిర్ కూలర్స్, మొబైల్స్ & ల్యాప్‌టాప్స్ Premium మోడల్స్ సోనోవిజన్‌లో లభిస్తున్నాయి. ముఖ్యంగా ఇండిపెండెన్స్‌డే సందర్భంగా పెద్ద మొత్తంలో లభించే క్యాష్‌బ్యాక్ పట్ల కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇండిపెండెన్స్‌డే సందర్భంగా హోండా అమేజ్ కారు డ్రా కోసం కొనుగోలుదారులు ఎదురు చూస్తున్నారు.


అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో...
సోనోవిజన్
ఇండిపెండెన్స్‌డే సేల్
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
అతి తక్కువ ధరలు Lowest Prices GUARANTEED Best Service నమ్మకమైన సర్వీస్
LG 195 Cm (77") 4K OLED Flexi EMI : 6999/-
SAMSUNG 189 Cm (75") LED 4K Ultra UHD Flexi EMI : 3990/-
SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart Flexi EMI : 6500/-
Panasonic 108 Cm (43") LED 4K HD EMI : 2791/-
Haier 139 Cm (55") LED 4K HD Smart Flexi EMI : 1994/-
TCL 108 Cm (43") LED 4K HD EMI : 2084/-
BPL 108 Cm (43") UHD 4K Smart LED EMI : 1942/-
LG Front Load Automatic Washing Machine 9 KGS EMI : 2734/-
SAMSUNG Front Load Automatic Washing Machine 12 KGS EMI : 3267/-
BOSCH Front Load Automatic Washing Machine 7 KGS EMI : 2817/-
IFB Top Load Automatic Washing Machine 7 KGS EMI : 1725/-
Whirlpool Top Load Automatic Washing Machine 7.5 KGS EMI : 1334/-
LG Top Load Automatic Washing Machine 8.5 KGS EMI : 1809/-
LLOYD Semi Automatic Washing Machine 7 KGS EMI : 859/-
iPhone 16, 16+ 4000/- Cash Back 12/0, 24/0 & 24/8 Schemes Available
Selected Bank Cards (Exchange Bonus 8000/-)
iPhone16 EMI : 3333/- iPhone16+ EMI : 3745/-
vivo X-200 - 5G X-200Pro - 5G Ram Expandable 8/0, 12/0, 24/0 Schemes Available 10% Cash Back EMI : 4666/-
SAMSUNG S-25 Ultra Mobile 12000/- Cash Back 24/0 Scheme Available EMI : 4875/-
oppo F-29 PRO 5G 8/0, 9/0 Schemes & 12/1 Scheme Available EMI : 2500/-
ONEPLUS 13 5G Ram Expandable Instant Cash Back ICICI Credit Card 12/4 Scheme Available EMI : 3750/-
realme 14 - 5G 6/0, 8/2, 10/3 Schemes Available Selected Models EMI : 3700/-
Smart Watch Ear Buds Mobile Accessories Boat, Realme, Fastrack, Hapipola
hp 12/4 Scheme Available EMI : 4333/-
Lenovo 12/4 Scheme Available EMI : 4166/-
DELL 15/4 Scheme Available EMI : 4583/-
ASUS 12/4 Scheme Available EMI : 3960/-
MacBook 24/0 Scheme Available EMI : 4166/-
Sound Bar
LG Side by Side 635 Litres Refrigerator EMI : 12900/-
SAMSUNG Side by Side 650 Litres Refrigerator EMI : 5750/-
Whirlpool Frost Free Double Door 235 Litres Refrigerator EMI : 1800/-
Haier Frost Free Double Door 240 Litres Refrigerator EMI : 1750/-
Godrej Frost Free Double Door 270 Litres Refrigerator EMI : 1840/-
VOLTAS Direct Cool Single Door 175 Litres Refrigerator EMI : 1041/-
LLOYD Direct Cool Single Door 188 Litres Refrigerator EMI : 1160/-
Crompton Air Cooler 55 Litres Starting Price 8300/-
KENSTAR Air Cooler 60 Litres Starting Price 7200/-
orient electric Air Cooler 30 Litres Starting Price 5900/-
Symphony Air Cooler 60 Litres Starting Price 7000/-
LG 5Star & 3Star Inverter A.C Starting EMI : 3000/-
LLOYD 5Star & 3Star Inverter A.C Starting EMI : 2875/-
BLUE STAR 5Star & 3Star Inverter A.C Starting EMI : 3041/-
VOLTAS 5Star & 3Star Inverter A.C Starting EMI : 2875/-
DAIKIN 5Star & 3Star Inverter A.C Starting EMI : 3000/-
Water Dispenser Starting Price Rs:9000/-
Water Purifier RO Starting Price Rs:12000/-
Water Geyser 10 Litres Starting Price Rs:6200/-
Microwave Oven Starting Price Rs:6200/-
KITCHEN SMALL APPLIANCES
Air Chimney Starting Price Rs:8100/-
3 Burner Glass Cooktop Starting Price Rs:5000/-
Wet Grinder Starting Price Rs:3100/-
Rice Cooker Starting Price Rs:1650/-
Mixer Grinder 3 Jar, 750 Watts Starting Price Rs:2900/-
Juicer
Air Fryer
Kettle
Iron Box
Blender
T & C Apply
EUREKA FORBES KENT pureit Sunflame Preethi Butterfly FABER KAFF V-GUARD KEELINE AOSmith UNISTAB Crompton MAHARAJA HAVELLS hindware morphy richards BAJAJ
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విశాఖపట్నం
డైమండ్‌పార్క్ - 1 ద్వారకా నగర్, వైజాగ్ 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
ద్వారకానగర్ 2వ లైన్, పోలక్స్‌స్కూల్ ఎదురు, వైజాగ్. 8712635857, 858, 859.
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్.గాజువాక. 9440804187, 9100991705
న్యూ సుకన్య థియేటర్.గోపాలపట్నం 9100991704, 9154281129
భారత్ పెట్రోల్ బంక్ ఎదురు, గోపాలపట్నం. 8712635833
కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ. 9246666214, 9390006613
తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి. 9246662288, 9246666212
జె.యన్.రోడ్, రాజమండ్రి. 9100991700, 9154281119
ఇన్నస్‌పేట, రాజమండ్రి. 9154281197, 98, 99
రామయ్య స్ట్రీట్, కాకినాడ. 9246665511, 9246666201
సర్పవరం జంక్షన్, కాకినాడ. 7331149376, 77, 78
శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
చెన్నయ్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు. 9246666206, 9154279913
ముత్తుకూరు గేట్, మిని బైపాస్ రోడ్, నెల్లూరు.- 8712600519, 20, 21
ఒంగోలు
బాపూజి మార్కెట్, ఒంగోలు. 9246666329, 9154279911
పశ్చిమ గోదావరి
జువ్వల పాలెం రోడ్, భీమవరం. 8333924936, 9154281175
బడేటి పార్క్ ఎదురు, ఏలూరు. 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు. 9390006620, 9154281112
అంబికాదేవి టెంపుల్, సత్రంపాడు, ఏలూరు - 8712635838, 839
పైడిపర్రు రోడ్, తణుకు. 8333924938, 9154281115
తాడేపల్లిగూడెం
గొల్లగూడెం సెంటర్, తాడేపల్లిగూడెం. 8712635854, 55, 56
విజయనగరం
3 లాంతర్ల సెంటర్, 9246666208, 9154281239
ఐస్ ఫ్యాక్టరి జంక్షన్, 8712600523, 8712600535
శ్రీకాకుళం
రామలక్ష్మణ జంక్షన్, జి.టి.రోడ్, శ్రీకాకుళం. - 9154281140, 41
విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ. 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ. 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ. 9246661616, 9100991702
రింగ్ రోడ్, విజయవాడ. 8712600531, 532, 533
పాయకాపురం, విజయవాడ. 8712648704, 05, 06.
విజయప్లాజా (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650.
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ. 9100991701, 9246666664
ఎనికేపాడు, విజయవాడ. 9100991703, 9154281626
ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్, గొల్లపూడి, విజయవాడ. 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ. 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47
గుడివాడ
ఏలూరు రోడ్, గుడివాడ. 9100991708, 9154281178, 79
మచిలీపట్నం
మునిసిపల్ పార్క్ ఎదురు, రామనాయుడుపేట, కోనేరు సెంటర్, మచిలీపట్నం - 7331149379, 80, 81
గుంటూరు జిల్లా
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం, మెయిన్ రోడ్, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
బ్రాడీపేట, గుంటూరు. 9246666215, 9100991706
రత్నాటాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్ రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368
నరసరావుపేట
రైల్వేస్టేషన్ రోడ్, అరండల్‌పేట, 8712648710, 11, 12.
రాయలసీమ
న్యూ బాలాజి కాలని, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి - 7331149370, 371, 372
అలిపిరి రోడ్, లీలామహల్ జంక్షన్, తిరుపతి - 9100991707, 9154279918
నేతాజి రోడ్, తిరుపతి. 9440804186, 9154279916
ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు, పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43,
అమ్మా హాస్పిటల్ సెంటర్, సి-క్యాంప్ ఆఫీస్, కర్నూలు - 8333924947, 48
హెచ్.పి.పెట్రోల్ బంక్ ప్రక్కన, సుభాష్ రోడ్, అనంతపురం - 9154281191, 92
రాజీవ్ గాంధి పార్క్ రోడ్, యస్.ఆర్.రాజీవ్ పార్క్ కడప - 9154281194, 96
పలమనేరు రోడ్, దర్గా ఎదురు, చిత్తూరు. 8712600528, 8712600530
తపోవనం స్కూల్ ఎదురు, వెల్లూరు రోడ్డు, చిత్తూరు. 8712635836, 46, 47
టి.టి.డి. కళ్యాణ మండపం ఎదురు, శ్రీనివాస నగర్ నంద్యాల - 8712600525, 526, 527
ఖమ్మం
కస్బాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
పర్ణశాల ఎదురు, వైరారోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38
కొత్తగూడెం
కొత్తగూడెం, భద్రాచలం రోడ్. 9154867825, 26, 27
మిర్యాలగూడ
ఆర్&బి సాగర్ రోడ్, వైష్ణవిగ్రాండ్ దగ్గర 8712635848
కరీంనగర్
వి. పార్క్ ఎదురుగా, జగిత్యాల రోడ్ 8712635843, 44, 45
వేములవాడ రోడ్, మంకమ్మతోట 8712635841, 42
హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి. 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్. 7331149363, 364, 365
మలక్‌పేట, హైదరాబాద్. 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు. 8333924943, 9154281188
బి.యన్.రెడ్డి నగర్, సాగర్ రోడ్, 8712648707, 708, 709
ప్యారడైస్ కాలని, షాద్‌నగర్. 8712648701, 02, 03.
మహబూబ్‌నగర్
గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, మెట్టుగడ్డ 8712635851, 52, 53



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 145

శుక్రవారం 15-8-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



డాక్టర్ వీస్ పేస్ కన్నుమూత

ఒలింపిక్ పతక విజేత. క్రీడా వైద్యుడిగా గుర్తింపు టెన్నిస్ స్టార్ పేస్‌కు తండ్రి - స్పోర్ట్స్‌లో



భారత్‌కు రేటింగ్ బూస్ట్

బీబీబీ స్టేబుల్ అవుట్‌లుక్‌కు అప్‌గ్రేడ్ ప్రకటించిన ఎస్అండ్‌పీ - బిజినెస్‌లో



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 145

శుక్రవారం 15-8-2025



సూచీలకు స్వల్ప లాభాలు
స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నేడు మార్కెట్‌కు సెలవు - బిజినెస్‌లో



ఒక్కొక్కరం.. ఒక్కో రంగు
స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నటి పూర్ణ ఇంటర్వ్యూ - ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 15-8-2025



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నటి పూర్ణ, హీరో శివ కందుకూరి పంచుకున్న విశేషాలు



ఒక్కొక్కరం ఒక్కో రంగు - పూర్ణ

● స్కూల్ డేస్‌లో ఇండిపెండెన్స్ డే ప్రోగ్రామ్స్‌లో పాల్గొనేదాన్ని. దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ఓ మంచి గుర్తుగా మిగిలిపోయింది. ఇప్పుడు కూడా నా స్కూల్ డేస్‌ని గుర్తు చేసుకుంటున్నాను. దానికి కారణం దుబాయ్‌లో నేను ఆరంభించిన 'డ్యాన్స్ స్కూల్'. ఈ స్కూల్ స్టార్ట్ చేశాక వచ్చిన తొలి ఇండిపెండెన్స్ డే ఇది. ఈ సందర్భంగా మా స్కూల్ స్టూడెంట్స్‌తో దేశభక్తికి సంబంధించిన రీల్ చేయించాం. సోషల్ మీడియా ద్వారా ఇవాళ రిలీజ్ చేయనున్నాం. రిపబ్లిక్ డే అప్పుడు ఇలాంటిదే చేశాం. అప్పుడు నేను కూడా పాల్గొన్నాను. ఈసారి షూటింగ్స్ ఉండటంతో హైదరాబాద్‌లో ఉన్నాను.

● స్కూల్లో 'ఏ మేరా ఇండియా' అని డ్యాన్స్ చేస్తున్నప్పుడు ఒళ్లు పులకరించిపోయేది. ఇప్పటికీ ఆ పాట పాడుతుంటే ఓ రకమైన ఎమోషన్ కలుగుతుంది. నేను ఫార్మల్‌గా డ్యాన్స్ నేర్చుకున్నాను. అందుకే దేశం పట్ల నాకు ఉన్న భక్తిని దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ద్వారా వ్యక్తపరుస్తుంటాను. అసలు 'ఇండియా' అని పలుకుతుంటేనే ఎంతో బాగుంటుంది.

● చిన్నప్పుడు స్కూల్ ప్రోగ్రామ్స్‌లో పార్టిసిపేట్ చేసినప్పుడు బాగా పర్ఫార్మ్ చేయాలనే దాని మీదే ఎక్కువ ఫోకస్ ఉండేది. అలాగే జెండా రంగులు వచ్చేలా ఒక్కొక్కరం ఒక్కో రంగు డ్రెస్ వేసుకోవడం అనేది ఓ తీపి గుర్తు. తర్వాత తర్వాత మనకు ఇండిపెండెన్స్ రావడానికి ఎందరి త్యాగం ఉందో తెలుసుకుని, వాళ్లందరి మీద గౌరవం పెరిగింది. అలాగే మనం ఇక్కడ క్షేమంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో ఉంటున్న సైనికుల వల్లే. అందుకే ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సైనికా... సెల్యూట్' అంటున్నాను.

● సైనికుల త్యాగాల గురించి చెబుతుంటే నాకు యాంకర్ రష్మీ గుర్తొస్తున్నారు. ఆమె సోదరుడు ఆర్మీలో ఉన్నారు. యుద్ధం జరిగినప్పుడు అక్కడ ఉన్న తన సోదరుడి గురించి ఇక్కడ వీరి కుటుంబం ఫీలింగ్స్‌ని స్వయంగా చూశాను. సోల్జర్స్ కుటుంబాలు పడే ఆవేదన, దేశ రక్షణలో తమ కుటుంబం నుంచి ఒక వ్యక్తి ఉన్నారనే ఆనందం... ఇలా రెండు ఫీలింగ్స్ కనబడుతుంటాయి.

● భవిష్యత్తులో మన పిల్లలు ఏ ఉద్యోగంలో స్థిరపడతారో చెప్పలేం. కానీ మా అబ్బాయితో మాత్రం 'నిన్ను ఆర్మీలో చేర్పిస్తా' అంటుంటాను. ఎందుకంటే వాడికి ఏ బొమ్మలూ నచ్చవు. అవి ఎంత పెద్దవైనా. వాటి పక్కన చిన్న గన్ ఉంటే చాలు... దాంతోనే ఆడుకుంటాడు. ఎక్కువగా అవే కొనుక్కుంటాడు. అందుకే మా అబ్బాయిలో నాకో సోల్జర్ కనబడుతుంటాడు.

అప్పుడు నేను నెహ్రూ - శివ కందుకూరి

● స్వాతంత్ర్య దినోత్సవం రోజున తప్పనిసరిగా స్కూల్‌కి హాజరవ్వాలనే నియమం ఉంటుంది. రూల్ ఉందని కాదు... ఇష్టంగా వెళ్లేవాణ్ణి. ఆ రోజు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఎప్పుడూ గుర్తుండిపోయే చిన్ననాటి జ్ఞాపకం. జెండా ఎగరేస్తుంటే సెల్యూట్ చేస్తూ, చూడటం నాకు చాలా హ్యాపీగా ఉండేది. అందుకే మిస్ కాకుండా స్కూల్‌కి వెళ్లేవాణ్ణి. నా చిన్నప్పుడు స్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ కోసం నెహ్రూజీలా డ్రెసప్ అయ్యాను. అలా రెడీ అయి, వెళ్లడం నాకు గుర్తుంది. అప్పుడు దేశభక్తి పూర్తి అర్థం తెలియదు. అయితే ఇప్పుడు ఒక హీరోగా ఏదైనా ఫ్రీడమ్ ఫైటర్ రోల్ చేసే అవకాశం వస్తే... తప్పకుండా చేయాలని ఉంది. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన పోరాట యోధుల గురించి మరోసారి గుర్తు చేసే అవకాశం ఉంటుంది కదా.

● మామూలుగా మనం చదువుకుంటున్నప్పుడు దేశ, విదేశీయులు కూడా ఆ ఇన్‌స్టిట్యూషన్స్‌లో చేరుతుంటారు. అలా నేను అమెరికాలో చదువుకున్న యూనివర్సిటీలో పలు దేశాలవారిని కలిశాను. వాళ్ల దేశాల్లో ఉండే నియమ నిబంధనలు విన్నప్పుడు 'నా దేశం ఎంతో మెరుగ్గా ఉంది కదా' అనిపించింది. ఒక ఫ్రీ కంట్రీలో బతుకుతున్నప్పుడు ఆ దేశానికి మనం విలువ ఇవ్వాలి. ఆ దేశం గురించి మనం గర్వపడాలి. ముఖ్యంగా ఆడవాళ్ల విషయంలో కొన్ని దేశాల్లో హద్దులు హారిబుల్. అమ్మాయిలు బయటకు వెళ్లకూడదు... డ్రైవ్ చేయకూడదు వంటి నియమాలు చూసి, మగవాళ్ల ఆధిపత్య పోరు ఎంతలా ఉందీ అనిపించింది. అఫ్‌కోర్స్ ఇప్పుడు ఆ నియమాల్లో కాస్త వెసులుబాటు వచ్చిందనుకోండి.

● నేను యూఎస్‌లో ఓ పదేళ్ల పాటు ఉన్నాను. ట్రాన్సిల్‌వేనియాలో ఉన్న 'ఇండియన్ అసోసియేషన్' వారు 2013లో ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ ఆరంభించారు. ఆ వేడుకల్లో రెండుసార్లు జెండా ఎగరేసే అదృష్టం నాకు దక్కింది. విదేశీ గడ్డ మీద మన మాతృదేశం జెండా ఎగరేయడం అనే ఫీలింగ్ మాటలకు అందనిది. పైగా మన భారతీయులు విదేశీ గడ్డపై ఐకమత్యంతో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం అనేది నాకు బాగా అనిపించింది. నా మూలాల మీద నాకు మరింత ప్రేమ పెరిగేలా చేసింది.

స్వాతంత్ర్యదినోత్సవ థీమ్... నయా భారత్

థీమ్ అనేది అలంకారప్రాయం కాదు. మన భవిష్యత్ లక్ష్యాల గురించి బలంగా చెప్పే... సంక్షిప్త సందేశం. ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తూ, కొత్త శక్తులతో ముందడుగు వేసినప్పుడే కొత్త భారతాన్ని ఆవిష్కరించుకోగలుగుతాము. ఈ భావాన్ని ప్రతిబింబించేలా 'నయా భారత్' అని ఈ స్వాతంత్ర్య దినోత్సవం థీమ్‌ను నిర్ణయించారు.



డాలీగారి దేశభక్తి

'దేశభక్తి మీకేనా? నాకు కూడా ఉంది' అని చెప్పకనే చెప్పింది డాలీ. పెయింటర్ డాగ్‌గా పాపులర్ అయిన డాలీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. తాజాగా త్రివర్ణ పతాకం పెయింట్ వేసి 'ఆహా' అనిపించేలా చేసింది డాలీ. 'శునక రాజమా... నీ దేశభక్తికి జోహార్లు' అంటున్నారు నెటిజనులు.



తండ్రి పేరు వందేమాతరం..!

'పేరులో పవర్ ఉంటుంది' అంటారు. కొన్ని పేర్లు వింటే 'నిజమే!' అనిపిస్తుంది. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఈ కుటుంబసభ్యుల పేర్లలో దేశభక్తి ధ్వనిస్తుంది. తండ్రి పేరు వందేమాతరం ప్రహ్లాద్ నాయక్. కుమారుడి పేరు తిరంగా ప్రియదర్శన్. కూతురు పేరు జైహింద్ జగ్యన్ సేని. 'మతాన్ని ప్రతిఫలించే పేర్లు కాకుండా దేశభక్తిని ప్రతిఫలించే పేర్లు అంటే నాకు ఇష్టం' అంటున్న వందేమాతరం స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. వందేమాతరం ఇంటిలోని గదులు జాతీయజెండాలోని మూడు రంగులతో అలంకరించి ఉంటాయి.

ఈ అమెరికన్ మన జాతీయగీతం అద్భుతంగా ఆలపిస్తాడు!

పదిహేడు సంవత్సరాల అమెరికన్ గేబ్ మెరిట్ ఆలపించిన మన జాతీయగీతం 'జన గణ మన' సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'ఓ మై గాడ్... నా హృదయం దేశభక్తితో ఉప్పొంగిపోయింది' అనే కాప్షన్‌తో ఈ వీడియోను షేర్ చేసింది దిశ అనే నెటిజన్. 'ఎన్నో దేశాల జాతీయగీతాలు పాడినప్పటికీ గేబ్‌కు మన జాతీయగీతం ఆలపించడం అంటే ప్రత్యేక అభిమానం' అని రాసింది దిశ.



అంటార్కిటికాలో వందేమాతరం





అంటార్కిటికాలోని పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు ఆగస్ట్ పదిహేను పర్వదినాన్ని పురస్కరించుకొని జాతీయజెండా ఎగరేయడానికి సన్నద్ధం అవుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వాతావరణ ప్రతికూలతలు ఉన్నప్పటికీ 'మేము సైతం' అంటూ జాతీయపతాకావిష్కరణకు సన్నద్ధం అవుతున్న దృశ్యం నెటిజనులను ఆకట్టుకుంది. ఉద్యోగులు మంచుపెకిలిస్తుంటే, నేపథ్యంలో 'వందేమాతర గీతం' వినిపిస్తుంటుంది.


● 50 ఏళ్ల షోలే (1975-2025)

షోలే... అప్పుడది తుపాన్ ఇండియా

సినిమా మొత్తం రెండు జతలకు మించి వాడని హీరోలు... హీరోయిన్ ఏమో టాంగేవాలీ... ఇంకో హీరోయిన్ వితంతువు... ముఖ్య క్యారెక్టర్ ఆర్టిస్టుకు రెండు చేతులూ ఉండవు... విలన్‌కు గట్టిగా చూస్తే 20 మందికి మించి గ్యాంగ్ లేదు... లొకేషన్ ఉత్త రాళ్లదిబ్బలు... ఇవాళ్టి పాన్ ఇండియా సినిమాలతో పోల్చి చూస్తే ఈ లక్షణాలతో ఏదైనా సినిమా సూపర్ హిట్ అవుతుందా? అవుతుంది... అయ్యింది... అవుతూనే ఉంది... 'షోలే' - ఒక ప్రెజెంట్ కంటిన్యుయెస్ టెన్స్ 50 ఏళ్లుగా 'షోలే' లిఖించిన రికార్డులు ఎన్నో. చెప్పిన కొటేషన్లు మరెన్నో. 'జో డర్ గయా... సమ్‌ఝో మర్‌గయా'... మరణమే లేని షోలేతో ప్రేక్షకుల వీడని దోస్తీ గురించి ప్రత్యేక కథనం...







'పుష్ప' సినిమా రెండు పార్ట్‌లుగా వచ్చి కోట్లు సంపాదించింది.

ఒక గంధపు చెక్కల స్మగ్లర్ హీరోనా అని ఒకరిద్దరు క్వశ్చన్ చేశారు.

కాని సగటు జనం జానేదో అని సూపర్‌హిట్ చేశారు.

ఈ సగటు జనం ఇక్కడి వరకూ చేయడానికి చాలా మెట్లు పడ్డాయి.

వాటిలో 'షోలే' ఒకటి.

***

సలీమ్–జావేద్ హిందీలో యాంగ్రీ యంగ్‌మేన్‌ను తెచ్చారు. అంటే స్వాతంత్ర్యం వచ్చాక జన్మించి, యుక్త వయసు వచ్చేనాటికి అంటే 1970ల నాటికి దేశ స్థితి చూస్తే ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, బ్లాక్ మార్కెట్. రోజులు ఇలా ఉంటే అమ్మాయి వెంట పరిగెత్తి విరహగీతాలు పాడే హీరో చెల్లుబాటు కాదు అని వాళ్ల కోపంగా ఉండే హీరోని తెచ్చారు. 'జంజీర్'లో అమితాబ్ అలాంటి హీరో. ఇతను ఇన్‌స్పెక్టర్‌గా ఉంటూ కూడా తన తల్లితండ్రులను చంపిన వాణ్ణి చట్టప్రకారం శిక్షించలేకపోతాడు. యూనిఫామ్‌ను వదిలాకే పగ సాధిస్తాడు. చట్టానికి ఆవల కొన్ని పనులు చేసే హీరోలు అలా పుట్టుకొచ్చారు. ఆ తర్వాత 'దీవార్' వచ్చింది. కష్టపడి పని చేసే హీరోకు బదులు అడ్డదారిలో స్మగ్లర్‌గా మారే హీరోగా కనిపిస్తాడు అమితాబ్. సినిమాలో నిజాయతీపరుడైన శశికపూర్ ఉన్నా అందలానికి ఎదిగిన అమితాబ్‌ను ఆరాధిస్తాడు ప్రేక్షకుడు. ఈ వరుసలోనే వచ్చింది 'షోలే'. ఇక్కడ అత్యంత దుర్మార్గుడైన గబ్బర్ సింగ్‌ను సంహరించడానికి ఇద్దరు చిల్లర దొంగలను కాంట్రాక్ట్ మీద పట్టుకొస్తాడు ఊరి పెద్ద ఠాకూర్. చిల్లర దొంగల్లో వీరత్వం ఉండటం, కొంచెం మానవత్వం ఉండటంతో మేలు చేయని పోలీసుల కంటే కొద్దిగా కీడు చేసే చిల్లర దొంగలే నయం అనుకుంటారు రామ్‌గఢ్ వాసులు, తద్వారా ప్రేక్షకులు. ఆ విధంగా సకల సద్గుణ శోభితుడైన హీరోకు నూకలు చెల్లుతూ వచ్చి 'పుష్ప' వరకూ అతడు రూపాంతరం చెందాడు.

***

'షోలే' కథ అంతా రెండు లైన్లలో చెప్పొచ్చు. గొప్ప కథలు ఏవంటే కట్టె కొట్టె తెచ్చె అన్నట్టుగా చెప్పగలిగేవే. పోలీస్ ఆఫీసర్ ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ సింగ్ చంపేశాడు. ఆ ప్రాంతానికి పీడగా మారాడు. వాణ్ణి చంపడానికి ఠాకూర్ ఇద్దరు దొంగలను కిరాయికి తెచ్చాడు. అంతే కథ. ఈ కథను మూడున్నర గంటల పాటు 70 ఎం.ఎం స్క్రీన్ మీద దర్శకుడు, నటీనటులు, రచయితలు, కెమెరామేన్, సంగీత దర్శకుడు ఎలా చూపారనేదే అసలు సంగతి. వాళ్లు ఎలా చూపారంటే అలా మరెవరూ, మరెప్పుడూ చూపలేకపోయారు. అందుకే షోలే అంటే షోలే. ఇలాంటి సినిమాలు సర్పాల తలలపై మణుల వంటివి. రీమేక్‌లని ప్రయత్నిస్తే మణులు రాళ్లయిపోతాయి. లేదా పాము కాటు తప్పదు. అందుకే 'షోలే'ను మళ్లీ మళ్లీ ముస్తాబు చేసి వదిలారు తప్ప రీమేక్ అంటే జనం తుపాకులు తీశారు.

***

'షోలే' యాక్షన్ సినిమా అనుకుంటారు. ఫక్తు కుటుంబ కథా చిత్రం. కుటుంబమే దీనికి ఆధారం. ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ గాడు కాల్చి చంపాడు. కుటుంబం కోల్పోతే మనిషికి ఉండే బాధతో ప్రేక్షకుడు ఐడెంటిఫై అవుతాడు. ఆ రోజుల్లో మగవారి ఎర్లీ డెత్స్ వల్ల ప్రతి ఇంటా ఒక వితంతువు ఉండేది. జయభాదురి వేసిన రాధ పాత్రను ప్రేక్షకులు పోల్చుకున్నారు. భర్త పోయిన ఎన్నో ఏళ్లకు ఆమె 'జయ్' అనే అమితాబ్‌ను చూసి మళ్లీ అతనితో కుటుంబాన్ని నిర్మించుకోవచ్చేమో అని ఆశ పడుతుంది. ఆ ఆశ ప్రేక్షకులకు తెలుసు. ఆమెకో కుటుంబం ఏర్పడాలని వారూ అనుకుంటారు. జరగదు. జయ్ చనిపోతాడు. ప్రేక్షకులు అక్కడా కనెక్ట్ అవుతారు. ఏ తాడూ బొంగరం లేని వీరూ అను ధర్మేంద్ర టాంగేవాలీతో సరసం చేసి సాధించుకుంది మౌసీతో పాటు ఒక కుటుంబాన్నే కదా! ఇక కథలో ఇమామ్ గారి కుటుంబానికి వచ్చిన బాధ ఎవరు మరుస్తారు. చేతికి ఎదిగొచ్చిన కొడుకు పట్నం పోయి సంపాదిస్తాడనుకుంటే తండ్రిని ఏకాకిని చేసి గబ్బర్ చేతుల్లో ప్రాణాలు కోల్పోతాడు. కుటుంబం ఉనికే భారతదేశ సమాజపు ఉనికి. ఇన్ని కుటుంబాల ఉద్వేగాల అల్లిక కాబట్టే 'షోలే' ఆడింది. ఆడుకుంది.

***

'షోలే' ప్రివ్యూ కోసం థియేటర్‌లో కూచున్న రాజ్‌కపూర్ సినిమా మొదలైన పది నిమిషాల్లోనే మొదలయ్యే ట్రైన్ రాబరీ సీక్వెన్స్ చూసి చకితుడయ్యాడు. 'ఇదేంటి... క్లయిమాక్స్‌ను ముందే పెట్టేశారు' అన్నాడట పక్కనున్న వారితో. అవును 'షోలే' క్లయిమాక్స్ ముందే వచ్చేస్తుంది... అంత భారీగా. ఆ తర్వాత 'షోలే'ను కేవలం సన్నివేశాల బలం మీద నడుపుతారుగాని యాక్షన్ మీద కాదు. 'షోలే' క్లయిమాక్స్ కేవలం ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మీదే! చేతుల్లేని ఠాకూర్ చేతులు తెగ్గొట్టే గబ్బర్‌తో తలపడతాడు. ఇలా స్క్రీన్‌ప్లే రాసిన 'షోలే' ఆడిందంటే ఏమిటి మర్మం! అదే మిటో ఎవరూ చెప్పలేరు. చెప్పినా కొంతే. రొంతే. అంతంతే. షోలేకు వ్యాఖ్యానం లేదు.

***

1973లో మొదలెట్టి రెండేళ్ల పాటు తీశారు 'షోలే'. కార్పెట్లు అమ్మి, ఆ తర్వాత రియల్ ఎస్టేట్ చేసి సంపాదించిన డబ్బును కొడుక్కు ఇచ్చి సినిమా చేయమన్నాడు నిర్మాత జి.పి.సిప్పీ. కోటి రూపాయల సినిమా! వస్తే చాలా డబ్బులు రావాలి పోతే కోటి అన్నాడు. అందుకు తగ్గ కథ రమేష్ సిప్పీ రాయించుకున్నాడు సలీమ్ జావేద్‌లతో! అతని వేడి చూసి – వాళ్లు కూడా రంగంలో దిగారు. 'లోహా గరమ్ హై... మార్ దో హథోడా' (ఇనుము వేడి మీద ఉన్నప్పుడే సమ్మెట పోటు పడాలి) అనుకున్నారు. ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మధ్య ఇద్దరు దొంగలను ప్రవేశపెట్టి కథ అల్లారు. దీనికి ప్రేరణ అకిరా కురసావా 'సెవన్ సమురాయ్', మనం తీసిన 'మేరా గావ్ మేరా దేశ్'... ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి. అన్నీ తీసుకుని మనది ఇవ్వడం కూడా విద్యే. ఆ విద్యతో తయారైన ఈ కథకు ద్వారకా దివేచా కెమెరా, రామ్ యెదేకర్ ఆర్ట్ డైరెక్షన్, ఎం.ఎస్.షిండే ఎడిటింగ్, ఆర్.డి.బర్మన్ సంగీతం... గంధపు చేతులకు మల్లెలు చుట్టాయి. మరి రమేష్ సిప్పీ ఇంత మంచి టేకింగ్‌ను ఎలా సాధించాడో అతనికే తెలియాలి.

ధర్మేంద్ర, అమితాబ్, అంజాద్ ఖాన్, సంజీవ్ కుమార్, హేమమాలిని, జయభాదురి... ఎవరికి ఎవరు తక్కువ. సత్తువ చూపడం వారికి మక్కువ.

***

'షోలే'లో ప్రతి సన్నివేశానికి, ప్రతి ఫ్రేమ్‌కు అభిమానులున్నారు. అందులోని ప్రతి చిన్న పాత్రకూ అభిమానులున్నారు. జైల్లో గూఢచారిగా పని చేసే బార్బర్ హరిరామ్, పిరిమిగా కట్టెలు అమ్మే సూర్మా భూపాలి, నమక్ తినే కాలియా, గబ్బర్‌కు బదులు పలికే సాంబా, హిట్లర్ జైలర్, ఠాకూర్ నమ్మినబంటు రామ్‌లాల్, పిల్లనిచ్చేందుకు ధర్మేంద్ర గుణగణాలు ఆరాతీసే మౌసీ, 'మెహబూబా' పాటలో మెరిసిన జలాల్ ఆగా... ప్రతి ఒక్కరూ... సినిమాను ధన్యం చేశారు... ధన్యులయ్యారు. ప్రేమ నాటకం కోసం వాటర్ ట్యాంకర్ ఎక్కిన ధర్మేంద్ర 'చక్కీ పీసింగ్' (తిరగలి తిప్పింగ్) అంటాడు. ప్రేక్షకులు నవ్వుతారు. 'సూసైడ్' అంటే ఆత్మహత్య అని ధర్మేంద్ర వల్లే జనానికి ఇంగ్లిష్‌లో తెలిసింది.

> పంచ్ డైలాగ్స్ ఫలానా దర్శకుడు వచ్చాక, ఫలానా రచయిత వచ్చాక ట్రెండ్‌లోకి వచ్చాయి అని ఎవరైనా అంటే నోటితోనే నవ్వబుద్ధవుతుంది. సకల పంచ్ డైలాగ్‌లకు బాప్ 'షోలే'. అందులో ప్రతి మాటా ఒక పంచ్ డైలాగే. పైగా అవి నిత్య జీవితంలోకి వచ్చేసిన డైలాగులు. కొటేషన్‌లు. సూక్తులు.
>
> - ఇజ్జత్ కీ మౌత్ జిల్లత్ కీ జిందగీ సే కయీ అచ్ఛీ హై (పరాభవాలతో బతికే కన్నా పరువుతో చావడం మేలు)
> - ముఝేతో సబ్ పోలీస్ వాలోంకీ సూరతే ఏక్ జైసీ లగ్ తీ హై (నాకు అందరు పోలీసోళ్ల ముఖం ఒకలాగే కనిపిస్తుంది)
> - తేరా క్యా హోగా కాలియా (నీ గతేంది కాలియా)
> - తుమ్హారా నామ్ క్యా హై బసంతి? (నీ పేరేంటి బసంతి)
> - దామ్ జో తుమ్ చాహో... ఔర్ కామ్ జో మై చాహూ (సొమ్ము మీరు కోరినంత... పని నేను చెప్పినంత)

***

'షోలే' తన శబ్దాలతో కూడా మనకు కనెక్ట్ అవుతుంది. రైలు కూతా, గుర్రపు డెక్కల చప్పుడు, జట్కా మువ్వలు, అజాన్, దూది ఏకే కవాను, కమ్మరి మోత... ఇక ఈ సినిమాకు ముందు రివాల్వరు, రైఫిలు పేలితే అలాంటి సౌండ్ వస్తుందని ప్రేక్షకులకు తెలియదు. బ్రిటిష్ స్టంట్‌మెన్ ఈ సినిమాకు స్టంట్ కొరియోగ్రాఫర్లుగా పని చేశారు. ట్రైన్ రాబరీలో ఒక బుల్లెట్ తగిలి గూడ్సు పెట్టెకు అంటించిన సర్కారు కాగితం చిట్లుతుంది. అలాంటి ఒక్క షాటు తర్వాతి కాలంలో తీయలేకపోయారు.

***

'షోలే' గొప్పతనం తెల్లార్లు చెప్పుకోవాలి. గబ్బర్ సింగ్ పేరు వాడుకుని ఒక హిట్ సినిమా తీసుకున్న మనం 'షోలే' యాభై ఏళ్ల సందర్భంగా ఉత్సవం తప్పక చేసుకోవాలి. ఈ సినిమాను తిరగేసి గుహనాథన్ కథ చెప్తే బాగుందని రామానాయుడు గారు 'కక్ష' తీశారు. ఇందులోని కొన్ని సీన్లు దర్శకేంద్రుడి 'అడవి రాముడు'కు పనికి వచ్చాయి. 'షోలే' ఎందరినో డైరెక్టర్లు అయ్యేలా చేసింది.

రైలుతో మొదలయ్యి రైలుతో ముగిసే ఈ సినిమా భారతీయ ప్రేక్షకులతో యాభై ఏళ్ల ప్రయాణం చేసింది.

ఇంకో యాభై ఏళ్లు ఇకపై చేస్తుంది.

ఏ దోస్తీ హమ్ నహీ తోడెంగే
తోడెంగే దమ్ మగర్ తేరా సాథ్ న ఛోడెంగె...
న ఛోడెంగె...

- కె.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) ఆగస్టు 14న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	1,01,310
బంగారం (22 క్యారెట్లు)	94,670
వెండి	1,18,300

విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,03,050
బంగారం (22 క్యారెట్లు)	92,900
వెండి	1,18,700


విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,01,350
బంగారం (22 క్యారెట్లు)	92,900
వెండి	1,26,000

రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,03,050
బంగారం (22 క్యారెట్లు)	95,690
వెండి	1,18,700

ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	1,00,950
బంగారం (22 క్యారెట్లు)	92,870
వెండి	1,17,700

చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,01,340
బంగారం (22 క్యారెట్లు)	92,900
వెండి	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.


'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+8 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 145



శుక్రవారం 15-8-2025

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నటుడు దర్శన్ బెయిల్ రద్దు

అభిమాని హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ నటుడు దర్శన్ బెయిల్‌ను రద్దు చేసి.. అరెస్టు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

వివరాలు Vలో ▸



ఎవరి పంతం నెగ్గుతుందో..

రెండు భిన్నమైన లక్ష్యాల సాధన కోసం ట్రంప్, పుతిన్ శుక్రవారం అలస్కాలో సమావేశం కాబోతున్నారు.

వివరాలు VIలో ▸



మరిన్ని టారిఫ్‌లు

ట్రంప్, పుతిన్ చర్చలు విఫలమైతే భారత్‌పై అదనపు టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని అమెరికా పేర్కొంది.

వివరాలు VIలో ▸



తీవ్ర పరిణామాలు తప్పవు

కవ్వింపు చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదని పాకిస్తాన్‌ను భారత్ హెచ్చరించింది.

వివరాలు VIలో ▸

కన్నీటి వరద

46 మంది మృతి

220 మంది గల్లంతు



చోసితీ గ్రామంలో వరద ప్రవాహానికి దెబ్బతిన్న ఇళ్లు

కశ్మీర్‌లోని కిష్తవాడ్‌లో గంటపాటు క్లౌడ్ బరస్ట్ చోసితీ గ్రామాన్ని ముంచెత్తిన భారీ వరద

- విరిగిపడిన కొండ చరియలు.. ధ్వంసమైన ఇళ్లు, దుకాణాలు
- బాధితుల్లో మచైల్ మాత భక్తులు, ప్రజలు
- 167 మందిని రక్షించిన సహాయక బృందాలు
- ఎటు చూసినా హృదయవిదారక దృశ్యాలు..
- బురద, రాళ్ల కింద ఛిద్రమైన స్థితిలో మృతదేహాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న అధికారులు

VI లో

- క్లౌడ్ బరస్ట్‌పై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
- సహాయక, పునరావాస చర్యలు వేగవంతం చేయాలన్న మోదీ
- జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాతో మాట్లాడిన అమిత్ షా

దేశ రాజధానిలో వాన హోరు

రహదారులన్నీ జలమయం
పలు ఘటనల్లో ముగ్గురు మృతి

VI లో

హత్య చేసి.. తగులబెట్టి..



- సబ్బవరం మండలం బాటజంగాల పాలెం వద్ద వివాహిత దారుణ హత్య
- మృతదేహం వద్ద లభించిన ఆధారాలతో కేసు దర్యాప్తు

6 లో

'పరీక్ష' తప్పింది!

- ఎస్సీఈఆర్టీ చర్యలతో గాడితప్పిన పరీక్ష విధానం
- ఎఫ్ఏ–1తో తెల్లబోయిన ఉపాధ్యాయులు
- కొత్తవిధానంపై అవగాహన కల్పించకుండా అమలు
- అక్షరాలు నేర్చుకునే విద్యార్థులు పదాలు రాయాలనడంపై విస్మయం
- అసెస్‌మెంట్ పుస్తకాలతో మరింత గందరగోళం

8 లో

రిగ్గింగ్ ఎన్నికల్లో.. సిగ్గుపడే గెలుపు

ప్రతిపక్షానికి చెందిన ఏజెంట్లే లేకుండా జరిగిన ఈ ఎన్నికలు ఒక ఎన్నికలా?

రిగ్గింగ్‌కు పాల్పడి, అనైతికంగా పోలీసుల సాయంతో గెలిచిన టీడీపీ సంబరాలు చేసుకోవడం ఏమిటి?

సాధారణంగా ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా స్వేచ్ఛగా ఓటేసేందుకు పోలీసు వ్యవస్థను వినియోగిస్తారు

తొలిసారిగా ప్రజలు ఓట్లు వేయకుండా ఉండేందుకు పోలీసులను వాడిన దుర్మార్గమైన చరిత్ర బాబుదే

అధికార టీడీపీ అరాచకాలను ఎండగడుతున్న ప్రజాస్వామికవాదులు, రాజకీయ విశ్లేషకులు

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అడ్డదారిలో టీడీపీ విజయం

కళ్లు మూసుకుని కూర్చున్న ఎన్నికల కమిషన్

2 లో



దొంగ ఓట్లు వేసిన టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీకి 683 ఓట్లు వచ్చాయంటే టీడీపీ వాళ్లే నమ్మడం లేదు

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

2 లో

సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేనికి బెయిల్



- అర్నేష్‌కుమార్ కేసు తీర్పును పాటించాల్సిందే.. ముందుగా 41ఏ నోటీసు ఇచ్చి.. ప్రాథమిక విచారణ చేయాలి
- ఆదేశాలు పాటించకపోతే చర్యలు తప్పవు
- ఏపీ పోలీసులకు సుప్రీంకోర్టు హెచ్చరిక

V లో


65 లక్షల ఓటర్ల డేటా బహిర్గతం చేయండి



- ప్రతి ఒక్క పేరుకు.. తొలగింపు కారణాన్నీ వెల్లడించండి
- బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశంలో ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

VI లో

సొంత ఆదాయ వనరులు పెంచండి



- కాంట్రాక్టు సంస్థలు ఏపీలోనే పెట్రోల్, డీజిల్ ఉత్పత్తులు కొనాలి
- ఈ ఏడాది రాష్ట్ర ఆదాయంలో 8 శాతం వృద్ధి అంచనాలు
- సీఎం చంద్రబాబు

IV లో

క్లుప్తంగా...

1న పెన్షన్ మార్చ్
సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి పోరు బాటపడుతున్నారు. సెప్టెంబర్ 1న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు 'బ్లాక్ డే' నిర్వహించనున్నట్లు సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు 'పెన్షన్ మార్చ్' పేరుతో నల్ల చొక్కాలు ధరించి పాదయాత్ర చేయనున్నట్లు వెల్లడించింది.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులివ్వండి
ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులను కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) సీఎం చంద్రబాబును కోరింది. దీర్ఘకాలంగా పదోన్నతులు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైనప్పటికీ పదోన్నతి పొందకుండానే ఎంతోమంది ఆర్టీసీ ఉద్యోగులు రిటైర్ అవ్వాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పదోన్నతులు కల్పించాలని ఆయన కోరారు.

మద్యం అక్రమ కేసులో బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

విజయవాడలీగల్: మద్యం కేసులో రిమాండ్‌లో ఉన్న శ్రీధర్‌రెడ్డి తరఫున ఏసీబీ కోర్టులో న్యాయవాది నగేష్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ న్యాయమూర్తి సెలవు నేపథ్యంలో ఈనెల 18వ తేదీకి వాయిదా పడింది. ఇదే కేసులో పైలా దిలీప్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 19వ తేదీకి, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్లపై విచారణ 20వ తేదీకి వాయిదా పడింది. కాగా, 11 కోట్ల నగదును సిట్ అధికారులు జప్తు చేసిన వ్యవహారంపై విచారణ ఈనెల 20వ తేదీకి వాయిదా పడింది.

వ్యవసాయంపై వాతావరణ మార్పుల ప్రభావం
సీఆర్ఐడీఏ డైరెక్టర్ డా.వి.కె.సింగ్

సాక్షి, అమరావతి: వాతావరణంలో వస్తున్న మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రై ల్యాండ్ అగ్రికల్చర్ (సీఆర్ఐడీఏ) డైరెక్టర్ వీకే సింగ్ అన్నారు. వ్యవసాయంలో వాతావరణ మార్పులు–సవాళ్లకు సమాధానాలు అనే అంశంపై ఐసీఏఆర్–సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో స్టేక్ హోల్డర్స్ కన్సల్టింగ్ వర్క్‌షాప్ గురువారం వీసీ శారద జయలక్ష్మి దేవి మాట్లాడుతూ.. నేల సారాన్ని, నీటి వనరులను కాపాడేలా వ్యవసాయ పరిశోధనలకు సరైన ప్రణాళిక అవసరమన్నారు. వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ జి.శివనారాయణ, రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు, సీఆర్ఐడీఏ శాస్త్రవేత్త ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.

■ తెలంగాణ

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

శంషాబాద్ (హైదరాబాద్): రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్ భద్రతాధికారులను ఉరుకులు.. పరుగులు పెట్టించింది. గురువారం సాయంత్రం వచ్చిన ఈమెయిల్‌ను అధికారులు పరిశీలించారు. గుజరాత్‌లోని బుజ్ ఎయిర్‌పోర్టుతో పాటు హైదరాబాద్ ఎయిర్‌పోర్టును.. దాయాది దేశానికి చెందిన ఉగ్రవాదులు విమానాన్ని హైజాక్ చేసి, బాంబుతో పేల్చివేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. అప్రమత్తమైన అధికారులు విమానాశ్రయంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ మెయిల్ నకిలీదని గుర్తించారు.



నూతన వధూవరులకు వైఎస్ జగన్ ఆశీర్వాదం




తరలివచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కుమారుడి వివాహ వేడుక గురువారం అనంతపురంలోని ఇంద్రప్రస్థ జీఎంఆర్ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై నూతన వధూవరులు ప్రణయ్‌రెడ్డి, రోహితకు వివాహ శుభాకాంక్షలు తెలియజేసి.. ఆశీర్వదించారు. వైఎస్ జగన్ రాక సందర్భంగా అనంతపురానికి ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. ఆయనతో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. వైఎస్ జగన్ అందరికీ అభివాదం చేస్తూ.. ఆప్యాయంగా పలకరించారు.

వాట్సాప్ వెబ్ వాడుతున్నారా?

ఆఫీసులో అయితే జాగ్రత్తలు తప్పనిసరి	సమాచారం బహిర్గతమయ్యే అవకాశం	నెట్‌వర్క్‌కూ పొంచి ఉన్న సైబర్ ముప్పు	యూజర్లను హెచ్చరించిన ఎంఈఐటీవై

వాట్సాప్.. మన దైనందిన జీవితంలో కీలక భాగమైంది. వ్యక్తులు ఎవరైనా.. సౌకర్యవంతమైన ఈ మెసేజింగ్ యాప్ రాకతో సమాచారం ఇచ్చిపుచ్చుకునే విధానాన్నే మార్చింది. ప్రపంచంలో యూజర్ల పరంగా అతిపెద్ద మెసేజింగ్ యాప్‌గా అవతరించి అత్యంత ప్రజాదరణ పొందుతోంది. అయితే సౌలభ్యం కోసం ఉద్యోగులు చాలామంది వాట్సాప్ వెబ్‌ను ఆఫీస్ డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్‌లలో వాడుతుంటారు. తద్వారా సున్నిత సమాచారం బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఈ చిన్న అలవాటు తీవ్రమైన భద్రతా ముప్పుకు దారి తీయవచ్చని స్పష్టం చేస్తోంది.



సాక్షి, స్పెషల్ డెస్క్

ప్రజలు తమ కార్యాలయంలోని కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో వాట్సాప్ వెబ్‌ను ఉపయోగించడం మానేయాలని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై) కోరింది. పని ప్రదేశంలో వేగంగా కమ్యూనికేట్ చేయడం కోసం ఉపకరణాల్లో వ్యక్తిగత చాటింగ్ చేయడం, ఫైల్స్‌ను ఉపయోగించడం సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ.. అలా చేయడం వల్ల సంస్థ యజమానికి సున్నిత సమాచారం బహిర్గతమవుతుందని ప్రభుత్వం వివరించింది. అంతేగాక కార్పొరేట్ నెట్‌వర్క్స్‌ను అడ్మినిస్ట్రేటర్స్, ఐటీ బృందాలు పర్యవేక్షిస్తుంటాయి. స్క్రీన్–మానిటరింగ్ సాఫ్ట్‌వేర్, మాల్వేర్, బ్రౌజర్ హైజాక్‌లతో సహా వివిధ మార్గాల ద్వారా వీరు ప్రైవేట్ సంభాషణలు, వ్యక్తిగత ఫైల్స్‌ను చూసే అవకాశం ఉందని ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అవేర్‌నెస్ (ఐఎస్ఈఏ) వెల్లడించింది.

ప్రమాదంలో డేటా..

కార్పొరేట్ కంపెనీల ఉపకరణాల్లో మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించడం వల్ల కలిగే నష్టాల గురించి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అవేర్‌నెస్ (ఐఎస్ఈఏ) బృందం ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. సైబర్ భద్రతపై కార్యాలయాల్లో పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఎంఈఐటీవై నుంచి ఈ హెచ్చరిక తాజాగా జారీ అయింది. అనేక సంస్థలు ఇప్పుడు వాట్సాప్ వెబ్‌ను భద్రతా ముప్పుగా పరిణమించే వేదికగా చూస్తున్నాయని ఐఎస్ఈఏ చెబుతోంది. 'మాల్వేర్, ఫిషింగ్ దాడులకు వాట్సాప్ వెబ్ ఒక గేట్‌వే. ఇది వారి మొత్తం నెట్‌వర్క్‌ను పణంగా పెడుతుంది. వ్యక్తిగత ఫోన్‌కు ఆఫీస్ వై–ఫైని ఉపయోగించడం కూడా శ్రేయస్కరం కాదు. నెట్‌వర్క్ సురక్షితంగా లేకున్నా, పర్యవేక్షణ వ్యవస్థలు ఉన్నా ప్రైవేట్ డేటా ప్రమాదంలో పడుతుంది' అని సూచించింది.

యూజర్లు 200 కోట్లు..

ప్రపంచంలో ఎక్కడున్నా టెక్స్ట్ సందేశాలు, ఫొటోలు, వీడియోలు, పత్రాలు పంపడానికి, వాయిస్ కాల్స్, వీడియో కాల్స్ చేయడానికి వాట్సాప్ వీలు కల్పిస్తోంది. ఫోన్ కాల్స్, ఈ–మెయిల్స్ వంటి సంప్రదాయ కమ్యూనికేషన్ సాధనాల కంటే సౌలభ్యంగా ఉండడంతో వాట్సాప్‌ను మరింత నమ్మదగిన వేదికగా మార్చింది. వాట్సాప్ నెలవారీ యాక్టివ్ వినియోగదార్ల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల పైచిలుకు ఉందంటే ఏ స్థాయిలో జనంలో మమేకమైందో అర్థం చేసుకోవచ్చు. 85.4 కోట్ల యూజర్లతో భారత్ తొలి స్థానంలో దూసుకుపోతోంది. ఇంట్లో, బయట ఉన్నప్పుడు ఫోన్లో వాట్సాప్ వాడేవారు కార్యాలయానికి చేరుకోగానే వాట్సాప్ వెబ్‌ను ఉపయోగిస్తున్నారు.

వాట్సాప్ వెబ్‌ను ఆఫీసులో తప్పనిసరిగా ఉపయోగించాల్సి వస్తే..

- డెస్క్ నుండి బయటకు వెళ్లే ముందు వాట్సాప్ వెబ్ నుండి లాగ్ అవుట్ అవ్వండి.
- లింక్‌లపై క్లిక్ చేసేటప్పుడు లేదా అపరిచితుల నుండి వచ్చిన అటాచ్‌మెంట్స్‌ను తెరిచేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.
- పని కోసం వ్యక్తిగత అప్లికేషన్స్, ఉపకరణాలను ఉపయోగించే విషయమై కంపెనీ డిజిటల్ పాలసీలను తెలుసుకోండి.

పొంచి ఉన్న ప్రమాదాలు..

ప్రైవసీకి ముప్పు: ఉపకరణాలను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నట్టయితే వ్యక్తిగత సంభాషణలు, పత్రాలు ఐటీ నిర్వాహకులకు కనిపించవచ్చు.

హానికర సాఫ్ట్‌వేర్: కార్యాలయంలోని కంప్యూటర్లు లక్ష్యంగా వాట్సాప్ వెబ్ ద్వారా హానికర ఫైల్స్ (మాల్వేర్) చేరవచ్చు. ఇదే జరిగితే మొత్తం నెట్‌వర్క్ సైబర్ నేరస్తుల చేతుల్లోకి వెళ్తుంది.

నెట్‌వర్క్ ఆధారిత స్నూపింగ్: వాట్సాప్ ఉపయోగిస్తున్నప్పుడు ఫోన్‌ను ఆఫీస్ వైఫైకి కనెక్ట్ చేయడం వలన వ్యక్తిగత డేటా కార్పొరేట్ నిఘా సాధనాలకు బహిర్గతమవుతుంది.





తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జేకే మహేశ్వరి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి లలిత

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జేకే మహేశ్వరి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి లలిత, ప్రముఖ సినీ తార జాన్వీ కపూర్ గురువారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. కాగా, జస్టిస్ ఎన్వీ రమణ, న్యాయమూర్తి జేకే మహేశ్వరి, న్యాయమూర్తి లలిత గురువారం రాత్రి తిరుమలలోనే బసచేసి శుక్రవారం శ్రీవారిని మరోమారు దర్శించుకోనున్నారు.

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సుమలత గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీకాళహస్తి ఆలయంలో జస్టిస్ చిల్లకూరు సుమలత



శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ఏపీఈఆర్‌సీ చైర్మన్‌గా ఐఏఎస్ అధికారి?

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని తమకు అనుకూలుడైన ఐఏఎస్ అధికారి చేతుల్లో పెట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రూ.వేల కోట్ల విద్యుత్ సంస్థల లావాదేవీలు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు వంటి ఆర్థిక విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, తీర్పులు ఇవ్వడం ఈ మండలిపై ఉన్న అతిపెద్ద బాధ్యత. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఏపీఈఆర్‌సీ తొమ్మిది నెలలుగా చైర్మన్ లేకుండా, ఐదునెలలుగా ఒక్క సభ్యుడితో నెట్టుకొస్తోంది. చైర్మన్ పదవి భర్తీచేయకపోవడానికి.. తమకు అనుకూలుడైన ఐఏఎస్ అధికారికి ఆ పదవి అప్పగించాలని నిర్ణయించుకోవడమేనని తెలిసింది. ఒక చైర్మన్, ఇద్దరు సభ్యులు ఉండే ఏపీఈఆర్‌సీకి 2024 అక్టోబర్ నుంచి పూర్తిస్థాయి చైర్మన్ లేరు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక సభ్యుడు పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఒక్కరే ఇన్‌చార్జ్ చైర్మన్‌గా, సభ్యుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం పలు ప్రైవేటు సంస్థలతో అత్యధిక ధరలకు కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు మండలి ఆమోదం తెచ్చుకుంది. ఐదునెలల తరువాత ఇప్పుడు ఒక సభ్యుడి నియామక ప్రక్రియ మాత్రమే చేపట్టి.. దానికి కూడా గడువు పెంచుకుంటూ కాలయాపన చేస్తోంది. సాధారణంగా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని ఏపీఈఆర్‌సీ చైర్మన్‌గా నియమిస్తుంటారు. న్యాయమూర్తి స్థాయి వారు ఈ పదవిలో ఉంటే తామనుకున్న పనులు జరగవని కూటమి నేతలు భావిస్తున్నారు. అందువల్లే చైర్మన్ పదవి భర్తీ విషయాన్ని పక్కన పెట్టేశారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్‌ను ఎప్పటిలోగా నియమిస్తారో చెప్పాలని ఇటీవల హైకోర్టు కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది.


బెనారస్ వర్సిటీలో తెలుగు ఆచార్యుడిపై హత్యాయత్నం

- మరో ఆచార్యుడు బూదాటి వెంకటేశ్వర్లు కుట్ర
- శాఖాధిపతి పదవి కోసం పథకం


సాక్షి, అమరావతి: వారణాసిలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యుడిపై హత్యాయత్నం ఘటన అధ్యాపక వర్గాల్లో కలకలం రేపుతోంది. గత నెల 28న పట్టపగలే బెనారస్ విశ్వవిద్యాలయంలో కిరాయి వ్యక్తులు తెలుగు విభాగాధిపతి చల్లా శ్రీరామచంద్రమూర్తిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. గాయపడిన శ్రీరామచంద్రమూర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు నిందితులను పట్టుకోవడంతో కుట్ర కోణం బయటపడింది. గతంలో బెనారస్ వర్సిటీ తెలుగు విభాగాధిపతిగా పని చేసిన ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు ప్రస్తుత విభాగాధిపతి శ్రీరామచంద్రమూర్తిని హత్య చేయించేందుకు కుట్ర పన్నినట్టు తెలుస్తోంది. బూదాటి వెంకటేశ్వర్లు జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు సన్నిహితుడు. శ్రీరామచంద్రమూర్తిని తప్పిస్తే తిరిగి తెలుగు విభాగాధిపతి పదవిని తానే పొందవచ్చనే కుట్రతో దుశ్చర్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రమోద్‌కుమార్‌ను మంగళవారం రాత్రి దఫీ ప్రాంతంలో పట్టుకోవడానికి ప్రయత్నించగా.. పోలీసులపై కాల్పులకు తెగబడ్డాడు. పోలీసుల ఎదురు కాల్పుల్లో అతని కాలి గాయంతో పట్టుబడ్డాడు. అదే వర్సిటీలోనే పీహెచ్‌డీ పూర్వ విద్యార్థి భూతుర్ భాస్కర్‌కు కూడా కుట్రలో భాగం ఉండటంతో.. తెలంగాణలో అతడిని అరెస్టు చేసినట్టు కాశీ జోన్ అడిషనల్ సీపీ టి.శరవణన్ బుధవారం తెలిపారు. కాంట్రాక్ట్ కిల్లర్ ప్రమోద్‌కుమార్ అలియాస్ గణేష్ పాసి ప్రయాగ్‌రాజ్‌కు చెందిన వాడిగా గుర్తించామన్నారు. వీళ్లకు సహకరించిన జౌన్‌పూర్‌కు చెందిన వేదాంత్ భూషణ్ మిశ్రా అనే మరో నిందితుడిని అరెస్టు చేశామన్నారు. 2016 నుంచి ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లుతో సన్నిహితంగా ఉంటున్న భూతుర్ భాస్కర్‌ను, మైసూరులో పనిచేస్తున్న కాశిం బాబును పిలిపించుకుని హత్యాయత్నానికి పథకం రచించారన్నారు. శ్రీరామచంద్రమూర్తి బైక్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో ఇనుప రాడ్లతో దాడి చేశారని, ఈ దాడిలో శ్రీరామచంద్రమూర్తి రెండు చేతులు విరిగిపోయాయని చెప్పారు. నిందితులు పట్టుబడటంతో బూదాటి వెంకటేశ్వర్లు పరారైనట్టు చెప్పారు. ఆయన మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారన్నారు. బూదాటి వెంకటేశ్వర్లుతో పాటు ఇతర నిందితులైన సూరజ్ దుబే, ప్రద్యుమ్న యాదవ్, విశాల్ యాదవ్, కాశింలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని చెప్పారు.

ఇద్దరు ఏపీ పోలీసు అధికారులకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు

- 'ప్రతిభాపూర్వక సేవ' కింద మరో 23 మందికి కూడా..
- దేశవ్యాప్తంగా మొత్తం 1,090 మందికి శౌర్య/సేవా పతకాలు



చెన్నుపాటి భద్రయ్య



రాజీవ్ కుమార్

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి/కర్నూలు/లక్ష్మీపురం(గుంటూరు ఈస్ట్) : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు చెన్నుపాటి భద్రయ్య (ఎస్పీ), గోపు రాజీవ్‌కుమార్ (డీఎస్పీ) రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీసు పతకానికి ఎంపికయ్యారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీసెస్‌కు చెందిన మొత్తం 1,090 మంది అధికారులకు శౌర్య/సేవా పోలీస్ పతకాలను ప్రకటించింది. ఇందులో మొత్తం 25 మంది ఏపీ అధికారులు ఈ పతకాలకు ఎంపికయ్యారు. కేంద్ర హోంశాఖ గురువారం ఈ జాబితా విడుదల చేసింది. ఇందులో భాగంగా.. దేశవ్యాప్తంగా 233 మందికి శౌర్య పతకాలు (జీఎం), 99 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు (పీఎస్ఎం), 758 మందికి ప్రతిభాపూర్వక సేవా పతకాలు (ఎంఎస్ఎం) ప్రకటించింది. వీరిలో ఏపీకి చెందిన ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం, 20 మంది పోలీసులకు కరెక్షనల్ సర్వీసెస్ కింద, ముగ్గురు అధికారులకు ప్రతిభాపూర్వక సేవా పతకాలు లభించాయి. ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో, నేరాలను నిరోధించడంలో లేదా నేరస్తులను అరెస్టుచేయడానికి విధి నిర్వహణలో ప్రదర్శించిన శౌర్యం, తెగువ ఆధారంగా రాష్ట్రపతి శౌర్య పతకం (పీఎంజీ), శౌర్య పతకం (జీఎం) కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. అలాగే, విధి నిర్వహణలో అందించిన విశిష్ట సేవకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం (పీఎస్ఎం), విలువైన సేవకు ప్రతిభాపూర్వక సేవా పతకం (ఎంఎస్ఎం) ఇస్తున్నారు.

ప్రతిభాపూర్వక సేవా పతకాలు

రవికృష్ణ ఆకే (ఐజీ), శ్రీనివాసరావు వల్లూరి (డీఎస్పీ), వీరవెంకట ప్రతాప్‌కుమార్ తోట (డీఎస్పీ), కోదండ శ్రీరామచంద్రరాజు దెందుకూరి (అసిస్టెంట్ కమాండెంట్), గోవిందరావు మామిడి (ఇన్‌స్పెక్టర్), రామకృష్ణ గండెం (ఇన్‌స్పెక్టర్), శ్రీనివాసరావు బొడ్డు (హెడ్ కానిస్టేబుల్), సీతారాము కరిమకొండ (ఎస్ఐ), చంద్రశేఖర్ పెదిరెడ్డి (ఏఎస్ఐ), నాగమల్లేశ్వరరావు విశ్వరావు (ఏఎస్ఐ), వెంకటరామశర్మ బుర్రా (ఏఎస్ఐ), ఉస్మాన్ గనిఖాన్ నయేబ్ (ఏఎస్ఐ), గోపాల్ కరువా (ఎస్ఐ), కోటేష్ కోట్టకోట (ఎస్ఐ), నాగేశ్వరరావు దొమ్మేటి (ఏఎస్ఐ), సీతారామాంజనేయులు పామర్తి (ఏఎస్ఐ), నాగబాబు కొప్పిశెట్టి (ఏఎస్ఐ), గోపాలకృష్ణ గుబ్బల (హెడ్ కానిస్టేబుల్), సురేష్‌కుమార్ మురుగేశన్ (హెడ్ కానిస్టేబుల్), దానం గద్ద (హెడ్ కానిస్టేబుల్), డా. వరప్రసాద్ మామిళ్లపల్లి (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్), రవికుమార్ కరణం (చీఫ్ హెడ్‌వార్డర్), వీరవెంకట సత్యనారాయణరావు తలపర్తి (హెడ్ వార్డర్)

జమ్మూకశ్మీర్‌లో ఏపీ ఐపీఎస్‌కు కూడా..

ఇక జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న కర్నూలుకు చెందిన ఐపీఎస్ అధికారి జీవీ సందీప్ చక్రవర్తి కూడా రాష్ట్రపతి పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. చక్రవర్తి అక్కడ అనేక ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన ధైర్యసాహసాలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే, గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ఆర్పీఎఫ్ డీఎస్పీ గొల్లమూడి మధుసూదనరావు, రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ కుక్కల రాజగోపాల్‌రెడ్డి కూడా రాష్ట్రపతి పోలీసు మెడల్స్‌కు ఎంపికయ్యారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, డీఆర్ఎం సుధేష్ట సేన్ వీరికి అభినందనలు తెలిపారు.



..యుద్ధం ఆపకుంటే.. యుద్ధం చేస్తాడట!

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+8 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 145



'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఉగ్రవాదంపై మానవత్వ పోరు

ఆపరేషన్ సిందూర్‌ను పహల్గాం ఉగ్రదాడికి దీటైన జవాబుగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శ్లాఘించారు.

వివరాలు VIలో ▸



విజేత విన్సెంట్ కీమెర్

జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ మరో రౌండ్ మిగిలి ఉండగానే.. చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ చాంపియన్‌గా అవతరించాడు.

వివరాలు VIIలో ▸

న్యూస్‌రీల్

ఏపీ వెలుపల ఇంటర్ చదివితే స్థానిక హోదా ఉండదు



ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అభ్యర్థుల 'స్థానికత' విషయంలో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం స్పష్టత నిచ్చింది. ఏపీ వెలుపల ఇంటర్ చదివిన విద్యార్థులను స్థానిక అభ్యర్థులుగా పరిగణించలేమని తేల్చి చెప్పింది.

వివరాలు 7లో ▸

ఈ చిన్నారి.. మృత్యుంజయురాలు



చిరుత నోటికి చిక్కిన చిన్నారి.. గాయాలతో బయటపడిన ఘటన ప్రకాశం జిల్లా చిన్నారుట్ల గూడెంలో జరిగింది. ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారిని చిరుత నోట కర్చుకొని అడవిలోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. చిన్నారి ఏడవటంతో నిద్రలేచిన తల్లిదండ్రులు.. చిరుతను చూసి భయంతో కేకలు వేశారు. బెదిరిన చిరుత.. చిన్నారిని వదిలేసి పారిపోయింది.

వివరాలు 6లో ▸

బుడమేరు వరద ప్రవాహంతో రామవరప్పాడు వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు



బుడమేరులో బోగస్ ఆపరేషన్!

ఏడాదిగా చర్యలు శూన్యం.. వరదకు వంతెనలు విలవిల

ఇప్పటికే 5 వేల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం

లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన నీళ్లు

గతేడాది బెజవాడను ముంచెత్తడంతో అపార ఆస్తి, ప్రాణ నష్టం

IVలో

నేడు 9 జిల్లాల్లో 'ఫ్లాష్ ఫ్లడ్'!



యానాంకు కూడా ప్రమాదం ఉందన్న ఐఎండీ

ఉత్తరాంధ్ర, ఒడిశా తీరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం

నేడు, రేపు రాష్ట్రానికి భారీ వర్ష సూచన

IVలో



పాలిటిక్స్ మనకెందుకు భయ్యా..

ఏం తిందాం.. ఏం ఆర్డర్‌పెడదాం!

రాజకీయాలు, ఎన్నికల కంటే ఫుడ్ ఆర్డర్లపైనే మెజారిటీ ఇండియన్ల తలమునక

81% మంది భారతీయులు రోజుకు 3 గంటలు ఏదో ఒక విషయంపై ఎక్కువగా ఆలోచిస్తున్నారు

61% మంది ఫుడ్ డెలివరీ గురించే ఆలోచన

74% మందికి ఏం ఆర్డర్ చేయాలి.. ఏం తినాలో అనేదానిపై దృష్టి

ఇండియా ఓవర్ థింకింగ్ రిపోర్ట్ 2025 నివేదికలో ఆసక్తికర అంశాలు వెల్లడి

దేశ రాజకీయాలు.. ఎన్నికలు వంటి ముఖ్యమైన అంశాల కంటే కూడా ప్రతీరోజు ఆన్‌లైన్‌లో చేసే ఫుడ్ ఆర్డర్లపైనే ఆలోచనలతో మెజారిటీ ఇండియన్లు తలమునకలు అవుతున్నారట. అంతే కాకుండా 81% మంది భారతీయులు ప్రతిరోజూ కనీసం మూడు గంటలపాటు ఏదో ఒక విషయమై తీవ్రమైన దీర్ఘాలోచనలు చేస్తున్నారట. ఎన్నికల కంటే కూడా 61% మంది ఫుడ్ డెలివరీ గురించే ఎక్కువగా ఆలోచిస్తున్నారు. దాదాపు 74% మందికి ఏ ఫుడ్ ఆర్డర్ చేయాలి..ఏం తినాలో అన్న నిర్ణయంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారట. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎవరికి ఓటు వేయాలనే నిర్ణయం కంటే కూడా ఆన్‌లైన్‌లో ఫుడ్‌కు సంబంధించి అనేక ఎంపికలు, డీల్స్ పట్ల ఆసక్తి. వాటిలో 'సరైన' ఎంపికకు తమ మొబైల్ స్క్రీన్‌లను ఎక్కువ సేపు పరిశీలిస్తున్నారు. దీంతో అతిగా ఆలోచించడం అనేది భారతీయులకు ఓ కొత్త అలవాటుగా మారిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. - సాక్షి, హైదరాబాద్

ఇదీ అధ్యయనం...

ఎన్నికలు ప్రతి ఐదేళ్లకు వస్తాయి.. కానీ లంచ్, డిన్నర్ ప్రతిరోజూ తప్పదు కాబట్టి సాపాటు సంతృప్తి ఇవ్వకపోతే కష్టమేనని 'ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ' పైనే సిటిజన్లు అతిగా వర్రీ అవుతున్నట్టుగా తాజాగా సెంటర్ ఫ్రెష్‌–యు గావ్ సంయుక్తంగా నిర్వహించిన 'ఇండియా ఓవర్‌థింకింగ్ రిపోర్ట్–2025'అధ్యయనంలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. అతిగా ఆలోచించడం.. ఏదైనా విషయంపై దీర్ఘాలోచనలు చేయడమనేది ఇండియన్ల 'న్యూ నార్మల్'గా మారిపోయిందా అన్న అభిప్రాయం సైతం వ్యక్తమవుతోంది. ఈ నివేదికలో వెల్లడైన అంశాలను బట్టి చూస్తే...భారతదేశంలో అతిగా ఆలోచించడం అనేది ఒక విస్తృతమైన సమస్య అని తేలింది. అధ్యయనంలో భాగంగా దేశంలోని మెట్రోపాలిటన్ నగరాలతోపాటు ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లోని విద్యార్థులు, వృత్తి నిపుణులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు, ఇతర వర్గాల వారి నుంచి ఆయా అంశాలపై సమాచారం సేకరించారు. ఇందులో అతి ఆలోచనల వల్ల ఆహారం, జీవనశైలి అలవాట్లు, మానవ సంబంధాలు, కెరీర్, వృత్తిగత జీవితం తదితరాలు ఎలా ప్రభావితం అవుతున్నాయనే అంశాలను పరిశీలించారు.

ముఖ్యాంశాలు

- ప్రతి నలుగురు భారతీయుల్లో ఒకరు అతిగా ఆలోచించడం ఒక స్థిరమైన అలవాటు అనే భావిస్తున్నారు
- ఆహారం, జీవనశైలి, డిజిటల్, సామాజిక జీవితం, డేటింగ్, సంబంధాలు, కెరీర్ ఎంపికలతో సహా వివిధ రంగాల్లో నిర్ణయాలను అతిగా ఆలోచించడం ప్రభావితం చేస్తున్నాయి
- 81% మంది భారతీయులు రోజుకు కనీసం మూడు గంటలు ఎక్కువగా ఆలోచిస్తారు.
- ఈ విధంగా అధిక ఆలోచనలతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి గణనీయమైన సంఖ్యలో ఇండియన్లు గూగుల్, చాట్ జీపీటీ వంటి సాంకేతికత వైపు మొగ్గు చూపుతున్నారు
- అతిగా ఆలోచించడం, అనిశ్చితిని అధిగమించడానికి, మరింత స్పష్టతకు డిజిటల్ సాధనాలను ఉపయోగిస్తున్నారు
- ఎన్నికల్లో రాజకీయ నాయకుడిని ఎన్నుకోవడం కంటే ఏం తినాలో ఎంచుకోవడం ఎక్కువ ఒత్తిడితో కూడుకున్నదని 63% మంది భావన
- ఓ సాధారణ బిర్యానీ ఆర్డర్ చేయడానికి ఫుడ్ యాప్ ద్వారా 30 నిమిషాలు స్క్రోలింగ్ చేస్తున్న ఉదంతాలున్నాయి
- ఆర్డర్ చేసే ఆహార ఎంపికలో అస్పష్టతకు గురికావడం లేదా డబ్బుకు తగిన విలువ లభించకపోవడం గురించి ఆందోళన చెందుతున్నారు
- డిస్కౌంట్లు, డెలివరీ సమయ అంచనాలు తదితరాలపై అధిక దృష్టి
- డిజిటల్ ఒత్తిళ్లు, సోషల్ మీడియా ఆందోళన, పని ప్రదేశంలోని సందేహాలు, ప్రాంతాలు, వృత్తుల్లో రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి
- మెనూ మెల్ట్‌డౌన్‌ల మొదలు ఇన్‌స్టా, ఫేస్‌బుక్, వాట్సాప్‌లో తమ స్టోరీల పోస్టింగ్ చేయాలా వద్దా అనే వరకు.. అతిగా ఆలోచించడం ఇప్పుడు భారతదేశానికి ఇష్టమైన కాలక్షేపంగా మారింది
- అతిగా ఆలోచించడం అనేది మెజారిటీ ప్రజల అలవాటుగా మారిందని, మన డిజిటల్ జీవితాల్లో, రోజువారీ ఎంపికల్లో, సామాజిక డైనమిక్స్‌లో లోతుగా పాతుకుపోయింది
- పని ప్రదేశాల్లో బాస్ ఏదైనా అంశంపై ఎస్ అని స్పందిస్తే దాని పట్ల 42% మంది ఆందోళన చెందుతున్నారు
- 63% మంది రెస్టారెంట్‌లో వంటకం ఎంచుకోవడం రాజకీయ నాయకుడి ఎంపిక కంటే ఎక్కువ ఒత్తిడితో కూడుకున్నదని చెబుతున్నారు. ఈ సంఖ్య దక్షిణాదిలో 69%గా ఉంది

అతి ఆలోచనను డీకోడ్ చేయడమే..

'సెంటర్ ఫ్రెష్ ఇండియా ఓవర్‌థింకింగ్ రిపోర్ట్ ద్వారా..నేటి హైపర్–కనెక్టెడ్ ప్రపంచంలో అతిగా ఆలోచించడం ఎలా వ్యక్తమవుతుందో డీకోడ్ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది ఒక సందేశాన్ని రెండవసారి ఊహించడం అయినా లేదా విందు ఎంపికను అతిగా విశ్లేషించడం అయినా, అతిగా ఆలోచించడమనేది రోజువారీ అలవాటుగా మారింది. ఈ మానసిక గందరగోళాన్ని హైలైట్ చేయడం ద్వారా, ఈ నివేదిక రోజువారీ మానసిక స్పష్టత యొక్క ప్రాముఖ్యత గురించి చర్చించేలా ఆలోచనను రేకెత్తిస్తుంది'అని పర్‌ఫెట్టి వాన్ మెల్లె ఇండియా డైరెక్టర్ మార్కెటింగ్ గుంజన్ ఖేతాన్ పేర్కొన్నారు.

రిగ్గింగ్ ఎన్నికల్లో.. సిగ్గుపడే గెలుపు

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అడ్డదారిలో టీడీపీ విజయం

సాక్షి ప్రతినిధి, కడప, సాక్షి రాయచోటి: ''అసలు ప్రతిపక్షానికి చెందిన ఏజెంట్లే లేకుండా జరిగిన ఈ ఎన్నికలు ఒక ఎన్నికలా..? ఏ ఒక్క బూత్‌లోనూ విపక్ష ఏజెంట్లను రానివ్వకుండా రిగ్గింగ్ చేసి, అనైతికంగా పోలీసుల సాయంతో గెలిచి సంబరాలు చేసుకోవడం ఏమిటి? ప్రపంచ చరిత్రలో ఏ ఎన్నికా ఇలా జరిగి ఉండదు...!'' అని ప్రజాస్వామికవాదులు, రాజకీయ విశ్లేషకులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 'దేశంలో ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు పోలీసు వ్యవస్థను వినియోగిస్తారు. కానీ మొట్టమొదటిసారి ప్రజలు ఓట్లు వేయకుండా ఉండేందుకు పోలీసులను వాడిన దుర్మార్గమైన చరిత్ర చంద్రబాబు సర్కారుది..' అని వ్యాఖ్యానిస్తున్నారు.

కళ్లు మూసుకున్న ఎన్నికల కమిషన్!

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అడ్డదారిలో టీడీపీ గట్టెక్కింది! ఎన్నికల ముందు తాలిబన్లు, బందిపోటు ముఠాల మాదిరిగా అటకాయించి వైఎస్సార్ సీపీ నేతలపై హత్యాయత్నాలు, దాడులకు తెగబడటంతో మొదలైన పచ్చముఠాల అకృత్యాలు ఎన్నికల రోజు మరింత యథేచ్ఛగా సాగాయి. అధికార యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకుని కొమ్ము కాసే పోలీసుల సహకారంతో ప్రభుత్వ పెద్దలు ఎన్నికల అరాచకాలకు బరితెగించారు. టీడీపీ నేతలు ఎన్నికల ముందు రోజు రాత్రే వైఎస్సార్ సీపీ పోలింగ్ ఏజెంట్ల ఇళ్ల వద్దకు చేరుకుని వారు బయటకు రాకుండా మోహరించారు. ఓటర్ల నుంచి స్లిప్పులు లాక్కుని బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారితో దొంగ ఓట్లు వేయించారు. దేశ చరిత్రలో తొలిసారిగా అసలు విపక్ష పోలింగ్ ఏజెంట్లే లేకుండా చేసి అధికార పార్టీ అడ్డగోలుగా అరాచకాలకు పాల్పడినా ఎన్నికల కమిషన్ కళ్లు మూసుకుని కూర్చుంది. ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి పోలీసు అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ నేతలపై బైండోవర్ కేసులు మొదలు హత్యాయత్నం, కౌంటర్ కేసులు బనాయించి అరెస్టులు చేసుకుంటూ వెళ్లారు. పట్టపగలు నల్లగొండువారిపల్లె గ్రామం మధ్యలో ప్రజలంతా చూస్తుండగా ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగితే నిందితులను ఇప్పటికీ అదుపులోకి తీసుకోలేదు. పైగా కౌంటర్ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలింగ్ రోజు వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు బూత్‌ల వద్దకు రాకుండా దగ్గరుండి మరీ అడ్డుకుని టీడీపీ గూండాలకు సహకారం అందించారు. ఏకంగా డీఐజీ కోయ ప్రవీణ్ పులివెందులలోనే తిష్ట వేసి ఈ అరాచకాలను పర్యవేక్షించడం విస్మయం కలిగిస్తోంది.

ఒంటిమిట్టలో మంత్రి సమక్షంలోనే దాడులు..

ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోలింగ్ ఉదయం 10.30 వరకు సాఫీగా సాగినా ఓటర్లు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్నట్లు పసిగట్టిన పచ్చముఠాలు బూత్‌లను ఆక్రమించుకుని దౌర్జన్యాలకు తెగబడ్డాయి. ఏకంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలోనే వైఎస్సార్ సీపీ ఏజెంట్లపై దాడులకు దిగినా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. టీడీపీ గూండాలను వారించకపోగా.. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను రాకుండా కట్టడి చేయడంతో అధికార పార్టీ బూత్‌లలో యథేచ్ఛగా రిగ్గింగ్ చేసుకుంది. పోలింగ్ రోజంతా విచ్చలవిడిగా సాగిన టీడీపీ మూకల రిగ్గింగ్, బయటి ప్రాంతాల నుంచి వచ్చిన దొంగ ఓటర్లతో జాతరను తలపించింది. ఉదయం పోలైన ఓట్లలో ఎక్కువ శాతం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి వచ్చినట్లు తెలుస్తోంది. తర్వాత పచ్చ ముఠాలు అక్రమాలకు బరి తెగించాయి. ఓటర్ల నుంచి స్లిప్పులు లాక్కుని దొంగ ఓట్లు వేశాయి. సాయంత్రం వరకు విపక్ష ఏజెంట్లు లేకుండా ఈ డ్రామా సాగింది. ఈ అరాచకాలు, అక్రమాలు, ఏకపక్ష ఎన్నికలను నిరసిస్తూ కడపలో జరిగిన కౌంటింగ్‌ను వైఎస్సార్ సీపీ అభ్యర్థితోపాటు ఏజెంట్లు బహిష్కరించారు.

అభాసుపాలైన ఎస్ఈసీ..

జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా వ్యవహరించిన తీరుతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ అభాసుపాలైంది. ఓటర్లు నాలుగైదు కిలోమీటర్లు దూరం ప్రయాణించి ఓట్లు వేయాల్సి వచ్చేలా పోలింగ్ కేంద్రాలను ఇష్టానుసారంగా మార్చేసినా ఏమీ పట్టనట్లు కళ్లు మూసుకుంది. టీడీపీ నాయకులు దొంగ ఓటర్ల అవతారం ఎత్తిన వైనం మీడియా, సామాజిక మాధ్యమాల్లో రోజంతా వైరల్ అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చివరకు మహిళలవి కూడా దొంగ ఓట్లు పోలయ్యాయి. పులివెందులలో 3,684 మంది మహిళలు ఓట్లు వేసినట్లు నమోదైంది. వెబ్ కాస్టింగ్ పరిశీలిస్తే బోగస్ బాగోతం వెల్లడవుతుందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. వ్యవస్థలన్నీ కుమ్మక్కై రౌడీ రాజ్యానికి పట్టం కట్టారని పులివెందుల ప్రజలు పేర్కొంటున్నారు.

ఓటర్లతో మాట్లాడే ధైర్యం ఉందా?

సాక్షి, అమరావతి: ఒంటిమిట్ట, పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని, అందుకే కౌంటింగ్ ప్రక్రియను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించామని ఒంటిమిట్ట వైఎస్సార్ సీపీ అభ్యర్థి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఒంటిమిట్టలో ఉదయం 11 గంటల వరకు మాత్రమే ఎన్నికలు సజావుగా జరిగాయని, ఆ తరువాత టీడీపీ నేతలు పోలీస్ ప్రొటెక్షన్‌తో రిగ్గింగ్ చేసుకుని దొంగ ఓట్లు వేసుకున్నారని వెల్లడించారు. ఈ రెండు ఉప ఎన్నికలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఒంటిమిట్ట, పులివెందులలో ఏ గ్రామానికి వెళ్లినా వేలికి సిరా గుర్తు లేని వారే కనిపిస్తారని చెప్పారు. ప్రతి గ్రామానికి వెళ్లి ఓటర్లకు సిరా గుర్తు ఉందో లేదో విచారణ చేయాలని కోరారు. గ్రామాలకు వచ్చి నిజమైన ఓటర్లతో మాట్లాడే ధైర్యం ఉందా? అని టీడీపీ నేతలకు సవాల్ చేశారు.



టీడీపీ గెలుపుపై సోషల్ మీడియాలో నెటిజన్ల సెటైర్లు

వైఎస్సార్‌సీపీకి 683 ఓట్లే వచ్చాయంటే టీడీపీ వాళ్లే నమ్మడం లేదు: ప్రొ. నాగేశ్వర్

సాక్షి అమరావతి: పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 683 ఓట్లు మాత్రమే వచ్చాయంటే టీడీపీ వాళ్లే నమ్మడం లేదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. అలాంటిది ఇక రాష్ట్ర ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఒక టీవీ చానెల్‌తో మాట్లాడుతూ గురువారం నాగేశ్వర్ ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఇదే విషయంపైన సోషల్ మీడియాలోనూ సెటైర్లు పేలుతున్నాయి. భారీ ఎత్తున దొంగ ఓట్లు, రిగ్గింగ్, పోలీసుల అండతోనే టీడీపీ గెలిచిందని నెటిజన్లు మండిపడుతున్నారు. పులివెందులలో వైఎస్సార్‌సీపీకి 683 ఓట్లు రావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు.

పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలు టీడీపీకే

కడప సెవెన్‌రోడ్స్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం కడప శివార్లలోని మను పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన తుమ్మల హేమంత్‌రెడ్డికి 683 ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డికి 6,716 ఓట్లు వచ్చాయి. దీంతో ఆమె 6,033 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి 6,513 ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి 12,780 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి 6,267 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసుకోండి

వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థులకు హైకోర్టు సూచన

సాక్షి, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీలకు ఈ నెల 12న జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు బెదిరింపులకు, దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడి, పలు పోలింగ్ కేంద్రాలను ఆక్రమించుకున్న నేపథ్యంలో రీ పోలింగ్ నిర్వహణకు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు తుమ్మల హేమంత్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. ఎన్నికల విషయంలో అభ్యంతరాలుంటే వాటిపై ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసుకోవాలని చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రీ పోలింగ్ కోసం వైఎస్సార్‌సీపీ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ రామకృష్ణప్రసాద్ విచారణ జరిపారు.

అధికార పార్టీ అక్రమాలకు పాల్పడింది

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు పొపెల్లుగారి వీరారెడ్డి, సుబ్రహ్మణ్య శ్రీరామ్ తదితరులు వాదనలు వినిపించారు. ఈ నెల 12న జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో అధికార పార్టీ భారీ అక్రమాలకు పాల్పడిందన్నారు. దౌర్జన్యపూరితంగా వ్యవహరించిందని, అత్యధిక చోట్ల పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మారణాయుధాలతో ఓటర్లను, వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను బెదిరించారన్నారు. ఓటువేసే అవకాశం కూడా ఇవ్వలేదని చెప్పారు. ఇందుకు పోలీసులు పూర్తిస్థాయిలో సహకరించారన్నారు. అక్రమాలు కళ్లముందు కనిపిస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని చెప్పారు. కలెక్టర్ కళ్ల ముందే దొంగ ఓట్లు వేశారని, ఇతర ప్రాంతాలకు చెందినవారు వచ్చి ఓట్లు వేసి వెళ్లారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరులు బహిరంగంగానే అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను వారు కోర్టు ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీలను, వెబ్‌క్యామ్‌లను పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని చెప్పారు. తమ వద్ద ఉన్న ఆధారాలను ఎన్నికల సంఘం ముందుంచామని తెలిపారు. అయితే ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అక్రమాలు జరిగినచోట రీ పోలింగ్‌కు ఆదేశాలు జారీచేయాలని వారు కోర్టును కోరారు. ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందని చెప్పారు. ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది వివేక్ వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యాజ్యాలకు విచారణార్హతే లేదన్నారు. ఓసారి ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత అందులో జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. అక్రమాలు జరిగాయని భావిస్తే ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసుకోవాలని చెప్పారు. రిటర్నింగ్ అధికారి నివేదిక ఆధారంగా రెండుచోట్ల రీ పోలింగ్‌కు ఆదేశాలిచ్చామని తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయి ఎన్నికల ఫలితాలు కూడా వెల్లడించినట్లు చెప్పారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, టీడీపీ అభ్యర్థి తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎన్నికల్లో అక్రమాలపై అభ్యంతరాలుంటే ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసుకోవాలని పిటిషనర్లకు స్పష్టం చేశారు.


నామినేషన్ నుంచి పోలింగ్ దాక ప్రజాస్వామ్యం ఖూనీ

స్వేచ్ఛగా పోలింగ్ నిర్వహిస్తే వెబ్ కాస్టింగ్ బయటపెట్టండి

పక్క నియోజకవర్గాల టీడీపీ నేతలు ఎలా ఓటేశారు?

పోలింగ్ పరిశీలనపై కలెక్టర్ ట్వీట్‌ను ఎందుకు డిలీట్ చేశారు?

మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం



సాక్షి, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అపహాస్యం చేశారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజమెత్తారు. ''14 నెలల పాలనలో అన్నివిధాలా వంచించిన కూటమి ప్రభుత్వానికి పులివెందుల ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారన్న భయం పట్టింది. అందుకే పోలీసుల అండతో దౌర్జన్యానికి దిగారు. చంద్రబాబు ఎన్ని అక్రమాలు చేసినా ప్రజలకు వాస్తవాలు తెలిశాయి. వారిని తరిమికొట్టడం ఖాయం'' అని తేల్చిచెప్పారు. గురువారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పులివెందుల, రాజంపేట నియోజకవర్గాల్లో ఒక్కో జెడ్పీటీసీ, కుప్పంలో ఎంపీటీసీ, ప్రకాశం జిల్లాలో సర్పంచ్ స్థానాన్ని ఎంచుకుని మరీ ఉప ఎన్నికకు సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు ప్రభుత్వం మహాగొప్పగా ప్రకటించిందని పేర్ని నాని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై.. 13 నెలల టర్మ్ మాత్రమే ఉన్న జెడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహిస్తూ, నామినేషన్ల నుంచే ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసేలా రకరకాల తంతులు నిర్వహించారని మండిపడ్డారు. ఖాకీ చొక్కాలు, అధికారులు తొత్తులుగా మారారని,, ఐఏఎస్‌లుగా రాష్ట్రంలో అత్యున్నత పదవులు వెలగబెట్టి, ఎన్నికల విధుల్లో ఉన్న కొందరు అధికారులు సైతం తమ బాధ్యతలను విస్మరించారని పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశంలో దొంగలు పడ్డారంటే ఇదేనేమో

ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుపుతున్నామని చెప్పడానికి, మీడియాకు పోలింగ్ కేంద్రాల వద్దకు అనుమతిస్తారని, కానీ పులివెందుల, ఒంటిమిట్టలో ఎవరినీ వెళ్లనివ్వకుండా, వాళ్లే ప్రయివేటు కెమెరాతో చిత్రీకరించారని పేర్ని అన్నారు. ''ఈ వీడియోల్లో ఎక్కడా మహిళలు ఓటు వేసినట్లు కనిపించలేదు. అందరూ పురుషులే. అది కూడా జమ్మలమడుగు లేదా కమలాపురం, ప్రొద్దుటూరు నియోజకవర్గాలకు చెందినవారు. ఈ మూడు నియోజకవర్గాల కూటమి ఎమ్మెల్యేలకు ఓట్లు గుద్దుకోవడానికి కాంట్రాక్ట్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. పులివెందులలో విచిత్రం ఏమంటే సాయంత్రం 5–6 గంటల మధ్య ఓటు వేసిన మహిళలంతా వి.కొత్తపల్లెలో పోలింగ్ స్టేషన్ నం.13లో ఓటు హక్కు వినియోగించుకున్నవారే. అక్కడ ఒక పురుష ఓటరు కూడా లేడు. అధికార పార్టీ బరితెగింపునకు ఇదో నిదర్శనం. క్యూ లైన్లో లేకుండానే 3,684 మంది మహిళలు ఓటు వేశారు. బహుశా దేశంలో దొంగలు పడ్డారంటే ఇదేనేమో! తండ్రీకొడుకు ఇద్దరు దొంగలు పడ్డారని, ఇంత తంతు చేసి, మీరిచ్చిన లెక్కలతోనే దొరికిపోయారు' అని అన్నారు.

డ్రామా రక్తి కట్టేలా పోస్టులు..

డ్రామాను మరింత రక్తి కట్టించడానికి 30 ఏళ్ల తర్వాత ఓటు వేస్తున్నాం థ్యాంక్స్ అంటూ టీడీపీ ఎక్స్ ఖాతాలో కొన్ని స్లిప్పుల పోస్టులు పెట్టారని, అంటే.. 30 ఏళ్ల తర్వాత పులివెందులలో దొంగ ఓట్లు వేస్తున్నామని థ్యాంక్స్ చెబుతున్నారా? క్యూలైన్లో పురుషులు అదీ బయటివాళ్లు ఉంటే.. వారితో సమానంగా మహిళల ఓట్లు ఎలా వచ్చాయని పేర్ని నాని ప్రశ్నించారు. అంటే, జమ్మలమడుగు నుంచి వచ్చి దొంగఓట్లు వేసినవారు.. 30 ఏళ్ల తర్వాత ఓటు వేశామని చెబుతూ పోస్టులు పెట్టారని ఎద్దేవా చేశారు.

లోకేశ్... మీ పోస్ట్‌లోనే తెలుస్తోంది

పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందంటూ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ ఖాతాలో వీడియో పోస్ట్ చేశారని... అందులో ఉన్నది జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పొన్నతోట మల్లికార్జున్ అని పేర్ని నాని పేర్కొన్నారు. ''ఇదీ వీళ్ల బండారం..! కలెక్టర్ పోస్ట్ పెట్టి తీసేస్తారు. మంత్రి దౌర్జన్యాల మీద, దొంగ ఓటర్ల మీద కేసులుండవు. ఓ సోదరి కుప్పంలో మీరు ఇలాగే చేశారని అంటోంది. కానీ, అక్కడ టీడీపీకి ఎంత ఖర్మ పట్టిందీ అంటే వాళ్ల చేతులతో వారే 680 ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేశారు'' అని తెలిపారు.

వైఎస్ జగన్ ప్రశ్నలకు సమాధానమేది బాబూ...?

ఉప ఎన్నికల పోలింగ్‌లో ఏ జరిగిందో ఆధారాలతో సహా కళ్లకు కట్టినట్టు చూపిస్తూ సమాధానం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ చాలెంజ్ చేశారని, కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారని పేర్ని నాని గుర్తుచేశారు. ''పోలింగ్ సరళి సీసీ టీవీ ఫుటేజీని, వెబ్ కాస్టింగ్‌ను ప్రజల్లో పెట్టాలని వైఎస్ జగన్ అడిగితే, ఎందుకు భయం? వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ చేసిన ట్వీట్‌లో ఆయన ముందున్నవారు దొంగ ఓటర్లు. అంటే, కలెక్టర్ దగ్గరుండి దొంగ ఓటింగ్ చేయించారా? క్యూలైన్లలోని దాదాపు 90 శాతం దొంగ ఓటర్లే. వీటిపైనే వైఎస్ జగన్ ప్రశ్నించారు'' అని తెలిపారు. దీంతో చంద్రబాబు స్క్రీన్ ప్లే మార్చారని, పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక కౌంటింగ్ ఒకే రౌండ్ లో పూర్తి చేయాలని నిర్ణయించారని పేర్కొన్నారు. ''ఎక్కడ తప్పు పడతారోననే భయంతో, కోర్టులు ప్రారంభమయ్యేలోగా ఉప ఎన్నిక ఫలితాలు తేల్చాలని ఆదరాబాదరాగా ఆదేశాలిచ్చారు. ప్రజాస్వామ్యయుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉప ఎన్నికలు జరుపుతున్నామని డ్రామా మాటలు చెప్పిన వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్.. ఒక్క మీడియాను కూడా ఓటింగ్‌ను చూపించేందుకు బూత్‌లలోకి అనుమతించలేదు. కిరాయికి మాట్లాడుకున్న ప్రైవేటు ఫోటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్‌తో ఫొటోలు, వీడియోలు తీయించి విడుదల చేశారు' అని చెప్పారు.

డీఐజీ.. ఎవరి ఆనందం కోసం ఈ నిర్వాకం

రాయచోటి ఎమ్మెల్యేనో, ఎన్నికలున్న ఒంటిమిట్టలో ఓటరు కాకపోయినా రాష్ట్ర మంత్రి ఎలా పోలింగ్ స్టేషన్ కు వెళ్తారని పేర్ని నాని నిలదీశారు. చిన్నకొత్తపల్లె గ్రామంలో మంత్రి సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్‌ను కొట్టారని, మంత్రి మీద కేసు ఫైల్ చేశారో లేదో డీఐజీ కోయ ప్రవీణ్ సమాధానం చెప్పాలని పేర్ని నిలదీశారు. 'ఇదంతా ఎన్నికల కమిషన్ కు కనబడ్డం లేదా? కేసు కట్టని అధికారులను సస్పెండ్ చేయరా? షోకాజ్ ఇవ్వరా? మీకు సిగ్గు, శరం ఉందా ? పోలీస్ ఉన్నతాధికారులు చేస్తున్న పనికి డీజీపీ సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. పోలింగ్ బాగా నిర్వహిస్తున్నామని జబ్బలు చరుచుకున్న జిల్లా కలెక్టర్.. వెంటనే ఎక్స్‌ఖాతాలోని పోస్టును ఎందుకు డిలీట్ చేశారని నిలదీశారు.

సునీతమ్మా.. మీ తండ్రే పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని చంపేశారా?

''అసెంబ్లీఎన్నికల్లో అక్రమాలు జరిగాయి. ఎక్కడాలేని విధంగా పోలైన ఓట్ల కంటే ఏపీలో 12 శాతం ఓట్లు అదనంగా లెక్కించారు. మొదటినుంచి మేం ఇది చెబుతూనే ఉన్నాం. ఇప్పుడు మిగిలిన రాష్ట్రాల్లో కూడా ఇదే చెబుతున్నారు. టీడీపీ కూటమికి 164 సీట్లు రావడం మీద దేశమంతా అనుమానంతో ఉంది. అది కూడా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక లాంటిదే అని ప్రజలు అనుకుంటున్నారు'' అని పేర్ని నాని అన్నారు. 30 ఏళ్ల తర్వాత పులివెందులలో చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని బతికించారంటున్న నర్రెడ్డి సునీతారెడ్డి.. ఈ నియోజకవర్గంలో ఆమె తండ్రి వైఎస్ వివేకానే చాన్నాళ్లు రాజకీయం చేశారని, అంటే ఆయనే ప్రజాస్వామ్యాన్ని చంపేశారని చెబుతున్నారా?'' అని ప్రశ్నించారు.

పులివెందుల, ఒంటిమిట్టలో జరిగింది పోలింగా?

- దొంగ ఓటింగ్‌తో జరిగిన దీనిని ఎన్నికలు అంటారా?
- ఎల్లోమీడియా రాతలపై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల లెక్కింపుపై ఎల్లో మీడియా సిగ్గుమాలిన కథనాలను ప్రచురించిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మండిపడ్డారు. పులివెందులలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ దొంగ ఓటింగ్‌తో, ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు రానివ్వకుండా చేసుకున్న ఈ ఎన్నికలను అసలు ఎన్నికలు అని ఎలా అంటారని ప్రశ్నించారు. తమ అరాచకాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయి అని మభ్యపెట్టేందుకే ఎల్లో మీడియా ద్వారా ఇటువంటి దిగజారుడు రాతలు రాయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే... 'పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల దొంగ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. తెలుగుదేశం పార్టీకి బాకా ఊదే ఈనాడు పత్రిక ఈ రోజు పతాక శీర్షికల్లో 'ఉత్కంఠతకు పడనున్న తెర, నువ్వా–నేనా' అంటూ వార్తలు ప్రచురించింది. ఇక మంత్రి నారా లోకేష్ దీనిపైన 'ప్రజాస్వామ్యం నిలబడిందంటూ' మాట్లాడిన స్టేట్‌మెంట్‌ను కూడా ప్రచురించింది. ఇవన్నీ చూస్తుంటే ఎవరిని నమ్మించడానికి తెలుగుదేశం నాయకులు, ఈనాడు పత్రిక యత్నిస్తున్నారో అర్థం కావడం లేదు. అసలు ఓటింగ్ జరిగితేనే కదా ఉత్కంఠత అని రాయడానికి? జరిగిందే దొంగ ఓటింగ్. ఏకపక్షంగా ఎన్నికల ఫలితాలు ఉంటాయనేది పులివెందులలో ఓటు వేయలేని ప్రతి ఒక్క ఓటరుకీ తెలుసు. ఇది వాస్తవం. కానీ ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని దొంగ ఓట్లతో గెలుస్తున్నామనే దానిని కప్పిపుచ్చుకునేందుకు, పులివెందుల ప్రాంతానికి చెందని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల ప్రజలకు ఈ ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేస్తున్నట్లుగా ఒక బిల్డప్‌ను ఇచ్చేందుకే ఈ తప్పుడు రాతలు రాయించారు. ప్రజాస్వామికంగా ఈ రెండు సెగ్మెంట్లలో పోలింగ్ జరిగినట్లు, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు, దానికి సంబంధించిన ఫలితాలు వెల్లడవుతున్నట్లుగా ఒక డ్రామాను సృష్టించి, దానిని వార్తా కథనాలుగా రాయడం ఎల్లో మీడియా దిక్కుమాలినతనానికి నిదర్శనం. ఇది అనైతికం కాదా? దొంగ ఓటింగ్ జరిగిందనేది చాలా స్పష్టంగా ఆధారాలతో సహా వైఎస్సార్‌సీపీ బయటపెట్టింది. అయినా నిజంగా పోలింగ్ జరిగినట్లుగా అనైతిక కథనాలు రాశారు. పోలీసుల అండతో, వేలాది మంది టీడీపీ కార్యకర్తలను పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించి, ఓటర్లను ఓటు వేయనివ్వకుండా బెదిరించి వెనక్కి పంపారు. ఏజెంట్లనూ రానివ్వకుండా, ఏజెంట్ ఫారాలను చించి, వారిపై దౌర్జన్యం చేశారు. దీనిని పోలింగ్ అంటారా? దీనిని ఎన్నికలు అని అంటారా? వైఎస్సార్‌సీపీ శ్రేణులు బాధపడాల్సిన అవసరం లేదు. ఇటువంటి దారుణాలకు పాల్పడిన వారికి ప్రజాస్వామికంగానే గుణపాఠం నేర్పుదాం. ఆ రోజులు కూడా దగ్గరలోనే ఉన్నాయి'.

పోలీసులు బెదిరిస్తారు.. అవసరమైతే కాల్చేస్తారు

- అందులో తప్పేమీ లేదు
- మంత్రి కొలుసు పార్థసారథి



సాక్షి, అమరావతి: 'పోలీసులు తిడతారు.. బెదిరిస్తారు. అవసరమైతే కాల్చేస్తారు. కాల్చి చూపిస్తారు' అని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తను 'కాల్చి పారేస్తా.. నా కొడకా' అని డీఎస్పీ బెదిరించిన ఘటనను మంత్రి సమర్థించారు. అందులో తప్పేమీ లేదన్నారు. సచివాలయంలో గురువారం పార్థసారథి మీడియాతో మాట్లాడారు. 2029లో పులివెందులలో టీడీపీ విజయం సాధించడానికి.. ఈ జెడ్పీటీసీ గెలుపు తొలి మెట్టన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను మెచ్చుకొని పులివెందుల ప్రజలు తమకు ఓట్లు వేశారని చెప్పుకొచ్చారు.


Reliance
SMART BAZAAR
ఫుల్ పైసా వసూల్ సేల్
13th - 17th AUG
చివరి 3 రోజులు
13 నుంచి 17 ఆగస్టు
వరకు ఒకటే సిద్ధాంతం, అందరూ చేస్తారు ఫుల్ పైసా వసూల్
కర్నూలు సోనా మసూరి రైస్ / క్లాసిక్ మిర్యాలగూడ హెచ్ ఎం టీ రైస్ 26 kg
స్మార్ట్ ప్రైస్ ₹999/ ₹1299
₹49.96 /kg
₹38.42 /kg
ఎమ్ఆర్‌పి ₹1650 / ₹2100
ఆదా చేసుకోండి ₹651 / ₹801
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g
స్మార్ట్ ప్రైస్ ₹389/ ₹439
ఎమ్ఆర్‌పి ₹620 / ₹725
ఆదా చేసుకోండి ₹231 / ₹286
లూజ్ కంది పప్పు వేల్యూ 1 kg / ఫార్చ్యూన్ రిఫైన్డ్ ఫ్లవర్ ఆయిల్ 870 g
స్మార్ట్ ప్రైస్ ₹99/ ₹135
మార్కెట్ ధర ₹104
ఎమ్ఆర్‌పి ₹180
ఆదా చేసుకోండి ₹45
BUY ANY 1 GET ANY 1 FREE
బిస్కెట్స్ 253 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹160 మొదలుకుని
BUY ANY 3 GET ANY 1 FREE
కోల్డ్ డ్రింక్ అండ్ జ్యూసెస్ 600 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹40 మొదలుకుని /యూనిట్
లూజ్ చక్కెర స్మాల్ 1 kg / ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ వీట్ ఆటా 5 kg
స్మార్ట్ ప్రైస్ ₹43.50
మార్కెట్ ధర ₹50
ఎమ్ఆర్‌పి ₹365
డవ్ / పియర్స్ / ఫియామా వెరైటీ ప్యాక్ 125 g మొదలుకుని (ప్యాక్ తగ్గింపు 5) (సెలెక్ట్ వేరియంట్స్)
ఫ్లాట్ 50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹449 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹225 మొదలుకుని
డిటర్జెంట్ పౌడర్ 5 kg మొదలుకుని / లిక్విడ్ 4 L మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 33% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹565 మొదలుకుని
తాజ్‌మహల్ టీ 500 g
ఆదా చేసుకోండి ₹81
ఎమ్ఆర్‌పి ₹380 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹299 మొదలుకుని
డైరీ, ఫ్రోజెన్ అండ్ బేకరి (ఎంపిక శ్రేణి)
కనీసం 25% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹25 మొదలుకుని
టూత్‌పేస్ట్ 280 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹212 మొదలుకుని
BUY ANY 1 GET ANY 1 FREE
స్టెయిన్ లెస్ స్టీల్ టిప్లీ కుక్‌వేర్ కాంబో (తవా 22 cm అండ్ ఫ్రై పాన్ 24 cm)
స్మార్ట్ ప్రైస్ ₹999
ఎమ్ఆర్‌పి ₹3649
స్మార్ట్ ప్రైస్ ₹3999
2 పీసెస్డ్ ట్రాలీ సెట్
ఎమ్ఆర్‌పి ₹12800
ఏదైనా ఉచితం డఫల్ ట్రాలీ బ్యాగ్
Surya Flame
2 / 4 బ్రాస్ బర్నర్ గ్లాస్ టాప్ గ్యాస్ స్టౌవ్
స్మార్ట్ ప్రైస్ ₹1599 మొదలుకుని
ఎమ్ఆర్‌పి ₹5695 మొదలుకుని
2000+ ఫ్యాషన్ స్టైల్స్
ఫ్యాషన్ ₹399
మెన్స్ వేర్, ఉమెన్స్ వేర్ అండ్ కిడ్స్ వేర్
Ask for your Bundle of Savings
Get Offer Coupons Booklet
worth ₹3999
at ₹9*
*On Shopping of ₹299/- & Above
అన్నీ ₹49 లోపల
ఎమ్ఆర్‌పి ₹100 మొదలుకుని
ఇప్పుడు తెరవబడింది
ఆకివీడు: ఎం వి ఆర్ కాంప్లెక్, ఎస్ బి ఐ ఎదురుగా, కైకలూరు రోడ్. కొవ్వూరు: ఎల్ ఐ సి ఆఫీస్ దగ్గర, ఎల్ ఐ సి ఆఫీస్ రోడ్.
SMART BAZAAR
వద్ద కూడా లభ్యం
fresh Signature
SMART SUPERSTORE
10% INSTANT DISCOUNT#
SBI card
#Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 per Trxn. per credit card; Validity: 13 Aug - 17 Aug 2025. T&C Apply.
BAJAJ FINSERV
Get ₹1000 GV on shopping of ₹5000 or more with Bajaj Easy EMI.
Offer Valid from 13th August to 17th August 2025



ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే - స్వాతంత్ర్య భావం, స్వాభిమానం, ఏకత్వాన్ని ప్రజలు లోతుగా అనుభూతి చెందాలి.
- మహాత్మా గాంధీ

సాక్షి
శుక్రవారం, 15 ఆగస్టు 2025

వివాదంలో 'గవర్నర్ కోటా'

రాష్ట్రాల్లో అసెంబ్లీలుండగా శాసన మండళ్ళు అవసరమా అన్న వాదనతోపాటే ఆ శాసన మండళ్ళకు కొందరు సభ్యుల్ని నామినేట్ చేయటానికి గవర్నర్లకుండే అధికారాలపై, ఆ కోటాలో ఎంపికైన అభ్యర్థుల అర్హతలపై కూడా విస్తృతంగా చర్చ జరుగుతుంటుంది. తెలంగాణ శాసన మండలికి నిరుడు గవర్నర్ కోటాలో ఎంపికైన విద్యావేత్త ప్రొఫెసర్ కోదండరామ్, పాత్రికేయుడు అమేర్ అలీఖాన్‌ల సభ్యత్వాలు రద్దుచేస్తూ బుధవారం సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలీయటంతో ఆ అంశాలపై మళ్లీ చర్చ మొదలైంది. రాష్ట్రాల్లో శాసన మండళ్ళ మాదిరే కేంద్ర స్థాయిలో ఉండే రాజ్యసభకు చేసే ఎంపికలు కూడా అందరిలో ఆసక్తి రేపుతాయి. అంతేకాదు... వివాదాలకూ, అభ్యంతరాలకూ దారితీస్తుంటాయి. పాలకులుగా ఎవరున్నా ఈ రివాజు మారదు. ఇప్పుడు ఎమ్మెల్సీ సభ్యత్వాలు రద్దయిన ప్రొఫెసర్ కోదండరామ్, అమేర్ అలీఖాన్‌ల నేపథ్యం చూస్తే గవర్నర్ కోటాలో ఎంపికకు వారికి అన్ని విధాలా అర్హతలున్నాయని అర్థమవుతుంది. తెలంగాణ సాధనలో జేఏసీ కన్వీనర్‌గా ప్రొఫెసర్ కోదండరామ్ పాత్ర తెలియనివారు లేరు. ఉర్దూ పత్రిక 'సియాసత్'లో సీనియర్ పాత్రికేయుడైన అమేర్ అలీఖాన్ విద్యా, సంక్షేమ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటారు. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదే స్థానాలకు దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణలను ఎంపిక చేసింది. వీరిద్దరికీ కూడా సామాజిక ఉద్యమాల్లో, సేవాకార్యకలాపాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది.

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ పాలిస్తున్నప్పుడు గవర్నర్ కోటా ఎంపికలపై రాష్ట్ర మంత్రివర్గ సిఫార్సులకు గవర్నర్ నుంచి దాదాపు అభ్యంతరాలు వినబడవు. వేర్వేరు ప్రభుత్వాలున్నప్పుడే సమస్యంతా! విపక్షాలు ఎటూ అన్ని వేళలా విమర్శిస్తాయి. అయితే గవర్నర్ కోటాకు వీలు కల్పించే రాజ్యాంగంలోని 171(5) అధికరణం స్ఫూర్తిని చాలా సందర్భాల్లో ప్రభుత్వాలు బేఖాతరు చేస్తున్నాయనీ, 'రాజకీయ నిరుద్యోగుల' పునరావాసానికి దాన్ని వినియోగిస్తున్నారనీ ఆరోపణలున్నాయి. ఆ అధికరణం ప్రకారం సాహిత్యం, విజ్ఞాన శాస్త్రం, కళ, సహకారోద్యమం, సామాజిక సేవ తదితర రంగాల్లో పాటుబడినవారిని, ఆ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం, వ్యావహారిక అనుభవం ఉన్నవారిని గవర్నర్ కోటాలో నామినేట్ చేయొచ్చు. మేధావులూ, కళాకారులూ, సేవాతత్పరత కలిగినవారూ నేరుగా పోటీచేసి నెగ్గే అవకాశం తక్కువ కాబట్టి శాసనాల రూపకల్పనలో, పాలనలో అటువంటివారి సేవలు పొందాలన్న ఉద్దేశంతో ఈ కోటా ఏర్పాటు చేశారు. ఇలాంటివారితో ఏర్పడే సభ కనుకే పెద్దల సభ అనీ, ఎగువసభ అనీ శాసన మండళ్ళకూ, రాజ్యసభకూ పేరుంది. రాజ్యాంగంలోని 80వ అధికరణం రాజ్యసభకు రాష్ట్రపతి కోటా కింద ఎంపిక చేసే వీలు కల్పిస్తోంది. అయితే దేశ చరిత్రలో కేబినెట్ సిఫార్సు లేకుండా గవర్నర్ తనంత తానే నామినేట్ చేసిన ఏకైక ఉదంతం ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో చోటు చేసుకుంది. 1952లో సీనియర్ నాయకుడు చక్రవర్తి రాజగోపాలాచారిని నాటి గవర్నర్ శ్రీ ప్రకాశ ఎమ్మెల్సీగా నామినేట్ చేశారు. అప్పటి ఎన్నికల్లో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోని కూటమి అధిక స్థానాలు గెల్చుకోవటం, కాంగ్రెస్ మైనారిటీలో పడటంతో నాటి ప్రధాని నెహ్రూ మంత్రాంగం నడిపి అనారోగ్యంతో ఉన్న రాజగోపాలాచారిని సీఎంగా రప్పించారు. అటుపై ఉప ఎన్నిక ద్వారా ఎమ్మెల్యే కావాలని ఆదేశించినా రాజగోపాలాచారి తిరస్కరించటంతో నెహ్రూ ఆగ్రహం వ్యక్తం చేశారంటారు. బల నిరూపణ సమయానికి రాజగోపాలాచారి ఫిరాయింపుల్ని ప్రోత్సహించి పదవి నిలబెట్టుకున్నారు. శ్రీ ప్రకాశ తీరును మాత్రం ఇప్పటికీ 'రాజ్యాంగ అనౌచిత్యం'గా రాజ్యాంగ నిపుణులు అభివర్ణిస్తారు.

దేశవ్యాప్తంగా చాలాచోట్ల ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులైన మేధావులూ, కళాకారులూ, సాహితీవేత్తలూ లేకపోలేదు. అయితే ఆ యా రంగాల్లో ఎన్నదగిన వైశిష్ట్యం ఉన్నా, రాజకీయ అనుకూలతలు తోడైనప్పుడే వారికి పదవులు దక్కుతున్నాయి. పదవులిస్తామన్నా వద్దని తిరస్కరించినవారూ లేకపోలేదు. కర్ణాటక సీఎంగా దేవరాజ్ అర్స్ ఉన్నప్పుడు సీనియర్ పాత్రికేయుడు టీఎస్ రామచంద్రరావుకూ, రామకృష్ణ హెగ్డే సీఎంగా ఉన్నప్పుడు సాహితీవేత్త దేవనూర్ మహాదేవకూ గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ అవకాశమిస్తామని చెప్పినా వారు తిరస్కరించారు. నిరుడు అక్టోబర్‌లో మహారాష్ట్రలో గవర్నర్ కోటా కింద 12 మందిని ఎంపిక చేసినప్పుడు కూడా వివాదం రాజుకుంది. వారిలో కొందరు రాజ్యాంగం నిర్దేశిస్తున్న నిబంధనలకు తగినవారే అయినా, కొందరు పూర్తిగా రాజకీయ ప్రాపకంతోనే ఎంపికయ్యారని విమర్శలు వెల్లువెత్తాయి. ఎటూ వచ్చే నెల 17న సర్వోన్నత న్యాయస్థానం తాజా వివాదంలో తదుపరి విచారణ కొనసాగిస్తుంది. దీనిలో వెలువడే తుది తీర్పు ప్రభుత్వాలకు మార్గదర్శకం కాగలిగితే మంచిదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు; శ్రావణ మాసం; **తిథి:** బ.సప్తమి రా.1.24 వరకు, తదుపరి అష్టమి; **నక్షత్రం:** అశ్విని ప.10.09 వరకు, తదుపరి భరణి; **వర్జ్యం:** ఉ.6.24 నుండి 7.54 వరకు, తదుపరి రా.7.05 నుండి 8.34 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.07 వరకు,తదుపరి ప.12.30 నుండి 1.20 వరకు; **అమృత ఘడియలు:** తె.4.01 నుండి 5.31 వరకు (తెల్లవారితే శనివారం).

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం: 6.24
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

మారిన దేశం



ఒకప్పుడు భారతదేశంలో: ఓటర్లు ప్రభుత్వాన్ని ఎంచుకున్నారు. ఇప్పుడు: ప్రభుత్వం ఓటర్లను ఎంచుకుంటోంది.
- సంజయ్ ఝా, న్యాయవాది

ఇండియాకు భిన్నంగా...



1947, 1948ల్లో పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆగస్టు 15నే జరుపుకొన్నారు. ఆ తరువాత, భారతదేశం నుండి భిన్నంగా ఉండాలనే ఉద్దేశంతో స్వాతంత్ర్య దినం కూడా వేరుగా ఉండాలని నిర్ణయించారు. దాంతో స్వాతంత్ర్యం వచ్చిన రాత్రి, అంటే ఆగస్టు 14ను స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకోవడం మొదలైంది.
- హుస్సేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

పనికొస్తుందనా?




ఆధార్ పౌరసత్వానికి రుజువు కాదు. ఓటర్ ఐడీ కూడా పౌరసత్వానికి రుజువు కాదు. మరి పాస్‌పోర్ట్ పనికొస్తుందా? పనికొస్తుంది. కానీ ఆ పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి గుర్తింపు కోసం ఆధార్‌ను చూపించవచ్చు! అంటే...
- అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

కష్టమేం కాదు!



నేటి యువతలో శ్రమించే తత్వం ఉంది. నిజాయతీ ఉంది. దృఢ సంకల్పం ఉంది. వీటికి తోడుగా సవాళ్లను ఎదుర్కొనే నేర్పు, ఓర్పు కూడా ఉంటే... 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థికశక్తిగా నిలపడం కష్టం కాదు.
- డాక్టర్ వి. నారాయణన్, ఇస్రో ఛైర్మన్

దిద్దేవి తడబాట్లే!



ఒక పనిని చేయటంలోని పట్టుదల విషయంలో మీరు నిజాయతీగా ఉండాలి. అప్పుడు, మీరు ఈరోజు చేయలేకపోయిన పనిని రేపు తప్పక చేయగలుగుతారు. తడబాట్లు ఉండేవే. ప్రపంచ గమనాన్ని సరిదిద్దేవి తడబాట్లే.
- శ్రీ అరబిందో, యోగి - జాతీయవాది

ఘర్షణతో కాదు



'మానవత్వం' ప్రపంచ విధానంగా ఉండాలి. ఒక దేశం ఇతర దేశాల భద్రతను పణంగా పెట్టి తన భద్రతను చూసుకోకూడదు. అన్ని దేశాల భద్రతా సమస్యలనూ తనవి గానే చూడాలి. ఘర్షణతో కాదు, సంభాషణతోనే నిజమైన భద్రతను సాధించగలం.
- వాంగ్ యి, చైనా విదేశాంగ మంత్రి

మానవత్వాన్ని మింగే ప్రపంచ స్వార్థం

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

'కళ్ల ముందు హింస జరుగుతుంటే, దానిని చూస్తూ మౌనంగా ఉండటం కూడా హింసలో భాగమే' అన్నారు మహాత్మా గాంధీ. ప్రపంచానికి అహింసా సిద్ధాంతాన్ని అందించి ప్రపంచ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలంటే అదొక్కటే ఏకైక మార్గమని ఆయన నిరూపించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు యుద్ధోన్మాదానికి రక్తపుటేరులై పారుతున్న 'గాజా'ను చూస్తూ కూడా ప్రపంచంలోని అత్యధిక బలమైన దేశాలు నోళ్లు కుట్టేసుకున్నట్లు ప్రవర్తించడమే నెతన్యాహు హింస కంటే బీభత్సంగా గోచరిస్తోంది. 'గాజా' మొత్తం ఛిద్రం అయింది. 75,000 మంది ఇప్పటి వరకు మట్టిలో కలిసిపోయారన్నది అధికారిక లెక్క. అంతకు మించిన సంఖ్యలో అక్కడి ప్రజలు, సైనికులు హతం అయ్యారన్నది అనధికార అంచనా. అంకెలను బట్టి చూస్తే, గతంలో హిట్లర్, ముస్సోలినీ నెలకొల్పిన రికార్డులన్నింటినీ నెతన్యాహు తిరగరాసినట్లే ఉంది.

మొదటి ప్రపంచ యుద్ధం సమయంలోగానీ, రెండవ ప్రపంచ యుద్ధం జరిగినప్పుడు గానీ బాధితులకు, క్షతగాత్రులకు రెడ్‌క్రాస్ వంటి స్వచ్ఛంద సంస్థలు అందించిన సాయాన్ని అడ్డుకొన్న దాఖలాలు లేవు. కానీ, నేడు అంతర్జాతీయ సమాజం అందిస్తున్న సాయంపై ఇజ్రాయెల్ సైనికులు ఆంక్షలు పెట్టారు. ఇంతటి అమానవీయం కనీవినీ ఎరుగం. 22 నెలలు గడిచినా 'గాజా'లో సాధారణ పరిస్థితులు నెలకొనడానికి ఏ దేశమూ చొరవ చూపడం లేదు. ఆ ఒక్క యుద్ధం సరిపోదన్నట్లుగా... ఇరాన్‌లో అణ్వస్త్రాయుధాలు, శుద్ధి చేసిన యురేనియం నిక్షేపాలు ఉన్నాయనే మిషతో ఆ దేశంపై కూడా విరుచుకుపడి పశ్చిమాసియాలో కల్లోల పరిస్థితులు సృష్టించి ఏ ఒక్కరికీ కంటి మీద కునుకు లేకుండా చేశారు నెతన్యాహు. వియన్నా డిక్లరేషన్‌ను అనుసరించి యుద్ధంలో పాల్గొనే దేశాలు... సామాన్య పౌరులను చంపకూడదు. జన సామాన్యం, నివాస ప్రాంతాలపై దాడులు చేయరాదు. ఈ నిబంధనను ఇజ్రాయెల్ అటకెక్కించింది.

అలాంటి నాయకులేరీ?

'వసుధైక కుటుంబం' అన్నది భారతదేశం ప్రవచించిన మహత్తరమైన భావన. దానిని భావనగానే ఉంచకుండా ఆచరణలోకి తేవడానికి చిత్తశుద్ధితో కృషి చేసింది కూడా భారతదేశ నాయకత్వమే. గాంధీజీ, నెహ్రూ, అంబేడ్కర్, లోహియా, వినోబాభావే మొదలైన నాయకులతో పాటు, ఆ తర్వాత తరానికి చెందిన ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి, అబ్దుల్ కలాం వంటివారు ప్రపంచ శాంతికి, ప్రపంచ దేశాల ఆర్థిక సామాజిక పురోగతికి కృషి చేశారు. కెన్నెడీ, చౌ ఎన్ లై, మార్షల్ టిటో, నాజర్ మొదలైన వివిధ దేశాల నాయకులు సైతం ప్రపంచశాంతికి కృషి చేశారు. మానవజాతి వినాశనానికి దారితీసే యుద్ధాల నివారణకు ఎందరో నేతలు గతంలో తాపత్రయ పడ్డారు. వివిధ దేశాల నడుమ ఘర్షణలు చెలరేగినప్పుడు ఆ



ఉద్రిక్తతలను తగ్గించడంలో, సంప్రదింపుల ద్వారా, ఒడంబడికల ద్వారా యుద్ధాలను నివారించడాన్ని అనుభవంలో చూశాం. కానీ ఇప్పుడా చొరవ ఒక్క నాయకుడూ చేయడం లేదు. 'నేను– నా పొట్ట' అనే రీతిలో, 'నేను– నా దేశం' అనే విధంగా మాట్లాడటం తమ దేశీయ ప్రయోజనాలను పరిరక్షించుకోవడం గానూ, తమ దేశాభివృద్ధిని కాంక్షించే జాతీయ విధానంగానూ భావిస్తున్నారు తప్ప... అటువంటి విధానం వల్ల దేశాల మధ్య పరస్పర సహకారం, సహజీవనం, శాంతి సౌభాగ్యాలకు విఘాతం కలుగుతుందని ఆలోచించడం లేదు.

అప్పుల కోసం, ఆయుధాల కోసం నేడు అనేక దేశాలు... అగ్రదేశాల ముందు సాగిలపడుతున్నాయి. బదులుగా అగ్రదేశాలు ఏం చేసినా... 'తానా అంటే తందాన' అంటున్నాయి. ఈ ధోరణి ఇప్పటికిప్పుడు అలవాటు చేసుకొన్నది కాదు. దాదాపు 3 దశాబ్దాలుగా కొనసాగుతున్నదే. ఇప్పుడది పరాకాష్ఠకు చేరింది. ఐక్యరాజ్యసమితి కోరల్ని ఎప్పుడో పీకేయడంతో ఆ సంస్థ అస్తిత్వం నామమాత్రంగా మారి యుద్ధాలను నివారించడంలో ఎటువంటి పాత్రనూ పోషించలేకపోతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను ఆపగల చొరవ ఎవరు తీసుకొంటారు? ఆ శక్తి ఎవరికి లేకపోవడం అటుంచి... అలాంటి ప్రయత్నం చేయాలన్న తపన కొరవడటమే అత్యంత బాధాకరం.

ద్వంద్వ ప్రమాణాలు

యుద్ధోన్మాదులు దేశాధినేతలైతే, ఆ దేశ ప్రజల భవిష్యత్తే కాదు... యావత్ ప్రపంచ భవిష్యత్ తారుమారవుతుందని గత అనుభవాలు తెలియజేస్తున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసిన కొన్ని గంటల్లోనే అంతర్జాతీయ చమురు ధరలు అమాంతం పెరిగిపోయాయి. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న సుదీర్ఘ యుద్ధం కారణంగా వాతావరణంలోకి ప్రవేశించిన ప్రమాదకర 'ధూళి' యూరప్‌తో సహా పొరుగునున్న పలు దేశాలలో ప్రతికూల ఫలితాలు చూపిస్తోందన్న వార్తలు వెలువడుతున్నాయి. దేశాల మధ్య ఏర్పడుతున్న ఉద్రిక్తతల కారణంగా తమ తమ గగనతలాలను మూసివేయడం,

- మానవజాతి వినాశనానికి దారితీసే యుద్ధాల నివారణకు ఎందరో నేతలు గతంలో తాపత్రయ పడ్డారు. కానీ ఇప్పుడా చొరవ ఒక్క నాయకుడూ చేయడం లేదు.
- మూడు బలమైన దేశాలు అమెరికా, రష్యా, చైనా ప్రత్యక్షంగా, పరోక్షంగా యుద్ధాల్లో పాల్గొనడం లేదా మిత్రదేశాలకు యుద్ధాల్లో సాయపడటం విరమించుకోనంత వరకు ప్రపంచంలో శాంతి స్థాపన జరగడం కష్టం.

నౌకాయాన మార్గాలను దిగ్బంధనం చేయడం వంటి దుందుడుకు చర్యల ఫలితంగా మానవాళికి జరుగుతున్న నష్టం, కాలహరణం ఊహాతీతమైనది.

ప్రపంచంలో మూడు బలమైన దేశాలు అమెరికా, రష్యా, చైనా ప్రత్యక్షంగా, పరోక్షంగా యుద్ధాల్లో పాల్గొనడం లేదా మిత్రదేశాలకు యుద్ధాల్లో సాయపడటం విరమించుకోనంత వరకు ప్రపంచంలో శాంతి స్థాపన జరగడం కష్టం. నిజానికి ఈ దేశాల ప్రజలకూ, ఆ మాటకొస్తే ఉత్తరకొరియా ప్రజలకు సైతం యుద్ధం అభిలషణీయం కాదు. ప్రజలెప్పుడూ అభివృద్ధిని ఆశిస్తారు. సుఖశాంతులను కోరుకుంటారు. కయ్యానికి కాలు దువ్వే మనస్తత్వం మెజారిటీ ప్రజలకు ఉండదు.

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు భిన్నంగా, తమ ప్రతిష్ఠను పెంచుకోవడానికీ, తమ దేశ ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని చాటుకొని అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికీ కొందరు ప్రపంచ నేతలు హ్రస్వదృష్టితో అనుసరిస్తున్న విధానాల వల్లనే... యుద్ధాలు ముగింపు లేకుండా కొనసాగుతున్నాయి. యుద్ధం పేరుతో బలహీనులపై అన్ని రకాల దారుణాలూ జరుగుతున్నాయి.

స్వార్థమే యుద్ధకారణం

కళింగ యుద్ధంలో గెలిచిన తర్వాత అశోక చక్రవర్తిలో పశ్చాత్తాపం కలుగుతుంది. ప్రత్యర్థులకు కలిగిన నష్టం కంటే మన నష్టం కొంచెం తక్కువ... అంతే... ఇది విజయం కాదు... పరాజయం... మానవత్వానికి తీరని మచ్చ అని మథన పడతాడు. యుద్ధాలకు స్వస్తి పలికి శాంతి కాముకుడిగా మారి శాంతిని విశ్వజనీనం చేయడానికి తన జీవితాన్ని ధారపోస్తాడు. ప్రపంచాన్ని జయించాలనుకున్న అలెగ్జాండర్ కథ కూడా చివర్లో విషాదంగానే ముగిసింది. ఈ ఉదంతాల నుంచి గుణపాఠాలు నేర్చుకొనే విశాల దృక్పథం నేడు నాయకుల్లో కరువైంది. వారి స్వార్థం నుంచే యుద్ధాలు మొదలవుతున్నాయి. అవి అంతిమంగా మానవత్వాన్ని మింగేస్తున్నాయి. ఉక్రెయిన్‌లో కావొచ్చు, గాజాలో కావొచ్చు... జరుగుతున్న పరిణామాల పట్ల ప్రపంచ దేశాలు నిర్లిప్తంగా, ఉదాసీనంగా, శిలాసదృశంగా మారిపోయాయి. వీటి ప్రతికూల పరిణామాలు ఊహిస్తేనే భయంగా ఉంటుంది.

వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, ఏపీ శాసన పరిషత్ సభ్యులు

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందినప్పుడే...

భారతదేశం నేడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటోంది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నెరవేర్చేందుకు ఎంతవరకు కృషి చేస్తున్నామో మనం ప్రశ్నించుకోవాలి.

2024 ప్రపంచ ఆకలి సూచిక ప్రకారం, భారతదేశం 127 దేశాలలో 105వ స్థానంలో ఉంది. 'సర్వైవల్ ఆఫ్ ద రిచెస్ట్: ది ఇండియా స్టోరీ' అనే శీర్షికతో ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ తాజా నివేదిక భారతదేశంలో గణనీయమైన ఆదాయ అసమానతను పేర్కొంది. అత్యంత ధనవంతులైన 1% మంది ఇప్పుడు దేశ మొత్తం సంపదలో 40% కంటే ఎక్కువ కలిగి ఉన్నారు. దిగువన ఉన్న 50% మంది కేవలం 3% మాత్రమే సంపద కలిగి ఉన్నారు. వీటితో పాటు 2024లో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ 'కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్' ప్రకారం భారతదేశం అవినీతి అవగాహన సూచికలో 180 దేశాలలో 96వ స్థానంలో ఉంది.

2025 నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై చేసే మొత్తం వ్యయం జీడీపీలో 4.64%గా ఉంటుందని ఆర్థిక వేత్తలు అంచనా వేశారు. అయితే ఇది నూతన విద్యా విధానం -2020 నిర్దేశించిన 6% లక్ష్యం కంటే తక్కువగా ఉండటం గమనార్హం. 2025–26 కేంద్ర బడ్జెట్‌లో, భారతదేశం ఆరోగ్య రంగానికి రూ. 99,859 కోట్లు కేటాయించింది. ఇది గత సంవత్సరం సవరించిన అంచనాలతో పోలిస్తే 11% పెరుగుదలను సూచిస్తుంది.



మొత్తం ఆరోగ్య బడ్జెట్‌లో 96%తో ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖకు ఎక్కువ కేటాయింపులు లభించాయి. అయితే ఇది వార్షిక బడ్జెట్ కేటాయింపులు, విధాన మార్పుల ఆధారంగా మారవచ్చు. ఆర్థిక వ్యవస్థలో రెడ్ టేపిజం ఇప్పటికీ తన ప్రభావాన్ని చూపుతోంది. బంధుప్రీతి దాదాపు అన్ని రంగాలలో కనిపిస్తోంది. ఇప్పటికీ మనం వరకట్నం, ఆడ శిశువుల హత్య, లింగ అసమానత, గృహ హింస, అంటరానితనం వంటి సాంఘిక దురాచారాలతో కునారిల్లడం బాధాకరం.

అయితే మన దేశం ఎన్ని ఆటంకాలు ఎదురైనా విభిన్న రంగాలలో చాలా అభివృద్ధిని సాధించింది. మానవ వనరులలో (జనాభా) భారతదేశం మొదటి స్థానంలో ఉంది. భారతదేశం ప్రపంచంలోనే పాలు, పప్పుధాన్యాలు, జనపనార ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంది. బియ్యం, గోధుమలు, చెరకు, వేరుసెనగ, కూరగాయలు, పండ్లు, పత్తి ఉత్పత్తిలో రెండవ అతిపెద్ద దేశంగా ఉంది. భారతదేశం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్యలో అమెరికా, చైనాల తర్వాత మూడవ స్థానంలో ఉంది. ప్రపంచంలో 10వ అతిపెద్ద దిగుమతిదారుగా, 16వ అతిపెద్ద ఎగుమతిదారుగా నిలిచింది. 2024లో, భారతదేశం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు స్వీకరించడంలో ప్రపంచవ్యాప్తంగా 15వ స్థానంలో నిలిచింది.

సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణల నేపథ్యంలో ప్రస్తుతం ప్రపంచంలో అమెరికా అనుసరిస్తున్న ట్రంప్ విధానాల నుండి, యుద్ధాల నుండి రక్షించుకోవడం కోసం నిరంతర ఆర్థికాభివృద్ధి, విభిన్న సంక్షేమ కార్యక్రమాలతో స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని మనం కొనసాగించాలి. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలపై అవగాహన ఉన్న పౌరుల భాగస్వామ్యంతోనే స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని అందుకుని అభివృద్ధి సాధించగలం.

- డా॥ పి.ఎస్. చారి, కామర్స్- మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ప్రొఫెసర్

ఎవరీ గబ్బర్ సింగ్?

ఇన్ బాక్స్



గబ్బర్: రియల్ – రీల్

గబ్బర్ సింగ్ గుర్జర్ అనే బందిపోటు దొంగ దురాగతాలను జనరంజకంగా తెరకెక్కించిన చిత్రం 'షోలే'. మధ్యప్రదేశ్ భీండ్ జిల్లా నివాసి గబ్బర్ సింగ్. అతడు చిన్నతనంలోనే (1955) బందిపోటు ముఠాలో చేరిపోయాడు. బ్రిటిష్ వాళ్ల కాలం నుండే ఆ ప్రాంతం బందిపోట్లకు అడ్డా. గబ్బర్ అక్కడ సొంత ముఠాతో సరిహద్దు గ్రామాల్లోకి చొరబడి దోపిడీ చేస్తూ, దొరికిన యువతులను మానభంగం చేసేవాడు. పోలీసులకు ఆచూకీ తెలిపినవారిని పట్టుకుని... వాళ్ల ముక్కు, చెవులు కోసి దేవీమాతకు అర్పించేవాడు. అతని డేరాల్లోకి వచ్చిన పోలీసు బలగాలను బంధించి వారి చేతివేళ్ళను కత్తిరించేవాడు. ఒక సాధువు సలహా మేరకు కాళీమాతను ప్రసన్నం చేసుకోవటానికని పన్నెండు మంది పసిపిల్లలను అపహరించి, వాళ్లను నరికి మాతకు నైవేద్యంగా అర్పించాడు. దీంతో గబ్బర్‌ని పోలీసులకు ప్రాణాలతో గానీ, చంపి గానీ అప్పగించిన వారికి యాభై వేల రూపాయల (పూరే పచాస్ హజార్) బహుమతి కూడా 'ఐలాన్' చేశారు అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కైలాస్ నాథ్ కట్జూ.

గబ్బర్ దురాగతాల వల్ల పార్లమెంటులో పండిత్ నెహ్రూ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు ప్రధాని... తన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కేఎఫ్ రుస్తంజీ నేతృత్వంలో పోలీస్ టీమ్ ఏర్పాటుచేసి గబ్బర్ సింగ్ గాలింపు కోసం మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ సరిహద్దు ప్రాంతాలకు డిప్యూట్ చేశారు. ఆ టీమ్ 1959 నవంబర్ 13న గబ్బర్ సింగ్‌ను హతమార్చింది. మరుసటి రోజు ఈ విషయాన్ని ప్రధాని నెహ్రూకు పుట్టినరోజు (నవంబరు 14) బహుమతి అంటూ ట్రంకాల్ ద్వారా తెలిపారు కేఎఫ్ రుస్తంజీ. ఆయన పోలీస్ టీమ్‌లోని ఒక పోలీస్ ఆఫీసర్ పేరు అబ్దుల్ రషీద్ ఖాన్. ఈయన కొడుకే సలీం ఖాన్ (సలీం–జావేద్ ఫేమ్). సలీం ఖాన్ చిన్నతనం ఇండోర్‌లో గడిచింది. చంబల్ వ్యాలీ గ్యాంగ్ గురించీ, గబ్బర్ సింగ్ ఎన్కౌంటర్ సంగతుల గురించీ ఆయన కుటుంబ సభ్యులు చెప్పుకుంటూ ఉంటే వినేవారు సలీం. ఆయన పెద్దయ్యాక బాంబేలో (ముంబై) బాలీవుడ్ స్టోరీ రైటర్‌గా స్థిరపడిన సంగతి తెలిసిందే.


గబ్బర్ సింగ్ ఎన్కౌంటర్ ఇతివృత్తంతో కథ రాశారు సలీం. దాన్ని విన్న ప్రముఖ నిర్మాత జీపీ సిప్పీ; ఆయన కొడుకు, దర్శకుడు రమేష్ సిప్పీలు సినిమా తీయడానికి సిద్ధమయ్యారు. గబ్బర్‌సింగ్ పాత్రకు అంజద్ ఖాన్‌ను ఎంపిక చేశారు. 'అభిషప్త్ చంబల్' లాంటి బందిపోట్లకు సంబంధించిన నవల, కేఎఫ్ రుస్తంజీ ఆటోబయోగ్రఫీ వంటి పుస్తకాలు అంజద్‌కు పాత్రను అర్థం చేసుకోవడానికి దోహదపడ్డాయి. నేటి (ఆగస్టు 15)కి, 'షోలే' విడుదలై యాభై ఏళ్ళు పూర్తి అయినా సినీ ప్రేక్షకుల మనోఫలకంపై అది చెదరకుండా ఉండటం విశేషం.

- జిల్లా గోవర్ధన్ । మాజీ పీఎఫ్ కమిషనర్, ముంబై
(బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'షోలే' విడుదలై నేటికి యాభై ఏళ్లు)

డేటా పాయింట్

పెరుగుతున్న క్యాన్సర్ మరణాలు

భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) - 'జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ కార్యక్రమం' (ఎన్‌సీఆర్‌పీ) గణాంకాల ప్రకారం... దేశంలో 2024 నాటికి 15,33,055 క్యాన్సర్ రోగులు ఉన్నారని అంచనా. గతంలో క్యాన్సర్‌ను గుర్తించేందుకు వైద్య సదుపాయాలు, పరీక్షలు చాలా తక్కువగా ఉండేవి. అందువల్ల కేసులు బయటకు వచ్చేవి కావు. ఇటీవలి కాలంలో వైద్య పరీక్షా సదుపాయాలు పెరగడం, ముఖ్యంగా ప్రజల్లో ఆరోగ్య స్పృహ ఎక్కువ కావడంతో స్వచ్ఛందంగా ఈ పరీక్షలు చేయించుకోవడానికి ముందుకు వస్తున్నారు.



జన్మాంతర సాఫల్యం

అథర్వ వేదానికి అనుబంధమైనది కృష్ణోపనిషత్తు. ఈ రెండు శ్లోకాలు అందులోనివే:
అన్యోన్య విగ్రహం ధార్యం తవాఙ్గస్పర్శనాదిహ / శశ్వత్స్పర్శాయితాస్మాకం గృహ్ణీమోవతారాన్వయమ్.
రుద్రాదీనాం వచః శ్రుత్వా ప్రోవాచ భగవాన్స్వయమ్ /అఙ్గసఙ్గం కరిష్యామి భవద్వాక్యం కరోమ్యహమ్.

సర్వాంగ సుందరుడు, సచ్చిదానంద స్వరూపుడు, మహావిష్ణు అవతారము అయిన శ్రీరామచంద్రుడిని చూసి వనవాసులైన మునిజనం (ఆయన సౌందర్యానికి) ఆశ్చర్యచకితులైనారు. ఆ మునులు శ్రీరాముడితో 'ఈ భూమిపై జన్మించిన విష్ణు స్వరూపుడివైన నీ ఆలింగన సుఖాన్ని మేమందరం కోరుకుంటున్నాము' అన్నారు. వారి మాటలకు శ్రీరాముడు 'నా మరో అవతారమైన శ్రీకృష్ణావతారంలో మీరందరూ గోపికలై జన్మించి నా ఆలింగన సౌఖ్యాన్నీ, అతి సన్నిహిత సామీప్యాన్నీ అనుభవించి ఆనందిస్తారు' అని బదులిచ్చాడు. 'అలాగా స్వామీ! అయితే మమ్ములను మా మరుజన్మలో గోపికలుగాను, గోపబాలురుగాను జన్మింపజేయండి. మీ సాన్నిధ్యాన్ని, మీ స్పర్శ సుఖాన్ని పొందే స్థితిలో మాకు గోపికలుగానూ, గోపబాలురుగానూ రూపాలు ధారణ చేయడం సమ్మతమే!' అని ఆ మునిగణం ఆనందంతో అంగీకారం తెలిపారు. రుద్రాది దేవతలు, మునులు స్వయంగా చేసిన ఈ స్నేహమయ ప్రార్థనను విన్న ఆదిపురుషుడైన భగవానుడు 'మీ గాఢమైన కోరికను నేను తప్పక మన్నించి నెరవేరుస్తాను!' అన్నాడు – అని పై శ్లోకాల భావం. పరమ పురుషుడు, భగవానుడు అయిన శ్రీరాముడి ఈ మాటలను విన్న దేవ మునిగణాలు ఆనందంతో 'మేము కృతార్థులమైనాము స్వామీ!' అన్నారు.



రామావతారంలో ఏకపత్నీవ్రతుడు అయిన కారణంగా శ్రీరాముడికి మునిజనం కోరికను ఆ జన్మలో తీర్చే అవకాశం లేకపోయిందన్నది విదితం. ఒక జన్మలో చేసిన పుణ్యాలకు ఫలితాన్ని మలి జన్మలో పొందడాన్ని 'జన్మాంతర సాఫల్యం' అంటారు. రామావతారంలో మునిజనం కృష్ణావతారంలో గోపికలై జన్మించడం ద్వారా భగవంతునితో అత్యంత సన్నిహితమైన సాంగత్యం పొంది అత్యుత్తమమైన జన్మాంతర సాఫల్యాన్ని పొందారు.

- భట్టు వెంకటరావు


ఆహారం & గ్రోసరీ
ఆల్మండ్ 1kg ₹769
జీడిపప్పు 500g ₹435
దేశీ నెయ్యి ₹525/ℓ
ఆవు నెయ్యి ₹539/ℓ
సన్‌ఫ్లవర్ ఆయిల్ ₹139/ℓ
ఫస్ట్ క్రాప్ రోజానా బాస్మతి బియ్యం 5kg MRP ₹675 ₹361
ఇండియా గేట్ రోజానా బాస్మతి బియ్యం 5kg MRP ₹575+ ₹415
దావత్ రోజానా బాస్మతి బియ్యం 5kg MRP ₹575+ ₹409
ఫస్ట్ క్రాప్ బిస్కట్స్ & కుకీస్ 200g+ MRP ₹40+
1 కొనండి 1 ఉచితంగా పొందండి
బ్రిటానియా/పార్లే/సన్‌ఫీస్ట్/క్యాడ్‌బరీ/యూనిబిక్/ఓరియన్/లోట్టే బిస్కట్స్ & కుకీస్ 120g+
1 కొనండి 1 ఉచితంగా పొందండి
హల్దీరామ్/బికానో/బికారామ్ సోన్ పాపీ 200g/400g
రసగుల్లా/గులాబ్ జామూన్ 1kg
MRP ₹90+
1 కొనండి 1 ఉచితంగా పొందండి
ఫుల్ బ్లూమ్ టీ 1kg MRP ₹540
8kg చక్కెర ఉచితం
టీ 1kg MRP ₹510+
టాటా ప్రీమియం ₹190 తగ్గింపు
రెడ్ లేబుల్ ₹190 తగ్గింపు
టాటా గోల్డ్ ₹151 తగ్గింపు
ఫస్ట్ క్రాప్ నమ్కీన్ 900g/ 1kg
MRP ₹350+ ₹159
బికానో నమ్కీన్ 1kg, MRP ₹299+
₹105 తగ్గింపు
ఫస్ట్ క్రాప్ మసాలా/ఆటా చిల్లీ నూడుల్స్ 280g
420g/ 560g MRP ₹70+
1 కొనండి 1 ఉచితంగా పొందండి
మ్యాగీ మసాలా నూడుల్స్
560g MRP ₹120+
2 కొనండి ₹45 తగ్గింపు పొందండి
హెడ్ & శోల్డర్స్/ పాంటెనే షాంపూ
340ml 40% తగ్గింపు
650ml 60% తగ్గింపు
కోల్గేట్ డెంటల్ క్రీమ్ 500g/ 800g
MRP ₹350+
33% తగ్గింపు
ఔట్‌షైన్ సోప్ 100g/ 125g
MRP ₹43+
ఏదైనా 4 కొనండి ₹99
డోవ్/లక్స్/చింథోల్/ సోప్ MRP ₹190+
40% తగ్గింపు
హోమ్ నింజా డిటర్జెంట్ 4kg/ 5kg
MRP ₹515+
50% తగ్గింపు
టైడ్ డిటర్జెంట్ 5kg, 8kg
MRP ₹659+
40% తగ్గింపు
ఈక్వాలైఫ్ శానిటరీ 20 ప్యాడ్స్, MRP ₹80
1 కొనండి 1 ఉచితంగా పొందండి
విస్పర్ అల్ట్రా శానిటరీ XL+ 3 X 15 ప్యాడ్స్,
MRP ₹480 ₹299
ఎల్లో హిప్పో బేబీ డైపర్ జంబో ప్యాక్
MRP ₹799
50% తగ్గింపు
పాంపర్స్ బేబీ డైపర్ సూపర్ జంబో ప్యాక్
MRP ₹1499
50% తగ్గింపు
షవర్ జెల్/కోకోనట్ ఆయిల్ క్లీనర్స్/ హ్యాండ్‌వాష్/ డిష్‌వాష్
1 కొనండి 1 ఉచితంగా పొందండి
ఆగస్టు 15 నుండి 17
నమ్మశక్యంకాని
ఆఫర్లు
హోమ్ నీడ్స్ & ఉపకరణాలు
కర్టెన్స్, MRP ₹269+
8 కొనండి 15% తగ్గింపు పొందండి
కింగ్ సైజ్ డబుల్ బెడ్ షీట్ + 2 పిల్లో కవర్ MRP ₹429+
2 కొనండి 1 ఉచితంగా పొందండి
100% కాటన్ బాత్ టవల్
MRP ₹349
₹499కు 2 కొనండి
స్టీల్ వాటర్ బాటిల్
MRP ₹199+
2వ దానిపై 20% తగ్గింపు
tandem
డ్రై ఐరన్ 1000W
MRP ₹599 ₹329
ఆదా చేయండి ₹270
USHA
డ్రై ఐరన్ 1000W
MRP ₹900+ ₹579
ఆదా చేయండి ₹321
tandem
ఎలక్ట్రిక్ కెటిల్ 1.5ℓ
MRP ₹1299 ₹479
ఆదా చేయండి ₹820
Prestige
ఎలక్ట్రిక్ కెటిల్ 1.5ℓ
MRP ₹1445 ₹599
ఆదా చేయండి ₹846
tandem
ఎగ్ బాయిలర్
MRP ₹599 ₹299
ఆదా చేయండి ₹300
tandem
ప్రెషర్ కుక్కర్ 3ℓ
MRP ₹1199 ₹599
ఆదా చేయండి ₹600
tandem
మిక్సర్ గ్రైండర్ 2 జార్ 500W
MRP ₹2499 ₹1099
ఆదా చేయండి ₹1400
BAJAJ
మిక్సర్ గ్రైండర్ 3 జార్ 500W
MRP ₹4150 ₹2099
ఆదా చేయండి ₹2051
Prestige
ఇన్‌ఫ్రారెడ్ కుక్‌టాప్
2200W, MRP ₹4275 ₹2799
ఆదా చేయండి ₹1476
tandem
ఇన్‌ఫ్రారెడ్ కుక్‌టాప్
2200W, MRP ₹4799 ₹1999
ఆదా చేయండి ₹2800
tandem
3-ప్లై స్టెయిలెస్ స్టీల్ మూతతో 3ℓ కుక్ & సర్వ్
MRP ₹1999 ₹899
ఆదా చేయండి ₹1100
NIRLEP
ఇండక్షన్ కుక్‌వేర్ సెట్ మూతతో 3 యూనిట్స్
MRP ₹2645 ₹1299
ఆదా చేయండి ₹1346
tandem
మిక్సర్ గ్రైండర్ 4 జార్
1000W MRP ₹7199 ₹3599
ఆదా చేయండి ₹3600
BAJAJ
మిక్సర్ గ్రైండర్ 3 జార్ 750W
MRP ₹5990 ₹2999
ఆదా చేయండి ₹2991
tandem
2 బర్నర్ గ్లాస్ టాప్ స్టవ్
MRP ₹3599 ₹1599
ఆదా చేయండి ₹2000
BAJAJ
2 బర్నర్ స్టవ్ స్టెయిలెస్ స్టీల్
MRP ₹3260 ₹1899
ఆదా చేయండి ₹1361
tandem
3 బర్నర్ గ్లాస్ టాప్ స్టవ్
MRP ₹5499 ₹1999
ఆదా చేయండి ₹3500
tandem
స్యాండ్‌విచ్ మేకర్
MRP ₹1599 ₹699
ఆదా చేయండి ₹900
VIP safari
అప్‌రైట్ ట్రాలీ బ్యాగ్ మీడియం సైజ్
MRP ₹8699+ ₹1999
ఆదా చేయండి ₹6700
అప్‌రైట్ ట్రాలీ బ్యాగ్ 3 యొక్క సెట్ (కేబిన్ + మీడియం + లార్జ్ సైజ్)
MRP ₹26000+ ₹4899
ఆదా చేయండి ₹21101
లేటెస్ట్ ఫ్యాషన్
కుర్తా
₹599+
2 కొనండి
1 ఉచితంగా
పొందండి
టీ-షర్ట్
₹199+
2 కొనండి
1 ఉచితంగా
పొందండి
జీన్స్
₹599+
2వ దానిపై
40% తగ్గింపు
టీ-షర్ట్
₹199+
2 కొనండి
1 ఉచితంగా
పొందండి
జీన్స్
₹599+
2వ దానిపై
40% తగ్గింపు
షర్ట్
₹499
2 కొనండి
₹150 తగ్గింపు
పొందండి
ట్రౌసర్స్
₹599+
2వ దానిపై
40% తగ్గింపు
ఉచిత బహుమతులు
₹3000 డిస్కౌంట్ కూపన్
₹7500 పై
₹1000 డిస్కౌంట్ కూపన్
₹5000 పై
₹300 డిస్కౌంట్ కూపన్
₹1500 పై [అప్పారెల్స్ & ఫుట్‌వేర్]
VISHAL MEGA MART
*నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి.

18న ఆఫ్‌లైన్‌లో వాచీల వేలం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు, టీటీడీ అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న 19 లాట్ల వాచీలకు ఈ నెల 18న ఆఫ్‌లైన్ ద్వారా టెండర్ కం వేలం నిర్వహిస్తున్నట్టు గురువారం టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు టీటీడీ వెబ్ సైట్ లేదా 0877-2264429 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జల విపత్తు మృతుల్లో రాష్ట్రమే టాప్!

- ఏప్రిల్ నుంచి జూలై వరకూ 343 మంది మృతి
- విపత్తు నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం వల్లే
- కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా జల వాతావరణ విపత్తుల్లో అత్యధిక మృతులు నమోదైన రాష్ట్రంగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకూ కేవలం నాలుగు నెలల్లో రాష్ట్రంలో 343 మంది జల విపత్తుల్లో ప్రాణాలు కోల్పోయారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు తేల్చిన ఈ నిజం- రాష్ట్ర విపత్తు నిర్వహణలో కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని బట్టబయలు చేస్తున్నాయి. కొన్ని ముఖ్యాంశాలు..

- ఏప్రిల్ నుంచి జూలై మధ్య కాలంలో దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి అందిన సమాచారం ప్రకారం జల వాతావరణ విపత్తుల కారణంగా 1,626 మంది మృతి చెందారు.
- జలాశయాల దగ్గర ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో చాలా మంది జలాశయాల్లో దిగి మృతి చెందుతున్నారు.
- భారీ వర్షాలకు లోతట్టు ప్రాంత ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయకపోవడంతో చాలా మంది ప్రాణాలను కోల్పోవాల్సిన పరిస్థితులు నెలకుంటున్నాయి.
- మృతుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్ (243), హిమాచల్ ప్రదేశ్ (195) నిలిచాయి.
- జల విపత్తులు సంభవించిన రాష్ట్రాల్లో నష్టాలను అంచనా వేసిన తరువాత జాతీయ విపత్తుల నిధి నుంచి కేంద్రం ఆర్థిక సాయం అందిస్తుందని గణాంకాల నివేదిక పేర్కొంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూలై 15వ తేదీ నాటికి జాతీయ విపత్తుల నిధి నుంచి కేంద్ర వాటాగా 22 రాష్ట్రాలకు రూ.9,578.40 కోట్లను విడుదల చేసినట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వెల్లడించింది.



ఏప్రిల్-జూలై మధ్య దేశ వ్యాప్త తీరిది

రాష్ట్రం	మృతుల సంఖ్య
ఆంధ్రప్రదేశ్	343
బిహార్	101
గుజరాత్	70
హిమాచల్ ప్రదేశ్	195
కర్ణాటక	102
కేరళ	97
మధ్యప్రదేశ్	243
మహారాష్ట్ర	90
రాజస్థాన్	79
ఉత్తరాఖండ్	71

గేదెను చంపిన పెద్దపులి

అర్ధవీడు: అడవిలో మేతకు వెళ్లిన గేదెపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం యాచవరం గ్రామానికి చెందిన రైతు తలుపుల అంకిశెట్టికి చెందిన గేదె మేత కోసం ఇటీవల అడవికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో రైతు అటవీ అధికారులకు సమాచారమిచ్చాడు. అడవిలో గేదెను పెద్దపులి దాడి చేసి చంపినట్లు అటవీ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రసాద్ రెడ్డి గురువారం గుర్తించారు. జూలై, ఆగస్టుల్లో పెద్దపులులు ఎక్కువగా సంచరిస్తుంటాయని, పశువులను ఎవరూ అడవిలోకి తోలవద్దని సూచించారు.

ఈ చిన్నారి.. మృత్యుంజయురాలు

- చిరుత నోట చిక్కి.. ప్రాణాలతో బయట పడిన మూడేళ్ల చిన్నారి
- ప్రకాశం జిల్లా చిన్నారుట్ల గూడెంలో ఘటన

పెద్దదోర్నాల: చిరుత నోటికి చిక్కిన చిన్నారి.. గాయాలతో బయటపడిన ఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలంలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు.. చిన్నారుట్ల గూడేనికి చెందిన కుడుముల అంజయ్య, లింగేశ్వరి తమ మూడేళ్ల కుమార్తె అంజమ్మతో కలిసి బుధవారం రాత్రి తమ ఇంట్లో నిద్రపోయారు. అర్ధరాత్రి సమయంలో చిరుత వారి ఇంట్లోకి ప్రవేశించి.. అంజమ్మ తలను నోట కర్చుకొని అడవిలోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. ఇంతలో చిన్నారి పెద్దగా ఏడవటంతో నిద్రలేచిన తల్లిదండ్రులు.. చిరుతను చూసి షాక్‌కు గురయ్యారు. భయంతో గట్టిగా కేకలు వేయగా.. చిన్నారిని వదిలేసి చిరుత పారిపోయింది. గాయపడిన చిన్నారిని తల్లిదండ్రులు వెంటనే శ్రీశైలం ప్రాజెక్టు వైద్యశాలకు తీసుకెళ్లి.. ప్రథమ చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు, పోలీసులు గురువారం ఉదయం చిన్నారుట్ల గూడేనికి చేరుకుని.. బాలికను పెద్దదోర్నాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాలిక మెడపై గాయాలు కావడంతో వైద్యులు కుట్లు వేశారు. బాలిక చికిత్స నిమిత్తం ఆమె తల్లిదండ్రులకు ఎస్సై మహేష్ ఆర్థిక సాయం చేశారు. బాలికను డీఎఫ్‌వో సందీప్ కృపాకర్ పరామర్శించారు. క్షతగాత్రురాలికి మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తామని చెప్పారు. చిరుత కదలికలు కనిపెట్టేందుకు ఐదుగురు సిబ్బందిని నియమించడంతో పాటు 15 కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. గూడెం వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, విద్యుత్ సదుపాయం లేకపోవడం వల్లే తరుచూ వన్యప్రాణులు దాడులు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీశైలం రహదారిపై గూడెం వాసులు నిరసన తెలిపారు. డీఎఫ్‌వో స్పందిస్తూ.. చిన్నారుట్ల గూడేనికి త్వరలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


ప్రాణాలతో బయటపడిన చిన్నారి

హత్య చేసి.. తగులబెట్టి..

- సబ్బవరం మండలం బాటజంగాల పాలెం వద్ద వివాహిత దారుణ హత్య
- మృతదేహం వద్ద లభించిన ఆధారాలతో కేసు దర్యాప్తు

సబ్బవరం(అనకాపల్లి): అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని బాటజంగాలపాలెం పరిధిలోని బంజరి జంక్షన్ వద్ద అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం గురువారం లభ్యమైంది. ఎక్కడో హత్య చేసి.. మృతదేహాన్ని ఇక్కడికి తీసుకొచ్చి తగలబెట్టినట్లు పోలీసులు గుర్తించారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏఎస్పీ, పరవాడ డీఎస్పీ బి.మోహన్ రావు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బాటజంగాలపాలెంలోని బంజరి జంక్షన్ వద్ద సిద్ధార్థ కోళ్ల ఫారానికు వెళ్లే మట్టి రోడ్డులో విద్యుత్ లైన్ తనిఖీ చేయడానికి వెళ్లిన లైన్‌మెన్ అగ్గాల సతీష్, గ్రామానికి చెందిన కాపుశెట్టి వీరనాయుడు కాలిపోయిన మహిళ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే వారు సర్పంచ్ పడాల వెంకట రమణకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆయన పోలీసులకు తెలియజేశారు. సీఐ రామచంద్రరావు ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రాథమిక సమాచారం సేకరించారు. దీని ఆధారంగా హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన మహిళ వయసు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని, పాక్షికంగా కాలిపోయినట్లు గుర్తించారు. ఆమె శరీరంపై పచ్చ, నలుపు, గులాబీ రంగు నైటీ, ఎరుపు రంగు లోదుస్తులు, చున్నీతోపాటు రోల్డ్ గోల్డ్ నల్లపూసలు, చెవి దుద్దులు, ఎరుపు రంగు గాజులు ఉన్నాయి. మెడకు టవల్ బిగించి చంపినట్లు గుర్తించారు. మృతదేహాన్ని మంచం పట్టెతో కట్టి, పెట్రోల్ పోసి తగలబెట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. కాగా.. ఘటనా స్థలాన్ని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీలు దేవాప్రసాద్, మోహన్‌రావు పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీస్ బృందాలు ఘటనా స్థలంలో శాంపిల్స్ సేకరించాయి. మృతదేహం వద్ద లభించిన ఆధారాలతో పోలీసులు పలు బృందాలను ఏర్పాటు చేసి చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిస్తున్నారు. హతురాలిని గుర్తించేందుకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో మూడు రోజుల పాటు భద్రపరచనున్నారు.

అజ్ఞాతంలోనే హతం

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు చిన్నన్న మృతి

ఆత్మకూరు రూరల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం వడ్లరామాపురానికి చెందిన మావోయిస్టు సుగులూరి చిన్నన్న (57) మృతి చెందినట్టు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.



చిన్నన్నకు భవనాశి శంకర్, విజయ్ అనే మారుపేర్లు ఉన్నాయి. చిన్నన్న కర్నూలు జిల్లా వేంపెంట ఘటనతోపాటు కరువు దాడులు, సినిమా థియేటర్ల పేల్చివేత, వాహనం దహనం, సున్నిపెంట పోలీస్ స్టేషన్ పేల్చివేత తదితర ఘటనల్లో నిందితుడిగా రికార్డులకెక్కారు. చిన్నన్న 1995లో అజ్ఞాతంలోకి వెళ్లారు. చిన్నన్న అజ్ఞాతంలోకి వెళ్లే నాటికి అతడికి భార్య సరోజ, ఇద్దరు కుమారులు క్రాంతి, రామకృష్ణ ఉన్నారు.

18న నవంబర్ నెల శ్రీవారి దర్శన కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల నవంబర్ కోటాను ఈనెల 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఆగస్టు 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపింది. ఆర్జిత సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఆగస్టు 25న ఉదయం 10 గంటలకు.. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.



ఏపీ వెలుపల ఇంటర్ చదివితే స్థానిక హోదా ఉండదు

ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల 'స్థానికత'పై హైకోర్టు స్పష్టత

పలువురు విద్యార్థుల పిటిషన్లు కొట్టివేత



సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అభ్యర్థుల 'స్థానికత' విషయంలో ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం బుధవారం స్పష్టతనిచ్చింది. ఈ తీర్పు ప్రతి గురువారం అందుబాటులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ వెలుపల విద్యను అభ్యసించినప్పటికీ, తాము రాష్ట్రంలో నివాసం ఉంటున్నామని, అందువల్ల తమను ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల్లో స్థానిక అభ్యర్థులుగా పరిగణించాలంటూ పలువురు విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లను ధర్మాసనం కొట్టేసింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెలుపల క్వాలిఫయింగ్ ఎగ్జామ్ (ఇంటర్) చదివిన విద్యార్థులను స్థానిక అభ్యర్థులుగా పరిగణించలేమని ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది. స్థానికత విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వులు చాలా స్పష్టంగా ఉన్నాయని తెలిపింది. అలాగే గతంలోనే హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం దీనిపై చాలా స్పష్టమైన తీర్పునిచ్చిందని గుర్తు చేసింది. ఇందులో తాము కొత్తగా చెప్పేందుకు ఏమీ లేదంది. తాము కూడా రాష్ట్రపతి ఉత్తర్వులకు, హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పునకు లోబడి ఉండాల్సిందేనని తేల్చి చెప్పింది. ధర్మాసనం తాజా తీర్పు ప్రకారం ఎవరు స్థానిక అభ్యర్థులు అవుతారంటే..

■ ప్రవేశం కోరుతున్న విద్యార్థి, తాను ఏ లోకల్ ఏరియా (ఎస్వీ యూనివర్సిటీ లేదా ఏయూ పరిధి)లో చదివానని చెబుతున్నాడో, ఆ ప్రాంతంలో ఆ అభ్యర్థి వరుసగా నాలుగేళ్లు చదివి ఉండాలి. ఆ నాలుగేళ్లను క్వాలిఫయింగ్ ఎగ్జామినేషన్(+2)తో ముగించి ఉండాలి. అప్పుడే ఆ అభ్యర్థి ఆ ప్రాంతానికి స్థానిక అభ్యర్థి అవుతాడు. ■ ఆ అభ్యర్థి ఆ ప్రాంతంలో (లోకల్) ఏ విద్యా సంస్థలోనూ చదవకపోయినప్పటికీ, క్వాలిఫైయింగ్ పరీక్ష రాసే నాటికి వరుసగా నాలుగేళ్ల పాటు ఆ లోకల్ ఏరియాలో నివాసం ఉన్నా కూడా ఆ అభ్యర్థి స్థానిక అభ్యర్థే అవుతాడు. ■ అలాగే క్వాలిఫయింగ్ పరీక్ష రాసే నాటికి ఆ అభ్యర్థి లోకల్ ఏరియాలో నాలుగేళ్ల పాటు ఎక్కడా కూడా విద్యాభ్యాసం చేయనప్పటికీ, రాష్ట్రంలో ఏడేళ్ల పాటు నివాసం ఉంటే సైతం ఆ అభ్యర్థిని స్థానిక అభ్యర్థిగానే పరిగణించాల్సి ఉంటుంది.

ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా.. తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి : ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసింది. ఈనెల 17వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు నమోదుచేయాలని పేర్కొంది.

22లోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయండి

ఆలిండియా కోటా ఎంబీబీఎస్ సీటు పొందిన విద్యార్థులు 22లోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) ఆదేశించింది. మొదటి విడత సీట్ల కేటాయింపు ఫలితాలను బుధవారం ప్రకటించింది. తొలి విడతలో ఏపీ విద్యార్థులు 600 మందికి పైగా సీట్లు దక్కించుకున్నట్టు తెలుస్తోంది.

ప్రజాస్వామ్యానికి బ్లాక్ డేగా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక

శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స ధ్వజం



ఎంవీపీ కాలనీ(విశాఖ): ''కూటమి సర్కారులోని అభద్రత, పాలనలోని డొల్లతనం పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో బయటపడ్డాయి. కలెక్టర్, డీఐజీ నుంచి కిందిస్థాయి అధికారుల వరకు వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. పోలింగ్ సెంటర్లలో సిబ్బందీ వాళ్లే, పోలీసులూ వాళ్లవారే, ఏజెంట్లూ వాళ్లే, చివరికి ఓట్లు వేసిందీ వాళ్లే. అందుకే, రాష్ట్ర చరిత్రలో ఈ ఉప ఎన్నిక బ్లాక్ డేగా నిలిచిపోతుంది'' అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుతో కలిసి ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ''పులివెందుల నియోజకవర్గంలోని ఇతర మండలాలకు చెందిన టీడీపీ లీడర్లంతా ఈ ఉప ఎన్నికలో దొంగ ఓట్లు వేశారు. క్యూలైన్లలో ఉన్న నాయకుల ఫొటోలు టీవీ చానల్స్‌లోనూ వచ్చాయి. చంద్రబాబు ఈ ఉప ఎన్నికతో దిగజారుడు సీఎంగా చరిత్రలో నిలిచిపోతారు. కేవలం ఒక జెడ్పీటీసీ స్థానం కోసం టీడీపీ ఇంత దిగజారడానికి కారణాలపై విశ్లేషించుకోవాలి. చంద్రబాబు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఉప ఎన్నిక జరిగిన తీరుపై మా న్యాయ పోరాటం కొనసాగుతుంది'' అని బొత్స తేల్చిచెప్పారు.

డీఐజీ తీరు రాజ్యాంగ విరుద్ధం

'ఉప ఎన్నికలో దొంగ ఓట్లకు, రిగ్గింగ్‌కు పోలీసులతో పాటు అధికార యంత్రాంగం పూర్తిగా సహకరించింది. కలెక్టర్, డీఐజీ పక్కన ఉండగానే స్థానికులు కానివారు దొంగ ఓట్లు వేస్తున్న దృశ్యాలే ఇందుకు నిదర్శనం. డీఐజీ కోయ ప్రవీణ్ వ్యవహరించిన తీరు రాజ్యాంగ విరుద్ధం. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ ఇతర కీలక నేతలను అరెస్ట్ చేసిన డీఐజీ.. టీడీపీ నేతలను ఎందుకు అరెస్ట్ చేయలేదు? పోలింగ్ కేంద్రంలోకి మంత్రి వెళ్లేందుకు సహకరిస్తారా? వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌ను బయటకు నెట్టేయడంలో ఆయన పాత్ర స్పష్టంగా కనిపించింది. డీఐజీ టీడీపీ కార్యకర్తగా అవతారమెత్తారు.. పోలీసు సంఘాలు దీనిపై స్పందించాలి' అని బొత్స కోరారు.

ఏపీ ఎన్నికలపైనా రాహుల్ స్పందించాలి...

సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో జరిగిన మోసాలపైనా, ఏపీలో 12.5 శాతం ఓట్లు అధికంగా లెక్కపెట్టడంపైనా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించాలని బొత్స కోరారు.

'పరీక్ష' తప్పింది!

ఎస్సీఈఆర్టీ చర్యలతో గాడితప్పిన పరీక్ష విధానం

'ఏ మేధావులు తయారుచేశారో ఈ ఒకటో తరగతి పరీక్ష పేపర్లు! పేరాగ్రాఫ్ విని ఇంగ్లిష్‌లో ఆన్సర్ చేయాలంట. వర్డ్స్ రాయాలంట. పదాలు తయారు చేయాలంట. ఉపాధ్యాయులను, విద్యార్థులను ఇబ్బంది పెట్టడానికి తప్ప ఈ పరీక్షలతో ఏం ఉపయోగం? పాఠశాలలో ప్రయోగశాల ఉండాలి తప్ప, పాఠశాలనే ప్రయోగశాలగా మార్చడం పద్ధతి కాదు..' ఎఫ్‌ఏ–1 ఒకటో తరగతి ఇంగ్లిష్ పేపర్ తీరుపై ఉపాధ్యాయుల అభిప్రాయం ఇది.

నాలుగు, ఐదో తరగతి పరిసరాల విజ్ఞానం 8 పేజీల ప్రశ్నపత్రంలో ప్రశ్నలను 'నాట్ కండిషన్'తో అడిగారు. డీఎస్సీ పరీక్షకి తయారుచేసిన ప్రశ్నల్లో మిగిలిన వాటిని ఏమైనా ఈ పేపర్లో ఇచ్చారా అన్నట్టుగా ఉన్నాయి ప్రశ్నలు? ఇవి విద్యార్థి సామర్థ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోను సరిగ్గా అంచనా వేయలేవు..' మంగళవారం జరిగిన ఈ పరీక్షపై కొందరు సీనియర్ ఉపాధ్యాయుల అభిప్రాయం.

- ఎఫ్‌ఏ–1తో తెల్లబోయిన టీచర్లు
- కొత్తవిధానంపై అవగాహన కల్పించకుండా అమలు
- అక్షరాలు నేర్చుకునే విద్యార్థులు పదాలు రాయాలనడంపై విస్మయం

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ ఈ విద్యాసంవత్సరం అమల్లోకి తెచ్చిన పరీక్ష విధానం ఫెయిలైంది. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు పెట్టిన మొదటి పరీక్ష ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)–1 ఉపాధ్యాయులకే అర్థంగానిరీతిలో ఉందని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు అసెస్‌మెంట్ పుస్తకాలిచ్చి, అన్ని పరీక్షలను వాటిలోనే రాయాలన్న నిబంధన పెట్టారు. పరీక్ష విధానంలో పలు మార్పులు తీసుకొచ్చిన రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణమండలి (ఎస్సీఈఆర్టీ) ఈ పరీక్షలపై అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించలేదని చెబుతున్నారు. విద్యార్థులు ఒక మార్కు ప్రశ్నలకు ఓఎంఆర్ షీట్లపై జవాబులు బబ్లింగ్ చేయడం, మరోపక్క వ్యాసరూప ప్రశ్నలకు పుస్తకంలో జవాబులు రాయడం ఒక ఎత్తయితే, పేపర్ల వాల్యూయేషన్ ఉపాధ్యాయులకు కొత్త పరీక్ష పెట్టింది. మొత్తం వాల్యూయేషన్ ప్రక్రియను రెండు, మూడురోజుల్లో పూర్తిచేసి ఓఎంఆర్ షీట్లను లీప్ యాప్‌లో స్కాన్‌చేసి అప్‌లోడ్ చేయాల్సి రావడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రాథమిక స్థాయిలోనే కఠిన పరీక్ష

సాధారణంగా ఒకటో తరగతిలోనే అత్యధికమంది విద్యార్థులు అక్షరాలు నేర్చుకుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కూడా ఈ స్థాయిలోనే ఉంటాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో నేర్చుకునేది చాలా స్వల్పం. కానీ ఒకటో తరతి ఎఫ్‌ఏ–1 ఇంగ్లిష్ పరీక్షలో అడిగిన ప్రశ్నలు చూసి ఉపాధ్యాయులే విస్తుపోయారు. ఇందులో 8, 9, 10 ప్రశ్నలకు ఇంగ్లిష్ పేరాగ్రాఫ్ విని జవాబులు రాయాలన్నారు. అలాగే ఇంగ్లిష్ పదం ఇచ్చి దానికి సరిపోయే బొమ్మను కనుక్కునేలా ప్రశ్నలు అడిగారు. రెండో తరగతి ఇంగ్లిష్ మొదటిప్రశ్న ఆంగ్లంలోని అచ్చులకు వ్యాకరణం పరీక్షిస్తూ అడిగారు. పాఠశాలలు ప్రారంభమై రెండునెలలు కాకముందే అత్యంత లోతైన సామర్థ్యాలను పరీక్షించేలా ఎస్సీఈఆర్టీ నిపుణులు ప్రశ్నపత్రాలు తయారు చేయడం ఏంటని పలువురు ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. 35 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షలో సగం ప్రశ్నలు విషయపరిజ్ఞాన (అనలైటికల్) ప్రశ్నలే కావడంతో ఎలా రాయాలో తెలియక విద్యార్థులు తికమకపడినట్టు తెలిసింది. మరోపక్క ఒకమార్కు జవాబులను ఓఆర్ఎం షీట్లపై బబ్లింగ్ చేయడం చేతగాక ప్రాథమికస్థాయి విద్యార్థులు పరీక్ష రాయలేకపోయినట్టు సమాచారం. చాలా ప్రశ్నలు సిలబస్ నుంచిగాక పూర్తిగాని పాఠ్యాంశాల నుంచి ఇచ్చారని తెలిసింది.



ఉపాధ్యాయులకూ కఠిన పరీక్షే..

విద్యార్థులు మొత్తం ఆరు పరీక్షలను అసెస్‌మెంట్ పుస్తకంలో రాయాలి. మార్కులను ఉపాధ్యాయులు బబ్లింగ్ చేయాలి. అసెస్‌మెంట్ బుక్‌లో ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయుడు నివేదిక రాయాలి. విద్యార్థుల జవాబుపత్రాల ఓఎంఆర్ షీట్లను స్కాన్‌చేసి లీప్‌యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రాథమిక తరగతుల్లో ప్రతి విద్యార్థికి నాలుగు చొప్పున, ఉన్నత తరగతుల్లో ఆరు చొప్పున స్కాన్ చేయాలి. ఇప్పటికే రోజూ యాప్‌లు, ఆన్‌లైన్ వర్క్, అర్జెంట్ ఫైళ్లతో బోధనకు దూరమైన తమకు ఇది మరో భారమైందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ప్రైవేటులో సొంతంగా పేపర్లు!

ఎఫ్‌ఏ–1 పరీక్షలు ఈనెల 11 నుంచి 14 వరకు జరుగుతాయని షెడ్యూల్ విడుదల చేశారు. ఫార్మెటివ్ పరీక్షలను ఎవరికివారు నిర్వహించుకునే వెసులుబాటు కల్పించడంతో ప్రైవేటు యాజమాన్య స్కూళ్లు ఈనెల 11వ తేదీకి ముందే నిర్వహించాయి. ఇప్పటికే తలాతోకా లేని విధానాలకు సంస్కరణల పేరు పెట్టిన కూటమి ప్రభుత్వం సర్కారు బడులను, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసింది. ఇప్పుడు ఈ తరహా పరీక్షల్లోను విద్యార్థులు ఫెయిలైతే.. ప్రభుత్వ స్కూళ్లకంటే ప్రైవేటు స్కూళ్లే మేలు అని తల్లిదండ్రులు భావించి పిల్లల్ని మార్చే అవకాశాలున్నాయి. కేవలం కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలుచేసేందుకే ప్రభుత్వం ఇలాంటి విధానాలు అనుసరిస్తోందని నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ఐఎంసీలో ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీ (ఆర్ఐఎంసీ–డెహ్రాడూన్)లో జూలై–2026 ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎనిమిదో తరగతిలో ప్రవేశాల కోసం ఏడో తరగతి చదువుకున్న వారు, పూర్తయిన వారు అర్హులు. 2013 జూలై 2 నుంచి 2015 జనవరి ఒకటి తేదీల మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ కార్యదర్శి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరికి డిసెంబర్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు www.rimc.gov.inలో సంప్రదించవచ్చన్నారు.

డీఎస్సీ అభ్యంతరాల స్వీకరణ గడువు ఒక రోజు పెంపు

సాక్షి, అమరావతి: డీఎస్సీ–2025పై అభ్యంతరాల స్వీకరణ అనంతరం సవరించిన టెట్ మార్కులతో స్కోర్ కార్డులను https://apdsc.apcfss.in/ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెట్ మార్కులను తప్పుగా నమోదు చేసిన నేపథ్యంలో అభ్యంతరాలు వచ్చాయన్నారు. ఈ క్రమంలోనే అభ్యర్థి ఐడీ నంబర్‌తో వెబ్‌సైట్‌లో వివరాలను స్వయంగా సరిచేసుకునేందుకు శుక్రవారం వరకు అవకాశం పొడిగించామన్నారు.

ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు పూర్తి

సాక్షి, అమరావతి: ఇంజినీరింగ్ ప్రవేశాల్లో తుది దశ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసినట్టు సాంకేతిక విద్యా మండలి డైరెక్టర్ గణేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 1,19,666 సీట్లు భర్తీ చేశామని, 34,298 సీట్లు ఇంకా మిగిలినట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 20న కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
I
శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



దుర్గమ్మకు పలువురి విరాళాలు
విజయవాడ దుర్గమ్మకు గురువారం పలువురు భక్తులు విరాళాలను సమర్పించారు. నిత్యాన్నదానం పథకం కోసం ఈ విరాళాలు ఆలయ అధికారులకు అందజేశారు. -IIలో▸



అగస్త్య లాంచీ ట్రయల్ రన్
విజయపురిసౌత్: ఎంఎల్ అగస్త్య లాంచీకి గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. శ్రీశైలంతో పాటు నాగార్జున కొండకు పర్యాటకులను చేరవేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.



స్వాతంత్ర్య దినోత్సవ సందడి
వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవ సందడి నెలకొంది. విజయవాడ నగరంతోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ పతాకాల విక్రయాలు జోరుగా సాగాయి.

న్యూస్‌రీల్

బస్టాండ్‌లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలకు ఉచిత బస్సు (స్త్రీ శక్తి) పథకాన్ని ప్రారంభించేందుకు విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టేషన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం వస్తున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను గురువారం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు పరిశీలించారు. బస్టాండ్‌తో పాటు, పరిసర ప్రాంతాల్లో భద్రతా పరంగా ఎలాంటి చిన్న లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్నిశాఖల అధికారుల సమన్వయంతో అప్రమత్తంగా ఉంటూ, బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు, వీవీఐపీలు, ఇతర అధికారులు ప్రయాణించే మార్గాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి. సరిత, ఎస్.వి.డి.ప్రసాద్, ఏడీసీపీ ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్, సౌత్ ఏసీపీ పావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్త్రీశక్తి పథకం ప్రారంభం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకం స్త్రీ శక్తి పథకం శుక్రవారం ప్రారంభమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనే ఈ కార్యక్రమానికి సంబంధించి అధికారులు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విజయవాడ బస్టాండ్‌లో ఏర్పాట్లను కలెక్టర్ సమన్వయ శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఆర్డీఓ కావూరి చైతన్య, వివిధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లోని సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. నగరంలోని న్యూరాజరాజేశ్వరిపేట, ఇబ్రహీంపట్నం, చినలంక సడక్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆమె గురువారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. అదే విధంగా సడక్ రోడ్డు ప్రాంతంలో వరద తీవ్రతను పరిశీలించి, గర్భిణులు, బాలింతలు ఉంటే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి అనారోగ్యం కలిగినా వెంటనే ప్రథమ చికిత్స చేయాలనే, అవసరమైతే ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు.

వైభవంగా అమరేశ్వర స్వామి వార్ల పవిత్రోత్సవాలు



అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం అలయ అర్చకులు, వేద పండితులు మండప పూజ, దీక్ష హోమం, రుద్ర హోమం, పవిత్రధారణ, చండీ హోమం జరిపి హారతి మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం స్వామివార్లకు పట్టు పవిత్రములు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి రేఖ మాట్లాడుతూ విజయవాడకు చెందిన యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామి వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం పవిత్రోత్సవాలు ముగింపు సందర్భంగా 11 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఏరు.. కన్నీరు

- ఎన్టీఆర్ జిల్లాను నిండా ముంచిన వర్షాలు
- భారీ వర్షాలకు పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న, వరి పైర్లు
- కోతకు గురైన రహదారులు.. కొట్టుకుపోయిన కల్వర్టులు



ప్రకాశం బ్యారేజీ దిగువన ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా నది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాను భారీ వర్షం నిండా ముంచింది. నిన్నటి వరకూ నీటి తడుల కోసం ఎదురుచూసిన పొలాలు ఇప్పుడు ముంపు బారినపడి రైతులకు కన్నీరు మిగిల్చాయి. పలు చోట్ల రోడ్లు ధ్వంసం కావడంతో గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. మంగళవారం 58.96 మిల్లీమీటర్లు, బుధవారం 94.05 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తెలంగాణ నుంచి ఆంధ్రలోకి ప్రవహించే పాలేరు, మున్నేరు, వైరా, కట్టలేరు, బుడమేరు వంటి వాగులు వరదతో పోటెత్తాయి. నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని ఏనుగుగడ్డ వాగు, పులివాగు, నక్కవాగు, వెదుళ్ల వాగు, కొండవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా పంట పొలాలు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాల భూముల్లో సాగు చేసిన పత్తి పత్తిచేలు నల్లగామారి గొడుగులెత్తాయి. వాగుల కింద వరి నారుమడులు దెబ్బతిన్నాయి. నాట్లు వేసిన ప్రాంతాల్లో వరి పైరు పూర్తిగా మునిగింది. పలు రహదారులు ధ్వంసమయ్యాయి. గ్రామాలకు వెళ్లే రోడ్లు భారీ కోతకు గురయ్యాయి. ఇబ్రహీంపట్నం మండలం జూపూడి వద్ద విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం కూడా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

తిరువూరు నియోజకవర్గంలో..
గంపలగూడెం – విజయవాడ రహదారిలో తోటమూల – వినగడప మధ్య కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గతంలో ఇక్కడ నిర్మించిన కాజ్‌వే కొట్టుకుపోయింది. ఆ పక్కనే ప్రత్యామ్నాయంగా రోడ్డు నిర్మించారు. భారీ వర్షాలకు కట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ఈ రోడ్డులో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరి, పత్తి పొలాలు దెబ్బతిన్నాయి. చౌటపల్లి వెదుళ్ల వాగు, అక్కపాలెం పడమటి వాగు ఉప్పొంగడంతో వరి, పత్తి పైర్లకు నష్టం వాటిల్లింది.

మైలవరం నియోజకవర్గంలో..
కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వరద రావడంతో ఇబ్రహీంపట్నంలోని పలు గ్రామాల్లోకి నీరు చేరింది. ఏనుగుగడ్డ వాగు పొంగడంతో దాములూరు, కొత్తపేట, ఆత్కూరు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. జూపూడి వద్ద జాతీయ రహదారిపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. బుడమేరులో సుమారు వెయ్యి క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది. జి.కొండూరు మండలం వెలగలేరు సమీపంలో బుడమేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద రెండు అడుగుల మేర వర్షం నీరు నిలిచి ఉంది.

నందిగామ నియోజకవర్గంలో..
కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు పొంగడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. కీసర వద్ద మున్నేరుకు 390 క్యూసెక్కుల వరద వస్తోంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న కంచికచర్ల బస్ స్టేషన్ నీట మునిగింది. వీరులపాడు మండలం పల్లంపల్లి, నందిగామ మండలం దాములూరు గ్రామాల మధ్య కూడలి వద్ద కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అటుగా రాకపోకలు నిలిపివేశారు. మండలంలోని ఏటిపట్టు గ్రామాల్లో పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. నందిగామ, చందాపురం మధ్య వాగు, ముప్పాళ్ల వద్ద నల్లవాగు, పాటెంపాడు వద్ద గుర్రాల వాగు పొంగాయి.

ఒకటో నంబరు హెచ్చరిక
కృష్ణానది ఉన్న ప్రకాశం బ్యారేజీ వద్ద వరద పోటెత్తింది. బ్యారేజీ వద్ద ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో 4,50,240 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. మధ్యాహ్నం ఒంటి గంటలకు 5,65,201 క్యూసెక్కులకు చేరింది. ఆ తరువాత స్వల్పంగా తగ్గుతూ సాయంత్రం ఆరు గంటలకు 5,46,018 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద నీటి మట్టం 14.5 అడుగులకు చేరింది. బ్యారేజీకి చెందిన మొత్తం 70 గేట్లను పూర్తిగా ఎత్తి వేసి వచ్చిన వరద వచ్చినట్లు సముద్రంలోకి వదులుతున్నారు.

విజయవాడ నగరంలో...
నగరంలోని మూడు నియోజకవర్గాల్లో పలు కాలనీల్లో వర్షపు నీరు నిలిచింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మునిసిపల్ అధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. భవానీపురం హెచ్‌బీ కాలనీలో మోటార్ల ద్వారా నీటిని తోడివేస్తున్నారు. విజయవాడ నూజివీడు రహదారిలో ఉన్న ఫైబర్ గ్రిడ్ వద్ద రోడ్డుపై వర్షపు నీరు ప్రవహిస్తోంది.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో..
జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో పాలేరు, మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెనుగంచిప్రోలు నుంచి నందిగామ వెళ్లే రోడ్డులో శనగపాడు వద్ద వరద తాకిడికి వాగుపై కల్వర్టు కొట్టుకుపోయింది. సుబ్బాయిగూడెం రహదారి ధ్వంసమైంది. అనిగండ్లపాడు – గుమ్మడిదూరు వెళ్లే రహదారి కొట్టుకుపోయి పెద్ద గుంతలు పడ్డాయి. జగ్గయ్యపేట మండలంలో షేర్ మహమ్మద్ పేట చెరువు పొంగడంతో జగ్గయ్యపేట రోడ్డుపై మూడు అడుగుల మేర వరద నీరు చేరి రాకపోకలు స్తంభించాయి. బూధవాడ అన్నవరం రెడ్డి నాయక్ తండ గ్రామాల్లో పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వత్సవాయి మండలం లింగాల వద్ద మున్నేరుకు పది అడుగుల మేర వరద నీరు రావడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమలమయ్యాయి. గోపినేని పాలెం చిట్యాల వద్ద రహదారిపైకి వర్షపు నీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీట మునిగాయి. జగ్గయ్యపేట పట్టణంలో పాలేరు ఎర్ర కాలువకు వరద నీరు ఉధృతంగా రావటంతో ఆయా ప్రాంతాల్లోని వాగులు వంకలు పొంగి పొర్లడమే కాకుండా ఇళ్లల్లోకి వరదనీరు వచ్చి చేరింది. జగ్గయ్యపేట– కోదాడ రోడ్డు నీటమునిగింది.



పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు వద్ద కూచివాగులో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న ప్రజలు



జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరు చప్టాపై వరద ఉధృతి



వీరులపాడు మండలం జగన్నాథపురం సమీపంలో వాడుముఖంపట్టిన పత్తిచేను



పెనుగంచిప్రోలు మండలం శనగపాడు వద్ద కల్వర్టు వద్ద గండివాగు ఉధృతి

కక్షిదారుల సౌలభ్యం కోసం ఈ-సేవ కేంద్రాలు
జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపీ



ఈ-సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపీ

చిలకలపూడి(మచిలీపట్నం): కక్షిదారులు, న్యాయవాదుల సౌలభ్యం కోసం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ–సేవ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపీ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ–సేవ కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తి గోపి మాట్లాడుతూ.. ఈ కేంద్రాల ద్వారా ఉచితంగా కక్షిదారులకు, న్యాయవాదులకు కేసుల పరిస్థితి, తదుపరి విచారణ తేదీలు వంటి వివరాలను తెలుపుతారని వివరించారు. సెలవులో ఉన్న న్యాయమూర్తుల వివరాలను కూడా తెలియజేస్తారని తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. న్యాయపరమైన ఆదేశాలు, తీర్పులు, సాఫ్ట్ కాపీలను ఈ–మెయిల్, వాట్సాప్, అందుబాటులో ఉన్న ఇతర యాప్‌ల ద్వారా ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. న్యాయశాఖలో తర్ఫీదు పొందిన సిబ్బంది ఈ–సేవ కేంద్రాల్లో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్జి జి.వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోతురాజు, న్యాయవాదులు ఎల్.బాలాజీ, నగధర్‌నాథ్, పుప్పాల కామేశ్వరరావు, పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బుడమేరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి



పవిత్ర సంగమం వద్ద కృష్ణానది వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

జి.కొండూరు: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుడమేరు వరద ప్రవాహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. జి.కొండూరు మండలంలోని వెలగలేరు వద్ద బుడమేరుపై ఉన్న హెడ్ రెగ్యులేటర్‌ను ఆయన గురువారం ఉదయం పరిశీలించారు. హెడ్ రెగ్యులేటర్ గేట్ల పనితీరు, వరద ప్రవాహం, డైవర్షన్ కెనాల్ సామర్థ్యం వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. బుడమేరులో సాధారణ వరద ప్రవాహం కొనసాగుతున్నందున డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణానదిలోకి వెళ్తోందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. బుడమేరుకు వరద ప్రవాహం పెరిగితే లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముందుగానే సమాచారం అందించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని పేర్కొన్నారు. అనంతరం కొండపల్లి శాంతినగర్ వద్ద ఇటీవల బుడమేరు డైవర్షన్ కెనాల్‌కు నిర్మించిన రిటైనింగ్‌వాల్, ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద కృష్ణానది వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

10 మందికి సేవా పతకాలు
కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణాజిల్లా పోలీసు శాఖలో 10 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది. పతకాలకు ఎంపికైన సిబ్బందిని ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం అభినందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఏఎస్ఐ జనార్దన్ (ఎస్ఐ పెనమలూరు పీఎస్), కె.హేమానందం (ఏఎస్ఐ, ఎస్బీ కృష్ణా), కె.వి.శ్రీనివాసరావు (హెచ్‌సీ, మచిలీపట్నం పీఎస్), కె.వెంకటేశ్వరరావు (హెచ్‌సీ, అవనిగడ్డ పీఎస్), జె.నందకిషోర్ (ఏఆర్‌హెచ్‌సీ, కృష్ణా), బి.శాంతకుమారి (ఉమెన్ ఎస్ఐ, ఉమెన్ పీఎస్), ఎస్‌కే ఇబ్రహీం (ఏఆర్‌హెచ్‌సీ, డార్మెట్), ఎస్‌కే రిహాన్ (పీసీ గుడివాడ టూ టౌన్), పి.రాధాకృష్ణ (పీసీ, కంకిపాడు)సేవా పతకాలకు, ఉత్తమ సేవా పతకానికి వై.లక్ష్మణరావు (ఏఎస్ఐ, డీఎస్బీ) ఎంపికయ్యారు.

వ్యాధుల ముప్పు.. అప్రమత్తతే మందు

- వర్షాలు, వరదల నేపథ్యంలో పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- అంటువ్యాధులు, సీజనల్ జ్వరాలు ప్రబలుతాయని హెచ్చరిక
- కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని వైద్యుల సూచన



బెజవాడలో బుడమేరు వరదకు నీటమునిగిన ఇళ్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కుసిరిన వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. విజయవాడలోని పలు కాలనీలు నీటమునిగాయి. అన్ని రోడ్లలో మురుగుతో కలిసి వర్షపునీరు తిష్టవేసింది. దీంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వరద ప్రాంతాలతో పాటు, అన్ని ప్రాంతాల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా చూడాలని, తాగునీటిని కాచి చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలని స్పష్టంచేస్తున్నారు.

అంటు వ్యాధుల భయం
» వరదలు వచ్చిన ప్రాంతంలో ఆహారం, నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంటుంది. దీంతో వాంతులు, విరేచనాలు, అతిసార వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ వ్యాధుల లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆలస్యం చేస్తే ప్రాణాపాయం ఏర్పడవచ్చు.

» వరద ప్రాంతాల ప్రజలు కొన్ని రోజుల పాటు చేతి పంపులు, కుళాయిల ద్వారా వచ్చే నీటిని తాగకుండా ఉండటం మంచిది. మంచినీటి పైపులు, డ్రెయిన్లు పక్కపక్కనే ఉంటే, ఆ రెండింటిలో నీరు కలిసే ప్రమాదం ఉంటుంది. ఇలా నీరు కలిసి కలుషితమైతే అనేక రకాల బ్యాక్టీరియాలతో పాటు, ఈ–కోలి వంటివి శరీరంలోకి చేరి అనారోగ్యానికి గురిచేస్తాయి.

» ఆర్‌ఓ వాటర్ బాటిళ్లలోని నీరు కూడా సురక్షితమని చెప్పలేం. ఆ నీటిని కూడా 30 నిమిషాల పాటు కాచి చల్లార్చి తాగితే మంచిది.

» వరద ప్రాంతాల్లోని ప్రజలు కొన్ని రోజుల పాటు బయట ఆహారం తినకూడదు.

ఇప్పటికే ప్రబలిన జ్వరాలు
ఇప్పటికే విజయవాడతో పాటు, ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సీజనల్ ఫ్లూ జ్వరాలు ఉన్నాయి. ఇప్పుడు వరద నేపథ్యంలో అవి ఇంకా విజృంభించే ప్రమాదం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

» దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి వంటివి ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

» నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందితే మలేరియా, డెంగీ, గున్యా వంటి విషజ్వరాలు సోకుతాయి. ప్రస్తుతం నగరంలో ఈ జ్వరాలు ఉన్నందున, ఈ వరదతో మరింత పెరిగే అవకాశం ఉంది.

» ఈగల ద్వారా కూడా బ్యాక్టీరియా ఆహార పదార్థాలపైకి చేరి వ్యాధులు సోకే అవకాశం ఉంది.

» విజయవాడలో ఇప్పటికే పారిశుద్ధ్య సమస్య ఉన్న నేపథ్యంలో వరదలతో మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం
వర్షాలతో పలు కాలనీల్లో నీళ్లు రావడంతో ప్రభుత్వం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం. అంతేకాకుండా కాలనీల్లోకి నీరు వచ్చిన ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం 24 శిబిరాలు ఏర్పాటు చేశాం. ఇంకా అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు కూడా వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్ఓ, ఎన్టీఆర్‌జిల్లా





ఇందిరాగాంధీ స్టేడియం ముస్తాబు
స్వాతంత్ర్య దినోత్సవానికి ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం ముస్తాబైంది. రాష్ట్రస్థాయి వేడుకల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పలు శాఖలు శకటాలను రూపొందించాయి. స్టేడియం ప్రాంగణం విద్యుత్ దీపాలతో కాంతులీనుతోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

డీఎల్ఓ తీరుపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): హెచ్ఐవీ బాధితులను ఉద్దేశించి అమానవీయంగా మాట్లాడిన జిల్లా లెప్రసీ, టీబీ అధికారి తీరుపై వైద్యశాఖ కమిషనర్ వీరపాండియన్ సీరియస్ అయినట్లు తెలిసింది. హెచ్ఐవీ బాధితుల సేవల విషయంలో ఓ వైద్యుడితో ఫోన్లో సంభాషించిన విషయమై సాక్షి జిల్లా ఎడిషన్‌లో ఈ నెల 12న పోతే పొమ్మనండి అంటూ కథనం ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ విచారణకు ఆదేశించారు. దీంతో ఆయన ఫోన్‌లో మాట్లాడిన వైద్యుడి నుంచి డీఎంహెచ్ఓ వివరణ తీసుకున్నారు. డీఎంఓ, వైద్యశాఖ కార్యాలయంలో వైద్యుల పట్ల ప్రవర్తనా తీరుపై వారి వద్ద నుంచి కూడా వివరణ తీసుకున్నట్లు తెలిసింది. విచారణ నివేదికను డీఎంహెచ్ఓ వైద్యశాఖ కమిషనర్‌కు పంపించారని సమాచారం. ఈ విషయమై ఏపీ శాక్స్ అధికారులు సైతం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఇలాంటి అధికారులతో హెచ్ఐవీ బాధితుల మనోభావాలు దెబ్బతింటాయని భావిస్తున్నట్లు సమాచారం.

టీబీలోనూ అంతే..

నెలన్నర కిందట బాధ్యతలు చేపట్టిన ఆ అధికారి వచ్చిన వెంటనే కొందరు సిబ్బందిని ఇష్టారాజ్యంగా బదిలీలు చేసేసినట్లు తెలిసింది. వాస్తవంగా వారికి పోస్టింగు ఇచ్చిన సమయంలో ఏ సెంటర్‌లో పనిచేయాలో కూడా పేర్కొంటారు. కానీ దానికి విరుద్ధంగా బదిలీలు చేసినట్లు చెబుతున్నారు.

దుర్గమ్మకు పలువురి విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గురువారం పలువురు భక్తులు విరాళాలను సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో నిత్యాన్నదానానికి కంకిపాడుకు చెందిన బి.తుషార పేరిట రాజేష్ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. ఉచిత ప్రసాద వితరణ పథకానికి విజయవాడ కామకోటి నగర్‌కు చెందిన సీహెచ్ రమేష్‌కుమార్, మాధురి దంపతులు తమ కుమారులు చుండూరి నాగరామ్, జశ్వంత్ పేరిట రూ.1,00,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.



ఉచిత ప్రసాద వితరణ పథకానికి విరాళం అందజేస్తున్న రమేష్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కృత్తివెన్ను: ప్రమాదవశాత్తు బైక్ రోడ్డు మార్జిన్‌లో పడిపోవడంతో వ్యక్తి మరణించిన సంఘటన మండల పరిధిలోని సంగమూడి సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం చినగట్టు గ్రామానికి చెందిన మాటూరి బసవేశ్వరరావు (పెదబాబు) బుధవారం రాత్రి కృత్తివెన్ను వెళుతుండగా అతను ప్రయాణిస్తున్న మోటార్‌బైక్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ గమనించలేదు. కొంత సమయం తరువాత వాహనదారుల సమాచారం మేరకు ప్రమాద స్థలాన్ని గుర్తించి చూడగా అప్పటికే పెదబాబు మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం గురువారం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

భరోసా మాయం...సేవకు మంగళం

రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. మారిస్తే మార్చారు కాని... ప్రస్తుతం రైతులకు భరోసా లేదు...సేవా లేదు. ఈ ప్రభుత్వంలో తమ గోడు పట్టించుకునే నాథుడే లేదని రైతులు వాపోతున్నారు.

- అన్నదాతకు అందని సేవలు
- కృష్ణాజిల్లాలో 390 రైతు సేవా కేంద్రాలు
- రేషనలైజేషన్‌తో 337 మందితో నడుస్తున్న కేంద్రాలు
- కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు అరకొరగా సేవలు
- ప్రభుత్వ నిర్లక్ష్యం, వైఫల్యంతో అన్నదాతల అవస్థలు



కంకిపాడులోని రైతుసేవా కేంద్రం

కంకిపాడు: కూటమి ప్రభుత్వ పాలనలో అన్నదాతలు అడుగడుగునా నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఓ వైపు రైతు సంక్షేమం వల్లె వేస్తూ రైతులను మాత్రం గాలికొదిలేస్తున్న ఘనత కూటమి సర్కారుకే చెల్లుతుంది. రైతులకు భరోసా కల్పిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను తీసుకొచ్చింది. అన్ని విధాలా అన్నదాతలకు బాసటగా నిలిచింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే పేరు మార్చి తద్వారా అందుతున్న సేవలకు సైతం మంగళం పాడేస్తోంది. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది కుదింపుతో రైతు సేవా కేంద్రాలు మూతబడే ప్రమాదం కూడా గోచరిస్తోంది.

నాడు సంక్షేమం...నేడు నిర్వీర్యం...

వ్యవసాయం దండగ అన్న నేతలు ముక్కున వేలేసుకునేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేసి చూపింది. పరిపాలన గ్రామస్థాయికి తీసుకొచ్చింది. సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలను ప్రతి ఒక్కరికీ చేరువ చేసింది. ఇందులో భాగంగానే వ్యవసాయం చేసే రైతులకు అవసరమైన అన్ని సేవలకూ మండల కేంద్రాలకు పరుగులు పెట్టకుండా రైతుభరోసా కేంద్రాల్లోనే అందుబాటులోకి తెచ్చింది. ఎరువులు, విత్తనాలు, పంట చేతికి వచ్చిన తరువాత పంట కొనుగోళ్లు సైతం ఈ కేంద్రాల ద్వారానే చేసింది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో పేరులోనే సేవ ఉంది తప్ప రైతులకు ఎలాంటి సేవలు అందడం లేదు. ఎరువుల సరఫరా పూర్తిగా సొసైటీల ద్వారానే సాగుతోంది. విత్తనాల పంపిణీలోనూ జాప్యం జరగటంతో రైతులు బయటి మార్కెట్‌పై ఆధారపడి విత్తనం తెచ్చుకుని అతికష్టం మీద ఈ ఖరీఫ్‌లో సాగు చేపట్టాల్సి వచ్చింది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 390 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 367 వ్యవసాయ శాఖ పరిధిలోనూ, 27 ఫిషరీస్ శాఖ పరిధిలోనూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. కియోస్క్‌లు మరమ్మతులకు గురయ్యాయి. వీటిని అందుబాటులోకి తీసుకొచ్చి సేవలను అందించటంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన రైతు సేవా కేంద్రాలు తుదిదశ పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేయటంతో ఆ భవనాలు అలంకార ప్రాయంగా మారాయి.

సిబ్బంది రేషనలైజేషన్‌తో సేవలు దూరం

తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టింది. గతంలో గ్రామ జనాభా ఆధారంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. దాన్ని కూటమి ప్రభుత్వం సాగు విస్తీర్ణం ఆధారంగా సిబ్బంది మదింపు చేసింది. వ్యవసాయశాఖ పరిధిలోని 367 రైతు సేవా కేంద్రాలకు గానూ వీఏఏలు 302 మంది, వీహెచ్ఏలు 18 మందిని కేటాయించారు. ఏఈఓలు 19, ఎంపీఈఓలు ఒకరు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వీఏఏ, వీహెచ్ఏలే గ్రామాల్లో అందుబాటులో ఉండే పరిస్థితి. అది కూడా సాగు విస్తీర్ణం ఆధారంగా 337 కేంద్రాలకు పరిమితం చేయటంతో మిగిలిన కేంద్రాలకు తాళాలు పడినట్టే. ఆయా కేంద్రాలకు అదనపు బాధ్యతలు అప్పగించిన వీఏఏలు, వీహెచ్ఏలు గ్రామాల్లో అందుబాటులో లేక రైతులకు ఆ శాఖ ద్వారా సేవలు, సమాచారం కరువవుతోంది. అందుబాటులో రైతు సేవా కేంద్రాలు ఉన్నా అవి మూసి ఉంటుండటంతో సేవలు అందక అవస్థలు పడాల్సి వస్తోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు సిబ్బంది మదింపుతో తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి విధులు నిర్వహించాల్సి రావటంతో పని భారం పెరుగుతోందని వీఏఏలు వాపోతున్నారు.

కూటమి చర్యలతో రైతులకు నష్టం



కూటమి ప్రభుత్వ చర్యలతో రైతులకు అడుగడుగునా కష్టాలే. గతంలో రైతు భరోసా కేంద్రాలతో రైతులకు భరోసాగా ఉండేది. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేవి. కియోస్క్‌ల ద్వారా మెరుగైన సేవలు అందించారు. కూటమి పాలనలో అవేవీ అందడం లేదు. సిబ్బంది రేషనలైజేషన్‌తో సేవలు కూడా రైతులకు అరకొరగా అందే పరిస్థితి. ఈ దుస్థితికి ప్రభుత్వ విధానాలే కారణం.

–కొండవీటి వెంకట సుబ్బారావు, రైతు, మంతెన

జల వనరుల నిర్వహణలో భాగస్వాములు కావాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జల వనరుల సమర్థ నిర్వహణలో సాగునీటి వినియోగదారుల సంఘాల సహకారం కీలకమని, భూగర్భ జలాల పెంపులోనూ సమష్టి భాగస్వామ్యం ముఖ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గురువారం వర్చువల్‌గా అన్ని జిల్లాల కలెక్టర్లు, సాగునీటి వినియోగదారుల సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ సాగునీటి సంఘాల ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి హాజరయ్యారు. నీటి భద్రత, జల వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నీటి నిర్వహణ సామర్థ్యం, పంటల నిర్వహణ తదితరాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సాగునీటి సంఘాల సహకారంతో జిల్లాలో నీటి వనరుల సమర్థ నిర్వహణలో మంచి ఫలితాలు సాధిద్దామని పిలుపునిచ్చారు. భూగర్భ జలాల పెంపులోనూ జిల్లాను ముందు వరుసలో నిలుపుదామని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల్లో సమీకృత నీటికుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి సాగు విధానాలను అనుసరించాలన్నారు. డ్రోన్ల సహాయంతో నానో యూరియా వంటి వాటి స్ప్రేయింగ్ వల్ల బహుళ ప్రయోజనాలుంటాయని కలెక్టర్ వివరించారు. సమావేశంలో సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మున్నేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పొన్నం బాలాజీ, వైస్ చైర్మన్ సీహెచ్ మాశేశ్వరరావు, వివిధ సాగు నీటి సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దిన వేడుకలకు సర్వం సన్నద్ధం

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దిన వేడుకలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే స్వాతంత్ర్య దిన వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ప్రాంగణాన్ని సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వేడుకలకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.రాజకుమారి, డీసీపీ కేజీవీ సరిత, ప్రొటోకాల్ డైరెక్టర్ టి.మోహన్‌రావు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారన్నారు. ఏఎస్పీ కాకినాడ పి.దేవరాజ్ మనీష్ పరేడ్ కమాండర్‌గా, ఏపీఎస్పీ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పీవీ హనుమంతు పరేడ్ సెకండ్-ఇన్-కమాండర్‌గా, పరేడ్ అడ్జుటెంట్‌గా ఏపీఎస్పీ శ్రీకాకుళం 1వ బెటాలియన్ జి.రాఘవులు వ్యవహరించనున్నారన్నారు. కవాతులో ఏపీఎస్పీ రెండో బెటాలియన్ (కర్నూలు), ఏపీఎస్పీ 5వ బెటాలియన్ (విజయనగరం), తెలంగాణ స్టేట్ పోలీస్, ఏపీఎస్పీ 16వ బెటాలియన్ (విశాఖపట్నం), ఏపీఎస్పీ 3వ బెటాలియన్ (కాకినాడ), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌సీసీ బాలురు, బాలికలు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏపీ సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ బృందాలు పాల్గొననున్నాయి. బ్రాస్ బ్యాండ్స్ విభాగంలో కర్నూలు, కాకినాడ, విజయనగరం, మంగళగిరి, వెంకటగిరి, భకరాపేట, అనంతపురం, విశాఖపట్నం, ఏపీఎస్పీ బెటాలియన్‌తో పాటు ఎస్ఏఆర్ సీపీఎల్ హైదరాబాద్ యూనిట్ పాల్గొంటాయని, మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్స్ పైప్ బ్యాండ్ ప్రదర్శించనున్నాయని ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా షేక్ మెహ్రోజ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడ వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన షేక్ మెహ్రోజ్‌ను పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు!

- ఒంటిమిట్ట, పులివెందుల ప్రజలను ఓట్లు వేయనివ్వలేదు
- పక్క నియోజకవర్గాల ప్రజలతో దొంగ ఓట్లు వేయించారు
- వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ మండిపాటు



లబ్బీపేట(విజయవాడతూర్పు): పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు గెలిచామని చెప్పుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని అక్కడి ప్రజలను ఓట్లు వేయనీయకుండా, ఇతర ప్రాంతాల నుంచి ప్రజలను తీసుకు వచ్చి దొంగ ఓట్లు వేయించిన తీరును రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు. గుణదలలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు ఒంటిమిట్ట, పులివెందుల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి, దానిపై పేలాలు ఏరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పులివెందులలో ప్రజాస్వామ్యం వర్ధిల్లిందంటూ మంత్రి లోకేష్ చేసిన ట్వీట్ వీడియోలో, పోలింగ్ బూత్‌లో కలెక్టర్ పరిశీలన చేస్తున్నట్లు విడుదల చేసిన వీడియోల్లోనే దొంగ ఓటర్లు ఉన్నారని అన్నారు. అలా దొంగ ఓట్లు వేసిన వారిపై పోలీసులు, ఎన్నికల సంఘం ఎందుకు చర్యలు తీసుకోలేదని అవినాష్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేసి, అత్యంత దారుణంగా ఎన్నికలు నిర్వహించారని, ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ హైకోర్టును ఆశ్రయించిందన్నారు. టీడీపీ గూండాలు దాడులు చేసి, గాయపడిన వైఎస్సార్‌సీపీ వారిపైనే ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసులు పెట్టడం దుర్మార్గం అన్నారు. ఓట్లు వేసేందుకు వెళ్లిన వారిని అడ్డుకున్నారని, స్లిప్‌లు లాక్కుని తామే ఓటేశారని, నిస్సిగ్గుగా, నిర్లజ్జగా యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని అవినాష్ మండిపడ్డారు. అధికార పార్టీ ఏ విధంగా గెలిచిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మాగాంధీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న నేపథ్యంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ట్రాఫిక్ మళ్లింపు చేయనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మళ్లింపు ఇలా....

- కంట్రోల్ రూమ్ వైపు నుంచి బెంజ్ సర్కిల్ వైపునకు వెళ్లే అన్ని వాహనాలను ఆర్టీసీ వై జంక్షన్ నుంచి ఏలూరు రోడ్ మీదుగా స్వర్ణ ప్యాలెస్, దీప్తి సెంటర్, చుట్టుగుంట -గుణదల -రామవరప్పాడు రింగ్ మీదుగా బెంజ్ సర్కిల్ వైపునకు మళ్లిస్తారు.
- బెంజ్ సర్కిల్ వైపు నుంచి బందర్ రోడ్ లోకి వచ్చే వాహనాలను బెంజ్ సర్కిల్ నుంచి ఫకీర్ గూడెం-స్క్యూ బ్రిడ్జ్- నేతాజీ బ్రిడ్జ్- బస్టాండ్ వైపు
- రెడ్ సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్, శిఖామణి సెంటర్ నుంచి వెటర్నరీ జంక్షన్ వరకు ఏ విధమైన వాహనాలకు అనుమతి లేదు.
- బెంజ్ సర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా కూడలి వరకు ఎంజీ రోడ్డులో ఉదయం ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తారు.

సిటీ బస్సుల మళ్లింపు ఇలా...

- ఎంజీ రోడ్డు, 5వ నంబరు రోడ్డులో వెళ్లే సిటీ బస్సులను ఆర్టీసీ వై జంక్షను నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రామవరప్పాడు రింగ్ వరకు వెళ్లి బెంజ్ సర్కిల్‌కు మళ్లిస్తారు.

ఆహ్వానితులు ఇలా...

- ఏఏ, ఏ1, ఏ2, బి1, బి2 పాస్ కలిగిన ఆహ్వానితులు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, పార్కింగ్ ప్రదేశాలు ముందుగా తెలుసుకోవాల్సి ఉంది.
- ఏఏ పాస్ ఉన్న వారు గేట్ నం. 3 (ఫుడ్ కోర్ట్) నుంచి ప్రవేశించి అక్కడే నిర్దేశించిన స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలి.
- ఏ1, ఏ2 పాస్‌లు ఉన్న వారు గేట్ నం.4(మీ సేవా పక్కన)లో నుంచి ప్రవేశించి వాహనాలను హ్యాండ్ బాల్ కోర్టులో పార్కింగ్ చేయాలి.
- బీ1, బీ2 పాస్‌లు ఉన్న వారు, పురస్కార గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు పాస్ కలిగిన వారు గేట్‌నం.2 ద్వారా ప్రవేశించి, అక్కడ ఉన్న ఫుట్‌బాల్ కోర్టులో కానీ, స్టేడియం ఎదురుగా ఉన్న ఏఆర్ గ్రౌండ్స్‌లోని కానీ వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- స్కూల్ విద్యార్థులు, ఇతర ఆహ్వానితులు వాటర్ ట్యాంక్ రోడ్డులోని గేటు నం. 6, 7 ద్వారా ప్రవేశించాలి.
- మీడియా పాత్రికేయులను గేట్ నం.2 ద్వారా స్టేడియం లోపలికి అనుమతిస్తారు. తప్పనిసరిగా ఫొటో అక్రిడిటేషన్ కార్డు కానీ, ఫొటో ఐడీ కలిగిన కార్డ్ కానీ ధరించాలి.
- పాస్‌లు ఉన్న వారు ఉదయం 8 గంటల్లోపు స్టేడియంకు చేరుకోవాలి.

మల్లవల్లి మహిషమ్మ తల్లి దేవస్థానంలో చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఈదులగూడెం రోడ్డులో ఉన్న మహిషమ్మ తల్లి దేవస్థానంలో బుధవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామ శివారులో మామిడి తోటల మధ్య నిర్మానుష్య ప్రాంతంలో ఆలయం ఉండటంతో రాత్రివేళ దొంగలు సులువుగా దోపిడీ చేశారు. ఆలయ ప్రధాన ద్వారం తాళం ధ్వంసం చేసి గర్భగుడిలోకి ప్రవేశించిన దుండగులు హుండీ అపహరించుకుపోయారు. ఆలయ వెనుక ప్రాంగణంలో హుండీని ధ్వంసం చేసి అందులోని నగదు తీసుకుని పరారయ్యారు. ఆలయ గర్భగుడిలో బీరువాలో భద్రపర్చిన అమ్మవారి నూతన వస్త్రాలు, ఇతర ఆభరణాలను కూడా దుండగులు అపహరించారు. ముఖానికి మాస్క్‌లు ధరించిన ఇద్దరు యువకులు ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించి హుండీ అపహరించటం, బీరువా ధ్వంసం చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. గురువారం ఉదయం ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన స్థానికులు వీరవల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ విచారణ చేపట్టారు.



గర్భగుడిలో సీసీ కెమెరాలకు చిక్కిన దుండగుల చిత్రం

విజయవాడ కోర్టులో ఈ-సేవా కేంద్రాలు ప్రారంభం

విజయవాడలీగల్: విజయవాడ కోర్టులో గురువారం తొలి ఈ-సేవ కేంద్రాన్ని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ ప్రారంభించారు. రెండవ ఈ-సేవ కేంద్రాన్ని 12వ అదనపు జిల్లా జడ్జి ఎస్.సునీల్, మూడవ ఈ-సేవ కేంద్రాన్ని కమర్షియల్ కోర్టు జడ్జి భూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఇకనుంచి ఎటువంటి దావాలు కానీ, దావాకి సంబంధించిన దస్తావేజులు కానీ ఫైల్ చేసుకోవటానికి ఈ కేంద్రాలు ఉపయోగపడతాయి. దీని ద్వారా న్యాయవాదులకు కక్షిదారులకు ఖర్చు తక్కువ, పని సులభం అవుతుంది కక్షిదారులకు కావలసిన కేసుకు సంబంధించిన వివరాలన్నీ ఈ కేంద్రంలో అడిగి తెలుసుకోవచ్చు. కార్యక్రమంలో పోక్సో కోర్టు జడ్జి వేల్పుల భవనమ్మ, ఎంపీ ఎమ్మెల్యే కోర్టు జడ్జి ఎ.అనిత, 13వ అదనపు జిల్లా జడ్జి శేషయ్య, ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు జడ్జి తిరుమల వెంకటేశ్వర్లు, సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి, ఏడో అదనపు జిల్లా జడ్జి అబ్రహం, నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.అంజనీ ఎస్ఎస్ రామ ఆదిత్య రిషిక, మూడవ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి. తిరుమలరావు, ఇతర జడ్జిలు పాల్గొన్నారు.



కోర్టు కాంప్లెక్స్‌లో ఈ-సేవ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది

మునేరులో పడి వ్యక్తి మృతి

పెనుగంచిప్రోలు: మునేరులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రం పెనుగంచిప్రోలులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా ఆరేపల్లి మండలం వాకావారిపాలెం గ్రామానికి చెందిన వాకా శ్రీనివాసరావు(58) నాలుగు రోజుల క్రితం పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో ఉదయం స్థానికులు మునేరులో మృతదేహం ఉందని సమాచారం ఇవ్వటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని జేబులో ఉన్న ఆధార్ కార్డుతో వారి కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు ఎస్ఐ అర్జున్ తెలిపారు. ప్రమాదవశాత్తు మునేరులో పడి మరణించి ఉంటాడని అన్నారు. పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగిస్తామని చెప్పారు.



క్లుప్తంగా

స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు


దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): ప్రజలకు వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్ గురువారం ఓ ప్రకటనలో స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర సమరంలో పాలుపంచుకొన్న త్యాగధనుల కృషిని స్మరించుకుంటూ స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించుకోవటం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట, 17వ డివిజన్‌లో నేతాజీ వంతెన సమీపంలో జాతీయ రహదారి పక్కన శ్రీ కృష్ణ దేవాలయంలో గురువారం రుక్మిణీ శ్రీకృష్ణుల విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. దేవాలయం అభివృద్ధికి దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.లక్ష విరాళంగా దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, దేవాలయం కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన నిషా షా



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ బాపట్లలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2025 పోటీల్లో నిషా షా సత్తా చాటింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న నిషా 1500 మీటర్ల రన్నింగ్‌లో మూడో స్థానంలో నిలిచి, పతకం గెలిచింది. ప్రిన్సిపాల్ ఎస్.పద్మజతో పాటు అధ్యాపకులు, సహచర విద్యార్థులు గురువారం ఆమెకు అభినందనలు తెలియజేశారు.

రెనాల్ట్ న్యూ ఆర్ స్టోర్ ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫ్రెంచ్ కార్ల తయారీ సంస్థ రెనాల్ట్ ఇండియా విజయవాడలో తమ స్టోర్‌ను గురువారం ప్రారంభించింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో తమ కొత్త ఆధునిక వాణిజ్య గుర్తింపునకు నాందిపలికింది. ఈ సందర్భంగా రెనాల్ట్ ఇండియా సేల్స్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాన్సిస్కో హిడాల్గో మాట్లాడుతూ.. మారుతున్న కస్టమర్ అభిరుచులకు అనుగుణంగా, డిజైన్ ఆవిష్కరణ, డిజిటల్ ఇంటిగ్రేషన్, కస్టమర్-ఫస్ట్ సేవలను మిళితం చేయడానికి రెనాల్ట్ ఇండియా బ్రాండ్ అనుభవం, పరివర్తన వ్యూహంలో భాగంగా ఈ స్టోర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. మా ఉత్పత్తులకు రాష్ట్రంలో లభించిన ప్రోత్సాహకరమైన స్పందనతో ఆంధ్రప్రదేశ్ మాకు ప్రాధాన్యత గల మార్కెట్ గా నిలిచిందన్నారు. విజయవాడలో కొత్త ఆర్ స్టోర్ ప్రారంభించడం అనేది రెనాల్ట్, రీథింక్ స్ట్రాటజీ కింద చేస్తోన్న మా వ్యాపార విస్తరణలో ఒక ముందడుగుగా పేర్కొన్నారు. మా కార్యక్రమాలను విస్తరించడం కొనసాగిస్తున్నందున, ఆటోమోటివ్ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాలని భావిస్తున్నట్లు తెలిపారు.

కృష్ణమ్మకు శాంతి పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కృష్ణానది వరద నేపథ్యంలో దుర్గాఘాట్‌లో గురువారం శాంతి పూజలు నిర్వహించారు. వరద ప్రభావం తగ్గుముఖం పట్టి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలని లోక క్షేమాన్ని కాంక్షిస్తూ కృష్ణానదికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సుమంగళ ద్రవ్యాలను సమర్పించారు. తొలుత దుర్గాఘాట్‌లో ఆలయ అర్చకులు పూజలు చేయగా ఆలయ ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, పూజాద్రవ్యాలు, పట్టుచీరలను సమర్పించి, హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫికర్

- చినుకు పడితే చుక్కలే
- రహదారులు కాలువల్లా మారుతున్న వైనం
- కిలోమీటర్ల మేర బారులు తీరుతున్న వాహనాలు
- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేనా ?


బెంజిసర్కిల్ వద్ద బుధవారం రాత్రి నిలిచిన ట్రాఫిక్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వర్షం పడిన సమయంలో నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ముఖ్యంగా సాయంత్రం సమయంలో సమస్య మరింత జటిలమవుతోంది. అన్ని జంక్షన్‌లు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్నాయి. ఒక వైపు రోడ్లపై ప్రవహిస్తున్న వర్షం నీరు, మరో వైపు తీవ్రమైన ట్రాఫిక్ రద్దీతో నగర ప్రజలు సతమతమవుతున్నారు. నగరంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. నగరంలోని ఒకటి, రెండు కిలోమీటర్లు వెళ్లేందుకు గంటకు పైగా సమయం పట్టింది. ఈ సమస్యకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవే నిదర్శనం..

- సాయంత్రం 7 గంటల సమయంలో పశువుల ఆస్పత్రి నుంచి గన్నవరం వెళ్లేందుకు ఒక ఫ్యామిలీ కారులో బయలు దేరింది. ఎంజీ రోడ్డులో పీవీపీ వద్దకు వెళ్లే సరికి తీవ్రమైన ట్రాఫిక్ ఉండటంతో పోలీసులు వెనక్కి మళ్లించారు. దీంతో మరలా లబ్బీపేట వాటర్ ట్యాంకు రోడ్డులో చుట్టుగుంట మీదగా ఏలూరు రోడ్డులో రామవరప్పాడు చేరుకున్నారు. అక్కడకు వెళ్లే సరికి రాత్రి 9 గంటలు దాటినట్లు చెబుతున్నారు. అంటే దాదాపు రెండు గంటల సమయం పట్టింది.
- రాత్రి 8.30 గంటల సమయంలో ఓ ద్విచక్రవాహనదారుడు వివంత హోటల్ నుంచి ఆటోనగర్ గేటు వరకూ వెళ్లేందుకు గంటకు పైగా సమయం పట్టిందని తెలిపాడు. ఇలా అనేక మంది ట్రాఫిక్‌తో చాలా ఇబ్బందులు పడ్డారు.

రోడ్లన్నీ జలమయమే కారణం..

- ఎంజీ రోడ్డులో బెంజిసర్కిల్ వద్ద అడుగు మేర నీరు నిలవగా, వజ్రా గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో అడుగున్నర మేర నీరు నిలిచింది.
- మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్ వద్ద రెండు అడుగుల మేర నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో వర్షం నీరు అడుగున్నరకు పైగా ఉండటంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. కార్లు వెళ్లడం కూడా కష్టతరంగా మారింది.
- అమ్మ కల్యాణ మండపం నుంచి రమేష్ హాస్పిటల్ వైపునకు వెళ్లే రోడ్డులో కూడా అడుగున్న నీరు నిలిచాయి.
- బస్టాండ్ వద్ద లో బ్రిడ్జి, వన్‌టౌన్ లో బ్రిడ్జి, భవానీపురంలో సైతం రెండు అడుగుల మేర నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- ఇలా నగరంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు జలమయంగా మారడంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సమస్య పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

పరిష్కారానికి చర్యలేవి ?

నగరంలో ఏడాదిగా వర్షం పడిన ప్రతి సారీ రోడ్లు జలమయంగా మారుతున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 10 రోజుల కిందట రాత్రి 8 గంటలకు కురిసిన వర్షంతో బెంజిసర్కిల్ ట్రెండ్‌సెట్‌మాల్ రోడ్డులో రెండు అడుగుల నీరు నిలిచి, మాల్ నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన కూడళ్లలో వర్షం నీరు నిలుస్తున్నప్పటికీ పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రణాళికా బద్ధంగా వర్షం నీరు పారుదల అయ్యేలా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని నగర ప్రజలు కోరుతున్నారు.

పునరావాస కేంద్రాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలి


లోబ్రిడ్జి వద్ద కుంగిన రోడ్డు, గోడను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వీఎంసీ ఏర్పాటు చేసిన అన్ని పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం ప్రకాశం బ్యారేజ్, హెచ్‌బీ కాలనీ, అజిత్ సింగనగర్, వన్‌టౌన్ లోబ్రిడ్జి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. లోబ్రిడ్జి వద్ద గోడ ప్రమాదకరమైన స్థితిలో ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకొని వెంటనే ఆ మరమ్మతులు చేపట్టాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరం, రిసెప్షన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ శిబిరాలకు వచ్చే ప్రజల నమోదుకు రిజిస్టర్ కచ్చితంగా పాటించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని, లైట్లు, ఫ్యాన్లు, ఎలక్ట్రిసిటీ సంబంధిత వసతుల్లో ఇబ్బందులు కలగరాదని అధికారులను ఆదేశించారు.

నగరంలో 40 పునరావాస కేంద్రాలు

కొత్త రాజరాజేశ్వరిపేట కేర్ అండ్ షేర్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు ఉదయం టిఫిన్‌ను కమిషనర్ ధ్యానచంద్ర అందించారు. గురువారం నగర పరిధిలోని పునరావాస కేంద్రాల్లో 660 మందికి ఆహార సౌకర్యం కల్పించామన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని సురక్షిత ప్రదేశాలకి తరలించాలని చెప్పారు. నగరంలో ఉన్న 40 పునరావాస కేంద్రాల్లో లోతట్టు, వరద ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను వారి సమీపంలోని పునరావాస కేంద్రంలోకి తరలించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వరద నీరు లేబర్ కాలనీ నివాస స్థలాల్లో చేరుకున్న ప్రాంతాల్లోని వారికి ఇంటి వద్దనే ఆహారం అందజేయాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జె.శ్రీనివాస్, వి.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ప్రసాదాల పోటు భవన నిర్మాణం


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న ప్రసాదాల పోటు భవనంలో డ్రెయినేజీ వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు. దుర్గగుడి మహా మండపం సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రసాదాల పోటును గురువారం దేవదాయ శాఖ కమిషనర్ పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో భవనంలోని సెల్లార్‌లో చేరిన వర్షం నీటిని పరిశీలించారు. కొండపై పడిన వర్షం నీరు సెల్లార్‌లోకి చేరకుండా భవనం చుట్టూ డ్రెయినేజీ కెనాల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు భవనంలో డ్రెయినేజీ వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రసాదాల పోటు బిల్డింగ్ ప్లాన్‌ను పరిశీలించి డ్రెయినేజీ పైపులైన్ల ఏర్పాటు గురించి పలు సూచనలు చేశారు. ప్రసాదాల పోటు భవనం వెనుక భాగంతో పాటు ఉత్తర భాగంలో పనులను పరిశీలించారు. అనంతరం కనకదుర్గానగర్‌లో జరుగుతున్న ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, కనకదుర్గానగర్ నుంచి మహా మండపం వరకు నూతన బీటీ రోడ్డు, ఘాట్‌రోడ్డులో మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. దసరా ఉత్సవాలకు 10 రోజులు ముందుగానే నూతన భవనాలను ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలని ఆలయ ఈవో శీనానాయక్‌కు సూచించారు. కమిషనర్ వెంట దేవదాయ శాఖ సీఈ శేఖర్, దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వీసీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి, ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశ భక్తిని చాటిచెప్పేలా ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సిద్ధార్థ వైద్య కళాశాల నుంచి జీజీహెచ్ వరకూ సాగిన ర్యాలీలో సుమారు 150 మంది వైద్య విద్యార్థులు, 50 మంది బోధనా సిబ్బంది పాల్గొన్నారు. వారంతా జాతీయ జెండాలు చేతపట్టి దేశభక్తి నినాదాలు చేశారు. తొలుత ర్యాలీని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించగా, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి తిరంగా పతాకం ప్రాముఖ్యత, స్వాతంత్య్ర పోరాట చరిత్రను వివరించారు. దేశ భక్తి, క్రమశిక్షణను విద్యార్థులు అలవర్చుకోవాలని తెలియచేస్తూ స్వాతంత్య్ర సంగ్రామ చరిత్ర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


డాక్టర్ నోరి దత్తాత్రేయ నాయుడుతో, అధ్యాపకులు, విద్యార్థినులు

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధికి దశల వారీగా చికిత్స విధానం అభివృద్ధి చెందుతుందని, క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే నివారించవచ్చని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయ నాయుడు అన్నారు.

నగరంలోని స్టెల్లా కళాశాలలో క్యాన్సర్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్యాన్సర్‌పై సోషల్ మీడియా ద్వారా విస్తృతమైన ప్రచారం చేయాలన్నారు. రాష్ట్రంలో ఫ్రంట్‌లైన్ వర్కర్ల ద్వారా అమలు చేస్తున్న స్క్రీనింగ్ కార్యక్రమాలను, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులతో పింక్ రిబ్బన్ క్యాన్సర్ క్రూసేడర్స్ క్లబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి శ్యామల, డాక్టర్ సీఆర్ పటేల్, డాక్టర్లు సురేష్, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) కన్సల్టెంట్ రాజ్ కిరణ్, కళాశాల పింక్ రిబ్బన్ క్యాన్సర్ క్రూసేడర్ క్లబ్ ఆర్గనైజర్ భారతి జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్పీఎఫ్ ఎస్‌ఐ కోటేష్‌కు ఇండియన్ పోలీస్ మెడల్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ పరిధిలోని ఎస్పీఎఫ్ విభాగంలో ఎస్‌ఐగా పనిచేస్తున్న కొత్తకోట కోటేష్‌కు ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. శ్రీకాకుళం జిల్లా పెద్ద పద్మాపురానికి చెందిన కోటేష్ 19వ ఏట 1987లో బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరి 1993 వరకూ సేవలందించారు. అనంతరం పర్మినెంట్ ట్రాన్స్‌ఫర్‌తో ఏపీ ఎస్పీఎఫ్ విభాగానికి వచ్చారు. నాటి నుంచి టీటీడీ దేవస్థానంతో పాటు పలు యూనిట్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తుండగా, ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ పోలీస్ మెడల్‌ను ప్రకటించింది.

ఆకట్టుకున్న భారతదేశ మ్యాప్ ఆకారం


మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే విద్యార్థులు దేశభక్తి పెంపొందించుకోవటంతో పాటు దేశానికి సేవ చేయాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు గురువారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దేశం మనకు ఏమి ఇచ్చిందని కాకుండా దేశానికి మనం ఏమి చేశామని ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు భారత దేశం మ్యాప్ ఆకారంలో జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం మాచవరం ఏలూరు రోడ్డులో జాతీయ జెండాలు చేతబూని హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డి.యుగంధర్, అధ్యాపకులు డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, జే.నాగేశ్వరరావు, కె.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


మాచవరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

స్వాతంత్య్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు


స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో శుక్రవారం జరిగే స్వాతంత్య్ర వేడుకల్లో ఎలాంటి అవాంతరాలు, సమస్యలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న స్వాతంత్య్ర వేడుకల ఏర్పాటు, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ప్రారంభించబోతున్న స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభ వేడుకల్లో కూడా సమస్యలు రాకుండా అధికారులు పటిష్ట ఏర్పాటు చేయాలని గురువారం చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. ఆయా కార్యక్రమాలకు విచ్చేసే ప్రజలందరికీ వీఎంసీ కల్పించే సౌకర్యాల్లో ఎటువంటి అసౌకర్యం కలిగించరాదన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ పి.సత్యకుమారి, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) పి.వెంకటనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.శ్రీనివాసరెడ్డి, జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న దుర్గారావు, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం మహిళలకు అందించే ఉచిత బస్సు పథకాన్ని తాము స్వాగతిస్తున్నామని కానీ ఈ పథకం వల్ల జీవనోపాధి దెబ్బతింటున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో యూనియన్ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు చర్చలకు పిలవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిరాయిలు లేక ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాలు జీవనం కోల్పోయి రోడ్డున పడుతున్నాయన్నారు. బ్యాడ్జితో సంబంధం లేకుండా ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జరిమానాలు విధించే జీవో నెంబర్ 21 రద్దు, సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఐదు శాతం వడ్డీతో ఆటోలు కొనుగోలుకు ఇస్తానన్న నాలుగు లక్షల రూపాయలు అమలు చేయాలని దీనిపై కూటమి ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆటో,క్యాబ్ డ్రైవర్లు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతారని హెచ్చరించారు. సమావేశంలో విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, నాయకులు ఏవీ రెడ్డి, పడగళ్ల చిన్న(గణేష్) డి.కాశేశ్వరరావు బి.కుమార్ పి.శరత్ కుమార్ పాల్గొన్నారు.

అడవిని తలపిస్తున్న జిల్లా పరిశ్రమల కేంద్రం



కార్మికవాడలోని జిల్లా పరిశ్రమల కార్యాలయం

నగరంలోని కార్మికవాడలో ఉన్న జిల్లా పరిశ్రమల కార్యాలయం ఆవరణ అడవిని తలపిస్తోంది. ఈ కార్యాలయం చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. గోడలకు సైతం పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. ఈ ప్రాంగణంలో విష సర్పాలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. దీంతో ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది భయపడుతున్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కార్యాలయంపై భాగంలో శ్లాబు పెచ్చులు పెచ్చులుగా ఊడిపోతోంది. ఈ ఆవరణలో ఖాళీ స్థలం నిరుపయోగంగా మారింది. ఇటీవల కార్యాలయం ఆవరణలో ఉన్న మూడు శునకాలు పాము కాటుతో మృతి చెందాయని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

– ఆటోనగర్(విజయవాడతూర్పు)


కార్యాలయం ఆవరణలో పెరుగుతున్న పిచ్చి మొక్కలు


కార్యాలయం గోడ పక్కన ఏపుగా పెరిగిన చిల్ల చెట్లు

క్లుప్తంగా...

మంగళగిరిలో విరిగిపడిన కొండచరియలు



మంగళగిరి టౌన్ : భారీ వర్షాలకు మంగళగిరి ఇందిరానగర్‌లో గురువారం ఉదయం కొండ చరియలు విరిగి పడ్డాయి. దీంతో అధికారులు ఆ ప్రదేశాన్ని సందర్శించి పక్కనే ఉన్న ఇంట్లో వారిని ఖాళీచేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విరిగిపడ్డ కొండ చరియలను తొలగించడంతో పాటు, కొండకు దిగువ భాగంలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా అధికారులను ఆదేశించారు.

విశాఖ బీచ్‌లో మహిళ మృతి

ఆమెను రక్షించే ప్రయత్నంలో యువకుడి గల్లంతు



మృతి చెందిన వసంత



గల్లంతైన గోవింద్

ఏయూక్యాంపస్: విశాఖపట్నంలోని పాండురంగాపురం డౌన్ బీచ్‌లో గురువారం సముద్ర కెరటాలకు హైదరాబాద్‌కు చెందిన టి.వసంత (58) బలయ్యారు. స్నానానికి సముద్రంలోకి వెళ్లిన ఆమె కెరటాల ధాటికి మునిగిపోయారు. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన వారి కుటుంబసభ్యుడు సాయికృష్ణ (35), ఒడిశాకు చెందిన గోవింద్ (26) అలల ఉధృతికి కొట్టుకుపోసాగారు. వీరిలో సాయికృష్ణను మెరైన్ పోలీసులు, లైఫ్ గార్డులు రక్షించగా గోవింద్ గల్లంతయ్యాడు. కొద్దిసేపటికి వసంత మృతదేహం తీరానికి చేరింది. ప్రమాదం నుంచి బయటపడ్డ సాయికృష్ణను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. హైదరాబాద్‌కి చెందిన వసంత ఒక వివాహ వేడుకలో పాల్గొనేందుకు కుటుంబసభ్యులతో కలిసి సింహాచలం వచ్చారు. బుధవారం వేడుక ముగియడంతో గురువారం సరదాగా బీచ్‌కి వచ్చి కెరటాలకు బలయ్యారు. ఒక ఆక్వాసంస్థలో పనిచేస్తున్న గోవింద్ సాయంత్రం బీచ్ సందర్శనకు వచ్చారు. కళ్లముందు ఆ మహిళ కొట్టుకుపోతుండటంతో రక్షించేందుకు ప్రయత్నించి గల్లంతయ్యారు. గోవింద్ ఆచూకీ కోసం మెరైన్, సివిల్ పోలీసులు గాలిస్తున్నారు. తుపానులు వంటివి సంభవించే సమయంలో తీరం అల్లకల్లోలంగా ఉండటంతో పాటు కెరటాలు ఉధృతంగా ఉంటాయని, అటువంటి సమయంలో స్నానం చేయడం ప్రమాదకరమని మూడో పట్టణ సీఐ పైడయ్య చెప్పారు. ఈ బీచ్‌లో గత ఎనిమిది నెలల్లో 25 మందిని రక్షించామని తెలిపారు.

పోటెత్తిన కొండవీటి వాగు

ఆరు మోటార్ల ద్వారా నీటి మళ్లింపు



తాడేపల్లి రూరల్ : అమరావతి చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీగా వర్షం కురవడంతో కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు పొంగకుండా, పంట పొలాలను ముంచెత్తకుండా ముందు జాగ్రత్తగా ఆరు మోటార్లతో 2,100 క్యూసెక్కులను కృష్ణా నదిలోకి విడుదల చేసినట్లు జేఈ అవినాష్ తెలిపారు. కొండవీటి వాగు ఎత్తిపోతల వద్ద 17.5 అడుగుల నీటిమట్టం దాటిందని, అది పెరగకుండా నిరంతరం మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపుతున్నట్టు వెల్లడించారు.

యూరియా లేక రైతుల అవస్థలు

ఏపీ రైతు సంఘం కమిటీ

సాక్షి, అమరావతి: వర్షాకాలంలో వరి పంటకు అవసరమైన యూరియా అందుబాటులో లేక రైతులు అవస్థలు పడుతున్నారని, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఎరువుల షాపుల వద్ద రైతులు బారులు తీరుతున్నారని ఏపీ రైతు సంఘం కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డిలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. లీటరు నానో డబ్బా తీసుకుంటేనే ఎరువుల బస్తా అమ్ముతామని చెబుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నానో యూరియాతో సంబంధం లేకుండా రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

తక్షణమే యూరియాను సరఫరా చేయండి

సాక్షి, అమరావతి: రామగుండం ఎరువుల కంపెనీ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన యూరియాను తక్షణమే సరఫరా చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. అన్ని రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, ముఖ్య కార్యదర్శులతో కేంద్ర మంత్రి చౌహాన్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో యూరియా అవసరం ఉంటుందని, ఆ మేరకు సరఫరా చేయాలని కోరారు.

బుడమేరులో బోగస్ ఆపరేషన్!



విజయవాడ జక్కంపూడి కాలనీలో దుస్థితి

ఏడాదిగా చర్యలు శూన్యం..

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వర్షం కురిసిందంటే చాలు బెజవాడ వాసులు బెంబేలెత్తుతున్నారు. ప్రధానంగా బుడమేరు ప్రాంత నివాసులు గతేడాది విలయం తలుచుకుని గజగజ వణికిపోతున్నారు. బుడమేరును ప్రక్షాళన చేస్తామన్న ప్రభుత్వ పెద్దల మాటలు ఏడాదిగా ఉత్త మాటలుగానే మిగిలిపోయాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు స్థానికంగా కురిసిన వర్షాలకే బుడమేరుకు 5,000 క్యూసెక్కులపైగా వరద వచ్చింది. ఏలూరు కాలువకు వెయ్యి క్యూసెక్కులు, మిగిలిన నీటిని బుడమేరు కాలువ ద్వారా బయటికి పంపే యత్నం చేస్తున్నారు. బుడమేరు పరిధిలో ఆక్రమణల మాట దేవుడెరుగు కనీసం పూడికతీత కూడా సక్రమంగా చేయలేదు. గుణదల, నిడమానూరు, రామవరప్పాడు, గూడవల్లి ప్రాంతాల్లో బుడమేరు వంతెనలను వెడల్పు చేయకపోవడంతో పైనుంచి నీరు ప్రవహిస్తోంది. నీళ్ల నిలువ ఉండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయి ఇళ్లలోకి ప్రవహిస్తోంది. రోడ్లు కోతకు గురి అవుతున్నాయి. బుడమేరు కాలువ సామర్థ్యం ఐదు వేల క్యూసెక్కులని చెబుతున్నా ఆక్రమణలు, పూడికతో కాలువ కుంచించుకుపోయింది. మూడు వేల క్యూసెక్కులకే కాలువ పొంగి లోతట్టు ప్రాంతాల్లోకి ప్రవేశించే పరిస్థితి నెలకొంది. ఎగువ ప్రాంతాల్లో పెద్దగా వర్షాలు కురవకపోవటం, బుధవారం వరకు వెలగలేరు వద్ద వరద లేకపోవడంతో బెజవాడ ఊపిరి పీల్చుకుంది. గురువారం ఉదయం వెలగలేరు వద్దకు 3 వేల క్యూసెక్కుల వరద రాగా డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణా నదిలోకి పంపారు. 10,500 క్యూసెక్కుల వరకు డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణాలోకి పంపే అవకాశం ఉంది. అయితే ఇదే వర్షం కొనసాగి ఉంటే బుడమేరు వరదతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యేవి.

పుట్టగుంట వంతెన వద్ద ఉధృతి..

పుట్టగుంట వంతెన వద్ద బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి ఐదు వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా వంతెన వద్ద 17.5 అడుగుల మేర వరద ఉంది. 20.5 అడుగులకు చేరితే మచిలీపట్నం-నూజివీడు-కల్లూరు జాతీయ రహదారిపై రాకపోకలను నిలిపివేసే అవకాశం ఉంది. నందివాడ మండలంలో ఇప్పటికే 6 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. బుడమేరు ప్రవాహం మరింత పెరిగితే పరీవాహక గ్రామాలు గతేడాది మాదిరిగా ముంపు బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వంతెన వద్ద ఎంఎస్‌కె రహదారి కోతకు గురవడంతో సగం మేర ధ్వంసమైంది. దీనివల్ల ప్రమాదాలు చోటు చేసుకునే ఆస్కారం ఉన్నా పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

మాయ మాటలతో సరి..!



బుడమేరు మధ్యకట్ట వద్ద విజయదుర్గ నగర్‌లో ఇళ్లలోకి చేరిన వరదనీరు

బెజవాడ దుఃఖదాయినిగా మారిన బుడమేరు ఆధునికీకరణపై కూటమి సర్కారు మాయ మాటలతో మభ్యపెట్టింది. గతేడాది విరుచుకుపడ్డ వరదకు 32 డివిజన్ల పరిధిలో అధికారిక లెక్కల ప్రకారమే 2.62 లక్షల కుటుంబాలు సర్వం కోల్పోయాయి. తాగేందుకు గుక్కెడు నీరు కూడా దొరకక వారం రోజులపాటు వరద నీటిలోనే విలవిల్లాడాయి. పెద్దఎత్తున ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగింది. ముంపు నివారణకు రూ.500 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామని ప్రకటించిన సీఎం చంద్రబాబు చివరకు రూ.39.47 కోట్లతో సరిపెట్టారు. ఆ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. విజయవాడను ముంపు రహిత నగరంగా మార్చేలా ఆపరేషన్ బుడమేరు యాక్షన్ ప్లాన్ అంటూ మంత్రులు కొద్ది రోజులు హడావుడి చేశారు. తొలిదశలో బుడమేరు సామర్థ్యం 10 వేల క్యూసెక్కులకు పెంచాలని ప్రతిపాదించారు. 13.25 కిలోమీటర్లు మేర బుడమేరు ఆక్రమణలకు గురైంది. విద్యాధరపురం నుంచి గుణదల వరకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 70 ఎకరాలు ఆక్రమణకు గురికాగా వీటిలో 3,051 ఇళ్ల నిర్మాణాలు జరిగినట్లు గుర్తించారు. బుడమేరుకు వచ్చే వరద నీటికి సమాంతరంగా కాలువ తవ్వి మళ్లించే ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. చీమలవాగు, కేసరపల్లి, ఎనికేపాడు, యూటీల సామర్థ్యం పెంపు ప్రతిపాదన బుట్టదాఖలైంది. ఎనికేపాడు నుంచి కొల్లేరు వరకు 50.6 కిలో మీటర్ల మేర కాలువ గట్ల పటిష్టానికి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం కొద్దిపాటి వర్షాలకే బుడమేరు ముంపు ప్రాంతాల్లో 45 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన స్థితి ఉంది. 660 మందిని ఆ కేంద్రాలకు తరలించారు. గతంలో కృష్ణలంకలో నెలకొన్న పరిస్థితులు ఇప్పుడు ఇక్కడ కనిపిస్తున్నాయని నగర వాసులు వాపోతున్నారు.

వర్షం పడితే వణుకే..



బుడమేరు వరద విలయానికి ఏడాది అవుతున్నా ఆ బీభత్సం ఇంకా కళ్లెదుట మెదులుతూనే ఉంది. సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాం. వర్షం పడుతుంటే మా కాలనీ వాసులకు వణుకొస్తోంది. సంవత్సరం గడిచినా వరద నీరు మళ్లీ మా ఇళ్లల్లోకి రాదనే భరోసాను ప్రభుత్వం కల్పించలేకపోయింది. బుడమేరులో ఆక్రమణలు, పూడికలు తొలగించాలి. ప్రజలను అప్రమత్తం చేయడం, పునరావాస కేంద్రాలు ఏర్పాటుపై సమాచారం సరిగా లేదు.

– టి.బాల, అరుణోదయనగర్, 57వ డివిజన్, విజయవాడ

కొద్దిపాటి వానకే ఇళ్లల్లోకి నీళ్లు..



సింగ్‌నగర్, నందమూరినగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. దీంతో కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీ నీళ్లు.. వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతోంది. గతేడాది వచ్చిన వరదలను మా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. ఇల్లు మునిగిపోయి సర్వస్వం కోల్పోయాం. ఇప్పుడు రెండు రోజుల వర్షానికే 68 ఇళ్లకుగానూ 30 ఇళ్లల్లోకి నీళ్లు వచ్చేశాయి. రోడ్లన్నీ మునిగిపోవడంతో మోటార్లు పెట్టి తోడుతున్నారు. తాత్కాలిక చర్యలు కాకుండా డ్రెయినేజీ నీరు సక్రమంగా పారేలా, వర్షపునీరు నిలవకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ పెద్దలు నందమూరినగర్‌పై దృష్టిపెట్టి ముంపు ముప్పును తొలగించాలి.

– వై.ప్రసాదరావు, నందమూరినగర్, 58వ డివిజన్, విజయవాడ



‘జల’ధాని అమరావతి

నీటమునిగిన అమరావతి రాజధాని ఐకానిక్ టవర్ల ప్రాంతం

రాజధాని ప్రాంతం నీటమునగడంతో చేపలు పడుతున్న యువకులు

పెదపరిమి రోడ్డులో నీట మునిగిన పంట పొలాలు

కృష్ణమ్మ దూకుడు



కృష్ణానదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

- వరద ఉధృతికి ప్రకాశం బ్యారేజీ వద్ద పరవళ్లు
- 5.59 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- శ్రీశైలం, సాగర్, పులిచింతలలోకి కొనసాగుతున్న వరద

సాక్షి, అమరావతి/విజయపురిసౌత్/సత్రశాల(రెంటచింతల)/తాడేపల్లిరూరల్/శ్రీశైలం ప్రాజెక్ట్ : ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరదకు మూసీ, మున్నేరు, కట్టలేరు, బుడమేరు, కొండవీటివాగు ప్రవాహం తోడవడంతో కృష్ణా నదిలో వరద ఉధృతి మరింత పెరిగింది. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రకాశం బ్యారేజీలోకి 5,59,185 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ 70 గేట్లు ఎత్తి 5,59,185 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో ఎగువన వర్షాలు కురుస్తుండటంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద కొనసాగుతోంది. ఆ రెండు జలాశయాలు నిండుకుండల్లా మారడంతో వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. ఉప నది భీమాపై మహారాష్ట్రలోని ఉజ్జయిని డ్యామ్ కూడా నిండింది. దాంతో కృష్ణా, భీమా వరద జూరాల మీదుగా శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రధాన ఉప నది తుంగభద్ర డ్యాం కూడా నిండిపోయి సుంకేశుల బ్యారేజీ మీదుగా శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద చేరుతోంది. దీంతో గురువారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,72,234 క్యూసెక్కులు చేరుతుండగా.. నాలుగు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 1,06,608 క్యూసెక్కులు, కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,982 క్యూసెక్కులు.. వెరసి 1,72,590 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి 1,72,774 క్యూసెక్కులు చేరుతుండగా.. స్పిల్ వే గేట్లు ఎత్తి, విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 2,36,958 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీనికి మూసీ వరద తోడవుతుండటంతో పులిచింతల ప్రాజెక్టులోకి 2,73,900 క్యూసెక్కుల వరద చేరుతోంది. స్పిల్ వే గేట్ల ద్వారా 1,84,692 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ కృష్ణాలో వర్షాలు తగ్గిన నేపథ్యంలో శుక్రవారం ప్రకాశం బ్యారేజీ వద్ద వరద తగ్గుముఖం పడుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

నేడు 9 జిల్లాల్లో ‘ఫ్లాష్ ఫ్లడ్’!

- యానాంకు కూడా ప్రమాదం ఉందన్న ఐఎండీ
- ఉత్తరాంధ్ర, ఒడిశా తీరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం
- నేడు, రేపు రాష్ట్రానికి భారీ వర్ష సూచన

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: అల్పపీడనం, రుతుపవన ద్రోణి ప్రభావం రాష్ట్రంపై భారీగానే ఉంటుందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) వెల్లడించింది. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు ఆకస్మిక వరదలు(ఫ్లాష్ ఫ్లడ్స్) వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. శుక్రవారం మధ్యాహ్నంలోపు కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. దీనికనుగుణంగా ఆయా ప్రాంతాల్లో విపత్తు నిర్వహణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఒక్కసారిగా వరద నీరు ఉప్పొంగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

కొనసాగుతున్న అల్పపీడనం

మరోవైపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర, ఒడిశా తీరాలకు సమీపంలో అల్పపీడనం కొనసాగుతోందని, శుక్రవారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా బలపడుతుందని, అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతుందని ఐఎండీ తెలిపింది. బిలాస్‌పూర్, కళింగపట్నం మీదుగా రుతుపవన ద్రోణి కొనసాగుతోందని వెల్లడించింది. అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. శుక్రవారం, శనివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల విస్తారంగా వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని వివరించింది. కాగా, 16 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు పెరుగుతాయని తెలిపింది. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం పోర్టుల్లో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయగా, కళింగపట్నం, భీమునిపట్నం, నిజాంపట్నం, వాడరేవు పోర్టులకు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు.

వేటకు వెళ్లొద్దు

రానున్న మూడు రోజులు తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. వరద పూర్తి స్థాయిలో తగ్గేవరకు కృష్ణానది పరీవాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ప్రజలను అప్రమత్తం చేస్తూ విపత్తు నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు మెసేజ్‌లు పంపిస్తుందని ఆయన స్పష్టంచేశారు.

తణుకులో 240 మి.మీ. వర్షపాతం

గడిచిన 24గంటల్లో తణుకులో 240 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదుకాగా, నందిగామలో 190, తాడేపల్లిగూడెంలో 160, విజయవాడ, అమలాపురం, డెంకాడలో 130, పాలేరులో 120, భీమడోలులో 100, పూసపాటిరేగ, ఏలూరులో 90, తుని, విజయనగరం, పాలకోడూరులో 80 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

వర్షాలతో అన్నదాతకు అపార నష్టం

- 13 జిల్లాల్లో తీవ్ర ప్రభావం
- ప్రాథమిక అంచనాల ప్రకారం 1.71 లక్షల ఎకరాల్లో పంటలకు దెబ్బ
- అత్యధికంగా 1.50 లక్షల ఎకరాల్లో ముంపునకు గురైన వరి పంట

సాక్షి అమరావతి : అల్పపీడన ప్రభావంతో రెండ్రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల వల్ల అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. దాదాపు 13 జిల్లాల పరిధిలో 79 మండలాలు.. 657 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనా ప్రకారం 1.71 లక్షల ఎకరాల్లో సాగవుతున్న వరితో సహా దాదాపు ఎనిమిది రకాల ఖరీఫ్ పంటలు ముంపుబారిన పడ్డాయి. 68,441 మంది రైతులకు నష్టం వాటిల్లింది. అత్యధికంగా 1.50 లక్షల ఎకరాల్లో వరి, 20 వేల ఎకరాల్లో పత్తి, 1,500 ఎకరాల్లో మినుము, వెయ్యి ఎకరాల్లో పెసర పంటలు ముంపునకు గురయ్యాయి. జిల్లాల వారిగా చూస్తే అత్యధికంగా గుంటూరు జిల్లాలో 72 వేల ఎకరాలు, బాపట్ల జిల్లా పరిధిలో 41 వేల ఎకరాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 19 వేల ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 12 వేల ఎకరాలు, కృష్ణాజిల్లాలో తొమ్మిది వేల ఎకరాలు, పల్నాడు జిల్లాలో 6,500 ఎకరాలు, ఏలూరు జిల్లాలో 4,100 ఎకరాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లాలో 2,700 ఎకరాలు, కాకినాడ జిల్లాలో 2,245 ఎకరాల్లో పంటలు పూర్తిగా ముంపునకు గురైనట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం వరి పంట మొక్క దశలో ఉండగా, పత్తి పూత దశలో ఉంది. మరోవైపు.. సుమారు 1,200 ఎకరాల్లో ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయి. అత్యధికంగా రాజధాని ప్రాంతంలో నష్టం వాటిల్లింది.

ఉత్తమ అధ్యాపకుల ఎంపికకు ఇంటర్వ్యూలు

ఉత్తర్వులు జారీచేసిన ఉన్నతవిద్య కార్యదర్శి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉత్తమ అధ్యాపక అవార్డుల ఎంపికకు ప్రభుత్వం ఇంటర్వ్యూ పద్ధతి ప్రవేశపెడుతోంది. ఈ మేరకు ఉన్నత విద్య కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వర్సిటీలు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు స్వీయ నామినేషన్లు సమర్పించడంతోపాటు అర్హత ఉండి దరఖాస్తు చేసుకోలేని వారిని వర్సిటీ, కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు అధ్యాపకులు కలిసి అవార్డుకు నామినేట్ చేయవచ్చని తెలిపారు. ఉన్నత విద్యామండలి, కళాశాల విద్య డైరెక్టరేట్ నిర్ణయించిన అర్హత ప్రమాణాలు, పనితీరు నివేదిక ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. గతంలో నిర్దేశించిన వెయ్యి మార్కులను.. ఇప్పుడు 800 మార్కులను సాధించిన విజయాలకు సర్దుబాటుచేసి, 200 మార్కులను ఇంటర్వ్యూకు కేటాయించినట్టు పేర్కొన్నారు. స్క్రూటినీ కమిటీల నుంచి వచ్చిన దరఖాస్తుల ఎంపిక, ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు రెండు కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్సిటీ స్థాయిలో దరఖాస్తులను పరిశీలించే కమిటీ ఛైర్మన్‌గా ఉన్నత విద్యామండలి ఛైర్మన్, ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ టీచర్ల ఎంపిక కమిటీకి కళాశాల విద్య డైరెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారని వివరించారు.

సొంత ఆదాయ వనరులు పెంచండి

ఆదాయార్జన శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో సొంత ఆదాయ వనరులు పెంచాలని సీఎం చంద్రబాబు ఆదాయార్జన శాఖలకు సూచించారు. కొన్ని కాంట్రాక్టు సంస్థలు పొరుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ఉత్పత్తులు కొనుగోలు చేయటంవల్ల ఆదాయం కోల్పోతున్నామని, వారు మన రాష్ట్రంలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదాయార్జన శాఖలపై గురువారం సచివాలయంలో సీఎం సమీక్షించారు. ఏపీ టాక్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా పన్ను వసూళ్లను పర్యవేక్షించాలని, సేవా రంగం ద్వారా ఎక్కువ పన్ను ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. 8శాతం వృద్ధి అంచనాలతో పనిచేయాలన్నారు.

విద్యుత్ వాహనాలకు రాయితీ కొనసాగింపు

విద్యుత్ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రస్తుతం ఇస్తున్న రాయితీని కొనసాగించాలని.. వాహనాల పన్ను చెల్లింపులు సక్రమంగా జరిగేలా ఆర్టీజీఎస్, సీసీ కెమెరాలను ఉపయోగించాలని చంద్రబాబు చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్లలో ఆటో మ్యూటేషన్ జరగాలని పేర్కొన్నారు. పంచాయతీల్లో నిర్వహించే ఖాతాలను ఆడిట్ చేయాలని ఆదేశించారు. అటవీశాఖ వద్ద ఉన్న ఎర్రచందనం నిల్వల ద్వారా రూ.1,500 కోట్ల మేర ఆదాయం వచ్చే అవకాశముందని చెప్పారు. అనంతరం సాగునీటి సంఘాలు, జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదలశాఖ అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడుతూ సమర్థ నీటి నిర్వహణతో కరువును తరమొచ్చని చెప్పారు. జలవనరుల శాఖలోని ఇంజనీరింగ్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరిస్తామని చెప్పారు.

క్లుప్తంగా...

కేవైసీ అప్‌డేట్ చేయించుకోండి

ప్రజలకు ఆర్బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.లక్ష్మీకాంతరావు సూచన

సాక్షి, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల లబ్ధి పొందాలంటే బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని ఆర్బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.లక్ష్మీకాంతరావు సూచించారు. జన సురక్ష ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్టీఆర్ జిల్లా నున్నలో నిర్వహించిన అవగాహన సదస్సులో లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. జన సురక్ష పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని బ్యాంకులకు సూచించారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు పెన్షన్ లభిస్తుందన్నారు. చందాదారు మరణిస్తే.. జీవిత భాగస్వామికి కూడా అదే పెన్షన్ లభిస్తుందని చెప్పారు. పీఎం సురక్ష బీమా యోజనలో చేరితే.. మరణం లేదా శాశ్వత వైకల్యానికి రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17 లేదా 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి

సాక్షి, అమరావతి: సెప్టెంబర్ 17 లేదా 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. అసెంబ్లీలో ఏర్పాటు చేసిన అత్యాధునిక హైస్పీడ్ ముద్రణ యంత్రాలను గురువారం అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవరతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ అత్యాధునిక ముద్రణా యంత్రాలు శాసన సభ సమావేశాల్లో, మరీ ముఖ్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. శాసన సభకు సంబంధించిన ప్రశ్నలు,అజెండా పత్రాలు, సభా సంవాదాలు వంటి కీలకమైన పత్రాలను అత్యంత వేగంగా ముద్రించగలుగుతాయన్నారు.

వారు లేకపోతే మీరు చేయండి

ప్రధానోపాధ్యాయులకు జెండా ఆవిష్కరించే అవకాశం

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ లేకపోతే ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఆవిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ్ రామరాజు గురువారం ఆదేశాలు జారీ చేశారు.

'స్త్రీ శక్తి'ని సక్రమంగా అమలు చేయాలి

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూపొందించిన 'స్త్రీ శక్తి' పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆ సంస్థ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్రంలోని ఆర్టీసీ ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. గ్యారేజీ, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ పథకం ప్రారంభించిన తరువాత మహిళలకు జీరో టికెట్ జారీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

రాష్ట్ర కార్యక్రమంగా గౌతు లచ్చన్న జయంతి

సాక్షి, అమరావతి: ప్రతి ఏడాది ఆగస్టు 16న డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులిచ్చారు. వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని జరుపుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్ర సచివాలయంలో మెప్మా జూట్ బ్యాగ్స్ స్టాల్స్

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్స్ స్టాల్స్‌ను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ గురువారం ప్రారంభించారు. సచివాలయం ప్రాంగణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, స్టిక్కర్లు, సాచెట్‌ల వాడకంపై తక్షణ నిషేధాన్ని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

గిరి బలిజగా దొమ్మరి కులం పేరు మార్పు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దొమ్మర కులం పేరును 'గిరి బలిజ'గా మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వెనుకబడిన తరగతుల్లో గ్రూప్‌–ఏ జాబితాలో 7వ కులంగా ఉన్న వారి కులం పేరు ప్రస్తావిస్తూ ఎవరినైనా తిట్టినప్పుడు పలు సందర్భాల్లో కించపరిచేలా దుర్భాషలాడుతుండటంతో కులం పేరు మార్పు చేశారు. ఇకపై విద్యాశాఖ రికార్డుల్లో వారి కులాన్ని గిరి బలిజగా వ్యవహరించాలని బీసీ సంక్షేమ శాఖ ఎక్స్‌–అఫీషియో కార్యదర్శి ఎస్.సత్యనారాయణ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు.

పొగాకు రైతుపై సర్కారు పగ!

కేంద్రాల ద్వారా కొన్నది 10వేల టన్నులే

క్వింటా రూ.10వేల నుంచి రూ.12వేల చొప్పున కొనుగోలు చేసింది 912 టన్నులే..

లో, మీడియం గ్రేడ్‌ల పేరుతో కొన్నది 9వేల టన్నులే

ఇంకా రైతుల వద్ద 30వేల టన్నుల వరకు పొగాకు నిల్వలు

పొగాకు కొనుగోళ్లకు రూ.260 కోట్లు అవుతుందని అంచనా

ఇప్పటి వరకు కొన్నదే రూ.80కోట్ల విలువైన పొగాకు మాత్రమే..

అయినా నేటికీ పైసా ఇవ్వని ప్రభుత్వం

డబ్బుల కోసం అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



సాక్షి, అమరావతి: నల్లబర్లీ పొగాకు రైతుల జీవితాలతో చంద్రబాబు ప్రభుత్వం చెలగాటమాడుతోంది. పూర్తిగా ఆరబెట్టిన తర్వాత నాణ్యమైన పొగాకును ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తున్నా... ప్రైవేటు కంపెనీల మాదిరిగా 'క్వాలిటీ లేదు' అనే సాకుతో కొర్రీలు వేస్తూ రైతులకు చుక్కలు చూపిస్తోంది. రైతులు తీసుకొచ్చిన పొగాకులో 90శాతానికి పైగా లో, మీడియం క్వాలిటీగానే కొనుగోలు కేంద్రాల సిబ్బంది పరిగణిస్తున్నారు. కేవలం 5 నుంచి 10శాతం పొగాకును మాత్రమే కాస్త క్వాలిటీగా ఉందని కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు పొగాకు కొనుగోళ్లు ప్రారంభించి రెండు నెలలు కావొస్తున్నా రైతులకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు.

30 క్వింటాళ్లు కొంటామని మెసేజ్‌లు... యార్డుకు వెళితే 20 క్వింటాళ్లే అట!

పొగాకు రైతులకు బాసటగా నిలిచేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా పొదిలి మార్కెట్ యార్డుకు వెళ్లిన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం దిగొచ్చింది. ఆఘమేఘాల మీద గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 24 కేంద్రాలు ఏర్పాటుచేసి పొగాకు కొనుగోళ్లకు శ్రీకారం చుట్టింది. రైతుల వద్ద పేరుకుపోయిన నిల్వల్లో 33వేల టన్నులు కంపెనీల ద్వారా కొనుగోలు చేయిస్తామని, మిగిలిన 20వేల టన్నులను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆర్భాటంగా చెప్పింది. నాణ్యతతో సంబంధం లేకుండా చివరి ఆకు వరకు క్వింటా రూ.12వేలు చొప్పున కొంటామని ప్రకటించింది. ఆచరణలోకి వచ్చేసరికి యార్డుల్లో నమోదు చేసుకున్న రైతుల నుంచి 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తామని మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఆ మేరకు లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా ఖర్చులన్నీ భరిస్తూ తీసుకువెళితే 20 క్వింటాళ్లకు మించి కొనడం లేదు. దీంతో తెచ్చిన పొగాకును ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

క్వాలిటీ పేరిట రైతుకు శఠగోపం

- ▲ పొగాకు కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో హై క్వాలిటీ(హెచ్‌డీఆర్)కి క్వింటా రూ.10వేల నుంచి రూ.12వేలు, మీడియం క్వాలిటీ (హెడ్‌డీఎం)కి రూ.7వేల నుంచి రూ.9వేలకు, లో క్వాలిటీ (హెచ్‌డీఎక్స్)కి రూ.4వేల నుంచి రూ.6వేలు చొప్పున ధరలు నిర్ణయించారు.
- ▲ జూన్ 8వ తేదీన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా, ఆగస్టు 9వ తేదీ(శనివారం) నాటికి అతికష్టమ్మీద 5,682 మంది రైతుల నుంచి 10,197 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. నాణ్యత పేరిట అడ్డగోలుగా ధరలో కోత విధిస్తున్నారు.
- ▲ హైక్వాలిటీ పొగాకు 912 టన్నులు(8.9శాతం) సేకరించారు. హై క్వాలిటీకి రూ.12 వేల వరకు చెల్లించాల్సి ఉన్నప్పటికీ అత్యధిక మంది రైతులకు గరిష్టంగా రూ.10వేలకు మించి ధర నిర్ణయించడం లేదు.
- ▲ మీడియం క్వాలిటీ పేరిట 4,323 టన్నులు(42.4 శాతం), లో క్వాలిటీ పేరిట 4,962 టన్నులు(48.7శాతం) సేకరించారు.
- ▲ మీడియం క్వాలిటీ పొగాకుకు క్వింటా రూ.7వేలు, లో కేటగిరీ పొగాకు రూ.4వేలకు మించి ధర దక్కడం లేదు.
- ▲ వాస్తవానికి 20వేల టన్నులకు క్వింటా రూ.12వేలు చొప్పున రూ.260 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే, ఇప్పటి వరకు సేకరించిన పొగాకు విలువ రూ.80 కోట్లు మాత్రమే.
- ▲ ఇప్పటికీ రైతుల వద్ద మరో 30వేల టన్నుల వరకు పొగాకు నిల్వలు ఉన్నాయి. కంపెనీలు ముఖం చాటేయడంతో ఏం చేయాలో తెలియక రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు.

పైసా విడుదల చేయని ప్రభుత్వం

ఇప్పటి వరకు రూ.80 కోట్ల విలువైన పొగాకు సేకరించగా, తొలి విడత చెల్లింపుల కోసం రూ.55 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ ఆర్థిక శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో రెండు నెలలుగా పొగాకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు డబ్బులు అందక నానా అవస్థలు పడుతున్నారు. అప్పులు చేసి ఎకరాకు రూ.లక్షన్నర వరకు పెట్టుబడులు పెట్టామని, వడ్డీలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. మరోవైపు ఈ నెలాఖరులోపు కొనుగోలు కేంద్రాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పొగాకు కొనుగోలుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.209 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి (పీఎస్ఎఫ్) నుంచి రూ.100 కోట్లు కేటాయించాలని మార్క్‌ఫెడ్ అభ్యర్థనను సైతం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఇంటికి వెళ్లేలా.. పెద్దారెడ్డికి భద్రత కల్పించండి

- అవసరమైతే అదనపు బలగాలను మోహరించండి
- పౌరుల భద్రత బాధ్యత పోలీసులదే: హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోని ఆయన ఇంటికి వెళ్లనీయకుండా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్న నేపథ్యంలో హైకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18న పెద్దారెడ్డి తాడిపత్రిలోకి ప్రవేశించి ఆయన ఇంటిలో ఉండేందుకు వీలుగా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసులను ఆదేశించింది. రాజకీయ ప్రత్యర్థి నుంచి ఆయనకు సమస్య ఎదురైతే ఎదుర్కొనేందుకు వీలుగా అవసరమైతే అదనపు బలగాలను మోహరించాలని సూచించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికిముందు పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ ''తాడిపత్రిలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. పెద్దారెడ్డి ఉండే లైన్‌లోనే ఆయన రాజకీయ ప్రత్యర్థి నివాసం ఉంటున్నారు. అందుకే భద్రత కల్పించడం సాధ్యం కావడం లేదు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చినప్పుడే పెద్దారెడ్డికి తగిన భద్రత కల్పిస్తామని'' కోర్టుకు చెప్పారు. దీంతో పోలీసుల తీరుపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. ''పౌరులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చేవరకు అన్నది చాలా అస్పష్టమైన వ్యవహారం. ఈ వాదన ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. పెద్దారెడ్డి తాడిపత్రిలోని ఆయన ఇంటికి వెళ్లేందుకు వీలుగా తగిన భద్రత కల్పించండి'' అని ఆదేశించారు. సోమవారం ఉదయం 10–11 గంటల లోపు తాడిపత్రి వెళ్లేందుకు పెద్దారెడ్డికి అనుమతినిచ్చిన కోర్టు.. అనుచరుల్లో ఎవరినీ రెచ్చగొట్టడానికి వీల్లేదని, కాన్వాయ్‌లో ఐదు వాహనాలకు మించొద్దని, ఇంటి వద్ద ఏ సమయంలోనూ 50–60 మంది కంటే ఎక్కువమంది ఉండకుండా చూడాలని స్పష్టం చేసింది. తాడిపత్రి నియోజకవర్గంలో శాంతి నెలకొనేందుకు వీలుగా అక్కడి ప్రజల రాకపోకలను రికార్డ్ చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేసింది.

కోర్టు ఆదేశించినా పోలీసులు లెక్కచేయడం లేదు

తాడిపత్రిలోని ఇంటికి వెళ్లి ఉండేందుకు తగిన భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా పోలీసులు వాటిని అమలు చేయడం లేదంటూ పెద్దారెడ్డి గతంలో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ గురువారం మరోసారి విచారణ జరిపారు. పెద్దారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. కోర్టు ఆయనను ఇంట్లో ఉండేందుకు అనుమతినిచ్చిందని, భద్రతకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు చెప్పిందని వివరించారు.

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్ని రద్దు చేయాలి

- రాజకీయ కక్షతోనే మిథున్‌రెడ్డి అరెస్ట్
- ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్
- ఎంపీ మిథున్‌రెడ్డితో ఆయన సతీమణి, కుమారుడు, బోస్ ములాఖత్



సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్ని రద్దుచేసి రీ పోలింగ్ జరపాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ డిమాండ్ చేశారు. కూటమి నేతలు యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని చెప్పారు. ఏజెంట్లు లేకుండా ఎక్కడైనా ఎన్నికలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ న్యాయదేవత పాత్ర పోషించాల్సింది పోయి దారుణంగా వ్యవహరించిందని చెప్పారు. మద్యం అక్రమ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డితో ఆయన సతీమణి దివ్య, కుమారుడు జశ్వంత్‌రెడ్డి, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ గురువారం ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు వద్ద బోస్ మీడియాతో మాట్లాడారు. రాజకీయ కక్షలతోనే ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఉన్న రాజకీయ వైరమే ఈ అరెస్టుకు కారణమని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో వ్యక్తిగత కక్షలతో అరెస్టులు చేయటం ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు. రాజకీయాల్లో ఉన్నవారు ఏదో ఒకరోజు జైలుకు వెళ్లడం తప్పదన్నట్టు ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది: మాజీ ఎంపీ భరత్

మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ రిగ్గింగ్ చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను కూడా లోపలకు అడుగు పెట్టనివ్వకుండా రిగ్గింగ్ చేశారని చెప్పారు. ఎన్నికలు ఇంత దారుణంగా కూడా నిర్వహించవచ్చని టీడీపీ దేశానికి చూపించిందని ఎద్దేవా చేశారు. వారి వెంట జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జి సాధిక్ ఉన్నారు.

ఏసీఏ ఎన్నికల్లో పిల్లిమొగ్గలు

- ఓటుహక్కు లేని వ్యక్తి నుంచి నామినేషన్ స్వీకరణ
- ఉపాధ్యక్ష పదవి ఎన్నిక తాత్కాలిక నిలుపుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)లో ఐదు ఆఫీస్ బేరర్స్, ఒక కౌన్సిలర్ పదవులకు ఎన్నిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. బుధవారం రాత్రి ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పోటీలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఇందులో ఉపాధ్యక్ష పదవికి పోటీ పడుతున్న బండారు నరసింహారావు పేరు ఓటర్ల జాబితాలో లేదు. ఆయన నామినేషన్‌పై అభ్యంతరాలు వెల్లువెత్తడంతో తనకున్న ప్రత్యేక అధికారాలతో దానిని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అత్యవసరంగా ఓటర్ల జాబితా సవరించారు. ఈ నెల 16న మిగిలిన పదవులకు యథావిధిగా ఎన్నిక ఉంటుందన్నారు. ఇప్పుడు ఇదే చర్చనీయాంశమైంది. బీసీసీఐ, ఏసీఏ చట్టాల ప్రకారం గడువు ముగిసిన తర్వాత కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకునే క్రమంలో మొత్తం పదవులన్నిటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలి. కానీ, ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల అధికారి నిమ్మగడ్డ ఇష్టానుసారం వ్యవహరిస్తూ, నిబంధనలను మార్చేస్తూ ఎన్నికలనే అపహాస్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేనికి బెయిల్



సాక్షి, న్యూఢిల్లీ: సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అలాగే రాష్ట్ర ప్రజలు, పాత్రికేయుల వాక్ స్వాతంత్ర్య హక్కును హరిస్తున్న ఏపీ పోలీసులకు సుప్రీంకోర్టు గట్టి హెచ్చరికలు చేసింది. అరెస్టు విషయంలో అర్నేష్ కుమార్ కేసులో ఇచ్చిన తీర్పును తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష ఉండే కేసుల్లో నేరుగా అరెస్ట్ చేయవద్దని హెచ్చరించింది. ముందుగా 41ఏ నోటీసు ఇచ్చి.. ప్రాథమిక విచారణ చేయాలని తేల్చిచెప్పింది. వీటిని పాటించకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేసింది. అలాగే లైవ్ డిబేట్‌లలో గెస్టులు చేసే పరువు నష్టం వ్యాఖ్యలను అనుమతించవద్దంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను కూడా అత్యున్నత న్యాయస్థానం సవరించింది. కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్, మధ్యంతర బెయిల్, వ్యాఖ్యల నియంత్రణ అంశాలపై విచారణను న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కె.వి.విశ్వనాథ్‌లతో కూడిన ధర్మాసనం పూర్తి చేసింది.

లైవ్ షోలో గెస్టుల వ్యాఖ్యలను నియంత్రించలేం..

లైవ్ షోలో డిబేట్ సందర్భంగా ఓ గెస్టు చేసిన వ్యాఖ్యల వ్యవహారంలో ఎలాంటి విచారణ చేయకుండానే సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును జూన్ 9వ తేదీన ఏపీ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన అప్పట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం జూన్ 13న ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తాజాగా గురువారం ఈ కేసును న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథ్ ధర్మాసనం విచారించింది. కొమ్మినేని తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే, న్యాయవాది అల్లంకి రమేష్ వాదనలు వినిపించారు. లైవ్ షోలో గెస్టు చేసే వ్యాఖ్యల ను ఎలా నియంత్రించగలమంటూ కొమ్మినేని తరఫు న్యాయవాది చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ నేపథ్యంలో లైవ్ డిబేట్‌లో వ్యాఖ్యల నియంత్రణపై గతంలో ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను తొలగిస్తూ కొమ్మినేనికి బెయిల్ ఉత్తర్వులు జారీ చేసింది.

మా జీవనోపాధికి విఘాతం

ఆటో కార్మికుల ఆవేదన

భీమవరం/తాడేపల్లిగూడెం/తణుకు/అత్తిలి/పాలకోడేరు/గణపవరం/తిరుపతి కల్చరల్ : ఉచిత బస్సు పథకం వల్ల తమ జీవనోపాధికి విఘాతం కలుగుతుందని ఆటో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆటోలను నిలిపివేసి బంద్ పాటించారు. ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి, పాలకోడేరు, గణపవరం, తిరుపతిలలో ప్రదర్శనలు చేశారు. బస్టాండ్ల వద్ద ధర్నాలు చేశారు. గణపవరం మూడు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఆటోలను రోడ్డుకు అడ్డంగా ఉంచి రాస్తారోకో చేశారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మికులు మెడకు ఉరితాడులతో నిరసన వ్యక్తం చేశారు.



మెడకు ఉరితాడు బిగించి నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

ఎస్ఈసీకి 35 ఫిర్యాదులిస్తే ఒక్కదానిపైనా చర్యల్లేవ్!

- దొంగ ఓట్లతో సాగిన పోలింగ్‌కు ఎస్ఈసీదే బాధ్యత
- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



సాక్షి, అమరావతి: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక నామినేషన్ల నుంచి టీడీపీ, పోలీసులు కుమ్మక్కై సృష్టించిన అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు అన్ని ఆధారాలతో 35 ఫిర్యాదులు చేసినా ఒక్కటీ పట్టించుకోలేదని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి లేళ్ళ అప్పిరెడ్డి మండిపడ్డారు. ''17 సార్లు వ్యక్తిగతంగా కలిసి, 18 వినతిపత్రాలను ఈ మెయిల్ ద్వారా పంపించాం. డీఐజీ నేరుగా పులివెందులలో నిల్చుని టీడీపీ గెలుపు కోసం పనిచేస్తున్నారని తెలియజేశాం. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలనూ ఎస్ఈసీకి చూపించాం. అయినా ఫలితం లేకపోయింది'' అని పేర్కొన్నారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ఈసీకి చిత్తశుద్ధి లేకపోవడంతో.. టీడీపీ పోలీసులను కాపలా పెట్టుకుని మరీ రిగ్గింగ్‌కు పాల్పడిందని ధ్వజమెత్తారు. మొత్తం ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల కమిషన్ దోషిగా నిలిచింది..

''పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలకు రెండు రోజుల ముందే కేసులే లేని వందలమంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు బైండోవర్ చేశారు. చరిత్రలో లేని విధంగా పోలింగ్ కేంద్రాల స్వాపింగ్ కు పాల్పడ్డారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేసిన కూటమి ప్రభుత్వ అరాచకానికి ఎస్ఈసీనే బాధ్యత వహించాలి'' అని అప్పిరెడ్డి అన్నారు. దొంగ ఓట్లతో టీడీపీ బరితెగింపుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిలదీస్తే కలెక్టర్ బెంబేలెత్తి, పోలింగ్ కేంద్రాల సందర్శన ఫొటోలను సోషల్ మీడియా నుంచి తొలగించారని తెలిపారు. మంత్రి లోకేశ్ సోషల్ మీడియా ఖాతాలో మాత్రం... దొంగ ఓట్లు వేస్తున్న వారి ఫొటోలు ఇప్పటికీ అలాగే ఉన్నట్లు పేర్కొన్నారు. ''ఉప ఎన్నికల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ దోషిగా నిలబడింది. పోలింగ్ జరుగుతుండగానే కమిషన్ వద్ద ధర్నా చేశాం. అప్పుడు స్పందించకుండా అర్ధరాత్రి 2 గంటలు దాటాక కంటితుడుపుగా రెండు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్‌కి ఆదేశాలిచ్చారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బూత్‌లోకి ప్రవేశించి రౌడీయిజం చేస్తే కనీసం చర్యలు తీసుకోలేదు. చిత్తశుద్ధి ఉంటే పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ పోలింగ్ సీసీ టీవీ ఫుటేజీలు బయటపెట్టాలి'' అని డిమాండ్ చేశారు.

నటుడు దర్శన్ బెయిల్ రద్దు

- తక్షణం అరెస్టు చేయాలని ఆదేశించిన సుప్రీంకోర్టు
- ప్రత్యేక మర్యాద ఇవ్వకూడదని జైలు అధికారులకు హెచ్చరిక
- తీర్పు తర్వాత దర్శన్, పవిత్రా గౌడ అరెస్ట్



న్యూఢిల్లీ: కర్ణాటకలో ప్రముఖ నటుడు దర్శన్ తూగుదీపకు సుప్రీంకోర్టులో పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. దర్శన్‌కు వీరాభిమాని అయిన రేణుకస్వామి హత్య కేసులో కర్ణాటక హైకోర్టు దర్శన్‌కు గతంలో మంజూరు చేసిన సాధారణ బెయిల్‌ను సుప్రీంకోర్టు గురువారం రద్దు చేసింది. దీంతో గంటల వ్యవధిలోనే దర్శన్‌ను, ఇదే కేసులో ప్రధాన నిందితురాలైన నటి పవిత్రా గౌడను పోలీసులు మళ్లీ అరెస్ట్‌చేశారు. బెంగళూరులోని హొసకెరెహళ్లిలోని తన భార్య విజయలక్ష్మి నివాసంలో ఉన్నప్పుడు దర్శన్‌ను పోలీసులు గురువారం అరెస్ట్‌చేశారు. గతేడాది డిసెంబర్ 13వ తేదీన దర్శన్‌కు సాధారణ బెయిల్ మంజూరు చేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం రద్దుచేసింది. ''బెయిల్ మంజూరు అనేది కేసు దర్యాప్తు, విచారణపై తీవ్ర ప్రభావం చూపుతుంది. సాక్షులను ప్రభావితం చేయొచ్చు. దీంతో దర్యాప్తు పట్టాలు తప్పే ప్రమాదం ఉంది. దర్శన్‌ను వెంటనే అదుపులోకి తీసుకోండి. అరెస్ట్ తర్వాత జైల్లో దర్శన్‌కు రాజమర్యాదలు చేయకూడదు. ప్రత్యేక మర్యాద చేసినట్లు తెలితే తీవ్రమైన చర్యలుంటాయి''అని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం, జైలు అధికారులను ధర్మాసనం హెచ్చరించింది. 'నిందితులకు జైలు ప్రాంగణంలో ఫైవ్ స్టార్ ట్రీట్మెంట్ అందిస్తున్నారని తెలిస్తే వెంటనే జైలు సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేస్తాం. జైలులో పొగ తాగడం, మద్యపానం నిషేధం'అని ధర్మానం గుర్తుచేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులు ట్రయల్ కోర్టుకు చేరగానే అరెస్ట్ వారెంట్‌తో బెంగళూరు పోలీసులు దర్శన్‌ను, పవిత్రా గౌడను అరెస్ట్‌చేసి అదుపులోకి తీసుకున్నారు. బెయిల్ ఇస్తూ గతేడాది డిసెంబర్ 13న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కర్ణాటక ప్రభుత్వం, పోలీసులు సుప్రీంకోర్టులో సవాల్‌చేయడంతో గురువారం ఈ తీర్పు వెలువడింది.

పీపీపీ ప్రాజెక్టుల కోసం.. ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు

- దేశ, విదేశీ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోవాలని ప్రభుత్వ నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ

సాక్షి, అమరావతి: పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో చేపట్టే ప్రాజెక్టుల కోసం ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశ, విదేశీ సంస్థలకు ప్రభుత్వ ఆస్తులు తనఖా పెట్టి, బాండ్లు జారీ చేసి భారీగా అప్పులు తేవాలని భావిస్తోంది. ఇందుకోసం ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పీపీపీ బృందాన్ని ఏర్పాటు చేసింది. అలాగే ఆర్థిక శాఖ మరో కార్యదర్శి డి.రోనాల్డ్ రోజ్ నేతృత్వంలో సంస్థాగత ఆర్థిక బృందాన్ని నియమించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పీపీపీ విధానంలో చేపట్టే మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల కోసం సాధ్యమైనంత వరకు ఈక్విటీ ఫైనాన్స్‌తో సహా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో బాండ్ల జారీ ద్వారా రుణాలను సమీకరించేందుకు పీపీపీ బృందం పనిచేస్తుంది. ఆస్తులు తనఖా పెట్టి దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణాలను సేకరించడానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు చేస్తారు. ఆర్ఈసీ, హడ్కో, పీఎఫ్‌సీ తదితర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందేందుకు పీపీపీ బృందం చర్యలు తీసుకుంటుంది.

గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులకు రుణాల కోసం...

గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులకు రుణాల మంజూరు కోసం సంస్థాగత ఆర్థిక బృందం పని చేస్తుంది. ప్రైవేట్ ఫైనాన్సింగ్‌ను సులభతరం చేయడానికి ప్రతి ప్రాజెక్టుకు తగిన ఆర్థిక సంస్థల భాగస్వామ్యం ఉండేలా పీపీపీ బృందం పనిచేస్తుంది. ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ ఆధ్వర్యంలోని పీపీపీ బృందంలో ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి, పీపీపీ నిపుణుడు, ఇద్దరు కన్సల్టెంట్లు, సెక్షన్ ఆఫీసర్, అకౌంట్ ఆఫీసర్లు ఉంటారు. అలాగే 2025–26 నుంచి 2028–29 ఆర్థిక సంవత్సరం వరకు చేపట్టే పీపీపీ ప్రాజెక్టులకు మరో బృందం రూపకల్పన చేస్తుంది.

ప్రపంచ స్థాయి సంస్థగా ఏపీహెచ్ఎంఈఎల్

సంస్థ అభివృద్ధి కోసం కన్సల్టెన్సీ నియామకం

సాక్షి, అమరావతి: సింగరేణి అనుబంధ సంస్థ ఏపీ హెవీ మిషనరీ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఏపీహెచ్ఎంఈఎల్)ను ప్రపంచస్థాయి సంస్థగా తీర్చిదిద్దనున్నట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పేర్కొన్నారు. దీనిని ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దడానికి ఒక కన్సల్టెన్సీని నియమిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఆయన విజయవాడ ఇబ్రహీంపట్నంలోని ఏపీహెచ్ఎంఈఎల్‌ను సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి సందర్శించారు. సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలో ఏర్పాటు చేసే కన్సల్టెన్సీ సంస్థ స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందన్నారు. దాని ఆధారంగా ఏ తరహాలో ముందుకు వెళ్లాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ పరిశ్రమ సింగరేణి కాలరీస్‌కు అవసరమైన కొత్త యంత్రాలు తయారు చేయడం, పాత యంత్రాల మరమ్మతులు చేస్తూ దేశవ్యాప్తంగా ఆర్డర్స్ తీసుకొని బీహెచ్ఈఎల్ మాదిరిగా పనిచేస్తుందన్నారు. కార్మికుల శ్రమ, ఉన్నత ఆలోచనలతో ఈ పరిశ్రమ ముందుకు వెళ్తుందన్నారు.

చర్చలు విఫలమైతే మరిన్ని టారిఫ్‌లు

భారత్‌కు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్, పుతిన్ మధ్య అలస్కాలో శుక్రవారం జరిగే చర్చలు విఫలమైతే భారత్‌పై అదనపు టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ తేల్చిచెప్పారు. ట్రంప్, పుతిన్ చర్చల ద్వారా ఫలితంపైనే టారిఫ్‌లపై తుది నిర్ణయం ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఒకవేళ సానుకూల ఫలితాలు రాకపోతే భారత్‌పై సుంకాల మోత తప్పదని వెల్లడించారు. రష్యా నుంచి ముడి చమురు కొంటున్నందుకు ఇండియాపై సెకండరీ టారిఫ్‌లు విధిస్తామన్నారు. అప్పటికీ రష్యా దారికి రాకపోతే సెకెంటరీ టారిఫ్‌లు మరింత పెరుగుతాయని స్పష్టంచేశారు. భారత్ గనుక ముడి చమురు కొనడం ఆపేస్తే రష్యాపై ఒత్తిడి పెరుగుతుందని అమెరికా అంచనా వేస్తోంది. భారత్ ఉత్పత్తులపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే 50 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే.

సరిహద్దు వాణిజ్యంపై భారత్-చైనా చర్చలు

న్యూఢిల్లీ: సరిహద్దు ప్రాంతాల గుండా వాణిజ్యంపై భారత్–చైనా మధ్య త్వరలో చర్చలు ప్రారంభం కానున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్తరాఖండ్‌లోని లిపూలేఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని షిప్‌కి లా పాస్, సిక్కింలోని నాథులా పాస్ గుండా గతంలో ఇరుదేశాల మధ్య వాణిజ్యం జరిగేది. ఐదేళ్ల క్రితం జరిగిన గల్వాన్ లోయ ఘర్షణ నేపథ్యంలో ఈ వాణిజ్యం పూర్తిగా ఆగిపోయింది. భారత్, చైనా మధ్య ఇటీవలి కాలంలో సంబంధాలు మళ్లీ బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించాలని రెండు దేశాలు నిర్ణయానికొచ్చాయి. దానిపై త్వరలో చర్చలు ప్రారంభించనున్నాయి. మరోవైపు సరిహద్దు వివాదంపై భారత్, చైనా మధ్య వచ్చేవారం ప్రత్యేక ప్రతినిధుల స్థాయిలో కీలక సమావేశం జరుగబోతోంది.

‘ఓటు చోరీ’ వంటి పదజాలం వద్దు

రుజువులు ఇవ్వండి: ప్రతిపక్షాలకు ఈసీ సూచన

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాను తారు మారు చేసి.. ‘ఓటు చోరీ’కి పాల్పడ్డారనే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపణలపై ఎట్టకేలకు ఎన్నికల సంఘం గురువారం స్పందించింది. ‘ఓటు చోరీ’ (ఓటు దొంగతనం) వంటి అభ్యంతరకర పదజాలం ఉపయోగించి.. తప్పుడు కథనాలు సృష్టించొద్దని, దానికి బదులుగా ఆధారాలు ఇవ్వాలని పేర్కొంది. 1951–1952లో మొదటి ఎన్నికల నుంచి ఇప్పటివరకూ ‘ఒక వ్యక్తికి ఒక ఓటు’ చట్టం అమలులో ఉందని తెలిపింది. ‘ఎవరైనా వ్యక్తి ఏదైనా ఎన్నికల్లో రెండుసార్లు ఓటు వేసినట్లు ఎవరి దగ్గరైనా ఆధారాలు ఉంటే.. అవి ఇవ్వండి. ఎటువంటి ఆధారాలు లేకుండా ‘చోర్’ భారత ఓటర్లను ముద్ర వేయడం సరికాదు. ఏదైనా అవకతవకలు జరిగితే రాతపూర్వక అఫిడవిట్ ద్వారా ఈసీఐకి తెలియజేయాలి’ అని ఒక ప్రకటనలో పేర్కొంది. ఓటు చోరీ వంటి పదజాలాన్ని ఉపయోగించి తప్పుడు కథనాలు సృష్టించడం కోట్లాది మంది భారతీయ ఓటర్లపై ప్రత్యక్ష దాడి మాత్రమే కాకుండా, లక్షలాది మంది ఎన్నికల సిబ్బంది సమగ్రతపై దాడి అని ప్రకటనలో తెలిపింది. తన వాదనలపై లిఖితపూర్వక ప్రకటన ఇవ్వాలని ఎన్నికల సంఘం రాహుల్ గాంధీని ఆదేశించింది.

క్షేత్రస్థాయి పరిస్థితులను విస్మరించలేం

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదాపై సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించే విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులను, ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రవాద దాడిని విస్మరించలేమని పేర్కొంది. సాధ్యమైనంత త్వరగా రాష్ట్ర హోదా కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషన్‌పై ప్రతిస్పందించాలని, వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించడంపై క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. పిటిషన్‌ను కొట్టి వేయాలని న్యాయస్థానాన్ని కోరారు. గతంలోనూ ఇలాంటి పిటిషన్లపై కోర్టు జరిమానాలు విధించిందని గుర్తుచేశారు. పిటిషన్‌పై తదుపరి విచారణను ధర్మాసనం 8 వారాలపాటు వాయిదా వేసింది.

పాక్‌లో కొత్తగా ఆర్మీ రాకెట్ ఫోర్స్

ఇస్లామాబాద్: ఆపరేషన్ సిందూర్ వేళ భారత క్షిపణుల ధాటికి పూర్తిగా చేతులెత్తేసిన పాకిస్తాన్‌కు నెమ్మదిగా తత్వం బోధపడింది. దేశ గగనతల రక్షణ వ్యవస్థను మరింత పటిష్టంచేసుకోవాలని ఎట్టకేలకు నిర్ణయించుకుంది. అందులోభాగంగా నూతనంగా ఆర్మీ రాకెట్ ఫోర్స్ కమాండ్ పేరిట నూతన విభాగాన్ని ఏర్పాటుచేసుకుంటోంది. పాక్ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి జరిగిన ఒక కార్యక్రమంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ విషయాన్ని వెల్లడించారు. సంప్రదాయక యుద్ధ సామర్థ్యాలను మెరుగుపర్చుకునే లక్ష్యంతో ఈ ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్న ట్లు పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, త్రివిధ దళాధిపతుల సమక్షంలో షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. భూతలం నుంచి ప్రయోగించే అణు, అణ్వస్త్రయేతర బాలిస్టిక్, హైపర్‌సోనిక్, క్రూయిజ్ క్షిపణులతో ఈ కొత్త ఆర్మీ రాకెట్ ఫోర్స్ కమాండ్‌ను తీర్చిదిద్దనున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన క్షిపణుల సత్తాను పాక్‌కు రుచి చూపించాక ఎట్టకేలకు పాక్ ప్రభుత్వం మేల్కొంది. 2025–2026 ఆర్థిక సంవత్సరంలో రక్షణరంగ బడ్జెట్‌ను 20 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

కన్నీటి వరద

46 మంది మృతి... 220 మంది గల్లంతు

- కశ్మీర్‌లోని కిష్త్వాడ్‌లో గంటపాటు క్లౌడ్ బరస్ట్
- చోసితీ గ్రామాన్ని ముంచెత్తిన భారీ వరద

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కిష్తవాడ్ జిల్లాలో ఆకస్మిక వర్షాలు బీభత్సం సృష్టించాయి. క్లౌడ్ బరస్ట్ కారణంగా గురువారం చోసితీ గ్రామాన్ని భారీ వరద ముంచెత్తింది. ఈ ఘటనలో ఇద్దరు సీఐఎస్ఎఫ్ జవాన్లు సహా ఏకంగా 46 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 220 మంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది. చాలా ఇళ్లు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద చిక్కుకున్న 167 మందిని సహాయక బృందాలు రక్షించాయి. వారిలో 38 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మచైల్ మాత ఆలయానికి వెళ్లే దారిలో వాహనాలపై ప్రయాణించగలిగే చిట్టచివరి గ్రామం చోసితీ. జిల్లా కేంద్రానికి 90 కిలోమీటర్ల దూరంలో మారుమూల ప్రాంతంలో కొండల మధ్య ఉన్న ఈ గ్రామంపై గురువారం మధ్యాహ్నం 12 గంటలకు క్లౌడ్‌బరస్ట్ విరుచుకుపడింది. సరిగ్గా గంటపాటు భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వరద ముంచెత్తింది. వరద దూసుకొచ్చిన సమయంలో గ్రామంలో 1,200 మంది ఉన్నట్లు తెలిసింది. మచైల్ మాత యాత్ర కోసం అప్పటికే చోసితీ గ్రామానికి చేరుకున్న భక్తులు భయకంపితులయ్యారు. సామూహిక వంటశాల(లంగర్)లో పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు. వంటశాలలోకి వరద నీరు చేరింది. పలు ఇళ్లు, దుకాణాలు, సెక్యూరిటీ ఔట్‌పోస్టు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. వీధులన్నీ బురద, బండరాళ్లతో నిండిపోయాయి. కొన్ని ఇళ్లు పేకమేడల్లా కూలిపోయాయి. వాహనాలు కొట్టుకుపోయాయి. వర్షం, వరద ధాటికి ఇప్పటిదాకా 46 మంది మృతి చెందినట్లు గుర్తించారు.



శిథిలాల్లో మట్టికొట్టుకుపోయిన ఆరేళ్ల పిల్లాడిని సురక్షితంగా బయటకు లాగిన దృశ్యం

మృతదేహాలు ఛిద్రం

చోసితీలో హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. బురద, రాళ్ల కింద చిక్కుకున్న మృతదేహాలు ముక్కలయ్యాయి. శరీరం లోపలి అవయవాలు బయటకు వచ్చాయి. ఎటుచూసినా రక్తపు మరకలే. మృతదేహాల ఊపిరితిత్తుల్లోకి కూడా బురద చేరింది. పక్కటెముకలు విరిగిపోయాయి. రాళ్ల తాకిడికి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. గుర్తుపట్టలేని విధంగా మారిపోయాయి. బురదను తొలగిస్తున్నకొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. ఇక క్షతగాత్రులు షాక్ నుంచి ఇంకా కోలుకోలేదు. అంతా క్షణాల్లో జరిగిపోయిందని అంటున్నారు. అసలేం జరిగిందో చెప్పలేకపోయారు. గల్లంతైన తమవారి కోసం గ్రామస్తులు, భక్తులు వెతుకున్నారు. వారి రోదనలతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జమ్మూకశ్మీర్‌లో కిష్తవాడ్‌తోపాటు రాజౌరీ, ఉదంపూర్, పూంచ్, కథువా తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తావి, చినాబ్, ఉజ్, సురాన్ తదితర నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

సహాయక చర్యలు వేగవంతం చేయాలి: మోదీ

కిష్తవాడ్ జిల్లాలో ఆకస్మిక వర్షాల్లో 40 మందికిపైగా భక్తులు, ప్రజలు మృతిచెందడం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు. సహాయక, పునరావాస చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ‘ఎక్స్’లో పోస్టుచేశారు. క్షతగాత్రులకు అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో ఫోన్‌లో మాట్లాడారు. చోసితీ గ్రామంలో సహాయక చర్యలపై ఆరా తీశారు. బాధితులను ఆదుకోవాలని సూచించారు. క్లౌడ్ బరస్ట్ గురించి తెలిసిన వెంటనే కిష్తవాడ్ డిప్యూటీ కమిషనర్ పంకజ్ వర్మతోపాటు సీనియర్ అధికారులు చోసితీకి చేరుకున్నారు. సహాయక చర్యలు ప్రారంభించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితోపాటు స్థానిక పోలీసులు, సైనికులు, స్వచ్ఛంద సేవకులు రంగంలోకి దిగారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, వరదల నేపథ్యంలో మచైల్ యాత్రను అధికారులు రద్దు చేశారు. ప్రజలు, యాత్రికుల సహాయార్థం కంట్రోల్ రూమ్, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో తొమ్మిది రోజుల క్రితమే క్లౌడ్ బరస్ట్ సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఒకరు మరణించగా, గల్లంతైన 68 మంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదు.

విశిష్టమైన యాత్ర

మచైల్ మాత యాత్ర జూలై 25న ప్రారంభమైంది. సెప్టెంబర్ 5న ముగియనుంది. చోసితీ నుంచి 8.5 కిలోమీటర్ల దూరంలో సముద్ర మట్టానికి 9,500 అడుగుల ఎత్తులో మచైల్ మాత ఆలయం ఉంది. ఈ గ్రామం నుంచే యాత్ర ప్రారంభమవుతుంది. యాత్రికులు తొలుత ఇక్కడికి వాహనాల్లో చేరుకుంటారు. తర్వాత కాలినడకన దుర్గా మాత ఆలయానికి వెళ్తారు. ప్రతిఏటా జరిగే ఈ యాత్రలో వేలాది మంది పాల్గొంటారు. పొరుగు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివస్తారు. ఇది చాలా విశిష్టమైన యాత్రగా పేరుగాంచింది. యాత్ర కోసం చోసితీని బేస్‌క్యాంప్‌గా ఉపయోగిస్తుంటారు.



కొండల మధ్య నుంచి గ్రామం మీదకు దూసుకొచ్చిన భారీ బురద



బురద వరదకు చెల్లాచెదురుగా పడి ధ్వంసమైన వాహనాలు

రాజధానిలో వానహోరు

వర్ష సంబంధ ఘటనల్లో ముగ్గురి మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ భీకరవానతో తడిసి ముద్దయింది. భారీ వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. చెట్లు, గోడ కూలడం వంటి వర్ష సంబంధ ఘటనల్లో మొత్తంగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ధౌలా ఖాన్–గురుగ్రామ్ రోడ్డులో అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో కార్లు బొమ్మకార్లలా నీటిపై అటూ ఇటూ తేలియాడాయి. ఎయిమ్స్ సమీప అండర్‌పాస్ రోడ్డు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. కాల్కాజీ ప్రాంతంలో ఉదయం తొమ్మిది గంటలకు భారీ వర్షం కురిసింది. అప్పుడే నడి రోడ్డుపై భారీ వృక్షం కూలడంతో 50 ఏళ్ల ద్విచక్రవాహనదారుడు సుధీర్‌కుమార్ అక్కడికక్కడే ప్రాణాలుకోల్పోయారు. వసంత్ విహార్ ప్రాంతంలో ఆటుకుంటున్న బిహార్‌కు చెందిన 9, 10 ఏళ్ల వయస్సున్న చిన్నారులపై వర్షానికి తడిసిన గోడ కూలడంతో ఇద్దరూ రక్తసిక్తమయ్యారు. గాయాలతో వారికి ఆస్పత్రిలో చేర్పించగా అప్పటికే చనిపోయారని వైద్యులు ధృవీకరించారు. వర్ష సంబంధ ఘటనల్లో వారం రోజుల వ్యవధిలో ఢిల్లీలో మొత్తంగా 9 మంది ప్రాణాలు కోల్పోయారు.


దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర పరిణామాలు

పాక్‌కు భారత్ హెచ్చరిక

న్యూఢిల్లీ: భారత్‌ను హెచ్చరిస్తూ పాకిస్తాన్ సైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్రస్థాయిలో స్పందించింది. కవ్వింపు చర్యలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలుచేస్తూ దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదని పాకిస్తాన్‌ను గురువారం భారత్ హెచ్చరించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఒక ప్రకటన విడుదలచేశారు. ‘‘ భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్ నేతలు తరచూ పూర్తి నిర్లక్ష్యపూరిత, యుద్ధోన్మాద, విద్వేషపూరిత వ్యాఖ్యానాలు చేస్తున్నారు. పాకిస్తాన్ తన గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు భారత వ్యతిరేక వాణిని తరచూ వినిపిస్తోంది. మరోసారి ఏదైనా కవ్వింపు చర్యలతో దుస్సాహసానికి తెగిస్తే తీవ్రమైన పర్యావసానాలను చవిచూడాల్సి వస్తుంది. ఇప్పటికే ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన సత్తాను మీకు రుచి చూపించింది’’ అని జైశ్వాల్ అన్నారు. ఇటీవల అమెరికాలో పర్యటించినవేళ ట్రంప్ భేటీ సమయంలో భారత్‌నుద్దేశిస్తూ మునీర్ హెచ్చరిక వ్యాఖ్యలు చేయడం తెల్సిందే. ‘‘ భారత్ కారణంగా పాకిస్తాన్ ఉనికి ప్రశ్నార్థకంగా మారితే అణుబాంబు ప్రయోగానికికైనా సిద్ధం. మా దేశం ఇబ్బందుల్లో పడితే సగం ప్రపంచాన్ని మాతోపాటు సమస్యల సుడిగుండంలోకి తీసుకెళ్తాం’’ అని వ్యాఖ్యానించారు. మునీర్ వ్యాఖ్యలపై ఆనాడే భారత్ ఘాటుగా బదులిచ్చింది. ‘‘ అణు బెదిరింపులకు భయపడేది లేదు. పాతకాలంనాటి అణుబెదిరింపులు ఆపితే మంచిది. అణ్వాయుధాలు ప్రయోగిస్తామనడం పూర్తి బాధ్యతారాహిత్యం. సైన్యం కనుసన్నల్లో పాలన వెళగబెట్టే పాక్ లాంటి దేశం నుంచి ఇలాంటి అణుబెదిరింపులు రావడం అంతర్జాతీయ సమాజానికి అత్యంత ప్రమాదకరం’’ అని భారత్ ఆందోళన వ్యక్తంచేసింది.

65 లక్షల ఓటర్ల డేటా బహిర్గతం చేయండి

- ప్రతి ఒక్క పేరుకు తొలగింపు కారణాన్నీ వెల్లడించండి
- బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశంలో ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం
- తొలగింపు కారణం తెలిస్తే వాళ్లు పరిష్కరించుకోవచ్చన్న కోర్టు
- అలాంటి వాళ్లకు ఆధార్‌కార్డ్‌ను అనుమతించాలని సూచన



న్యూఢిల్లీ: విపక్షాల విమర్శలతో అత్యంత వివాదాస్పదంగా మారి సుప్రీంకోర్టులో వాదోపవాదనలకు కేంద్రస్థానంగా మారిన బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీచేసింది. వివిధ కారణాలతో ముసాయిదా జాబితాలో స్థానం దక్కకుండాపోయి తొలగింపునకు గురైన 65 లక్షల ఓటర్ల పేర్లను బహిర్గతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు గురువారం సూచించింది. ఆ 65 లక్షల ఓట్లలో ఆయా ఓటరు ఓటును ఎందుకు తొలగించారో కారణసహితంగా పేర్కొంటూ మొత్తం 65 లక్షల జాబితాను ఈనెల 19వ తేదీలోపు బోర్డ్‌ల లేదా వెబ్‌సైట్ ద్వారా బహిర్గతంచేయండి. ఆగస్టు 22వ తేదీలోపు ఈ అంశంలో నివేదిక సమర్పించండి’’ అని ఈసీని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం ఆదేశించింది. ఈ సందర్భంగా ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది తన వాదనలను వినిపించారు. ‘‘ కాలానుగుణంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు చేసే పూర్తి చట్టబద్ధ అధికారం ఈసీకి ఉంది. కానీ రాజకీయ శత్రుత్వాలతో నిండిపోయిన ఈ వాతావరణంలో ఈసీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అది విమర్శలపాలవడం శోచనీయం. రాజకీయ పార్టీల ఆధిపత్య కొట్లాట మధ్య ఈసీ చిక్కుకుపోయింది. గెలిచిన పార్టీ ఈవీఎంలు సవ్యంగా పనిచేస్తున్నాయని ప్రకటిస్తుంది. ఓడిన పార్టీయేమో ఈవీఎంలో మోసాలు జరిగాయని మాపై అభాండాలు మోపుతోంది. దాదాపు 6.5 కోట్ల మంది ఓటర్లు మళ్లీ కొత్తగా పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వీళ్లు/ వీళ్ల తల్లిదండ్రుల పేర్లు 2003 నాటి ఓటర్ల జాబితాలో ఉన్నాయి’’ అని ఈసీ వాదించింది. దీనిపై ధర్మాసనం ఈసీకి పలు ప్రశ్నలు సంధించింది. ‘‘ మరణించిన, వేరే ప్రాంతాలకు వలసవెళ్లిన, వేరే అసెంబ్లీ నియోజకవర్గాల్లో శాశ్వత స్థిరనివాసం ఏర్పర్చుకున్న ఓటర్ల జాబితాను ఎందుకు బహిర్గతం చేయట్లేరు? వీళ్ల పేర్లను ఈసీ బోర్డ్ లేదంటే వెబ్‌సైట్‌లో ఎందుకు బహిరంగంగా ప్రచురించట్లేరు? ముసాయిదా జాబితాలో స్థానం దక్కని ఈ 65 లక్షల మంది ఓటర్లు మళ్లీ తమ ఓటును పునరుద్ధరించుకునేందుకు 30 రోజుల్లో అవకాశం కల్పించవచ్చు కదా!’’ అని ఈసీని ధర్మాసనం ప్రశ్నించింది. మృతిచెందిన, వలసవెళ్లిన, వేరే నియోజక వర్గాలకు మారిన ఓటర్ల జాబితాను ఇప్పటికే రాజకీయ పార్టీలకు అందజేశామని ఈసీ పేర్కొంది. దీంతో ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది.

ఓటు హక్కు కోసం రాజకీయ పార్టీలపై ఆధారపడాలా?

‘‘అందరికీ అందుబాటులో ఉండేటా నేరుగా జాబితాలో విడుదలచేయకుండా కేవలం రాజకీయ పార్టీలకు ఆ జాబితా ఇవ్వడంలో మీ ఆంతర్యమేంటి? ఓటర్లు ఓటు హక్కు కోసం రాజకీయపార్టీలపై ఆధారపడాలా? రాజకీయ పార్టీల కార్యకర్తలు, నేతలపై పౌరుల హక్కులు ఆధారపడాలని మేం కోరుకోవట్లేదు. తప్పులను సరిదిద్దుకునేలా ఆయా ఓటర్లకు అవకాశం కల్పించాలి. ఆయా 65 లక్షల మంది ఓటర్ల జాబితా ఏఏ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటుందో, ఏఏ కార్యాలయాల్లో అందుబాటులోకి తెస్తారో తెలియజేస్తూ పబ్లిక్ నోటీస్ జారీచేయండి’’ అని ఈసీని ధర్మాసనం ఆదేశించింది. ఇందుకు ఈసీ సమ్మతించింది. ‘‘ ఆగస్టు 19వ తేదీలోపు ఆ 65 లక్షల ఓటర్ల జాబితాను బహిర్గతంచేసి 22వ తేదీలోపు నివేదిక సమర్పించండి. ఆయా ప్రతి ఒక్క ఓటర్ ఓటు తొలగింపునకు కారణం పేర్కొంటూ జిల్లా రిటర్నింగ్ అధికారుల వద్ద జాబితాలను అందరికీ అందుబాటులో ఉంచండి. ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ కార్డ్(ఎపిక్) నంబర్‌తో ఈ జాబితాలో తమ పేరును వెతికేలా, సెర్చ్ ఆప్షన్‌ను అందుబాటులో ఉంచండి. ఈ జాబితా బహిర్గతం చేయడం ద్వారా బిహార్‌లో సమగ్ర జాబితా(ఎస్ఐఆర్) మరింత పారదర్శకంగా జరిగిందని చాటి చెప్పొచ్చు. పారదర్శకత అనేది ఓటర్లలో విశ్వాసాన్ని పెంచుతుంది. తొలగించిన ఓటర్ల జాబితా వివరా లపై స్థానిక, ఇంగ్లిష్ వార్తపత్రికలు, రేడియో, టెలివిజన్ మీడియాలో పబ్లిసిటీ చేయండి. ముసాయిదా జాబితాలో తమ పేరు లేని ఓటర్లు పోలింగ్ అధికారుల వద్దకెళ్లి ఆధార్ కార్డ్‌ను ధ్రువీకరణపత్రంగా సమర్పించి ఓటును పునరుద్ధరించుకోవచ్చు. అందుకు మేం అనుమ తిస్తున్నాం’’ అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. కేసు తదుపరి విచారణను కోర్టు ఆగస్టు 22వ తేదీకి వాయిదా వేసింది.



ఉగ్రవాదంపై మానవత్వ పోరాటం

- ఆపరేషన్ సిందూర్ ఆ విధంగానే చరిత్రలో నిలిచిపోతుంది
- స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన ముర్ము

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల పాశవిక దాడికి దీటైన జవాబుగా ఉగ్రస్థావరాలను నేలమట్టంచేస్తూ భారత్ సర్కార్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శ్లాఘించారు. రక్షణరంగంలో స్వావలంబన దిశలో దూసుకెళ్తున్న భారత్‌ను రాష్ట్రపతి మెచ్చుకున్నారు. 79వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాష్ట్రపతి ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. కీలకాంశాలు ఆమె మాటల్లోనే..

మానవీయ పోరాటానికి మచ్చుతునక

‘‘సెలవుల్లో సరదాగా గడిపేందుకు పహల్గాంలోని లోయ ప్రాంతానికి వచ్చిన అమాయకుల ప్రాణా లను ఉగ్రవాదులు పొట్టన బెట్టుకోవడం అత్యంత అమానవీయం. దీనికి దీటైన జవాబిస్తూ సరిహద్దు వెంట, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భారత త్రివిధదళాలు అత్యంత కచ్చితత్వంతో, సాంకేతిక సామర్థ్యంతో ఉగ్రస్థావరాలను నేలమట్టం చేశారు. ఉగ్రవాదంపై మానవత్వం చేసిన పోరాటానికి ఆపరేషన్ సిందూర్ ఒక ప్రబల నిదర్శనం. ఉగ్రవాదంపై అంతర్జాతీయ పోరులో ఆపరేషన్ సిందూర్ ఒక కీలక ఘట్టంగా నిలిచిపోతుంది. రక్షణరంగంలో ‘ఆత్మనిర్భర్ భారత్’ విజయానికి ఆపరేషన్ సిందూర్ కొలమానం.

అవినీతిని సహించలేని సుపరిపాలన

ప్రజాస్వామ్య వృక్షానికి అవినీతి, వంచన ఫలాలు కాయొద్దని గాంధీ హెచ్చరించారు. ఆయన ఆదేశాలను శిరసావహిస్తూ దేశం నుంచి అవినీతిని కూకటి వేళ్లతో పెకలించాలి. అవినీతిని సహించలేని సుపరిపాలన కావాలి. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ వంటికి స్వదేశీ స్ఫూర్తిని కొనసాగిస్తున్నాయి. దేశీయ ఉత్ప త్తులను కొందాం, వినియోగిద్దాం అని సంకల్పం తీసుకుందాం.

కశ్మీర్ రైలుతో పర్యాటకం, వాణిజ్యం పైపైకి

కశ్మీర్ లోయలో చినాబ్ నదిపై నూతన రైలు వంతెన మన భారతీయ ఇంజనీరింగ్ అద్భుతం. అంజీఖడ్ తీగల వంతెన సైతం కీలకమైంది. చినాబ్ నది మీదుగా కశ్మీర్‌కు తొలిసారిగా నూతన రైళ్ల రాకపోకలు ఆరంభమై కశ్మీర్‌లో పర్యాటకం, వాణిజ్యం మరింత ఊపందుకుంటోంది. రైళ్లు అక్కడికి కొత్త ఆర్థిక అవకాశాలను మోసుకొస్తాయి. రైల్వే అనుసంధానంతో ఆ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి బాటలు పడుతున్నాయి.’’

ఎవరి పంతం నెగ్గుతుందో!



నేడే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ భేటీ

ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముగింపు పలికి, శాంతి దూతగా పేరు సంపాదించాలన్నదే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పంతం. యుద్ధంలో ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాలను తమదేశంలో సంపూర్ణంగా విలీనం చేసుకొని, చట్టబద్ధత కల్పించుకోవాలన్నదే రష్యా అధినేత పుతిన్ ఆశయం. రెండు భిన్నమైన లక్ష్యాల సాధన కోసం ట్రంప్, పుతిన్ శుక్రవారం అలస్కాలో సమావేశం కాబోతున్నారు. ఇరువురు నేతల భేటీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధానంగా ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని ముగించడంపైనే చర్చలు జరుగుతాయని పైకి చెబుతున్నా.. తెరవెనుక ఇతర అంశాలూ ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు తమ అధీనంలో ఉన్న ఉక్రెయిన్ భూభాగాల విషయంలో పుతిన్ పట్టుదలతో వ్యవహరిస్తున్నారు. అలస్కా భేటీతో ఇరువురు నేతలు ఆశిస్తున్నదేమిటో చూద్దాం..

అందుకే అలస్కా వేదిక

ఉక్రెయిన్‌పై దండయాత్ర కొనసాగిస్తున్న పుతిన్‌ను ప్రపంచంలో ఏకాకిగా మార్చేందుకు పశ్చిమ దేశాలు చేసిన ప్రయత్నాలు చాలావరకు విఫలమయ్యాయి. అమెరికా నుంచి రష్యాను దూరం చేసేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయి. అమెరికా వద్ద తన ప్రతిష్ట స్థిరంగా చెక్కుచెదరకుండా ఉందని నిరూపించుకోవాలని పుతిన్ భావిస్తున్నారు. ఇందుకోసం అలస్కా సమావేశాన్ని అవకాశంగా వాడుకోవాలని నిర్ణయించారు. అంతర్జాతీయ రాజకీయాల్లో తన పట్టు ఏమాత్రం సడలలేదని ట్రంప్‌తో భేటీ ద్వారా పుతిన్ సంకేతం ఇవ్వబోతున్నారు. సమావేశానికి వేదికగా అలస్కాను ఎంచుకోవడం వెనుక ఒక వ్యూహం ఉంది. అలస్కాకు చేరుకోవాలంటే ఇతర దేశాల గగనతలం గుండా ప్రయాణించాల్సిన అవసరం లేదు. ఎవరినో అనుమతి కోరాల్సిన పనిలేదు. రష్యా నుంచి నేరుగా అలస్కాకు చేరుకోగలరు. అలస్కాను 19వ శతాబ్దంలో రష్యా పాలకులు అమెరికాకు విక్రయించారు. 21వ శతాబ్దంలో కొన్ని సరిహద్దుల్లో బలవంతంగా చేసిన మార్పులను సమర్థించుకోవడానికి అలస్కాను వేదికగా పుతిన్ ఎంచుకున్నారు. దేశాల సరిహద్దులు మార్చడం, భూభాగాల యజమానులు మారడం సాధారణ విషయమేనని ఆయన చెప్పదలిచారు.

అలాగైతేనే కాల్పుల విరమణ

ఉక్రెయిన్‌తోపాటు యూరోపియన్ దేశాల అధినేతలను పుతిన్ పక్కనపెట్టారు. ప్రత్యక్షంగా అమెరికాతోనే చర్చలకు సిద్ధమయ్యారు. ఇతర దేశాల పరిగణనలోకి తీసుకోవడం లేదు. చర్చలైనా, ఒప్పందమైనా అమెరికాతోనే అంటున్నారు. ఈ విషయంలో ఉక్రెయిన్ అభ్యంతరాలు వ్యక్తం చేసినా పుతిన్ పట్టించుకోలేదు. తాము ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాలను రష్యాలో అంతర్భాగంగా అంతర్జాతీయ సమాజం గుర్తించాలని పుతిన్ డిమాండ్ చేస్తున్నారు. అలాగైతేనే ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణకు సిద్ధమని చెబుతున్నారు. అయితే, పుతిన్ డిమాండ్‌ను ఉక్రెయిన్ వ్యతిరేకిస్తోంది. కబ్జాదారులకు తమ భూమి ఇవ్వబోమని ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ తెగేసి చెప్పారు. ఆక్రమిత ప్రాంతాలను రష్యాలో భాగంగా అధికారికంగా గుర్తించేలా ట్రంప్‌పై ఒత్తిడి పెంచాలన్నదే పుతిన్ వ్యూహంగా కనిపిస్తోంది. మొదట అమెరికా గుర్తిస్తే తర్వాత ఇతర దేశాలపైనా ఒత్తిడి పెంచే అవకాశం ఉంటుంది. ఆక్రమిత ప్రాంతాలను వదులుకోకుంటే ఆర్థిక సాయం నిలిపివేస్తామంటూ అమెరికా బెదిరిస్తే ఉక్రెయిన్ దారికి రావడం ఖాయమని పుతిన్ వాదిస్తున్నారు.

ఆర్థిక బంధం బలపడుతుందా?

అమెరికా–రష్యా మధ్య ఆర్థిక, ద్వైపాక్షిక సంబంధాలపైనా ట్రంప్, పుతిన్ చర్చించబోతున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన రష్యాపై అమెరికా కఠిన ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ ఆంక్షలను సడలించి, ఆర్థిక బంధాన్ని బలోపేతం చేసుకొనే దిశగా ఇరువురు నేతలు ఏదైనా ఒప్పందానికి వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం రష్యా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిళ్లు ఎదుర్కొంటోంది. అమెరికా సాయంతో గట్టెక్కాలన్న ఆలోచనలో పుతిన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపడానికి పుతిన్ అంగీకరిస్తే రష్యాకు ఆర్థికంగా అండగా ఉండడానికి ట్రంప్ ముందుకు రావొచ్చు. యుద్ధానికి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే తీవ్ర పరిణామాల ఉంటాయని ట్రంప్ తాజాగా రష్యాను హెచ్చరించడం గమనార్హం. అంటే ఈ విషయంలో ట్రంప్ గట్టి పట్టుదలతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. శుక్రవారం జరిగే భేటీలో పుతిన్‌ను ఆయన ఒప్పించడం ఖాయమని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. యుద్ధాన్ని ఆపేసి శాంతి దూతగా నోబెల్ శాంతి బహుమతి స్వీకరించాలని ట్రంప్ ఆరాపడుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

స్టాక్‌ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	58	80,598
నిఫ్టీ ▲	12	24,631

విదేశీ సూచీలు

నాస్‌డాక్‌	21,731	▲	17
డోజోన్స్‌	44,822	▽	100
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,173	▲	8
డాక్స్‌	24,379	▲	193
షాంఘై	3,666	▽	17
నికాయ్‌	42,649	▽	625

అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	87.10	88.12
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	117.00	119.99
€	యూరో	ఎస్‌బీఐ	101.20	103.93
¥	జపాన్‌ యెన్‌ (100)	ఎస్‌బీఐ	59.00	60.51
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	56.28	58.53
S$	సింగపూర్‌ డాలర్‌	థామస్‌కుక్‌	65.89	69.57
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	22.46	23.96
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	22.95	24.19
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	11.33	13.15

బీఎస్‌ఎన్‌ఎల్‌కి పెట్టుబడుల దన్ను

రూ. 47,000 కోట్ల ప్లాన్‌ సిద్ధం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌ను పటిష్టం చేయడంపై కేంద్రం మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు రూ. 47,000 కోట్ల పెట్టుబడులతో మరో ప్రణాళికను సిద్ధం చేసినట్లు సోషల్‌ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో టెలికం శాఖ వెల్లడించింది. 4జీ సేవలను విస్తరించేందుకు 1 లక్షకు పైగా టవర్లను ఏర్పాటు చేసేందుకు కంపెనీ గతేడాది రూ. 25,000 కోట్లు వెచ్చించినట్లు కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ఉటంకిస్తూ పేర్కొంది. వచ్చే ఏడాది నాటికి కస్టమర్లను పెంచుకుని, మొబైల్‌ సర్వీస్‌ వ్యాపారాన్ని 50 శాతం మేర పెంచుకోవాలని గత నెలలో బీఎస్‌ఎన్‌ఎల్‌ అధికారులతో సమీక్షా సమావేశం సందర్భంగా మంత్రి సూచించారు. ఎంటర్‌ప్రైజ్‌ వ్యాపారాన్ని 25–30 శాతం, ఫిక్స్‌డ్‌ లైన్‌ విభాగాన్ని కనీసం 15–20 శాతం మేర పెంచుకోవడంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి యూజరుపై సగటున వచ్చే ఆదాయం (ఏఆర్‌పీయూ)ని మెరుగుపర్చుకోవాలని తెలిపారు. ప్రస్తుతం సర్కిల్‌ని బట్టి బీఎస్‌ఎన్‌ఎల్‌ ఏఆర్‌పీయూ సుమారు రూ. 40 నుంచి రూ. 175 వరకు ఉంటోంది. జూన్‌ త్రైమాసికంలో ప్రైవేట్‌ టెల్కోలు రిలయన్స్‌ జియో ఏఆర్‌పీయూ రూ. 208గా, ఎయిర్‌టెల్‌ది రూ. 250గా నమోదైంది.



జూలైలో ఎగుమతులు జూమ్‌

- 37.24 బిలియన్‌ డాలర్లు
- రెండు నెలల క్షీణతకు బ్రేక్‌

న్యూఢిల్లీ: ఎగుమతులు రెండు వరుస నెలల క్షీణత తర్వాత జూలైలో పుంజుకున్నాయి. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూసినప్పుడు 7.29% వృద్ధితో 37.24 బిలియన్‌ డాలర్ల విలువైన (రూ.3.24 లక్షల కోట్లు) ఎగుమతులు నమోదయ్యాయి. దిగుమతులు సైతం 8.6% పెరిగి 64.59 బిలియన్‌ డాలర్ల (రూ.5.62 లక్షల కోట్లు)కు చేరాయి. దీంతో వాణిజ్య లోటు ఎనిమిది నెలల గరిష్ట స్థాయికి చేరి, 27.35 బిలియన్‌ డాలర్లుగా (రూ.2.38 లక్షల కోట్లు) నమోదైంది. గతేడాది నవంబర్‌ (31.77 బిలియన్‌ డాలర్లు) తర్వాత ఇదే గరిష్ట వాణిజ్య లోటు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్‌ నుంచి జూలై వరకు నాలుగు నెలల్లో ఎగుమతులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 3% పెరిగి 149.2 బిలియన్‌ డాలర్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో దిగుమతులు 5%కి పైగా పెరిగి 244 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యాయి. వాణిజ్య లోటు 4 నెలల్లో 94.81 బిలియన్‌ డాలర్లుగా ఉంది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత వస్తు, సేవల ఎగుమతులు మంచి పనితీరు చూపిస్తున్నట్టు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్‌ భర్త్వాల్‌ పేర్కొన్నారు. అంతర్జాతీయ సగటు కంటే భారత ఎగుమతులే ఎక్కువ వృద్ధిని సాధించినట్టు చెప్పారు. ఇంజనీరింగ్‌, ఎల్రక్టానిక్స్‌, రత్నాభరణాలు, ఫార్మా, కెమికల్స్‌ ఎగుమతుల్లో బలమైన పనితీరు చూపాయి.

ఐవోసీ లాభం రెట్టింపు


క్యూ1లో రూ. 5,689 కోట్లు

న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ (ఐవోసీ)ఈ ఏడాది (2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్‌–జూన్‌(క్యూ1)లో స్టాండెలోన్‌ నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 5,689 కోట్లను తాకింది. ప్రొడక్టులకు మార్జిన్లు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 2,643 కోట్లు ఆర్జించింది. కాగా.. రూ. 6,465 కోట్ల నిల్వల నష్టాలు, రూ. 3,858 కోట్ల ఎల్‌పీజీ సబ్సిడీ(బకాయి) నేపథ్యంలోనూ లాభాలు రెట్టింపైనట్లు కంపెనీ వెల్లడించింది. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా దాదాపు 26.33 మిలియన్‌ టన్నుల అమ్మకాలు సాధించింది. ప్రతీ బ్యారల్‌ చమురు శుద్ధిపై 2.15 డాలర్లు మాత్రమే లభించగా.. గత క్యూ1లో 6.39 డాలర్లు ఆర్జించింది.

ఐవోసీ షేరు 1.6% నష్టంతో రూ. 140 వద్ద ముగిసింది.

మైనస్‌లోనే టోకు ద్రవ్యోల్బణం

- జూలైలో మైనస్‌ 0.58 శాతం
- ఇది రెండేళ్ల కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం రెండేళ్ల కనిష్ట స్థాయికి దిగొచ్చింది. జూలైలో మైనస్‌ 0.58 శాతంగా (ప్రతి ద్రవ్యోల్బణం) నమోదైంది. జూన్‌లోనూ ఇది మైనస్‌ 0.13 శాతంగా ఉంది. గతేడాది జూలైలో 2.10 శాతంగా ఉండడం గమనార్హం. ఆహార వస్తువులు, మినరల్‌ ఆయిల్‌, ముడి చమురు, సహజ వాయువు, బేసిక్‌ మెటల్స్‌ ధరలు తగ్గడం వల్ల జూలై నెలకు టోకు ద్రవ్యోల్బణం ప్రతికూలంగా నమోదైనట్టు పరిశ్రమల శాఖ పేర్కొంది.

- ఆహార వస్తు విభాగంలో టోకు ద్రవ్యోల్బణం మైనస్‌ 6.29%గా నమోదైంది. జూన్‌లో మైనస్‌ 3.75%గా ఉంది. ముఖ్యంగా ఈ విభాగంలో కూరగాయల ధరలు గణనీయంగా తగ్గడంతో ద్రవ్యోల్బణం మైనస్‌ 28.96 శాతంగా నమోదైంది.
- ఇంధనం, విద్యుత్‌ విభాగంలో మైనస్‌ 2.43 శాతంగా ఉంది.
- తయారీ వస్తు విభాగంలో ద్రవ్యోల్బణం 2.05 శాతానికి పెరిగింది. జూన్‌లో ఇది 1.97%.

ఆగస్టులో మళ్లీ ప్లస్‌లోకి..


''ఆహార విభాగం కారణంగానే జూలైలో టోకు ద్రవ్యోల్బణం మైనస్‌లో కొనసాగింది. కూరగాయలు, పప్పులు, గుడ్లు, మాంసం, చేపల ధరలు ఎక్కువగా తగ్గాయి. వినియోగ ధరల (రిటైల్‌) ద్రవ్యోల్బణం లాగే టోకు ద్రవ్యోల్బణం సైతం జూలైలో కనిష్టానికి చేరింది. ఆగస్టు నుంచి తిరిగి ప్లస్‌లోకి చేరుకుంటుంది'' అని ఇక్రా సీనియర్‌ ఆర్థికవేత్త రాహుల్‌ అగర్వాల్‌ తెలిపారు.

'సాక్షి ప్లస్‌' ఈ-పేపర్‌లో ..
బ్లూకాలర్‌ ఉద్యోగాల్లో మిలీనియల్స్‌, జెన్‌ జెడ్‌ హవా | ఇన్ఫోసిస్‌ చేతికి వెర్సెంట్‌ గ్రూప్‌

భారత్‌కు రేటింగ్‌ బూస్ట్‌

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు, ద్రవ్యలోటు కట్టడి విషయంలో ప్రభుత్వ క్రమశిక్షణను ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ రేటింగ్స్‌ గుర్తించింది. ద్రవ్యోల్బణ నియంత్రణ అనుకూల పరపతి విధానాలనూ పరిగణనలోకి తీసుకుంటూ.. భారత సార్వభౌమ రేటింగ్‌ను బీబీబీ మైనస్‌ నుంచి 'బీబీబీ' స్టేబుల్‌ అవుట్‌లుక్‌ (స్థిరమైన దృక్పథం)కు అప్‌గ్రేడ్‌ చేస్తున్నట్టు ప్రకటించింది. భారత ఆర్థిక వ్యవస్థను నిర్జీవమైనదంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ ఆరోపించిన కొన్ని రోజులకే.. ఎస్‌అండ్‌పీ తన చర్యతో అసలు నిజమేంటో నిరూపించింది. 18 ఏళ్ల విరామం తర్వాత భారత రేటింగ్‌ను ఎస్‌అండ్‌పీ అప్‌గ్రేడ్‌ చేయడం గమనార్హం. 2007 జనవరిలో భారత సావరీన్‌ రేటింగ్‌ను బీబీబీ మైనస్‌ (అతి తక్కువ పెట్టుబడుల గ్రేడ్‌)కు తగ్గిస్తూ ఎస్‌అండ్‌పీ నిర్ణయం ప్రకటించింది. ఆ తర్వాత రేటింగ్‌ సవరణ మళ్లీ ఇదే. గతేడాది మే నెలలో భారత క్రెడిట్‌ రేటింగ్‌ అవుట్‌లుక్‌ను స్థిరత్వం నుంచి సానుకూలానికి మారుస్తూ.. వచ్చే 24 నెలల్లో రేటింగ్‌ అప్‌గ్రేడ్‌ ఉండొచ్చంటూ సంకేతం పంపింది. దీర్ఘకాల అన్‌సాలిసైటెడ్‌ (స్వచ్ఛంద) సావరీన్‌ క్రెడిట్‌ రేటింగ్స్‌ను బీబీబీ మైనస్‌ నుంచి బీబీబీకి.. స్వల్పకాల రేటింగ్స్‌ను ఏ–3 నుంచి ఏ–2కు ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ రేటింగ్స్‌ అప్‌గ్రేడ్‌ చేసింది. దీనివల్ల భారత కంపెనీలు మరింత తక్కువ రేట్లపై అంతర్జాతీయ మార్కెట్ల నుంచి నిధులు సమీకరించే వెసులుబాటు లభిస్తుంది. బీబీబీ అన్నది ఇన్వెస్ట్‌మెంట్‌ గ్రేడ్‌ రేటింగ్‌. తన రుణాలను సౌకర్యవంతంగానే చెల్లించగలదని ఇది సూచిస్తుంది.

- బీబీబీ స్టేబుల్‌ అవుట్‌లుక్‌కు అప్‌గ్రేడ్‌
- ప్రకటించిన రేటింగ్‌ ఏజెన్సీ ఎస్‌అండ్‌పీ
- 18 ఏళ్ల తర్వాత సవరణ
- బలమైన ఆర్థిక వృద్ధి, ద్రవ్య క్రమశిక్షణకు కితాబు



ప్రపంచంలో అత్యుత్తమ పనితీరు

''ప్రపంచంలో అత్యుత్తమ ఆర్థిక పనితీరు చూపుతున్న దేశాల్లో భారత్‌ ఇక ముందూ తప్పకుండా ఉంటుంది. ప్రభుత్వ వ్యయాల తీరు గత ఐదారేళ్ల కాలంలో మెరుగుపడింది. అమెరికా టారిఫ్‌ల కారణంగా భారత ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం ఎదుర్కోతగినదే. 50% టారిఫ్‌ల విధింపు వృద్ధిని ఏమంత కిందకు తోసేయదు. వాణిజ్య ఎగుమతులపై భారత్‌ తక్కువగా ఆధారపడి ఉన్నది. 60% ఆర్థిక వృద్ధి దేశీ వినియోగం రూపంలోనే ఉంటోంది'' అని ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ రేటింగ్స్‌ తెలిపింది. ఆర్థిక వృద్ధి సరైన దిశలోనే ఉన్నందున ద్రవ్య స్థిరీకరణకు మరింత నిర్దిష్టమైన మార్గాన్ని రూపొందించుకోవాలని సూచించింది.

ఇక ముందూ ఇదే ఒరవడి..: ఆర్థిక శాఖ

ప్రధాని మోదీ నాయకత్వంలో భారత ఆర్థిక వ్యవస్థ చురుగ్గా, చైతన్యంగా, బలంగా ఉందని రేటింగ్‌ అప్‌గ్రేడ్‌ రుజువు చేస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. ఒకవైపు మౌలిక వసతుల కల్పన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని కొనసాగిస్తూ, మరోవైపు ద్రవ్య స్థిరీకరణకు భారత్‌ ప్రాధాన్యం ఇచ్చిందని, దీని ఫలితమే రేటింగ్‌ అప్‌గ్రేడ్‌ అంటూ ఎక్స్‌ ప్లాట్‌ఫామ్‌పై పేర్కొంది. చురుకైన ఈ వృద్ధిని భారత్‌ ఇక ముందూ కొనసాగిస్తూ, 2047 నాటికి వికసిత్‌ భారత్‌ లక్ష్యం సాధించేందుకు వీలుగా అవసరమైన సంస్కరణలు చేపడుతుందని తెలిపింది.

ఎస్‌బీఐ 'ఐఎంపీఎస్‌' చార్జీలు



న్యూఢిల్లీ: ఐఎంపీఎస్‌ (ఇమీడియెట్‌ పేమెంట్‌ సర్వీస్‌) లావాదేవీలను సవరిస్తున్నట్టు ఎస్‌బీఐ ప్రకటించింది. ఆన్‌లైన్‌లో ఐఎంపీఎస్‌ ద్వారా నిర్వహించే నగదు బదిలీ రూ.25,000 దాటితే రూ.2 నుంచి రూ.10 వరకు చార్జీ, దీనిపై జీఎస్‌టీ అమలవుతుంది. రూ.25,000కు పైన రూ.లక్షలోపు లావాదేవీపై రూ.2, రూ.1–2 లక్షల లావాదేవీపై రూ.6, రూ.2–5 లక్షల లావాదేవీలపై రూ.10 చొప్పున చార్జీతో పాటు జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని ఎస్‌బీఐ తెలిపింది.. బ్యాంక్‌ శాఖల ద్వారా నిర్వహించే ఐఎంపీఎస్‌ లావాదేవీలపై ఇక ముందూ ఎలాంటి చార్జీలు ఉండవని పేర్కొంది. వేతన ఖాతాదారులు సైతం ఎలాంటి చార్జీల్లేకుండా ఐఎంపీఎస్‌ లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. కరెంట్‌ ఖాతా (గోల్డ్‌, డైమండ్‌, ప్లాటినం, రోడియం, ప్రభుత్వ శాఖలు, విభాగాలు, ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి)లకూ ఈ చార్జీల నుంచి మినహాయింపు ఇచ్చింది.

సూచీలకు స్వల్ప లాభాలు

- స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నేడు మార్కెట్‌కు సెలవు



ముంబై: ట్రేడింగ్‌ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్‌ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌, రష్యా ప్రెసిడెంట్‌ పుతిన్‌తో అలస్కా వేదికగా ఆగస్టు 15న(నేడు) జరగనున్న వాణిజ్య చర్చల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. సెన్సెక్స్‌ 58 పాయింట్లు పెరిగి 80,598 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 12 పాయింట్లు బలపడి 24,631 వద్ద నిలిచింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం (15న) స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు సెలవు.

- జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌ షేరు ఇష్యూ ధర (రూ.147)తో పోలిస్తే బీఎస్‌ఈలో 4% ప్రీమియంతో రూ.153 వద్ద లిస్టయింది. ఒక దశలో 5% ఎగసి రూ.155 గరిష్టాన్ని తాకింది. ఇంట్రాడే లాభాలు కోల్పోయి చివరికి 0.64% నష్టంతో రూ.146 వద్ద క్లోజైంది.
- ఆల్‌ టైం ప్లాస్టిక్స్‌ షేరు లిస్టింగ్‌ మెప్పించింది. ఇష్యూ ధర (రూ.275)తో పోలిస్తే బీఎస్‌ఈలో 14% ప్రీమియంతో రూ.314 వద్ద మొదలైంది. ఒక దశలో 17% ఎగసి రూ.322 వద్ద గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి 3% లాభంతో రూ.283 వద్ద ముగిసింది.

క్వార్టర్‌ ఫైనల్లో దివ్య దేశ్‌ముఖ్‌ పరాజయం

మహిళల స్పీడ్‌ చెస్‌ చాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్‌, ప్రపంచకప్‌ విజేత దివ్య దేశ్‌ముఖ్‌ పోరాటం ముగిసింది. ర్యాపిడ్‌ ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో దివ్య క్వార్టర్‌ ఫైనల్లో వెనుదిరిగింది. ప్రపంచ నంబర్‌వన్‌, మూడుసార్లు వరల్డ్‌ చాంపియన్‌, చైనా గ్రాండ్‌మాస్టర్‌ హూ ఇఫాన్‌తో జరిగిన క్వార్టర్‌ ఫైనల్లో దివ్య 9.5–10.5 పాయింట్ల తేడాతో ఓటమి చవిచూసింది. ఇద్దరి మధ్య మొత్తం 20 గేమ్‌లు జరిగాయి. దివ్య ఎనిమిది గేముల్లో ... హూ ఇఫాన్‌ తొమ్మిది గేముల్లో నెగ్గారు. మరో మూడు గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. మొత్తం 16 మంది క్రీడాకారిణుల మధ్య నాకౌట్‌ పద్ధతిలో ఈ టోర్నీ జరుగుతోంది. దివ్య తొలి రౌండ్‌లో 10–3తో చైనా గ్రాండ్‌మాస్టర్‌ లీ టింగ్జీపై గెలిచింది. ఇతర క్వార్టర్‌ ఫైనల్స్‌లో కాటరీనా లాగ్నో (రష్యా) 9–4తో అలెగ్జాండ్రా కొస్టెనిక్‌ (స్విట్జర్లాండ్‌)పై, జు వెన్‌జున్‌ (చైనా) 10.5–8.5తో బీబీసారా అసబయేవా (కజకిస్తాన్‌)పై విజయం సాధించారు.



ప్రపంచ చెస్‌లో భారత్‌ ఆధిపత్యం

స్వాతంత్య్ర దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి




న్యూఢిల్లీ: ప్రపంచ చెస్‌లో భారత్‌ ఆధిపత్యం కనబరుస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కితాబిచ్చారు. దేశ పౌరులకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన ఆమె తన సందేశంలో భారత చెస్‌ క్రీడాకారుల ఘనతను ప్రస్తావించారు. క్రీడల్లో భారత్‌ గణనీయమైన విజయాలను సాధిస్తోందని ప్రశంసించారు. 'దేశ యువత సరికొత్త ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో ముందడుగు వేస్తోంది. చెస్‌ ఈవెంట్‌ను చూసుకుంటే... భారత యువ చదరంగ క్రీడాకారులదే హవా! మునుపెన్నడూ లేని విధంగా అంతర్జాతీయ చెస్‌లో ఆధిపత్యాన్ని మన గ్రాండ్‌మాస్టర్లు చలాయిస్తున్నారు. ఇక మీదట అమలయ్యే కొత్త క్రీడా పాలసీతో ప్రపంచ క్రీడా శక్తిగా భారత్‌ ఆవిర్భవించే అవకాశాలున్నాయి. మన అమ్మాయిలు మనకు గర్వకారణంగా నిలుస్తున్నారు. ప్రతి రంగంలోనూ మహిళలు సత్తా చాటుకుంటున్నారు. రక్షణ, భద్రత, క్రీడలు ఇలా ఏ రంగమైనా సరే ఎవరికీ తీసిపోని విధంగా సాటిలేని విజయాలు సాధిస్తున్నారు. పురుషుల్లో 18 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్‌ ప్రపంచ చాంపియన్‌షిప్‌ సాధించడం, మహిళల్లో 19 ఏళ్ల టీనేజ్‌ అమ్మాయి దివ్య దేశ్‌ముఖ్‌, 38 ఏళ్ల వెటరన్‌ గ్రాండ్‌మాస్టర్‌ కోనేరు హంపి 'ఫిడే' మహిళల ప్రపంచకప్‌ ఫైనల్స్‌కు అర్హత సాధించడం చెస్‌లో మన సత్తా ప్రపంచానికి చాటినట్లయ్యింది' అని రాష్ట్రపతి తన సందేశంలో ప్రముఖంగా ప్రస్తావించడం విశేషం. తరాలు మారుతున్నా... మన మహిళలు స్థిరంగా ప్రతిభ చాటుకుంటున్నారని, ప్రపంచంతో పోటీ పడేందుకు సై అంటున్నారని ప్రశంసించారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన 'నారీశక్తి వందన్‌ అధినియమ్‌' ఇకపై నినాదం మాత్రమే కాదు... నిజమైన సార్థకతగా అభివర్ణించారు. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ చెస్‌లో భారత క్రీడాకారులు విశేషంగా రాణిస్తున్నారు. గుకేశ్‌, దివ్యలతో పాటు తెలంగాణ తేజం ఇరిగేశి అర్జున్‌, ప్రజ్ఞానంద, విదిత్‌, వైశాలి ఇంటా బయటా విజయకేతనం ఎగురవేస్తున్నారు.

విజేత విన్సెంట్‌ కీమెర్‌



చెన్నై: ఆద్యంతం నిలకడగా రాణించిన జర్మనీ గ్రాండ్‌మాస్టర్‌ విన్సెంట్‌ కీమెర్‌ మరో రౌండ్‌ మిగిలి ఉండగానే... చెన్నై గ్రాండ్‌మాస్టర్స్‌ చెస్‌ టోర్నీలో చాంపియన్‌గా అవతరించాడు. జోర్డెన్‌ వాన్‌ ఫారీస్ట్‌ (నెదర్లాండ్స్‌)తో గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్‌ గేమ్‌ను విన్సెంట్‌ కీమెర్‌ 59 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఎనిమిదో రౌండ్‌ తర్వాత కీమెర్‌ 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. నాలుగు గేముల్లో నెగ్గిన కీమెర్‌, మరో నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్‌, కార్తికేయన్‌ మురళీ 4.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. నేడు జరిగే చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో కీమెర్‌ ఓడిపోయినా... అర్జున్‌, కార్తికేయన్‌ తమ గేమ్‌ల్లో విజయం సాధించినా జర్మనీ గ్రాండ్‌మాస్టర్‌ను అందుకోలేకపోతారు. ఎనిమిదో రౌండ్‌లో అర్జున్‌–విదిత్‌ గేమ్‌ 32 ఎత్తుల్లో; నిహాల్‌ సరీన్‌–కార్తికేయన్‌ మురళీ గేమ్‌ 61 ఎత్తుల్లో; అవండర్‌ లియాంగ్‌ (అమెరికా)–అనీశ్‌ గిరి (నెదర్లాండ్స్‌) గేమ్‌ 37 ఎత్తుల్లో; ప్రణవ్‌ (భారత్‌)–రే రాబ్సన్‌ (అమెరికా) గేమ్‌ 35 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి.



డాక్టర్‌ వీస్‌ పేస్‌ కన్నుమూత

ఒలింపిక్‌ పతక విజేత, క్రీడా వైద్యుడిగా గుర్తింపు

టెన్నిస్‌ స్టార్‌ లియాండర్‌ పేస్‌కు తండ్రి

- భారత క్రీడల్లో ప్రత్యేక ముద్ర



లియాండర్‌కు పశ్చిమ బెంగాల్‌ రాష్ట్ర క్రీడల మంత్రి అరూప్‌ బిశ్వాస్‌ పరామర్శ

కోల్‌కతా: క్రీడాకారుడు, క్రీడలకు సంబంధించిన వివిధ రంగాల్లో నైపుణ్యం... స్వయంగా ఒలింపిక్‌ పతకం గెలిచిన జట్టులో సభ్యుడు, మరో ఒలింపిక్‌ మెడలిస్ట్‌కు తండ్రి... వైద్యుడిగా వేర్వేరు క్రీడాంశాల్లో ప్రత్యేక గుర్తింపు... బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్‌ వీస్‌ పేస్‌ బయోడేటా ఇది. 80 ఏళ్ల వీస్‌ పేస్‌ గురువారం అనారోగ్య కారణాలతో కోల్‌కతాలో కన్ను మూశారు. చికిత్స కోసం మంగళవారం ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా ఆపై కోలుకోలేకపోయారు. గత కొంత కాలంగా వీస్‌ పేస్‌ పార్కిన్సన్‌ వ్యాధితో కూడా బాధపడుతున్నారు. భారత మహిళల బాస్కెట్‌బాల్‌ జట్టు మాజీ కెప్టెన్‌ జెన్నిఫర్‌ను వివాహమాడిన వీస్‌కు కుమారుడు లియాండర్‌తో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. విదేశాల్లో ఉన్న వారిద్దరు తిరిగొచ్చిన తర్వాత అంత్యక్రియలు జరుగుతాయి.

ప్లేయర్‌గా మొదలై...

1945లో గోవాలో పుట్టిన వీస్‌ పేస్‌ మొదటి నుంచి అటు క్రీడల్లోనూ, ఇటు క్రీడా వైద్యంలోనూ చురుగ్గా ఉండేవారు. ఫుట్‌బాల్‌, క్రికెట్‌, రగ్బీ వంటి ఆటల తర్వాత ఆయన హాకీని పూర్తి స్థాయిలో ఎంచుకొని సత్తా చాటారు. మిడ్‌ ఫీల్డర్‌గా భారత హాకీ జట్టు తరఫున రాణించిన వీస్‌కు 1968 మెక్సికో ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత జట్టులో ఆడే అవకాశం త్రుటిలో చేజారింది. అయితే ఆ తర్వాత టీమ్‌లో తన స్థానం సుస్థిరం చేసుకున్నారు. 1971 హాకీ వరల్డ్‌ కప్‌లో మూడో స్థానంలో నిలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడిగా ఉన్నారు. తర్వాతి ఏడాదే మరో కీలక విజయంలో ఆయన భాగమయ్యారు. 1972 మ్యూనిక్‌ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జట్టులో కూడా వీస్‌ కీలక పాత్ర పోషించారు. ఆటగాడిగా గుర్తింపు పొందక ముందే 1964–65లో ఆయన కోల్‌కతా ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి ప్రి మెడికల్‌ కోర్సు పూర్తి చేశారు.

స్పోర్ట్స్‌ డాక్టర్‌గా...

హాకీ నుంచి తప్పుకోగానే వీస్‌ పేస్‌ పూర్తి స్థాయిలో క్రీడా వైద్యంపై దృష్టి పెట్టారు. నాటి రోజుల్లో మన దేశంలో స్పోర్ట్స్‌ మెడిసిన్‌పై పెద్దగా అవగాహన, గుర్తింపు రాని రోజుల్లోనే వీస్‌ ఆధునిక వైద్య విధానాలతో భిన్న క్రీడాంశాల్లో ఆటగాళ్లకు మార్గనిర్దేశనం చేశారు. దశాబ్దకాలం పాటు భారత డేవిస్‌ కప్‌ జట్టుతో పాటు ఆసియా క్రీడలు, కామన్వెల్త్‌ క్రీడలు, ఒలింపిక్స్‌లో పాల్గొన్న టీమ్‌లకు కూడా ఆయన టీమ్‌ డాక్టర్‌గా పని చేశారు. స్పోర్ట్స్‌ మెడిసిన్‌ ద్వారా పలువురు భారత ఆటగాళ్లు గాయాల నుంచి కోలుకోవడంలో వీస్‌ సహకరించారు. ఆసియా క్రికెట్‌ కౌన్సిల్‌, బీసీసీఐకి కూడా ఆయన సుదీర్ఘకాలం కన్సల్టెంట్‌గా పని చేశారు. ముఖ్యంగా బీసీసీఐ యాంటీ డోపింగ్‌ ప్రోగ్రామ్‌లో ఆయన కీలక పాత్ర పోషిస్తూ బోర్డుకు సహకరించారు.

కొడుకును తీర్చిదిద్ది...

తండ్రీ కొడుకులు ఒలింపిక్‌ పతక విజేతలు కావడం ప్రపంచ క్రీడల్లో చాలా అరుదు. అలాంటి ఘనతను పేస్‌ కుటుంబం సాధించింది. తండ్రి ప్రోత్సాహంతో క్రీడాకారుడిగా మారిన లియాండర్‌ తర్వాతి కాలంలో భారత టెన్నిస్‌ దిగ్గజంగా తన పేరును లిఖించుకున్నాడు. లియాండర్‌ కెరీర్‌ను తీర్చిదిద్దడంతో తండ్రిగా, మేనేజర్‌గా, మెంటార్‌గా వీస్‌ పాత్ర చాలా పెద్దది. 18 గ్రాండ్‌స్లామ్‌ టైటిల్స్‌తో పాటు 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన లియాండర్‌ తండ్రి అంచనాలను అందుకోగలిగాడు. వీస్‌ పేస్‌ మృతి పట్ల హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్‌ తిర్కీతో పాటు మాజీ ఆటగాళ్లు అజిత్‌పాల్‌ సింగ్‌, వీరెన్‌ రస్కిన్హా, బీపీ గోవింద, హర్బిందర్‌ సింగ్‌ సంతాపం వ్యక్తం చేశారు. భారత టెన్నిస్‌ స్టార్‌ సానియా మీర్జా కూడా 'వీస్‌ అంకుల్‌తో నాకు దాదాపు పాతికేళ్ల అనుబంధం ఉంది. 2002 బుసాన్‌ ఆసియా క్రీడల నుంచి ఆయన ఎన్నోసార్లు మాతో కలిసి పని చేశారు. స్వయంగా ఆటగాడు కావడంతో ఆయనకు క్రీడాకారుల మానసిక స్థితిపై కూడా సరైన అవగాహన ఉండేది. దాని ప్రకారమే ఆయన వైద్యం చేసేవారు. భారత క్రీడారంగానికి ఆయన లోటు తీరనిది' అని నివాళి అర్పించింది.



టెన్నిస్‌ 'హాల్‌ ఆఫ్‌ ఫేమ్‌'లో లియాండర్‌కు చోటు లభించిన సమయంలో మనుమరాలు అయానా, భార్య జెన్నిఫర్‌తో వీస్‌ పేస్‌

స్వేచ్ఛా జీవితం అంటే ఎవరికి నచ్చినట్టు వారు ఉండటం మాత్రమే కాదు తమ అభిరుచులను కూడా నైపుణ్యంగా మలుచుకునే స్వేచ్ఛను కలిగి ఉండటం అంటోంది నేటి యువత. తమ భావి జీవన నిర్మాణాన్ని బాధ్యతగా మలుచుకోవడమూ దేశభక్తే అని చెబుతోంది.

యువర్స్

స్వేచ్ఛా తరంగాలు

వివిధ రంగాలలో రాణిస్తూ తమని తాము ప్రూవ్ చేసుకుంటున్నారు తెలుగు రాష్ట్రాలకు చెందిన యువతులు. ముంబైలో ఉంటూ నటిగా, మోడల్‌గా నిరూపించుకుంటోంది దియా సీతేపల్లి. కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తూ, జెండర్ ఈక్వాలిటీకి కృషి చేస్తోంది ఢిల్లీ శ్రీరామ్ యూనివర్శిటీలో డిగ్రీ చేస్తున్న శ్రీహిత. 'కోర్ట్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువయిన కాకినాడ శ్రీదేవి సైకాలజీ చేస్తానంటోంది. డిగ్రీ చేస్తూ నేపథ్య గాయనిగా పేరు తెచ్చుకుంటున్న హరిణి, క్యారమ్స్‌లో ఇంటర్నేషనల్ ప్లేయర్‌గా రాణించి, యూకే యూనివర్శిటీ నుంచి మాస్టర్స్‌లో గోల్డ్ మెడలిస్ట్ అందుకున్న హుస్నా సమీర.. నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.


శ్రీహిత నీలి


దియా సీతేపల్లి


హరిణి ఆనంద్


హుస్నా సమీర


కాకినాడ శ్రీదేవి

ఎంతటి కష్టమైనా...

జూనియర్ ఇంటర్ టైమ్‌లోనే మోడలింగ్ ఫ్రీలాన్స్ చేశాను. ఏజెన్సీతో కలిసి పనిచేశాను. హైదరాబాద్‌లోని లేడీస్ బ్రాండ్స్‌కి మోడలింగ్ చేశాను. చిన్నప్పటి నుంచి యాక్టింగ్ మీద బాగా ఇష్టం. లాక్‌డౌన్ టైమ్‌లో 'ప్రేమకథ' సినిమా చేశా. తమిళ సినిమాకు వర్క్ చేశాను. ముంబైలో ఉంటూ మోడలింగ్‌గా నా కెరియర్‌ను కొనసాగిస్తున్నాను. ఆడిషన్స్ చేస్తుంటాను. నా ఇష్టాన్ని అమ్మానాన్నలు కాదనలేదు. నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి, బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. ముంబై వంటి మహానగరంలో మనవాళ్లు ఎలా నిలదొక్కుకుంటారు, అమ్మాయిలు కదా... లాంటి అనుమానాలేవీ అక్కర్లేదు. ఇప్పుడు ప్రపంచం అంతా ఒక్కటే. మన వర్క్‌ని ఎంత బెస్ట్‌గా ఇవ్వగలుగుతున్నాం అనే దానిపైన దృష్టి ఉండాలి. సక్సెస్ కోసం ఎంతటి కష్టమైనా ఎదుర్కోవడానికి మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి.

– దియా సీతేపల్లి, నటి, మోడల్

అభిరుచులకు మద్దతు

క్యారమ్స్‌లో అంతర్జాతీయ క్రీడాకారులతో పోటీ పడి వరల్డ్ రికార్డ్ సాధించాను. యూకేలో ఇంటర్నేషనల్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ మాస్టర్స్‌లో గోల్డ్ మెడల్ తీసుకున్నాను. కాలీగ్రఫీ, మ్యాథమేటిక్స్‌లో అవార్డులు ఉన్నాయి. హ్యూమన్ రిసోర్సెస్ స్పెషలిస్ట్‌గా వర్క్ చేస్తున్నాను. వ్యాపారవేత్తగా రాణించాలని, క్యారమ్స్‌లోనూ మరిన్ని విజయాలు అందుకోవడానికి కృషి చేస్తున్నాను. నా ఇష్టాలకు, అభిరుచులకు అమ్మానాన్నలు చాలా సపోర్ట్ నిచ్చారు. చిన్నప్పటి నుంచి ఇలా నన్ను నేను మెరుగుపరుచుకోవడానికి వారిచ్చిన ప్రోత్సాహం మాటల్లో చెప్పలేనిది.

– హుస్నా సమీర

మల్టిపుల్ స్కిల్స్ మస్ట్

స్కూల్ టైమ్‌లోనే హిందీ పండిట్ కోర్సు చేశాను. సంగీతం అంటే ఇష్టం ఉండటంతో కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చుకుంటూ, సంగీత విశారద డిగ్రీ కోర్సు పూర్తిచేశాను. వాలీబాల్ స్టేట్‌లెవల్ కాంపిటీషన్‌లో పాల్గొన్నాను. ఈమధ్య బీటెక్ అవుతూనే క్యాంపస్ సెలక్షన్‌లో జాబ్ వచ్చింది. కర్ణాటక సంగీతంలో కచేరీలు ఇస్తుంటాను. మలేషియాలో తెలుగు అసోసియేషన్ ఆహ్వానంతో అక్కడ కచేరీలో పాల్గొన్నాను. మ్యూజిక్ క్లాసులు కూడా తీసుకుంటాను. జాబ్ చేస్తూనే సింగర్‌గానూ ప్రూవ్ చేసుకోవాలనుకుంటున్నాను. ఇప్పుడు యోగాలో టీచర్ ట్రైనింగ్ కోర్సు చేస్తున్నాను. సాంకేతికపరంగా ప్రపంచంలో చాలా మార్పులు వస్తున్నాయి. ఇలాంటప్పుడు ఒక చదువు మాత్రమే ఉంటే సరిపోదు. ఇలా విభిన్న రంగాలలో నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల మనల్ని మనం మెరుగ్గా తీర్చిదిద్దుకోవచ్చు. ఆసక్తి, అభిరుచులను కూడా స్కిల్స్‌గా డెవలప్ చేసుకుంటే మన వ్యక్తిత్వం కూడా బాగుంటుంది. లైఫ్ అంతా ఉపయుక్తంగా మార్చుకుంటూ వెళితే చాలా హ్యాపీగా ఉంటాం.

– హరిణి ఆనంద్ చెరుకూరి

జెండర్ ఈక్వాలిటీకి కృషి

నేను టెన్త్ క్లాస్‌లోనే శాస్త్రీయ నృత్యంలో సర్టిఫికెట్స్ తీసుకున్నాను. కూచిపూడి నృత్యకారిణిగా ప్రదర్శనలు ఇస్తుంటాను. ఫుట్‌బాల్ ప్లేయర్‌ని. అమ్మ గైనకాలజిస్ట్, నాన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మ్యాథ్స్, సైన్స్ వైపు కాకుండా పొలిటికల్ సైన్స్ వైపు వచ్చాను. యూపీఎస్సీలో ర్యాంకు సాధించాలనేది నా లక్ష్యం. ఢిల్లీ శ్రీరామ్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో బీఏ పొలిటికల్ సైన్స్ అండ్ ఎకనామిక్స్ చేస్తున్నాను. కాలేజీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఎడిటోరియల్ టీమ్‌కు సబ్ హెడ్‌గా ఉంటూనే, ఎన్ఎస్ఎస్ ఆర్గనైజేషన్‌లో జెండర్ ఈక్వాలిటీ కోసం కృషి చేస్తున్నాను. ఒక లక్ష్యంతో పాటు అభిరుచికి తగిన స్కిల్‌ను నేర్చుకోవాలి. అంతే కాదు సమాజానికి మన వంతు భాగస్వామ్యాన్ని, సేవను అందించాలి. అందుకు మనల్ని మనం ఎప్పుడూ సిద్ధం చేసుకోవాలి.

– శ్రీహిత నీలి

సైకాలజీ స్టార్

'కోర్టు' సినిమా నటిగా నాకు మంచి పేరు తెచ్చింది. ఇప్పుడు తమిళంలో ఓ మూవీ చేస్తున్నాను. జూనియర్ ఇంటర్ పూర్తయ్యింది. సైకాలజీలో డిగ్రీ చేయాలనుకుంటున్నాను. జెన్ జీ తరం చాలా ఆందోళన, డిప్రెషన్‌తో లైఫ్‌ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో తెలియని గందరగోళంలో ఉంటున్నారు. అందుకే, సైకాలజీ చేసి, మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి చికిత్సను అందించాలనుకుంటున్నాను. డ్యాన్స్, కుకింగ్ నా ఫేవరేట్స్. యాక్టింగ్ అంటే చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉన్నా ఇలా సినిమాల్లోకి వస్తానని అనుకోలేదు. రీల్స్ చేయడం ద్వారా పేరొచ్చింది. మూవీలో అవకాశం వచ్చింది. అమ్మ ఓకే అంది. అలా జాలీగా నా జర్నీ స్టార్ట్ అయ్యింది. మంచి నటిగా పేరు తెచ్చుకుంటూ, బాగా చదువుకుంటాను.

– కాకినాడ శ్రీదేవి, నటి

– నిర్మలా రెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

● యంగ్ టాలెంట్

యస్...ఇది గణేశ్ బండి!

'అవసరమే ఆవిష్కరణకు దారి చూపిస్తుంది' అనే మాట తెలంగాణ రాష్ట్రం ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాకు చెందిన లకావత్ గణేశ్ విషయంలోనూ నిజమైంది. పుట్టుకతో పోలియోతో రెండు కాళ్లు చచ్చుబడిపోయిన గణేశ్ ఎనిమిదో తరగతి వరకు చదివాడు. సెల్‌ఫోన్ రిపేరును సొంతంగా నేర్చుకొని ఇంట్లోనే షాపు పెట్టుకున్నాడు. ప్రభుత్వం ద్వారా వచ్చిన మూడు చక్రాల బండి తరచూ రిపేరుకు రావడం, ఎత్తైన ప్రదేశాలు ఎక్కలేక పోవడంతో గణేశ్ ఇబ్బంది


గణేశ్

పడ్డాడు. విడిభాగాలు కాలిపోవడంతో బండిని మూలన పడేశాడు. అప్పటి నుంచి ఎక్కడికి వెళ్లాలన్నా మరొకరు సాయం చేసేవారు. కొన్నిసార్లు ఎవరూ సాయం రాకపోవడంతో గణేశ్ ఆలోచన మూడు చక్రాల బండిపై పడింది. దీంతో ఒక సైకిల్ కొని దానికి బ్యాటరీ, మోటర్ బిగించాడు. కొన్ని విడిభాగాలను ఆన్‌లైన్‌లో, మరికొన్నింటిని ముస్తాబాద్‌లో కొనుగోలు చేశాడు. వాటిని సైకిల్‌కు బిగించి బ్యాటరీతో సులభంగా నడిచేలా ప్రయోగం చేశాడు. అది విజయవంతం కావడంతో ఆ బ్యాటరీ సైకిల్‌పై తిరుగుతూ తన పనులు చక్కబెట్టుకుంటున్నాడు. ప్రభుత్వం సాయం అందిస్తే మరిన్ని ప్రయోగాలు చేస్తానని ఎంతో ఆత్మ విశ్వాసంతో చెబుతున్నాడు గణేశ్.

– అవధూత బాలశేఖర్, సాక్షి, ముస్తాబాద్

సాక్షి సినిమా



పరిశ్రమలో ఎవరి కుంపటి వాళ్లదే

– నిర్మాత అల్లు అరవింద్

''ఇటీవల ప్రకటించిన జాతీయ అవార్డుల్లో తెలుగు చిత్ర పరిశ్రమకు ఏడు అవార్డులు వచ్చాయి. ముందుగా విజేతలందరికీ అభినందనలు. నిజంగా దీన్ని ఒక పండగలాగా జరుపుకోవాలి. జాతీయ అవార్డులు వచ్చినా కూడా మన సినీ పరిశ్రమ స్పందించలేదు. చిత్ర పరిశ్రమలో ఎవరి కుంపటి వాళ్లదే. ఇండస్ట్రీ స్పందించక ముందే 'సైమా' వారు స్పందించి, విజేతలను సత్కరించడం అభినందనీయం. 12 ఏళ్లుగా సైమా వేడుక నిర్వహిస్తున్న విష్ణు, బృందాకి అభినందనలు'' అని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. 'సైమా' 2025 (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) వేడుక సెప్టెంబరు 5, 6 తేదీల్లో దుబాయ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జాతీయ అవార్డు విజేతలైన దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి (భగవంత్ కేసరి), దర్శకుడు సాయి రాజేశ్, సింగర్ రోహిత్ (బేబీ), దర్శకుడు ప్రశాంత్ వర్మ, విజువల్ ఎఫెక్ట్స్ వెంకట్ (హనుమాన్)లను 'సైమా' సత్కరించింది. ''సైమా' కేవలం అవార్డు వేడుక కాదు. ప్రతిభని, సంస్కృతిని సెలబ్రేట్ చేసుకునే గ్లోబల్ స్టేజ్'' అని 'సైమా' చైర్ పర్సన్ బృందా పేర్కొన్నారు.

ఆపద్బాంధవుడు రెడీ


● పెంచల్ రెడ్డి, సుధాకర్ గౌడ్

పెంచల్ రెడ్డి, సుధాకర్ గౌడ్, ఝాన్సీ, ప్రతిమ, నాగేశ్వర రావు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఆపద్బాంధవుడు'. భీమగాని సుధాకర్ గౌడ్ రచన, దర్శకత్వం వహించారు. డి. లీలావతి, పెంచల్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం రిలీజ్‌కి రెడీ అవుతోంది. గురువారం నిర్వహించిన 'ఆపద్బాంధవుడు' సినిమా సమావేశంలో సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ– ''వ్యాపారం, కుటుంబం, సమాజ సేవ... ఈ మూడింటినీ సమన్వయం చేసుకుంటూ సేవా రత్నగా గుర్తింపు పొందిన పెంచల్ రెడ్డిగారి జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాను. ఈ చిత్రంలో ఆయన నటించారు... నేను ఆయన మిత్రుడి పాత్ర పోషించాను. సెప్టెంబరు 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. పెంచల్ రెడ్డి మాట్లాడుతూ– ''నా సంపాదనలో 50 శాతం విరాళాల రూపంలో సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాను. స్కూల్స్, కాలేజీలు, దేవాలయాలు, సీనియర్ సిటిజన్స్... ఇలా సహాయం చేస్తున్నాను'' అని తెలిపారు.

అడుగు అడుగునా...



● అబిద్ భూషణ్, రియా కపూర్

'రక్త కన్నీరు' సినిమా ఫేమ్, దివంగత నటుడు నాగభూషణం మనవడు అబిద్ భూషణ్, 'బిగ్ బాస్' ఫేమ్ రోహిత్ సహాని హీరోలుగా, రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మిస్ టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో జయ్ వల్లందాస్ నిర్మించారు. ఈ సినిమా నుంచి 'అడుగు అడుగునా...' అంటూ సాగే పాటని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం విడుదల చేశారు. ఈ పాటకి ఎంఎల్ రాజా సాహిత్యం అందించడంతో పాటు సంగీతం అందించారు. ఎంఎల్ఆర్ కార్తికేయన్ పాడారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ– ''అంకితభావంతో పని చేసే పోలీసు అధికారిపై చిత్రీకరించిన 'అడుగు అడుగునా...' పాట చాలా బాగుంది. సస్పెన్స్ థ్రిల్లర్‌ని కొత్త ఒరవడిలో చూపించే ప్రయత్నం చేసిన మహి కోమటిరెడ్డిని, అమెరికాలో స్థిరపడి కూడా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఈ సినిమాను నిర్మించిన జయ్ వల్లందాస్‌లను అభినందిస్తున్నాను. పోలీసుల నిబద్ధతని అద్భుతంగా రాసి, చక్కని సంగీతం అందించిన రాజాకి అభినందనలు'' అన్నారు.

సిల్వర్ స్క్రీన్ పై రియల్ హీరోస్


● ఫర్హాన్ అక్తర్


● సల్మాన్ ఖాన్


● ప్రభాస్


● వామికా, అడివి శేష్


● సన్నీ, వరుణ్ ధావన్

దేశం కోసం అమరులైన వీరులు ఎందరో ఉన్నారు. అందరి కథలు వెండితెరపైకి రాకపోవచ్చు. అయితే దేశభక్తిని చాటి చెప్పే, దేశభక్తి స్ఫూర్తిని నింపే సినిమాలు ఎప్పటికప్పుడు వెండితెరపైకి వస్తూనే ఉంటాయి... ప్రేక్షకుల్లో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందిస్తున్నాయి. కొందరు 'రియల్ హీరోస్' గాథలను గుర్తు చేస్తూనే ఉన్నాయి. అలా ప్రస్తుతం దేశభక్తిని చాటే కొన్ని సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశభక్తి నేపథ్యంలో రూపొందుతున్న కొన్ని చిత్రాల గురించి...

యుద్ధానికి కొత్త నిర్వచనం

'సీతారామం' సినిమాలో దేశభక్తి, ప్రేమ అంశాలను మిళితం చేసి, వెండితెరపై ప్రేక్షకులకు నచ్చేలా చూపించారు దర్శకుడు హను రాఘవపూడి. ఈ దర్శకుడు తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్). భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వం 1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని తెలిసింది. ఈ చిత్రంలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఆధిపత్యం కోసమే యుద్ధాలు జరిగే ఆ రోజుల్లో యుద్ధానికి కొత్త నిర్వచనం చెప్పే ఓ యోధుడి పాత్రగా ప్రభాస్ క్యారెక్టరైజేషన్ ఉంటుందని యూనిట్ పేర్కొంది. అలాగే స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హిందూ ఫౌజ్, రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యాలు కూడా ఈ చిత్రంలో ఉంటాయని టాక్. కొన్ని చారిత్రక అంశాలతో ముడిపడిన కల్పిత కథతో కూడిన ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో విడుదల కావొచ్చు.


బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్

దేశభక్తిని చాటి చెప్పే ఆర్మీ ఆఫీసర్‌గా నటిస్తున్నారు సల్మాన్ ఖాన్. 2020లో గాల్వాన్ లోయలో ఇండియా–చైనా సైనికుల మధ్య జరిగిన ఉద్రిక్త ఘర్షణల నేపథ్యంలో 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలోనే సల్మాన్ ఆర్మీ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ఇందుకోసం ఈ హీరో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రంలో చిత్రాంగదా సింగ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అపూర్వ లఖియా దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ పతాకంపై సల్మాన్ ఖాన్ ఈ దేశభక్తి సినిమాను నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్ సమాచారం.

మేజర్ షైతాన్ సింగ్

మేజర్ షైతాన్ సింగ్ భాటి జీవితం ఆధారంగా రూపొందిన పీరియాడికల్ వార్ డ్రామా '120 బహదూర్'. ఈ హిందీ చిత్రంలో సిల్వర్ స్క్రీన్‌పై షైతాన్ సింగ్‌గా ఫర్హాన్ అక్తర్ నటిస్తున్నారు. ఇందులో రాశీ ఖన్నా హీరోయిన్. రజనీష్ ఘాయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 1962లో జరిగిన ఇండియా–చైనా వార్‌లో ప్రధానంగా చెప్పుకునే 'రెజాంగ్ లా' యుద్ధం సంఘటనలు ప్రధాన ఇతివృత్తంతో '120 బహదూర్' సినిమా రూపొందుతోంది. దాదాపు 3 వేలమంది చైనా సైనికులను ఎదుర్కొని, 120 మంది భారతీయ సైనికులు ఎలా వీరోచితంగా పోరాడారు? అనే నేపథ్యంలో '120 బహదూర్' సినిమా ఉంటుంది. ఈ చిత్రం ఈ నవంబరు 21న విడుదల కానుంది.


● నిఖిల్


● రణ్‌దీప్ హుడా


● అగస్త్య నంద

రాజ్‌పాల్ పునియా

యునైటెడ్ నేషన్స్ పీస్ కీపింగ్ మిషన్‌లో భాగంగా వెస్ట్ ఆఫ్రికాకు వెళ్లిన 233 మంది భారతీయ సైనికులు అక్కడి రెబల్స్ ట్రాప్‌లో చిక్కుకున్నారు. దాదాపు 70 రోజులు ఎన్నో ఇబ్బందులు అనుభవించిన ఈ సైనికులను రెస్క్యూ చేసే ఆపరేషన్‌ను రాజ్‌పాల్ పునియా సక్సెస్‌ఫుల్‌గా లీడ్ చేశారు. పాతిక సంవత్సరాల క్రితం జరిగిన ఈ సంఘటనల నేపథ్యంలో 'ఆపరేషన్ ఖుక్రీ' సినిమా రానుంది. ఈ చిత్రంలో రాజ్‌పాల్ పునియాగా రణ్‌దీప్ హుడా నటిస్తారు. ఆపరేషన్ ఖుక్రీ: ది ట్రూ స్టోరీ బిహైండ్ ది ఇండియన్ ఆర్మీస్ మోస్ట్ సక్సెస్‌ఫుల్ మిషన్ యాజ్ పార్ట్ ఆఫ్ ది యునైటెడ్ నేషన్స్' బుక్ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ బుక్ హక్కులను రణ్‌దీప్ హుడా ఫిల్మ్స్, రాహుల్ మిత్రా ఫిల్మ్స్ దక్కించుకున్నాయి.

బోర్డర్‌లో వార్

భారతీయ సైనికుల వీరత్వం, వీరోచిత పోరాటం నేపథ్యంలో రూపొందుతున్న తాజా హిందీ చిత్రం 'బోర్డర్ 2'. ఈ సినిమాలో సన్నీ డియోల్ లీడ్ రోల్ చేయగా, వరుణ్ ధావన్, అహన్ శెట్టి, దిల్జీత్ సింగ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సన్నీ డియోల్, వరుణ్ ధావన్, అహాన్ శెట్టి భారత సైనికుల పాత్రల్లో నటించారు. ఈ వార్ డ్రామా వచ్చే ఏడాది జనవరి 23న విడుదల కానుంది. ఇక 1971లో ఇండియా – పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో రూపొందిన 'బోర్డర్' (1977) సినిమాకు సీక్వెల్‌గా 'బోర్డర్ 2' చిత్రం తెరకెక్కిందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.

గూఢచారి

అడివి శేష్ హీరోగా నటిస్తున్న స్పై డ్రామా 'జీ2' (గూఢచారి 2). వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలోని ఈ చిత్రంలో వామికా గబ్బి, ఇమ్రాన్ హష్మీ, మురళీ శర్మ, సుప్రియ యార్లగడ్డ, మధు శాలిని కీలక పాత్రల్లో చేస్తున్నారు. అడివి శేష్, వామిక ప్రధాన స్పై పాత్రల్లో నటిస్తున్నారు. అనిల్ సుంకర, టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మే 1న విడుదల కానుంది. అడివి శేష్ హీరోగా 2018లో విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచిన 'గూఢచారి'కి సీక్వెల్‌గా 'జీ2' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే.

ది ఇండియా హౌస్

దేశభక్తి నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'ది ఇండియా హౌస్'. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు 1905లో లండన్‌లో ఉన్న కొందరు భారత మేధావులు ఎలా సమావేశం అయ్యారు? భారతదేశానికి స్వాతంత్ర్యం రావాలనే కార్యాచరణకు ఎలాంటి వ్యూహాలు రచించారు? అనే అంశాల నేపథ్యంలో 'ది ఇండియా హౌస్' రూపొందుతోందని సమాచారం. అలాగే వీర్ సవార్కర్ జీవితంలోని కొన్ని సంఘటనలు ఈ సినిమాలో కనిపిస్తాయి. నిఖిల్ హీరోగా, సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా అనుపమ్ ఖేర్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. రామ్‌చరణ్ సమర్పణలో వి మెగా పిక్చర్స్, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ఇక్కీస్

పరమ వీర పురస్కారగ్రహీత అరుణ్ ఖేత్రపాల్ జీవితం ఆధారంగా హిందీలో 'ఇక్కీస్' అనే దేశభక్తి చిత్రం రానుంది. 1971లో జరిగిన భారత్–పాకిస్తాన్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి, అమరుడైన అరుణ్ ఖేత్రపాల్‌గా అగస్త్య నంద (అమితాబ్ బచ్చన్ మనవడు) నటిస్తున్నారు. ధర్మేంద్ర, జైదీప్ అహ్లావత్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 2న విడుదల కానుంది.

ఇలా దేశభక్తి నేపథ్యంలో సాగే మరికొన్ని చిత్రాలు ఉన్నాయి.

విజయీ విశ్వ తిరంగా ప్యారా..





కదలి కెరటానికి దీటుగా ఉవ్వెత్తున ఎగురుతోంది త్రివర్ణపతాకం..దేశ సమైక్యతకిది తలమానీకం అంటూ.. ఆ విజయధ్వజానికి వందనం చెబుతున్నారు భరత మాత ముద్దు బిడ్డలు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఊరూవాడా మువ్వన్నెల పతాకం మురిసిపోతోంది. విశాఖ నగర వీధుల్లో గురువారం సాయంత్రం చిన్న,పెద్ద అందరి చేతుల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





వెయ్యి మీటర్ల తిరంగా..



మార్కాపురం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలో దీక్షా యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తిరంగా ర్యాలీలో భాగంగా 1,000 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శనను సబ్‌కలెక్టర్ వెంకట సహదిత్ త్రివినాగ్ సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. యువతలో దేశభక్తి ఉండాలని పిలుపునిచ్చారు.

వందే మాతరం..!


1500 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



చంద్రగిరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థులు భారీ జాతీయ జెండాతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగలో భాగంగా సుమారు 1,500 అడుగుల భారీ జాతీయ జెండాతో చంద్రగిరి పురవీధుల్లో ర్యాలీగా తీసుకెళ్లారు. దేశ భక్తి నినాదాలతో ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించారు.ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకాని నిషేధించాలంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు.

ఒలుపులో వెరైటీలెన్నో!

- కొబ్బరి ఒలుపులో పదికి పైగా రకాలు
- పిలక, బొంబాయి సీలు, మూడు నామాలు, కసింగలు, పోర్‌పట్టా, బోరాలు
- రాష్ట్రాన్ని బట్టి ఒలుపు మారుతుందంటున్న కార్మికులు
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు
- జిల్లా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి



కాయలను ఒలుస్తున్న కార్మికుడు

సాక్షి, భీమవరం: కొబ్బరి కాయ ఒలవడం తేలికేనని తీసి పారేయకండి. దానికీ ఓ పద్ధతుంది. బొండాం, ముప్పేట, ముదర కాయ, కురిడీ అంటూ కాయల్లో రకాలున్నట్టే.. పిలక, బొంబాయి సీలు, కసింగలు, పోర్‌పట్టా, బోరాలు, మూడు నామాలు.. అంటూ ఒలుపుల్లోనూ పదికి పైనే వెరైటీలు ఉన్నాయి. ప్రాంతాన్ని బట్టి ఒలుపులు మారుతుంటాయి. ప్రస్తుతం రికార్డు ధరతో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి రోజుకు దాదాపు వంద లారీల కొబ్బరి కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడి అవసరాలకు తగ్గట్టు ఇక్కడి ఒలుపు కార్మికులు వడివడిగా కాయలను వలుస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సుమారు 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఆచంట, పాలకొల్లు, నరసాపురంలోని వశిష్ట గోదావరి, సముద్ర తీరం వెంబడి, భీమవరం, ఉండి, ఆకివీడు ప్రాంతాల్లోని ఆక్వా చెరువు గట్లు, తాడేపల్లిగూడెం, ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, తణుకు ప్రాంతాల్లో తోటలు సాగు చేస్తున్నారు. జిల్లా నుంచి రాజస్తాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, బీహార్, పంజాబ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి అవుతున్నాయి. తమిళనాడు, కేరళ తర్వాత మన కొబ్బరికి దేశ వ్యాప్తంగా గిరాకీ ఉన్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. తమిళనాడులో దిగుబడి తగ్గడంతో నెలన్నర రోజులుగా జిల్లా నుంచి ఎగుమతులకు డిమాండ్ ఏర్పడింది. మునుపెన్నడూ లేనివిధంగా రైతు ధర కాయకు రూ.18 నుంచి రూ.20 మధ్య నిలకడగా ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు వంద లారీల వరకు కాయలు ఎగుమతి అవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.

ఒలుపులో రకాలెన్నో..

హిందూ సంప్రదాయంలో కొబ్బరి కాయకు ఎంతో విశిష్టత ఉంది. పూజల్లో కొట్టడం నుంచి హోమాల్లో కాయ పళంగా వేయడం, దిష్టి, దిగదుడుపు తీయడం తదితర ప్రతి పనిలోనూ కొబ్బరి కాయ ఉండాల్సిందే. మన ప్రాంతంలో ముచ్చిక, పిలకతో ఒలిచిన వాటిని వినియోగించినట్టే ఇతర ప్రాంతాల్లో వివిధ రూపాల్లో ఒలిచిన కాయలను వాడుతుంటారు. ఈ మేరకు జిల్లా నుంచి ఎగుమతులు జరిగే రాష్ట్రాల్లోని అవసరాలకు తగ్గట్టు కాయలను ఒలుస్తుంటారు. వీటిలో పిలక, బొంబాయి సీలు, రాయపూర్ సీలు, మూడు నామాలు, కసింగలు, బోరాలు, బెల్ట్ పోర్ పట్టా, బెల్ట్ లెస్ పోర్‌పట్టా, ఐదు పేళ్లు, ఆరు పేళ్లు, ఎనిమిది పేళ్లు తదితర పదికి పైనే ఒలుపుల్లో రకాలున్నాయి. ఎగుమతి అయ్యే ప్రాంతంలో ఆయా ఒలుపులకు ఏ పేర్లున్నా కానీ స్థానికంగా తాము ఈ విధంగా పిలుచుకుంటామని వ్యాపారులు, ఒలుపు కార్మికులు అంటున్నారు.

రాయపూర్ సీలును కాయ వెనుక నుంచి మూడు పేళ్లుగా ఒలిస్తే, కసింగలను ముందు నుంచి మూడు, వెనుక నుంచి మూడు పేడులుగా కాయపైన పీచు ఉంచి డొక్కను ఒలుస్తారు. బెల్టు పోర్‌పట్టా కోసం కాయకు నాలుగు వైపులా మధ్యలో అరంగుల డొక్క ఉంచి మిగిలిన దానిని తీసివేస్తారు. బెల్టు లెస్ కోసం నాలుగు వైపులా స్క్వేర్ ఆకారంలో పీచు ఉండేలా డొక్కను ఒలుస్తారు. అదేమాదిరి ఐదు పేళ్లు, ఆరు పేళ్లు, ఎనిమిది పేళ్ల సంఖ్యను బట్టి అన్ని పేళ్లుగా పైడొక్కను తొలగిస్తారు. మూడు నామాల కోసం కాయకు మూడు వైపులా అంగుళం వెడల్పున పీచు ఉంచి మిగిలిన డొక్కను పీచు సహా తీసేస్తారు. బొంబాయి సీలు కోసం కాయకు సగ భాగం పూర్తిగా పీచును ఒలిచేసి మిగిలిన సగ భాగం ఉంచేస్తారు. ఇలా వివిధ రకాలుగా కాయలను ఒలుస్తుంటారు.



బొంబాయి సీలు



ఎనిమిది పేళ్లు



మూడు నామాలు



పోర్‌పట్టా



పిలక కాయ

ఏ ఒలుపు ఎక్కడికి..

బెల్ట్‌లెస్ పోర్‌పట్టా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి జరిగితే బోరాలు యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు, ఆరు పేళ్ల యూపీ, కర్ణాటక, రాయపూర్ సీలు, ఐదు పేళ్ల మహారాష్ట్రకు, పిలకలు ముంబయి, బిహార్‌కు, మూడు నామాలు మహారాష్ట్రకు, కసింగలు అన్ని ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో చాలా వరకు కొట్టకుండా వీటిని నేరుగా హోమాల్లో వేస్తారన్నారు. కాయపళంగా కన్నా ఒలిపించడం వల్ల బరువు తగ్గి ఎక్కువ కాయలు తీసుకువెళ్లే వీలుంటుందని అక్కడి అవసరాలకు తగ్గట్టు ఇక్కడే ఒలిపించుకుని తీసుకువెళతారని అంటున్నారు. కావాల్సిన ఆకారంలో వేగంగా కాయలు ఒలవడం అనుభవంతో కూడిన పని. ఒక్కో కాయ ఒలుపునకు రూ.1.50 చొప్పున ఇస్తారు. రోజుకు ఒక్కో కార్మికుడు 800 నుంచి 1000 కాయలను ఒలుస్తుంటారు.

గండీర.. గటగట

ఉత్తరాది రాష్ట్రాల్లో కురిడీ కొబ్బరి ఆహారంలోనూ భాగంగా ఉంటుంది. ఇవి ఎక్కువగా రాజస్తాన్, మధ్యప్రదేశ్‌కు వెళుతుంటాయి. బాగా తయారైన కాయలను ఎంపిక చేసి ఎనిమిది పేళ్లుగా ఒలుస్తారు. గోదాముల్లో గాలి తగిలేలా అరలు కట్టి కాయలను నిల్వ చేస్తారు. ఆరు నెలలకు లోపలి నీరు పూర్తిగా ఇంకిపోయి గుడ్డు మాత్రమే ఉంటుంది. మొదట్లో 600 గ్రాముల నుంచి 700 గ్రాములు ఉన్న కాయ బరువు కురిడీ అయ్యేసరికి 80 గ్రా. నుంచి 100 గ్రా.కు తగ్గిపోతుంది. నాణ్యమైన గండీర, సెకండ్ క్వాలిటీని గటగటగా పిలుస్తుంటారు. గండీరకు రూ.30 ఉండగా గటగటకు రూ.28 ధర ఉన్నట్టు చెబుతున్నారు.

అవసరాన్ని బట్టి ఒలుపు



ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఒలిచిన కాయలను వినియోగిస్తుంటారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్డరు మేరకు వారికి అవసరమైన రీతిలో ఒలిపించి ఎగుమతి చేస్తుంటాం. తమిళనాడులో దిగుబడులు తగ్గడంతో ప్రస్తుతం జిల్లా నుంచి ఎగుమతులు బాగున్నాయి. రైతులకు రికార్డు ధర వస్తోంది.

– కాసా సత్యనారాయణ, వ్యాపారి, యలమంచిలి, పశ్చిమగోదావరి జిల్లా

నాలుగు దశాబ్దాల అనుభవం



నలభై ఏళ్లుగా ఒలుపు పని చేస్తున్నాను. ఒక్కో ప్రాంతం నుంచి వచ్చిన వారు ఒక్కో విధంగా ఒలవమని చెబుతుంటారు. ఏ రకంగా ఒలవాలన్నా దాదాపు ఒకే సమయం పడుతుంటుంది. ప్రస్తుతం సీజన్ కావడం వల్ల పని ఎక్కువగా ఉంది.

– కొడవటి ఎర్రియ్య, ఒలుపు కార్మికుడు, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా

మన పండు బ్రహ్మోండం!







ఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో బ్రహ్మజెముడు మొక్క

డ్రాగన్ ఫ్రూట్. ఇటీవల కాలంలో విచ్చలవిడిగా లభిస్తున్న పండు. ఇదివరలో చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నా.. ఇప్పుడు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విరివిగా సాగవుతోంది. అయితే ఇంతకు వెయ్యి రెట్లు బీ12, ఏ, సీ విటమిన్లు లభించే మొక్క మన దేశంలోనే ఉన్న బ్రహ్మజెముడు(పాపిచ్చి కాయ)ను విస్మరిస్తున్నాం. చైనాకు, మన పండుకు ఉన్నా తేడా ఒక్క ముళ్ల మాత్రమే. కేవలం ఈ ఒక్క కారణంతో ముళ్లు తీసుకునే సమయం లేక చైనా పండ్లను ప్రోత్సహిస్తున్నాం. పైగా ఈ పండ్లు గ్రామీణ ప్రాంతాల్లోని కొండ ప్రాంతాల్లో ఎవరూ పెంచకుండానే మొండిగా బతికేస్తుంది. అయితే చైనా పండు(డ్రాగన్ ఫ్రూట్)ను మాత్రం కేజీ రూ.100 చొప్పున కొనుగోలు చేస్తున్నాం. ఇక్కడే ఫ్రీగా లభిస్తున్న, డ్రాగన్ ఫ్రూట్‌ను మించి పోషకాలను అందిస్తున్న మన బ్రహ్మజెముడును పట్టించుకోకపోవడం గమనార్హం. కార్పొరేట్, కాంక్రీట్ జంగిల్స్‌లో విద్యను అభ్యసిస్తున్న పిల్లలకు వీటి గురించి అవగాహన లేకపోయినా.. గ్రామీణ ప్రాంతాల్లో సర్కారు పాఠశాలల్లో చదివే పిల్లలకు ఈ పాపాసికాయలు తెలియనివి కావు. పండును బండరాయికేసి రుద్దితే ముళ్లు విరిగిపోతాయి, ఆ తర్వాత తోలు తీసి గుజ్జును తినేయడమే. చివరగా వచ్చే విత్తనాలను మాత్రం పడేయటం విస్మరించొద్దు. ఈ పండ్లు తిన్నామంటే ఇట్టే గర్తుపట్టేయొచ్చు. చేతులు, నాలుక కొద్ది సమయం వరకు ఎరుపు, గులాబి రంగులోకి మారిపోవడం చూస్తే పాపాసికాయలు తిన్నావా అని అడగాల్సిందే. ఔషధ గుణాలు కలిగిన బ్రహ్మజెముడు పండ్లతో కాలేయ, క్యాన్సర్ వ్యాధులను సైతం నయం చేస్తోంది. అంతేకాదు.. స్థూలకాయం, మధుమేహం, గ్యాస్ట్రిక్ సమస్యలను కూడా తగ్గించే గుణం ఉండటం విశేషం.



– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కర్నూలులో కేజీ రూ.100 చొప్పున విక్రయిస్తున్న డ్రాగన్ ఫ్రూట్

ఇండస్ట్రియల్ 'కారిడార్'లు ఏమాయే?

- పెండింగ్‌లోనే హైదరాబాద్ టు వరంగల్.. మహారాష్ట్ర వరకు 235 కి.మీ.ల ప్రతిపాదన
- 2024లో రూ.28,602 కోట్ల పెట్టుబడులతో 11 కారిడార్ల మంజూరు
- అందులో తెలంగాణను వరించిన మూడు కారిడార్‌లు
- హెచ్‌డబ్ల్యూఐసీకి ముందుకు పడని అడుగులు
- రవాణా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై ఆశలు



సాక్షి ప్రతినిధి, వరంగల్: హైదరాబాద్–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌డబ్ల్యూఐసీ) పూర్తికి అడుగులు ముందుకు పడటం లేదు. ఎన్‌హెచ్–163 వెంబడి హైదరాబాద్, వరంగల్ మధ్య ఒక ముఖ్యమైన ప్రాజెక్టుగా ఈ కారిడార్‌ను ప్రతిపాదించారు. ఇది తెలంగాణలో రెండు ముఖ్యమైన ఆర్థిక కేంద్రాలను కలిపి పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేస్తుందన్న అంచనాతో శ్రీకారం చుట్టారు. ఈ కారిడార్ తెలంగాణతోపాటు మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలను కూడా ప్రభావితం చేసేలా 235 కి.మీ.ల పొడవున రూపొందించారు. పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను కల్పించడంతోపాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కారిడార్ లక్ష్యం. కాగా హైదరాబాద్, వరంగల్ మధ్య వేగవంతమైన కనెక్టివిటీని అందించడం ద్వారా హెచ్‌డబ్ల్యూఐసీ రెండు నగరాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను పెంచడం.. సమర్థవంతమైన పారిశ్రామిక పునాదిని నిర్మించడాన్ని సులభతరం చేస్తుందని ప్రతిపాదించారు.

11 కారిడార్‌లకు పచ్చజెండా..

భారత పట్టణ–పారిశ్రామికాభివృద్ధి ఉజ్వల భవిష్యత్తుకు ఉద్దేశించిన జాతీయ పారిశ్రామిక కారిడార్ నిర్మాణ కార్యక్రమం (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్–ఎన్ఐసీడీపీ)కు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఈ భవిష్యత్‌పారిశ్రామిక కూడళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించడం ద్వారా అంతర్జాతీయ అగ్రశ్రేణి తయారీ, పెట్టుబడి గమ్యాలకు దీటుగా భారత్‌ను ప్రపంచంలో అగ్రస్థానాన నిలపాలన్నది ప్రభుత్వ సంకల్పం. తయారీ రంగంలో వృద్ధిని వేగిరపరచడం, క్రమబద్ధ పట్టణీకరణను ప్రోత్సహించడమే సమీకృత పారిశ్రామిక కారిడార్ల నిర్మాణ వ్యూహంలో ప్రధానాంశాలు. బలమైన బహుళ రవాణా సదుపాయాలతో అనుసంధానిస్తూ రూపొందే ఈ కారిడార్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వాల అంగీకారం కూడా తీసుకున్నారు. దీంతో 2020, ఫిబ్రవరిలో 'డీఎంఐసీడీసీ'పేరును నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఐసీడీసీ)గా మార్చి రూ.28,602 కోట్ల పెట్టుబడులతో 11 కారిడార్లను మంజూరు చేశారు. అందులో తెలంగాణను మూడు వరించాయి.

ఇండస్ట్రియల్ కారిడార్‌లు వస్తే అభివృద్ధి



ఇండస్ట్రియల్ కారిడార్‌లు వస్తే రాష్ట్రంలో ఊహించని అభివృద్ధి జరుగుతుంది. జూలై 22న తెలంగాణలో పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి సంబంధించిన పురోగతిపై పార్లమెంట్‌లో క్వశ్చన్ అడిగాను. ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం ద్వారా వ్యూహాత్మక ప్రణాళికను అమలు చేస్తూ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ చెప్పారు. దీంతో పారిశ్రామిక కారిడార్లను వెంటనే ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి సహకరించాలని కోరాను.

– డాక్టర్ కడియం కావ్య, ఎంపీ, వరంగల్

11 జాతీయ పారిశ్రామిక కారిడార్లు ఇవే..

2024, ఆగస్టు 30న రూ.28,602 కోట్లతో 11 జాతీయ పారిశ్రామిక కారిడార్లను ప్రకటించగా.. అందులో మూడు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచే ఉన్నాయి. అందులో ఒకటి హైదరాబాద్–నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్ఎన్ఐసీ), రెండోది హైదరాబాద్–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌డబ్ల్యూఐసీ) కాగా, మూడోది హైదరాబాద్–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ). అలాగే ఢిల్లీ–ముంబై (డీఎంఐసీ), అమృత్‌సర్–కోల్‌కతా ఇండస్ట్రియల్ కారిడార్ (ఏకెఐసీ), చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ), విశాఖపట్నం–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ), బెంగళూరు–ముంబై ఇండస్ట్రియల్ కారిడార్ (బీఎంఐసీ), ఒడిశా ఎకనమిక్ కారిడార్ (ఒఇసీ), కోయంబత్తూర్ మీదుగా కొచ్చి వరకు 'సీబీఐసీ'పొడిగింపుతో పాటు ఢిల్లీ–నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ (డీఎన్ఐసీ)లకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

మైసూరు ఇండస్ట్రియల్ కారిడార్ తరహాలో..

హైదరాబాద్ నుంచి వరంగల్ ద్వారా జగదల్‌పూర్ వరకు 163వ నంబరు జాతీయ రహదారిని రూ.1,905 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లేన్ల రహదారిగా విస్తరించారు. మరోవైపు ఎన్ఐటీతో సహా పలు సాంకేతిక, వృత్తి విద్యా సంస్థలకు వరంగల్ నగరం కేంద్రంగా ఉండటంతో ఐటీ రంగం అభివృద్ధికి అనువైన వాతావరణం ఉందని ఐటీ సంస్థలు భావిస్తున్నాయి. భవిష్యత్తులో ఇక్కడ రూ.11,586 కోట్లతో ఏర్పాటయ్యే మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా 1.13 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా ఉంది. దీంతో తెలంగాణలో హైదరాబాద్ తర్వాత పెద్దనగరం వరంగల్‌ను బెంగళూరు మైసూరు శాటిలైట్ ఇండస్ట్రియల్ కారిడార్ తరహాలో హైదరాబాద్–వరంగల్ కారిడార్‌ను తీర్చిదిద్దాలని గత రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీని కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ (హెచ్‌పీసీ)కి నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్టు (ఎన్ఐసీడీఐటీ) ద్వారా మౌలిక సదుపాయాల కోసం రూ.3,418 కోట్లు గ్రాంటుగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అప్పటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ గతేడాది అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఐటీ క్లస్టర్ల మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిన తర్వాత కారిడార్ అభివృద్ధి పనులు మరింత వేగం పుంజుకుంటాయని పారిశ్రామిక వర్గాలు చెబుతున్నాయి.

బిహార్‌లో ఓటమిని కాంగ్రెస్ అంగీకరించింది

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సాక్షి, హైదరాబాద్: బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ ఓటమిని ఎన్నికలకు ముందే అంగీకరించిందని బీజేపీ పార్లమెంటు సభ్యుడు రఘునందర్‌రావు అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈవీఎంలను వ్యతిరేకిస్తున్న రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీ ఎంపీకి రాజీనామా చేయాలని, ఆ తర్వాత బైఎలక్షన్‌లో బ్యాలెట్ ద్వారా గెలిచి చూపించాలని సవాల్ చేశారు. రాయ్‌బరేలిలో 71 వేల నకిలీ ఓట్లు ఉన్నాయని, వయనాడ్‌లో 93,499 మంది ఒకే సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ప్రియాంక గాంధీకి ఓటు వేశారని చెప్పారు. అభిషేక్ బెనర్జీ, అఖిలేష్ యాదవ్, ఆయన సతీమణి గెలిచిన నియోజకవర్గాల్లో దొంగ ఓట్లను కనుగొనే పనిలో ఉన్నామన్నారు. ఈవీఎంలపై నమ్మకం లేకుంటే తెలంగాణలో బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు పెట్టాలని ఆయన సూచించారు. బంగ్లా చొరబాటుదారులను ఆపాలంటే బోర్డర్‌లో గోడ కట్టాలని, బెంగాల్‌లో దీదీని గద్దె దించి బీజేపీ అధికారంలోకి వచ్చాక గోడ కడతామన్నారు. లోక్‌సభలో హోంమంత్రి అమిత్ షా ఈ విషయాన్ని చెప్పారన్నారు. ఎమ్మెల్సీ రద్దు తీర్పు బీజేపీకి చెంపపెట్టు అని కేటీఆర్ వ్యాఖ్యానించడాన్ని రఘునందన్ తప్పుబట్టారు.

సుప్రీంకోర్టు తీర్పుతో ఓట్ చోరీ నిజమేనని తేలింది

మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లేవనెత్తిన 'ఓట్ చోరీ'అంశం సుప్రీంకోర్టు తీర్పుతో నిజమేనని రుజువైందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బిహార్‌లో తొలగించిన 65 లక్షల ఓట్లను వెబ్‌సైట్‌లో పెట్టాలని, వాటిని తొలగించడానికి గల కారణాలను తెలియజేయాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించడంతో రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశం న్యాయమైనదేనని దేశ ప్రజలకు అర్థమైందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే నూతన ఓటరును నమోదు చేస్తే ఆధార్ కార్డు తప్పనిసరి చేయాలని, అసలు ఓటరు నమోదు విధానాన్ని ఏ విధంగా చేస్తున్నారో చెప్పాలని కూడా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించిందన్నారు. కేంద్రం ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, అక్రమంగా ఓట్లను ఎలా తొలగించి, దొంగిలిస్తుందో ప్రజలు గమనించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆధార్ కార్డుతో ఓటును లింక్ చేసి.. 'ఒక ఓటు – ఒక మనిషి'అనే విధానాన్ని తీసుకురావాలని రాహుల్ గాంధీ చేసిన డిమాండ్‌కు అనుగుణంగా ఎన్నికల కమిషన్ స్పందించాలని పొన్నం పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఓట్ల చోరీ అంశంపై రాహుల్ గాంధీ రెండు వారాలుగా పార్లమెంటులో చర్చ కోసం పట్టుపడుతుంటే స్పీకర్ సభను వాయిదా వేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు దోహదపడ్డాయని, ఈ ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన సుప్రీంకోర్టు తీర్పుపై స్పందిస్తూ స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివ్యూ పేరుతో భారత ఎన్నికల సంఘం చేస్తున్న దారుణాలను కాంగ్రెస్ కూటమి, రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఎన్నికల సంఘం ఒకవేళ 65 లక్షల ఓటర్లను తొలిగించినట్లయితే ఎందుకు తీసేస్తున్నారో.. ఆ వివరాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొనడం గొప్ప విషయమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం ఒక కీలకమైన విభాగమని, రాజ్యాంగబద్ధంగా పని చేయాల్సిన ఈ సంస్థ ప్రలోభాలకు లోనైతే తీరని నష్టం వాటిల్లుతుందని అన్నారు. పౌరసత్వం, మతం పేరున ఎన్నికల సంఘం ఓటర్లను తొలిగించలేదని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలో చనిపోయిన వారిని బతికున్నట్లు, బతికున్న వారు చనిపోయినట్లు తప్పుల తడకలుగా చూపారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం అందరిపై ఉందని అన్నారు.

కబేళాల మూసివేతపై జోక్యం చేసుకోలేం

– హైకోర్టు స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం, శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని బీఫ్‌షాపులు, కబేళాలు మూసివేయాలన్న ఉత్తర్వులపై జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. పిటిషనర్ బీఫ్ అమ్మే వ్యక్తి కానందున స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఆగస్టు 15, 16న బీఫ్ దుకాణాలు, కబేళాలు మూసివేయాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేశారని, ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అంటూ తార్నాకకు చెందిన వడ్ల శ్రీకాంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. బీఫ్ షాపులను మాత్రమే మూసివేస్తే అది వివక్షకు దారితీస్తుందని, జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 533(బీ) ప్రకారం చెల్లుబాటయ్యే బలమైన కారణం లేకుండా వ్యాపారాలను మూసివేయడానికి కమిషనర్‌కు అధికారం లేదన్నారు. అకస్మాత్తుగా మూసివేస్తే వ్యాపారుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. పిటిషనర్ వ్యాపారి కాదని, వినియోగదారుడు మాత్రమేనన్నారు. 'మాంసం తినడం లేదా మద్యం సేవించడంపై ఎటువంటి నిషేధం లేదు. మీరు తినాలనుకుంటే, ఇప్పుడే వెళ్లి, మీకు కావాల్సింది కొనుక్కోండి. దానిని డీప్ ఫ్రీజర్‌లో భద్రపరుచుకోండి. రేపు, ఎల్లుండి దాన్ని ఉపయోగించండి' అని వ్యాఖ్యానించారు. ఇలాంటి అంశాలపై కావాలంటే పిల్ వేసుకోవచ్చని చెప్పారు. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేశారు.

వాహనాల లైఫ్ టాక్స్ పెంపు ప్రజల నడ్డి విరవడమే

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: వాహనాల లైఫ్ టాక్స్ పెంచడం అంటే.. పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరవడమే అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పన్నుల భారం వేసి పేద ప్రజల రక్తం పీల్చాలని చూస్తోందని గురువారం ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆదాయం సమకూర్చుకోవడంలో కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉందని డిప్యూటీ సీఎం భట్టి చెప్పిన మాటలను సీఎం రేవంత్ రెడ్డి ఈ రకంగా నిజం చేసి చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. జీవో 53, 54 లతో కొత్త వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంచి ప్రజలను దొంగ దెబ్బ కొట్టారన్నారు. ఈ రోజుల్లో ఏ ద్విచక్ర వాహనం కొనుగోలు చేసినా లక్ష దాటి ఉంటుందని, రైతులు, చిరు వ్యాపారులు ద్విచక్ర వాహనాలను వృత్తి, ఉపాధిపరంగా కొనుగోలు చేస్తుంటారని, లక్ష దాటిన ద్విచక్ర వాహనాలపై లైఫ్ టాక్స్ ను 12శాతం నుంచి 15శాతానికి పెంచడం దుర్మార్గమని అన్నారు. అదే విధంగా రూ.10 లక్షలు లేనిదే కారు రాని పరిస్థితి ఉందని, 10–20 లక్షల కారు కొంటే 17 శాతంగా ఉన్న పన్ను శాతాన్ని 18 శాతానికి పెంచడంతో దాదాపు రూ. 20 వేల అధిక భారం కొనుగోలుదారులపై కాంగ్రెస్ ప్రభుత్వం వేసిందని మండిపడ్డారు.

బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షం

జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు, మేధావులను ఈ సమావేశంలో భాగస్వామ్యం చేయాలని, ఈ సమావేశం తర్వాతే రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం ముందుకు వెళ్లాలని ఆయన ఒక ప్రకటనలో సూచించారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయని, అయితే పార్లమెంటులో చట్టం చేసే విషయంలో బీజేపీ ద్వంద్వ విధానం అనుసరిస్తోందని ఆయన అన్నారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారనే తప్పుడు ప్రచారంతో బీసీ వర్గాల్లో తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వైఖరిని ప్రజల్లో ఎండగట్టాలన్నారు. ఈనెల 18న జరిగే కేబినెట్ సమావేశంలో స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటారంటూ జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు.

కేంద్రంలో రైతు శత్రు ప్రభుత్వం: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో ఉన్నది రైతుమిత్ర ప్రభుత్వం కాదని, రైతు శత్రు ప్రభుత్వమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రాష్ట్రానికి కేటాయించిన మేరకైనా యూరియా సరఫరా చేయాలని మూడు నెలలుగా కేంద్రాన్ని కోరుతున్నప్పటికీ, ప్రతి నెలా కోత విధిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నదని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఒకవైపు యూరియా ఇవ్వకుండా కేంద్రం రైతులను వేధిస్తుంటే, దేశంలో ఏ రాష్ట్రంలోను యూరియా కొరత లేదని, రాష్ట్ర ప్రభుత్వమే కృత్రిమ కొరత సృష్టిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వ్యాఖ్యానించడం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కేంద్రం ఎంత యూరియా కేటాయించింది, ఎంత సరఫరా చేసిందనే వాస్తవాలను రామచంద్రరావు ముందుగా తెలుసుకోవాలని ఆయన సూచించారు. కేవలం తెలంగాణలోనే కాదు, పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కూడా యూరియా కొరత ఉందని తెలిపారు. ఇలాంటి ఆరోపణలు తెలంగాణ బీజేపీకి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియచేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ నెల నుంచి ఆగస్టు వరకు ఏయే నెలలో ఎంత యూరియా కేటాయించి, ఎంత సరఫరా చేసిందనే వివరాలను మంత్రి వెల్లడించారు.

బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల డంప్

భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం



డంప్‌లోని ఆయుధాలు, మందుగుండు సామగ్రితో బలగాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను పోలీసు బలగాలు గుర్తించాయి. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా.. గురువారం బీజాపూర్ జిల్లా కోమటిపల్లి అడవుల్లో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమాన అటవీ ప్రాంతంలో గుట్టల్లో భారీ డంప్‌ను గుర్తించారు. ఆపై డంప్‌ను వెలికితీయగా.. పెద్దఎత్తున తుపాకులు, రాకెట్ లాంచర్లు, మందుపాతరలు బయటపడ్డాయి. ఉడతమల్ల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు నిర్మించిన స్మారక స్థూపాన్ని సైతం బలగాలు కూల్చివేశాయి. ఈ ఆపరేషన్‌లో డీఆర్‌జీ బలగాలతో పాటు సీఆర్‌పీఎఫ్ 170, 203, 208, 228 విభాగాల బలగాలు పాల్గొన్నాయి.

బిహార్ ఓట్లపై సుప్రీం తీర్పు భేష్: మహేశ్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సంఘం విడుదల చేసిన బిహార్ ఓటర్ల జాబితాపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి గొప్ప విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను 48 గంటల్లో వెబ్‌సైట్‌లో ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం ప్రజాస్వామ్య విజయమన్నారు. రాహుల్ గాంధీ లేవనెత్తిన ఓటు చోరీ ఆరోపణలు సుప్రీంకోర్టు తీర్పుతో రుజువైనట్లేనని పేర్కొన్నారు.

తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్న కేంద్రం

చొప్పదండి ఎమ్మెల్యే సత్యం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీరని అన్యాయం చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని చూస్తే.. కేంద్రానికి కడుపు మంట, కళ్ల మంట ఉన్నట్లు అనిపిస్తోందన్నారు. ఆయన గురువారం సీఎల్‌పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న తెలంగాణను అడ్డుకోవడమే బీజేపీ లక్ష్యంగా మారిందన్నారు. గుజరాత్, బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే తెలంగాణ ఎదిగిపోతుందన్న భయం వారిలో కనిపిస్తోందన్నారు. అందుకే తెలంగాణకు న్యాయంగా రావలసిన నిధులు, రైతులకు యూరియా ఇవ్వడం లేదని విమర్శించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ కోసం 18 నెలలుగా తమ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నా.. తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్ సమర్పించి ప్రధానిని కలిసి విజ్ఞప్తి చేసినా.. పైసా మంజూరు చేయడం లేదని మండిపడ్డారు.

చిన్న కాంట్రాక్టర్ల బిల్లులు విడుదల చేయండి

ముఖ్యమంత్రికి మండలి ఛైర్మన్ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన సీఎంకు లేఖ రాశారు. బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తనని కలసి వారి పరిస్థితిని వివరించారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మన ఊరు– మన బడి కార్యక్రమం కింద రూ. 361.35 కోట్ల సివిల్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ మేరకు వెంటనే బిల్లులు విడుదల చేసి చిన్న కాంట్రాక్టర్లను ఆదుకోవాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణా జాగృతిలో సంస్థాగత నియామకాలు


నూతన బాధ్యులు వీరే...



ఆర్గనైజింగ్ సెక్రెటరీ: దూగుంట్ల నరేష్ ప్రజాపతి, అధికార ప్రతినిధి: నలమాస శ్రీకాంత్‌గౌడ్, ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు: లోకిని రాజు, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు: ఇత్తరి మారయ్య, ఉపాధ్యక్షుడు: ఈగ సంతోష్ ముదిరాజ్, తెలంగాణ జాగృతి ఎంబీసీ, సంచార జాతుల విభాగం అధ్యక్షుడు: రాచమల్ల బాలకృష్ణ, సింగరేణి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు: ఎల్.వెంకటేష్, తెలంగాణ జాగృతి మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు: మేక లలితయాదవ్, తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు: కంచర్ల శివారెడ్డి, ఉపాధ్యక్షులు: అల్వాల జితేందర్ ప్రజాపతి, భూక్యా రవి రాథోడ్, పాలె నిషా లెనిన్, కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్, తెలంగాణ జాగృతి విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు: మునుకుంట్ల నవీన్‌గౌడ్, సాహిత్య జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు: కాంచనపల్లి గోవర్ధన్‌రాజు, రైతు జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు: మంథని నవీన్‌రెడ్డి, ఐటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు: శ్రీధర్ గుండెబోయిన, రాష్ట్ర ఉపాధ్యక్షులు: హరికృష్ణ బ్రహ్మండభేరి, ముస్లిం విభాగం రాష్ట్ర అధ్యక్షుడు: మహమ్మద్ ముస్తఫా, క్రిస్టియన్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు: జి.డేవిడ్, ఆటో జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు: మహమ్మద్ అబ్దుల్ సలీం.

రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి రఘునందన్‌కు లేదు

అద్దంకి దయాకర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ సహకారంతో చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా మెదక్ ఎంపీ అయిన రఘునందన్‌రావుకు రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. హరీశ్‌రావుతో ఒప్పందం చేసుకుని ఎంపీ అయిన రఘునందన్‌రావుకు రాహుల్ గాంధీకి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని వ్యాఖ్యానించారు. పెద్దవాళ్లపైన మాట్లాడితే పెద్దవాడిని అయిపోతానని రఘునందన్ అనుకుంటున్నాడని, కానీ బీజేపీలోనే ఆయనకు విలువ లేదని విమర్శించారు. ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నిస్తుంటే రఘునందన్‌రావు ఎందుకు ఉలిక్కి పడుతున్నారని ప్రశ్నించారు. ఓట్ల జాబితాలో ఉన్న చిత్ర విచిత్రాలను రాహుల్ గాంధీ బయటపెడుతున్నారని అన్నారు. చనిపోయిన వాళ్లతో టీ తాగే అద్భుత అవకాశం ఈసీ రాహుల్ గాంధీకి ఇచ్చిందని, చనిపోయిన వాళ్లు ఏకంగా సుప్రీంకోర్టులో ప్రత్యక్షమవుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ బండారం బయటపడుతుందనే రాహుల్‌గాంధీని విమర్శిస్తు)న్నారని అద్దంకి ధ్వజమెత్తారు.

సూపర్ సెప్టెంబర్



● అనుష్క
● రష్మిక

సెప్టెంబర్ నెల సినిమా లవర్స్‌కి సూపర్ అనే చెప్పాలి. ఎందుకంటే చాలా సినిమాలు విడుదలవుతున్నాయి. ప్రతి నెలా విడుదలవుతాయి కానీ పెద్ద సినిమాలు రెండో మూడో ఉంటాయి. అయితే సెప్టెంబర్‌లో విడుదలయ్యేవాటిలో పెద్ద సినిమాల సంఖ్య మెండుగానే ఉంది. ఆ సినిమాల గురించి తెలుసుకుందాం.

యాక్షన్ డ్రామా...

'అరుంధతి, పంచాక్షరి, భాగమతి, నిశ్శబ్దం' వంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాల తర్వాత అనుష్క లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'ఘాటీ'. 'వేదం' (2010) వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క, డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రమిది. విక్రమ్ ప్రభు, జగపతిబాబు, చైతన్యా రావు, రవీంద్రన్ విజయ్ ఇతర పాత్రలు పోషించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. పలుమార్లు విడుదల వాయిదా పడిన ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 5న తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ''మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రం 'ఘాటీ'. ఒక బలహీన మహిళ క్రిమినల్‌గా, ఆ తర్వాత లెజెండ్‌గా మారే పాత్రలో అనుష్క నటన అద్భుతంగా ఉంటుంది. అధిక బడ్జెట్‌తో, అత్యున్నత స్థాయి సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో మా సినిమా రూపొందింది. ఇటీవల విడుదలైన ట్రైలర్ మా మూవీపై అంచనాలు పెంచింది'' అని చిత్రయూనిట్ తెలిపింది.



● తేజ సజ్జా

సూపర్ యోధ...

'హనుమాన్' (2024) చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో హిట్ అందుకున్న తేజ సజ్జా హీరోగా నటించిన తాజా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రితికా నాయక్ కథానాయికగా నటించిన ఈ సినిమాలో మంచు మనోజ్ విలన్ పాత్ర పోషించారు. జగపతిబాబు, శ్రియ శరణ్, జయరామ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా 2డీ, 3డీ ఫార్మాట్లలో 8 భాషల్లో విడుదల కానుంది. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన ఫ్యాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాలో తేజ సూపర్ యోధగా కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, వీడియో గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. గౌర హరి సంగీతం అందించిన ఈ సినిమా నుంచి ఇటీవల విడుదల చేసిన 'వైబ్ ఉంది బేబీ..' పాట ట్రెండింగ్‌గా మారింది. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత తేజ సజ్జా నటించిన 'మిరాయ్' పై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఇక ఈ సినిమా హిందీ థియేట్రికల్ హక్కులను కరణ్ జోహార్ దక్కించుకున్నారు.

అందమైన ప్రేమకథ

ఓ వైపు హీరోయిన్‌గా బిజీ బిజీగా వరుస ప్రాజెక్టులతో దూసుకెళుతూనే మరోవైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలకీ సై అంటున్నారు రష్మికా మందన్న. ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన తాజా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి లీడ్ రోల్‌లో నటించారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. ఈ సినిమా సెప్టెంబర్ 5న విడుదల కానుంది. ''అందమైన ప్రేమకథగా ఈ చిత్రం రూపొందింది. మనసుని ఆకట్టుకునే అంశాలతో రాహుల్ రవీంద్రన్ అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో రష్మిక నటన సరికొత్తగా ఉంటుంది. యువ తరంతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా మా మూవీ ఉంటుంది'' అని చిత్ర యూనిట్ తెలిపింది. ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను హీరో విజయ్ దేవరకొండ తన వాయిస్ ఓవర్‌తో రిలీజ్ చేయగా, అద్భుతమైన స్పందన వచ్చింది. అలాగే హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి ఇటీవల విడుదలైన 'నదివే...' అంటూ సాగే తొలి పాట కూడా ఆకట్టుకుంది.



● బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ

కిష్కిందపురిలో...


'భైరవం' సినిమాతో ఇటీవల ప్రేక్షకులను అలరించారు హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన నటించిన తాజా చిత్రం 'కిష్కిందపురి'. 'రాక్షసుడు' (2019) వంటి హిట్ మూవీ తర్వాత సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటించిన ద్వితీయ చిత్రమిది. కౌశిక్ పెగల్లపాటి రచన, దర్శకత్వంలో అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఈ సినిమాని సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ''హారర్ మిస్టరీగా రూపొందిన చిత్రం 'కిష్కిందపురి'. సాయి శ్రీనివాస్ కెరీర్‌లో హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ఇది. ఈ చిత్రం ప్రేక్షకులకు అద్భుతమైన హారర్, మిస్టరీ ఎక్స్‌పీరియన్స్‌ని అందిస్తుంది. కౌశిక్ పెగల్లపాటి గ్రిప్పింగ్ కథనం, చిన్మయ్ సలాస్కర్ కెమెరా వర్క్, సామ్ సీఎస్ సంగీతం ఆకట్టుకుంటాయి. సాహు గారపాటి గ్రాండ్‌గా నిర్మించిన ఈ చిత్రం చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరికీ నచ్చుతుంది. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది'' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రం నుంచి 'ఉండిపోవే నాతోనే...' అంటూ సాగే తొలి పాటని విడుదల చేయగా, అద్భుతమైన స్పందన వచ్చింది.



● బాలకృష్ణ



● పవన్ కల్యాణ్



● విజయ్ ఆంటోని

యాక్షన్ భద్రకాళి

సంగీత దర్శకుడు, నటుడు, నిర్మాత, దర్శకుడు... ఇలా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు విజయ్ ఆంటోని. ఆయన నటించిన 25వ చిత్రం 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలానీ, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, మాస్టర్ కేశవ్ ఇతర పాత్రలు పోషించారు. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్‌పై విజయ్ ఆంటోని నిర్మించారు. ఈ సినిమాని తొలుత సెప్టెంబర్ 5న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఆ తేదీకి కాకుండా 19వ తేదీ రిలీజ్ చేయనున్నట్లు లేటెస్ట్‌గా అనౌన్స్ చేశారు. ఈ సినిమాని తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విడుదల చేస్తోంది. ఈ చిత్రంలో కిట్టు పాత్రలో విజయ్ ఆంటోని నటించారు. సుమారు 200 కోట్ల రూపాయల కుంభకోణం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. గత చిత్రాల కంటే స్టైలిష్‌గా, యాక్షన్ హీరోగా కనిపించనున్నారు విజయ్.

వెండితెరపై తాండవం...

హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీనులది హిట్ కాంబినేషన్. వారి కలయికలో వచ్చిన 'సింహా (2010), లెజెండ్ (2014), అఖండ' (2021) సినిమాలు మంచి విజయం అందుకున్నాయి. హ్యాట్రిక్ హిట్స్ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అఖండ 2: తాండవం'. 'అఖండ' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న ఈ మూవీలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎం. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమాని సెప్టెంబర్ 25న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

గ్యాంగ్‌స్టర్ పాత్రలో...

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓజీ'. 'రన్ రాజా రన్, సాహో' చిత్రాల ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానుంది. ''ఓజీ' చిత్రంలో పవన్ కల్యాణ్ భీకరమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది.



● సాయిదుర్గా తేజ్

యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్

'విరూపాక్ష', 'బ్రో' వంటి హిట్ సినిమాల తర్వాత సాయిదుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల యేటిగట్టు). ఈ సినిమా ద్వారా రోహిత్ కేపీ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి కథానాయికగా నటిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'హనుమాన్' (2024) వంటి పాన్ ఇండియన్ ఫిల్మ్ నిర్మించిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ''యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల యేటిగట్టు). ఈ చిత్రంలో మునుపెన్నడూ చూడని పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు సాయిదుర్గా తేజ్. ఆయన పోరాట సన్నివేశాలు సరికొత్తగా ఉంటూ ఆడియన్స్‌ని మెస్మరైజ్ చేస్తాయి. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని సెప్టెంబర్ 25న విడుదల చేయనున్నాం'' అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి.



● శివానీ, మౌళి తనుజ్

నవ్వులే నవ్వులు

'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీ ఫేమ్ శివానీ నగరం, '90స్ ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్ జంటగా నటించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. సాయి మార్తాండ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాజీవ్ కనకాల, ఎస్‌ఎస్ కాంచీ, అనిత చౌదరి, సత్య కృష్ణన్ ఇతర పాత్రలు పోషించారు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై ఆదిత్య హాసన్ నిర్మించారు. ఈ సినిమాని నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి సెప్టెంబర్ 12న విడుదల చేస్తున్నారు. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. సినిమా చూస్తున్నంత సేపు థియేటర్లలో ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటారు. 2 గంటల పాటు మా చిత్రం ఆడియన్స్‌కి నవ్వులు పంచుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. కాగా సింజిత్ యెర్రమల్లి సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'రాజా గాడికి...' అంటూ సాగే పాటని విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది.

పైన పేర్కొన్న సినిమాలే కాదు.. మరికొన్ని చిత్రాలు కూడా సెప్టెంబరులో విడుదలకు ముస్తాబవుతున్నాయి.

- దేరంగుల జగన్ మోహన్

నవ్వుల జాలీ



● అక్షయ్ కుమార్

బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ 'జాలీ ఎల్ఎల్‌బీ' నుంచి రానున్న తాజా చిత్రం 'జాలీ ఎల్ఎల్‌బీ 3'. ఈ సినిమాలో అక్షయ్ కుమార్, అర్షద్ వార్సి ప్రధాన పాత్రధారులుగా నటించారు. సౌరభ్ శుక్లా, హ్యూమా ఖురేషీ, అమ్రితా రావు ఇతర కీలక పాత్రల్లో నటించారు. సుభాష్ కపూర్ దర్శకత్వంలో అలోక్ జైన్, అజిత్ అంధారే నిర్మించిన ఈ చిత్రంసెప్టెంబరు 19న విడుదల కానుంది. ఈ చిత్రంలో లాయర్ జగదీశ్వర్ జాలీ మిశ్రా పాత్రలో అక్షయ్ కుమార్, లాయర్ జగదీష్ జాలీ త్యాగి పాత్రలో అర్షద్ వార్సి, జడ్జ్ పాత్రలో సౌరభ్ శుక్లా నటించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టీజర్ అక్షయ్, అర్షద్‌ల మధ్య గొడవలు, కోర్ట్ రూమ్‌లో జరిగే కామెడీ డ్రామాగా సాగుతుంది.

కాలేజీ క్యాంపస్ డ్రామాకి సై



● ఆలియా భట్

నటిగా సూపర్ హిట్ అయిన ఆలియా భట్ నిర్మాతగా మాత్రం ఇంకా హిట్ స్టేటస్‌ను సాధించలేకపోతున్నారు. ఎటర్నల్ సన్ షైన్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థను ప్రారంభించిన ఆలియా భట్, 'డార్లింగ్, జిగ్రీస్' సినిమాలను నిర్మించారు. ఈ రెండు సినిమాల్లోనూ ఆలియా భట్ లీడ్ రోల్ చేశారు. కానీ ఈ రెండు చిత్రాలూ హిట్ కాలేకపోయాయి. ఇప్పుడు ఆలియా భట్ మరో సినిమా నిర్మించేందుకు రెడీ అవుతున్నారని బాలీవుడ్ సమాచారం. అయాన్ ముఖర్జీ 'బ్రహ్మాస్త్ర' సినిమాకు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేసిన శ్రీతీ ముఖర్జీ ఓ కాలేజీ క్యాంపస్ డ్రామా కథను సిద్ధం చేసి, ఈ కథను ఆలియా భట్‌కు వినిపించారట. ఆలియాకు ఈ కథ నచ్చడంతో నిర్మించేందుకు ఓకే అన్నారట. అయితే కాలేజ్ క్యాంపస్ డ్రామా కాబట్టి తాను నటించకుండా, నూతన నటీనటులకు చాన్స్ ఇవ్వాలని ఆలియా భావిస్తున్నారని, ఆ దిశగా ఈ బ్యూటీ ప్రయత్నాలు మొదలుపెట్టారని సమాచారం. ఈ ఏడాది అక్టోబరులో షూటింగ్ స్టార్ట్ కానుందని బాలీవుడ్ టాక్. మరోవైపు నటిగా ఆలియా భట్ 'లవ్ అండ్ వార్' సినిమాలో నటిసస్తున్నారు. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తుండగా, విక్కీ కౌశల్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. సంజయ్‌లీలా భన్సాలీ డైరెక్షన్‌లోని ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ కానుంది.

గ్యాంగ్‌స్టర్ ప్రేయసి



● త్రిప్తి దిమ్రి

షాహిద్ కపూర్ హీరోగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ గ్యాంగ్‌స్టర్ మూవీ రానున్న సంగతి తెలిసిందే. 1990 నేపథ్యంలో ముంబై మాఫియా నేపథ్యంలో సాగే ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. అయితే ఈ సినిమాలో మాఫియాతో పాటుగా ప్రేమ సన్నివేశాలు కూడా చాలా కీలకంగా ఉండబోతున్నాయని బాలీవుడ్ సమాచారం. ఇందుకు తగ్గట్లుగా విశాల్ భరద్వాజ్ నటీనటుల ఎంపికపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలోని హీరోయిన్స్ పాత్రల కోసం త్రిప్తి దిమ్రి, దిశా పటానీలను ఎంపిక చేసుకున్నారట మేకర్స్. షాహిద్ కపూర్, త్రిప్తి దిమ్రి జోడీగా నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. అంతేకాదు... ఈ చిత్రంలోని ఇతర ప్రధాన పాత్రల్లో విక్రాంత్ మెస్సే, రణ్‌దీప్ హుడా, నానా పటేకర్, అవినాష్ తివారి నటించనున్నారని సమాచారం. షాహిద్ కపూర్, విక్రాంత్ మెస్సే, రణ్‌దీప్ హుడా వంటి పాపులర్ హీరోలు ఈ సినిమాలో భాగం కావడంతో ఈ మూవీపై అంచనాలు ఏర్పడుతున్నాయి.

బిజినెస్ రీల్

కాగ్నిజెంట్‌లో నవంబర్ నుంచి వేతనాల పెంపు

అర్హత కలిగిన 80 శాతం మందికి వర్తింపు



న్యూఢిల్లీ: అర్హత కలిగిన 80 శాతం ఉద్యోగులకు నవంబర్ 1 నుంచి వేతనాల పెంపును అమలు చేయనున్నట్లు ఐటీ సేవల దిగ్గజం కాగ్నిజెంట్ వెల్లడించింది. సీనియర్ అసోసియేట్ స్థాయి ఉద్యోగుల వరకు ఇది వర్తిస్తుందని, వ్యక్తిగత పనితీరు, దేశాన్ని బట్టి పెంపు ఆధారపడి ఉంటుందని వివరించింది. నిలకడగా అత్యంత మెరుగైన పనితీరు కనపరుస్తున్న వారికి గరిష్ట సింగిల్ డిజిట్ స్థాయిలో, టాప్ పర్ఫార్మర్లకు అత్యధికంగా పెంపు ఉంటుందని కంపెనీ పేర్కొంది. కంపెనీ ఈ ఏడాది తొలినాళ్లలో చాలా మంది సిబ్బందికి, గత మూడేళ్లలోనే అత్యధిక బోనస్‌లు ప్రకటించింది. ఇక ఈ ఏడాది ద్వితీయార్ధంలో పెద్ద సంఖ్యలో సిబ్బందికి ప్రతిభ ఆధారంగా వేతనాల పెంపు ఉంటుందని రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా కాగ్నిజెంట్ తెలిపింది. జనవరి–డిసెంబర్ ఆర్థిక సంవత్సరాన్ని పాటించే కాగ్నిజెంట్ లాభాలు రెండో త్రైమాసికంలో అంచనాలకన్నా అధికంగా 14 శాతం వృద్ధితో 645 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఆదాయం 5.25 బిలియన్ డాలర్లుగా ఉంది.

నోయల్ నియామకానికి టాటా సన్స్ షేర్‌హోల్డర్లు ఓకే



న్యూఢిల్లీ: నోయల్ ఎన్ టాటాను డైరెక్టరుగా నియమించడం సహా ఆరు కీలక తీర్మానాలకు టాటా సన్స్ షేర్‌హోల్డర్లు ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేశారు. షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ కూడా మద్దతు తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రతన్ టాటా మరణం తర్వాత 2024 అక్టోబర్ 22 నుంచి నోయెల్ టాటా అదనపు డైరెక్టరుగా నియమితులయ్యారు. మరోవైపు, వర్చువల్‌గా నిర్వహించిన వార్షిక సర్వ సభ్య సమావేశంలో టాటా సన్స్ డైరెక్టరుగా టీవీఎస్ మోటర్స్ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్ నియామకానికి కూడా ఆమోదం లభించినట్లు వివరించాయి. టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కి 66 శాతం, షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్‌నకు 18.4 శాతం వాటాలు ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-8-2025

విశాఖ	515-00
చిత్తూరు	548-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	246.5	2.01
ETERNAL	317.7	1.71
INFY	1,448.00	1.5
HDFCLIFE	788	1.47
ASIANPAINT	2,530.00	1.19

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	155.68	-2.81
ADANIPORTS	1,301.40	-1.38
HEROMOTOCO	4,708.00	-1.27
TECHM	1,488.20	-1.2
TATACONSUM	1,045.40	-1.01

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,813
ఎన్ఎస్ఈ	83,349
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,31,651
ఎఫ్ఐఐ	- 1,927
డీఐఐ	+ 3,896

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.96 (రాత్రి 11.30కు)	$ 62.65 (క్రితం ముగింపు)
బ్రెంట్	66.76 (రాత్రి 11.30కు)	$ 65.63 (క్రితం ముగింపు)

బ్లూకాలర్ ఉద్యోగాల్లో మిలీనియల్స్, జెన్ జెడ్ హవా

- 65 శాతం దరఖాస్తులు వీరి నుంచే
- 20–23 ఏళ్ల వయసు వారి నుంచి పోటీ
- వర్క్ఇండియా నివేదిక వెల్లడి



ముంబై: బ్లూకాలర్ ఉద్యోగాల్లో (శ్రమ ఆధారిత కార్మిక, నైపుణ్య పనులు) మిలీనియల్స్ (30 ఏళ్ల లోపు), జెనరేషన్ జెడ్ (30–45 ఏళ్ల వయసు వారు) ఎక్కువగా పోటీపడుతున్నారు. 2024, 2025 సంవత్సరాల్లో ఈ విభాగంలో ఉద్యోగాలకు వచ్చిన దరఖాస్తుల్లో 65 శాతం మేర మిలీనియల్స్, జెన్-జెడ్ నుంచే ఉండడం గమనార్హం. ఇందులోనూ 20–23 వయసు వారి నుంచే అధికంగా ఉన్నాయి. ఈ వయసు విభాగంలో ఉద్యోగ దరఖాస్తులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 51 శాతం పెరిగాయి. ఈ వివరాలను బ్లూ, గ్రే కాలర్ జాబ్ ప్లాట్‌ఫామ్ అయిన వర్క్ఇండియా వెల్లడించింది. యువత నుంచి (తాజా గ్రాడ్యుయేట్లు) బ్లూకాలర్ ఉద్యోగాలకు దరఖాస్తులు 85.5% పెరిగాయని, చిన్న వయసులోనే ఉద్యోగాల్లో చేరాలన్న ఆసక్తికి ఇది నిదర్శనమని పేర్కొంది. 10వ తరగతి కంటే తక్కువ విద్యార్హత ఉన్నవారి నుంచి కూడా ఉద్యోగ దరఖాస్తుల్లో 37 శాతం వృద్ధి కనిపించింది. 2024 జనవరి నుంచి 2025 జూలై వరకు వర్క్ ఇండియా ప్లాట్‌ఫామ్‌పై 111.71 మిలియన్ ఉద్యోగార్థుల డేటాను విశ్లేషించి ఈ నివేదికను సంస్థ విడుదల చేసింది. చదువుతో సంబంధం లేకుండా వివిధ వర్గాల వారి నుంచి ఉద్యోగాల నిర్వహణ పట్ల ఆకాంక్షలు, సన్నద్ధత పెరుగుతున్నట్లు పేర్కొంది.

మధ్య వయసులో మహిళలు డ్రాప్!

కెరీర్ ఆరంభంలో ఉన్న యువతీ, యువకులు ఉద్యోగాలకు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకుంటున్నట్లు వర్క్ఇండియా నివేదిక వెల్లడించింది. 27–29 ఏళ్ల వయసు మహిళల నుంచి ఉద్యోగ దరఖాస్తులు స్తబ్దుగా ఉన్నట్టు తెలిపింది. కానీ, ఇదే వయసు పురుషుల నుంచి మాత్రం దరఖాస్తులు పెరుగుతున్నట్టు పేర్కొంది. దీన్ని బట్టి ఈ వయసు మహిళలు కెరీర్ నుంచి మధ్యలోనే వైదొలగడం లేదంటే అవరోధాలను ఎదుర్కొంటున్నారా? అన్న దానిపై దృష్టి సారించాలని సూచించింది. ఉద్యోగాల కోసం అవసరమైతే వేరే ప్రాంతాలకు వెళ్లేందుకు సైతం యువత సుముఖత చూపిస్తున్నట్టు తెలిపింది. ఇక బ్లూకాలర్‌కు అదనంగా టైపిస్ట్, డేటా ఎంట్రీ, సేల్స్, హెచ్‌ఆర్, తయారీ ఉద్యోగ విభాగాలు సైతం అధిక వృద్ధిని చూస్తున్నట్టు వివరించింది. టైర్4 పట్టణాల నుంచి ఉద్యోగ దరఖాస్తులు 55 శాతం వరకు పెరిగినట్టు తెలిపింది.

జూలైలో ప్యాసింజర్ వాహన అమ్మకాలు అంతంతే

- డిమాండ్ స్తబ్దత ప్రధాన కారణం
- వాహన తయారీదారుల సంఘం సియామ్




సియామ్ గణాంకాల ప్రకారం జూలైలో వాహన విక్రయాలు

వాహన విభాగం	2025	2024	వృద్ధి(%లో)
ద్విచక్ర వాహనాలు	15,67,267	14,41,694	9
మోటార్ సైకిళ్లు	8,90,107	8,50,489	4.7
స్కూటర్లు	6,43,169	5,53,642	16
మోపెడ్లు	33,991	37,563	(-)9.5%
త్రిచక్ర వాహనాలు	69,403	59,073	17.5

ముంబై: డిమాండ్ స్తబ్దత కారణంగా జూలైలో కంపెనీల నుంచి డీలర్లకు ప్యాసింజర్ వాహనాల పంపిణీ తగ్గిందని దేశీయ వాహన తయారీదారుల సంఘం సియామ్ తెలిపింది. వార్షిక ప్రాతిపదికన జూలైలో 3,40,772 పీవీల పంపిణీ జరిగింది. గతేడాది ఇదే జూలైలో 3,41,510 యూనిట్లతో పోలిస్తే స్వల్పంగా 0.21% తక్కువగా ఉంది. "డిమాండ్ లేమీ కారణంగా ప్యాసింజర్ మినహా అన్ని వాహన విభాగ అమ్మకాలు మెరుగ్గా ఉన్నాయి. ఓనమ్ పండుగ(ఆగస్టు 26)తో ప్రారంభం కానున్న పండుగ సీజన్ నుంచి వాహనాలకు డిమాండ్ పుంజుకోవచ్చు" అని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు.

ఇన్ఫోసిస్ చేతికి వెర్సెంట్ గ్రూప్

- 75 శాతం వాటా కొనుగోలుకి డీల్
- ఒప్పందం విలువ రూ. 1,336 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ తాజాగా ఆస్ట్రేలియన్ టెలికం కంపెనీ టెల్‌స్ట్రాతో ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా టెల్‌స్ట్రా సొంత అనుబంధ సంస్థ వెర్సెంట్ గ్రూప్‌లో 75 శాతం వాటా సొంతం చేసుకోనుంది. ఇందుకు దాదాపు 23.33 కోట్ల ఆస్ట్రేలియన్ డాలర్లు(రూ. 1,336 కోట్లు) వెచ్చించనుంది. వెరసి ఇన్ఫోసిస్, టెల్‌స్ట్రా వ్యూహాత్మకంగా చేతులు కలపనున్నాయి. తద్వారా ఏర్పాటు చేయనున్న భాగస్వామ్య కంపెనీ(జేవీ) ద్వారా ఆస్ట్రేలియన్ బిజినెస్‌లకు ఏఐ ఆధారిత క్లౌడ్, డిజిటల్ సొల్యూషన్లు అందించనుంది. ఆస్ట్రేలియాలో డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్లు అందించడంలో ముందున్న వెర్సెంట్ గ్రూప్‌లో ఇన్ఫోసిస్ 75 శాతం వాటాను చేజిక్కించుకోనుంది. క్లౌడ్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సేవలందిస్తున్న టెల్‌స్ట్రా గ్రూప్‌నకు వెర్సెంట్ పూర్తి అనుబంధ సంస్థకాగా.. తాజా లావాదేవీ 2026 ద్వితీయార్థంలో పూర్తి కావచ్చని ఇన్ఫోసిస్ అంచనా వేస్తోంది. 650 మంది నిపుణులు కలిగిన వెర్సెంట్ గ్రూప్ ద్వారా ఆస్ట్రేలియాలో ఇన్ఫోసిస్ కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయి.

ఈ వార్తల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు బీఎస్ఈలో 1.5 శాతం లాభపడి రూ. 1,447 వద్ద ముగిసింది.

రష్యా చమురు కొనుగోళ్లు ఆపలేదు

ఐవోసీ చైర్మన్ ఏఎస్ సాహ్ని వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌ల బెదిరిస్తున్నప్పటికీ రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయలేదని ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) చైర్మన్ ఏఎస్ సాహ్ని తెలిపారు. ఆర్థిక ప్రయోజనాల ప్రాతిపదికనే ఐవోసీలాంటి రిఫైనింగ్ సంస్థలు కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. టారిఫ్‌ల నేపథ్యంలో కొనుగోళ్లను తగ్గించాలని గానీ లేదా మరింతగా పెంచాలని గానీ తమకు ఎలాంటి సూచనలు రాలేదని సాహ్ని చెప్పారు. రష్యా చమురుపై ఎలాంటి ఆంక్షలు లేవని, వాటికి విరుద్ధమైనవేమీ భారత్ చేయలేదని పేర్కొన్నారు. 2022 ఫిబ్రవరికి ముందు భారత చమురు దిగుమతుల్లో 1 శాతం కన్నా తక్కువగా రష్యా వాటా ఉండేది. కానీ ఉక్రెయిన్–రష్యా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ దేశ ఇంధనంపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించిన తర్వాత నుంచి ఇది 30 శాతానికి పెరిగింది. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో ఐవోసీ రిఫైనరీలు ప్రాసెస్ చేసిన క్రూడాయిల్‌లో 22–23 శాతం వాటా రష్యా దిగుమతులది ఉంటోంది. అటు బీపీసీఎల్ క్రూడాయిల్ రిఫైనింగ్‌లో 34 శాతంగా నమోదైంది. మరోవైపు రష్యా చమురుపై డిస్కౌంట్లు, బ్యారెల్‌పై 1.5 డాలర్లకు తగ్గడంతో గత నెల దిగుమతులు కొంత తగ్గినట్లు బీపీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) వెత్సా రామకృష్ణ గుప్తా తెలిపారు.

వివో వీ60 విడుదల

19 నుంచి విక్రయాలు



హైదరాబాద్: వివో కంపెనీ వీ60 పేరుతో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. ఇందులో 6.77 అంగుళాల ప్రీమియం క్వాడ్ కర్వ్‌డ్ డిస్‌ప్లే, అల్ట్రా కాంపాక్ట్ కెమెరా మాడ్యూల్ ఉన్నాయి. 50 మెగాపిక్సల్ టెలీఫొటో, స్నాప్‌డ్రాగన్ 7జెన్4 చిప్‌సెట్, ఐపీ రేటింగ్ (ఐపీ68, 69), స్కాట్ డ్రాప్ రెసిస్టెన్స్ గ్లాస్‌తో వస్తుంది. ధరల శ్రేణి రూ.36,999 నుంచి రూ.45,999 మధ్య ఉంటుంది. ఈ నెల 19వ తేదీ నుంచి వివో వెబ్‌సైట్‌తోపాటు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, అన్ని రిటైల్ స్టోర్లలో లభిస్తుందని కంపెనీ ప్రకటించింది. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డుల ద్వారా చెల్లింపులు చేస్తే 10 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. ఆరు నెలల నోకాస్ట్ ఈఎంఐ, ఏడాది అదనపు వారంటీని కంపెనీ ఆఫర్ చేస్తోంది. వివో టీడబ్ల్యూఎస్ 3ఈ సెట్‌ను రూ.1,499కే సొంతం చేసుకోవచ్చని ప్రకటించింది.

శ్రీరామ్ లైఫ్ ప్రీమియం వసూళ్లు 21 శాతం అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జూన్ త్రైమాసికంలో కొత్త బిజినెస్ ప్రీమియం (ఎన్‌బీపీ) వసూళ్లు 21 శాతం పెరిగి రూ. 212 కోట్ల నుంచి రూ. 257 కోట్లకు చేరినట్లు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ తెలిపింది. డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ పటిష్టం కావడం, శాఖల విస్తరణ, సగటు పాలసీ విలువ పెరగడం తదితర అంశాలు ఇందుకు దోహదపడినట్లు వివరించింది. ఇండివిడ్యువల్ బిజినెస్‌కి సంబంధించి రెన్యువల్ ప్రీమియం వసూళ్లు 25 శాతం పెరిగి రూ. 259 కోట్ల నుంచి రూ. 323 కోట్లకు చేరినట్లు పేర్కొంది.

పోకో నుంచి ఎం7 ప్లస్ 5జీ స్మార్ట్‌ఫోన్

ధర రూ. 12,999



హైదరాబాద్: కన్జూమర్ టెక్నాలజీ బ్రాండ్ పోకో తాజాగా ఎం7 ప్లస్ 5జీ స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. ప్రారంభ ఆఫర్ కింద దీని ధర రూ. 12,999గా ఉంటుంది. ఇందులో 7000 ఎంఏహెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ, 6.9 అంగుళాల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 6ఎస్ జెన్ 3 చిప్,50 ఎంపీ ఏఐ రియర్ కెమెరా తదితర ఫీచర్లు ఉన్నాయి. 2 ఓఎస్ జనరేషన్స్, 4 ఏళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్ పొందవచ్చు. ఫ్లిప్‌కార్ట్‌లో ఆగస్టు 19 నుంచి సేల్ ప్రారంభమవుతుందని పోకో వివరించింది.

వేగంగా వాణిజ్య ఒప్పందాలు

- ఎగుమతుల పెంపుపై కేంద్రం దృష్టి
- వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భత్వాల్



న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులను ఇతోధికం చేసుకునే దిశగా కేంద్ర సర్కారు చర్యలపై దృష్టి సారించింది. వాణిజ్య ఒప్పందాలపై చర్చలను వేగవంతం చేయడంతోపాటు, వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయడం ద్వారా ఎగుమతులు పెంచుకోవాలని భావిస్తోంది. ఎగుమతుల పోటీతత్వం పెంచుకోవడంతోపాటు, ఎగుమతులకు మరింత ప్రోత్సాహాన్ని అందించడం, ఎగుమతులను పలు దేశాల మధ్య వైవిధ్యం చేసుకోవడం, దిగుమతుల్లోనూ వైవిధ్యంపై వాణిజ్య శాఖ దృష్టి సారించినట్టు ఆ శాఖ కార్యదర్శి సునీల్ భత్వాల్ తెలిపారు. సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందానికి ఆమోదాన్ని వేగవంతం చేయాలని యూకేని కోరినట్టు చెప్పారు. ఈ ఏడాది జూలై 24న దీనిపై రెండు దేశాలు సంతకాలు చేయడం గమనార్హం. ఐరోపా సమాఖ్య (ఈయూ)తోనూ చర్చలను వేగవంతం చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది చివరికి ముగింపునకు రావొచ్చన్నారు. ఒమన్‌తో సంప్రదింపులు ముగిశాయని, రెండు దేశాలకు అనుకూలమైన తేదీన ఒప్పందంపై సంతకాలు జరగనున్నట్టు చెప్పారు. ఇక న్యూజిలాండ్, పెరూ, చిలీతోనూ చర్చలు పురోగతితో సాగుతున్నట్టు పేర్కొన్నారు. 10 దేశాల ఆసియా కూటమితోనూ సమీక్షపై సంప్రదింపులు చేస్తున్నట్టు తెలిపారు. ప్రధానంగా 50 దేశాలపై దృష్టి సారించినట్టు తెలిపారు. ఎగుమతుల ప్రోత్సాహానికి పలు పథకాలు ఇప్పటికే అమల్లో ఉండగా, వాటిని మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. దిగుమతులకు కొన్ని దేశాలపైనే ఎక్కువగా ఆధారపకుండా వైవిధ్యం చేసుకోవాల్సి ఉందన్నారు.

క్యూ1 ఫలితాలు

వొడాఫోన్ ఐడియా నష్టాలు అప్ ▸ రూ. 6,608 కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర నష్టం పెరిగి రూ. 6,608 కోట్లను తాకింది. ఫైనాన్స్ వ్యయాలు పెరగడం ప్రభావం చూపింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో దాదాపు రూ. 6,427 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం 5 శాతం పుంజుకుని దాదాపు రూ. 11,023 కోట్లకు చేరింది. ఈ కాలంలో ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 15 శాతం ఎగసి రూ. 177ను తాకింది. గత క్యూ1లో రూ. 154 ఏఆర్‌పీయూను సాధించిన సంగతి తెలిసిందే. కాగా.. 2025 జూన్30కల్లా కంపెనీ రుణ భారం రూ. 1,99,140 కోట్లకు చేరగా.. బ్యాంకులలో రుణాలు దాదాపు రూ. 1,945 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం సీవోవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అభిజిత్ కిషోర్‌ను కొత్త సీఈవోగా బోర్డు ఎంపిక చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం సీఈవో బాధ్యతలు నిర్వహిస్తున్న అక్షయ ముంద్రా పదవీ కాలం ఈ నెల 18న ముగియనుంది. ఆగస్ట్ 19 నుంచి సీఈవో పదవి చేపట్టనున్న అభిజిత్ మూడేళ్లపాటు కొనసాగనున్నట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 3.5 శాతం పతనమై రూ. 6.15 వద్ద ముగిసింది.

అశోక్ లేలాండ్ లాభం జంప్ ▸ రూ. 658 కోట్లు



న్యూఢిల్లీ: వాణిజ్య వాహన దిగ్గజం అశోక్ లేలాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 658 కోట్లను తాకింది. రికార్డ్ అమ్మకాల పరిమాణం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 551 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,697 కోట్ల నుంచి రూ. 11,709 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 9,995 కోట్ల నుంచి రూ. 10,921 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 44,238 వాహనాలను విక్రయించింది. అనుబంధ సంస్థ స్విచ్ మొబిలిటీ సానుకూల ఇబిటాను సాధించినట్లు అశోక్ లేలాండ్ చైర్మన్ ధీరజ్ హిందుజా పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2 శాతం లాభపడి రూ. 122 వద్ద ముగిసింది.

హిందుస్తాన్ కాపర్ లాభం ప్లస్ ▸ రూ. 134 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం హిందుస్తాన్ కాపర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 18 శాతం ఎగసి రూ. 134 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 113 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 500 కోట్ల నుంచి రూ. 527 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు రూ. 346 కోట్ల నుంచి రూ. 347 కోట్లకు నామమాత్రంగా పెరిగాయి. ఖనిజ్ విదేశ్ ఇండియా లిమిటెడ్‌తో ఏర్పాటు చేసిన అనుబంధ జేవీ చత్తీస్‌గఢ్ కాపర్ లిమిటెడ్ పనితీరు సైతం కన్సాలిడేటెడ్ ఫలితాలలో కలసి ఉన్నట్లు హిందుస్తాన్ కాపర్ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 240 వద్ద ముగిసింది.

గల్ఫ్ ఆయిల్ లాభం గుడ్ ▸ రూ. 97 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో స్టాండెలోన్ నికర లాభం 10 శాతం ఎగసి రూ. 97 కోట్లకు చేరింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 88 కోట్లు ఆర్జించింది. హిందుజా గ్రూప్ కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ. 885 కోట్ల నుంచి రూ. 996 కోట్లకు బలపడింది. ఇది 13 శాతం వృద్ధికాగా.. తయారీ సామర్థ్యాన్ని 70 శాతం మేర పెంచేందుకు రూ. 55 కోట్ల పెట్టుబడులను వెచ్చించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో 24 కోట్ల లీటర్లకు సామర్థ్యం పెరగనున్నట్లు తెలియజేసింది. కాగా.. కన్సాలిడేటెడ్ నికర లాభం సైతం 13 శాతం పుంజుకుని రూ. 95 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం రూ. 894 కోట్ల నుంచి రూ. 1,016 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు యథాతథంగా రూ. 1,175 వద్ద ముగిసింది.

పతంజలి ఫుడ్స్ లాభం డౌన్ ▸ రూ. 180 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం పతంజలి ఫుడ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 31 శాతం క్షీణించి రూ. 180 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో దాదాపు రూ. 263 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 7,202 కోట్ల నుంచి రూ. 8,913 కోట్లకు బలపడింది. ఈ కాలంలో ప్రధానంగా ప్రకటనల వ్యయాలు పెరగడం లాభాలను దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది. ఉత్తరప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ దుర్గా శంకర్ మిశ్రాను అదనపు నాన్‌ఎగ్జిక్యూటివ్ స్వతంత్ర డైరెక్టర్‌గా ఎంపిక చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ నెల 14 నుంచి మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నట్లు తెలియజేసింది. అంతేకాకుండా స్వామి రామ్‌దేవ్‌ను నాన్‌ఎగ్జిక్యూటివ్ నాన్‌ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా తిరిగి ఎంపిక చేసినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 1,768 వద్ద ముగిసింది.

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లాభం జూమ్ ▸ రూ. 202 కోట్లు



న్యూఢిల్లీ: ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జూన్ త్రైమాసికానికి ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 45 శాతం జంప్ చేసి రూ.202 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.140 కోట్లుగా ఉంది. ఆదాయం ఇదే కాలంలో రూ.1,972 కోట్ల నుంచి రూ.2,164 కోట్లకు వృద్ధి చెందింది. టోల్ వసూళ్ల రూపంలో 8 శాతం అధికంగా రూ.1,680 కోట్ల ఆదాయం సమకూరింది. భారత ఆర్థిక వ్యవస్థ ఇక ముందూ బలమైన పనితీరు చూపిస్తుందన్న అంచనాల నడుమ తదుపరి దశ అవకాశాలను సొంతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ సీఎండీ వీరేంద్ర డి. మైస్కర్ ప్రకటించారు. ఇప్పటికే ఉన్న ఆస్తులతోపాటు, కొత్త ప్రాజెక్టుల ద్వారా స్థిరమైన, వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తామన్నారు.

బీఎస్ఈలో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా షేరు ధర ఒక శాతానికి పైనే పెరిగి రూ.45 వద్ద ముగిసింది.

సెన్‌కో గోల్డ్ లాభం హైజంప్ ▸ రూ. 105 కోట్లు



న్యూఢిల్లీ: బంగారు ఆభరణ వర్తక రిటైల్ కంపెనీ సెన్‌కో గోల్డ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం రెట్టింపై రూ. 105 కోట్లకు చేరింది. నిర్వహణ సామర్థ్యం, రిటైల్ అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 51 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 30 శాతం జంప్‌చేసి రూ. 1,826 కోట్లను అధిగమించింది. గత క్యూ1లో రూ. 1,404 కోట్ల టర్నోవర్ అందుకుంది. నిర్వహణ లాభం 69 శాతం ఎగసి రూ. 184 కోట్లకు చేరింది. ఈ కాలంలో కొత్తగా 10 షోరూములను ప్రారంభించింది. వీటిలో 5 సొంతంకాగా.. మిగిలినవి ఫ్రాంచైజీలు. దీంతో స్టోర్ల సంఖ్య 186ను తాకింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 6.5% పెరిగి రూ. 361 వద్ద ముగిసింది.



45 ఏళ్ల వయసులో...



2001 యూఎస్ ఓపెన్ విన్నర్స్ ట్రోఫీతో వీనస్, రన్నరప్ ట్రోఫీతో సెరెనా

గ్రాండ్‌స్లామ్ 'రీ ఎంట్రీ'కి వీనస్ విలియమ్స్ రెడీ

- యూఎస్ ఓపెన్‌లో 'వైల్డ్ కార్డ్' ఎంట్రీ
- సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో పోటీపడనున్న అమెరికా దిగ్గజం

న్యూయార్క్: అమెరికా టెన్నిస్ దిగ్గజం వీనస్ విలియమ్స్ 45 ఏళ్ల వయసులో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో వీనస్ పోటీ పడనుంది. మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో వీనస్‌కు 'వైల్డ్ కార్డ్' ప్రవేశం లభించింది. దీంతో రెనీ రిచర్డ్స్ (1981లో; 47 ఏళ్ల వయసులో) తర్వాత యూఎస్ ఓపెన్ బరిలోకి దిగనున్న అత్యంత పెద్ద వయస్కురాలిగా నిలవనుంది. కెరీర్‌లో 7 సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన వీనస్... మహిళల డబుల్స్‌లో 14, మిక్స్‌డ్ డబుల్స్‌లో రెండు టైటిల్స్ ఖాతాలో వేసుకుంది. ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాలు సహా మొత్తం 5 పతకాలు ఖాతాలో వేసుకుంది. ఆమె కెరీర్‌లోని ప్రధానాంశాలను ఓసారి పరిశీలిస్తే...

- 1994లో ప్రొఫెషనల్ కెరీర్ ప్రారంభించిన వీనస్... 14 ఏళ్ల వయసులో ఆక్లాండ్ ఓపెన్ డబ్ల్యూటీఏ టోర్నీలో పాల్గొంది.
- 1997 ఫ్రెంచ్ ఓపెన్ ద్వారా వీనస్ గ్రాండ్‌స్లామ్ అరంగేట్రం చేసింది. తొలి రౌండ్‌లో గెలిచిన వీనస్... రెండో రౌండ్‌లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.
- అదే ఏడాది యూఎస్ ఓపెన్‌లో నిలకడైన ప్రదర్శన కనబర్చిన వీనస్... ఫైనల్ వరకు చేరింది. తుది సమరంలో మార్టినా హింగిస్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడి రన్నరప్‌తో సరి పెట్టుకుంది.
- 1998 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారి సోదరి సెరెనా విలియమ్స్‌తో వీనస్ విలియమ్స్ తలపడింది. ఆ తర్వాత వీరిద్దరి మధ్య 31 మ్యాచ్‌లు జరగగా... అందులో 19 మ్యాచ్‌ల్లో సెరెనా విజయం సాధించింది. 12 మ్యాచ్‌ల్లో వీనస్ నెగ్గింది. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెరెనా 11–5తో వీనస్‌పై పైచేయి కనబర్చింది.
- సెరెనాతో కలిసి వీనస్ 1999లో ఫ్రెంచ్ ఓపెన్ మహిళల డబుల్స్ టైటిల్ గెలిచింది. అదే సంవత్సరం ఈ అక్కాచెల్లెళ్లు యూఎస్ ఓపెన్‌లో సైతం విజేతలుగా నిలిచారు.
- 20 ఏళ్ల వయసులో వీనస్ తొలి గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలిచింది. 2000 వింబుల్డన్ టోర్నీలో వీనస్ విజేతగా నిలిచింది. తద్వారా గిబ్సన్ (1950లో) తర్వాత వింబుల్డన్ టైటిల్ నెగ్గిన నల్లజాతి ప్లేయర్‌గా వీనస్ రికార్డుల్లోకెక్కింది. అంతకుముందే 1999 యూఎస్ ఓపెన్‌లో సెరెనా విలియమ్స్ తొలి టైటిల్ గెలవడంతో... టెన్నిస్ చరిత్రలో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ గెలిచిన మొదటి సోదరీమణులుగా సెరెనా, వీనస్ రికార్డుల్లోకెక్కారు.
- వీనస్ సుదీర్ఘ కెరీర్‌లో ఐదుసార్లు (2000, 2001, 2005, 2007, 2008లో) వింబుల్డన్ సింగిల్స్ టైటిల్ గెలిచింది. 2000, 2001లో యూఎస్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది.
- 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో వీనస్ విలియమ్స్ 'డబుల్ ధమాకా' మోగించింది. సింగిల్స్‌లో స్వర్ణం గెలిచిన ఈ అమెరికా ప్లేయర్... మహిళల డబుల్స్‌లో సోదరి సెరెనాతో కలిసి పసిడి పతకం ఖాతాలో వేసుకుంది.
- 2008 బీజింగ్ ఒలింపిక్స్, 2012 లండన్ ఒలింపిక్స్ మహిళల సింగిల్స్‌లో బంగారు పతకాలు నెగ్గిన వీనస్... 2016 రియో విశ్వక్రీడల్లో మిక్స్‌డ్ డబుల్స్‌లో రజతం కైవసం చేసుకుంది.
- 2002 నుంచి 2003 వరకు వరుసగా నాలుగు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో సెరెనా, వీనస్ మధ్య హోరాహోరీ సమరాలు జరిగాయి. అందులో నాలుగింట సెరెనానే విజయం సాధించింది. 1884 వింబుల్డన్‌లో మౌడ్ వాట్సన్, లిలియన్ వాట్సన్ తర్వాత గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో తలపడ్డ అక్కాచెల్లెళ్లు సెరెనా, వీనస్ కావడం విశేషం.
- 2002 ఫిబ్రవరిలో వీనస్ విలియమ్స్ తొలిసారి డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరింది. మొత్తంగా ఆమె 11 వారాల పాటు 'టాప్'లో కొనసాగింది. సెరెనా 319 వారాల పాటు అగ్రస్థానంలో నిలవడం విశేషం.
- 2011 యూఎస్ ఓపెన్ రెండో రౌండ్ మ్యాచ్‌కు ముందు వీనస్ తనకు స్జొగ్రెన్స్ సిండ్రోమ్ ఉన్నట్లు వెల్లడించింది. కీళ్ల నొప్పుల కారణంగా టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు పేర్కొంది.
- గాయాల నుంచి కోలుకున్న అనంతరం తిరిగి కోర్టులో అడుగుపెట్టిన వీనస్... 2016–17లో అదరగొట్టింది. ఆ ఏడాది ఆస్ట్రేలియా, ఓపెన్ వింబుల్డన్‌లో ఫైనల్‌కు చేరి అదుర్స్ అనిపించుకుంది. మరో రెండు గ్రాండ్‌స్లామ్‌లలో సెమీఫైనల్స్ ఆడింది.
- ఆ తర్వాత పెద్దగా ఆకట్టుకోలేకపోయిన వీనస్ విలియమ్స్... వరుసగా 10 గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో తొలి రెండు రౌండ్‌లలోనే నిష్క్రమించింది. అందులో 2023 యూఎస్ ఓపెన్ కూడా ఉంది. ఆ తర్వాత రాకెట్ పక్కన పెట్టిన వీనస్... శస్త్రచికిత్సల అనంతరం గత నెల డీసీ సిటీ ఓపెన్ ద్వారా తిరిగి మైదానంలో అడుగు పెట్టింది. ఇప్పుడు సొంతగడ్డపై జరుగుతున్న యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో లేటు వయసులోనూ తనదైన ముద్ర వేయాలని భావిస్తోంది.



1993లో ఓ టోర్నీ ఫైనల్ ముగిశాక...



2012 లండన్ ఒలింపిక్స్ డబుల్స్ స్వర్ణ పతకాలతో వీనస్, సెరెనా

అర్జున్ టెండూల్కర్ నిశ్చితార్థం

ముంబై: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ వివాహ నిశ్చితార్థం జరిగింది. కేవలం కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు, మిత్రుల మధ్య బుధవారం ఈ వేడుకను నిర్వహించినట్లు తెలిసింది. సానియా చందోక్‌తో అర్జున్ టెండూల్కర్ ఎంగేజ్‌మెంట్ జరిగింది. ముంబైకి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త రవి ఘయ్ మనువరాలు సానియా. గ్రావిస్ గ్రూప్ చైర్మన్ రవి ఘయ్. ఫుడ్, హాస్పిటాలిటీ సెక్టార్‌లో ఈ గ్రూప్ పేరుగడించింది. ముంబైలోని ఇంటర్ కాంటినెంటల్ హోటల్, బ్రూక్లిన్ క్రీమరీ ఐస్ క్రీమ్ బ్రాండ్ వీరిదే. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో 'బాస్కిన్ అండ్ రాబిన్స్' బ్రాండ్‌తో ఉన్న ప్రీమియం చైన్ ఐస్‌క్రీమ్ పార్లర్లు బ్రూక్లిన్ క్రీమరి సంస్థకు చెందినవే. క్వాలిటీ ఐస్ క్రీమ్స్ కూడా ఆ సంస్థ ఉత్పత్తులే! పరిమిత సంఖ్యలో, కేవలం ఆత్మీయుల మధ్యే జరిగిన ఈ ఈవెంట్‌పై ఇరు కుటుంబసభ్యులు గోప్యత పాటించారు. వార్త బయటికి పొక్కినా... అటు రవి ఘయ్ కుటుంబం నుంచి గానీ, ఇటు సచిన్ కుటుంబం నుంచి గానీ ఇంకా ఎలాంటి ధ్రువీకరణ వెలువడలేదు. విషయం తెలిసిన ఐకాన్ క్రికెటర్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 25 ఏళ్ల అర్జున్ లెఫ్టార్మ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్. ముందుగా ముంబై అండర్-19 జట్టు నుంచి క్రికెట్‌లో అరంగేట్రం చేసిన అతను చెప్పుకోదగిన స్థాయిలో రాణించలేకపోయాడు. ప్రస్తుతం గోవా తరఫున దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. ఐపీఎల్‌లో సచిన్ మెంటార్‌గా ఉన్న ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్నాడు. కానీ ఇప్పటివరు కేవలం ఐదు మ్యాచ్‌లే ఆడి మూడే వికెట్లు తీయగలిగాడు. బ్యాట్ నుంచి ఇప్పటివరకు రాణించిన ఇన్నింగ్స్ లేదు. అర్జున్ చేయి అందుకున్న సానియా జంతు ప్రేమికురాలు. ముంబైలో ఉన్న పెంపుడు జంతువులు, మూగ జీవాల కోసం ఏర్పాటైన 'మిస్టర్ పాస్'ను సానియా ప్రారంభించారు.



గిల్ జట్టును గొప్పగా నడిపించాడు: యువరాజ్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో శుబ్‌మన్ గిల్ కెప్టెన్‌గా భారత జట్టును నడిపించిన తీరుపై మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. ఈ సిరీస్‌కు ముందు తనపై వచ్చిన విమర్శలన్నింటికీ ఒకేసారి జవాబిస్తున్నట్లుగా అతని సారథ్యం కనిపించిందని యువీ అన్నాడు. గిల్ కెప్టెన్సీ నమ్మశక్యంగా అనిపించలేదని కితాబిచ్చాడు. కెరీర్ ఆరంభంలో స్వయంగా యువీనే మెంటార్‌గా గిల్‌కు మార్గనిర్దేశనం చేశాడు. 'విదేశాల్లో గిల్ రికార్డును చాలా మంది ప్రశ్నించారు. కానీ అతను కెప్టెన్ కావడంతోనే నాలుగు సెంచరీలు బాదాడు. బాధ్యతను అప్పగిస్తే దానిని మరింత సమర్థంగా నిర్వర్తించిన తీరు నమ్మశక్యం కాని రీతిలో ఉంది. భారత జట్టును చూస్తే గర్వంగా అనిపించింది. పేరుకు సిరీస్ 'డ్రా' అయినా నా దృష్టిలో ఇది మనం గెలిచినట్లే. పెద్దగా అనుభవం లేని జట్టు ఇంగ్లండ్‌కు వెళ్లి ఇంగ్లండ్ గడ్డపై సత్తా చాటడం అంత సులువు కాదు' అని యువరాజ్ అభిప్రాయ పడ్డాడు. కోహ్లి, రోహిత్‌లు లేకపోవడాన్ని ఒక సవాల్‌గా తీసుకొని మన కుర్రాళ్లు సత్తా చాటారని యువీ అన్నాడు. 'సాధారణంగా యువ ఆటగాళ్లు ఇంగ్లండ్‌కు వెళ్లినప్పుడు వారిపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. కోహ్లి, రోహిత్ లాంటి ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేయడం అంత సులువు కాదు. కానీ కుర్రాళ్లు తమ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించారు. నా దృష్టిలో జడేజా, సుందర్ సెంచరీలతో మాంచెస్టర్ టెస్టును 'డ్రా' చేసుకోవడం కీలక మలుపు. ఇలాంటిది చాలా కాలంగా నేను చూడలేదు. ఇది మన జట్టు స్థాయి ఏంటో చూపించింది. జడేజాకు అంటే చాలా అనుభవం ఉంది. కానీ యువ ఆటగాడు సుందర్ ప్రదర్శనను మాత్రం ఎంత ప్రశంసించినా తక్కువే అవుతుంది' అని యువరాజ్ విశ్లేషించాడు.



మహారాష్ట్ర జట్టులో రుతురాజ్, పృథ్వీ షా

18 నుంచి బుచ్చిబాబు టోర్నీ

పుణే: భారత బ్యాటర్లు రుతురాజ్ గైక్వాడ్, పృథ్వీ షా మహారాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్‌లో మహారాష్ట్ర జట్టు తలపడుతుంది. మూడు రోజుల ఫార్మాట్‌లో ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 9 వరకు చెన్నైలో ఈ టోర్నీ జరుగుతుంది. హైదరాబాద్ జట్టు డిఫెండింగ్ చాంపియన్ కాగా... ఈ టోర్నీ కోసం 17 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించగా... అంకిత్ బావ్నే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ముంబైని వీడిన పృథ్వీ షాకు మహారాష్ట్ర తరఫున ఇదే తొలి టోర్నీ కానుంది. ఈ నేపథ్యంలో 25 ఏళ్ల షా ఈ టోర్నీని తాజాగా ప్రారంభించాలని ఆశిస్తున్నాడు. రుతురాజ్ గైక్వాడ్, సౌరభ్ నవాలే మహారాష్ట్రకు ఎంపికైనప్పటికీ ఒకట్రెండు మ్యాచ్‌లే ఆడే అవకాశముంది. దులీప్ ట్రోఫీ కోసం వీళ్లిద్దరు వెస్ట్‌జోన్ తరఫున బరిలోకి దిగనున్నారు. వెస్ట్‌జోన్ నేరుగా సెమీఫైనల్ చేరగా... సెప్టెంబర్ 4 నుంచి మ్యాచ్ ఆడుతుంది.

మహారాష్ట్ర జట్టు: అంకిత్ బావ్నే (కెప్టెన్) రుతురాజ్ గైక్వాడ్, పృథ్వీ షా, సిద్దేశ్ వీర్, సచిన్ ధాస్, అర్షిన్ కులకర్ణి, హర్షల్ కాటే, సిద్ధార్థ్ మాత్రే, సౌరభ్ నవాలే, మందార్ భండారి, రామకృష్ణ ఘోష్, ముకేశ్ చౌధరీ, ప్రదీప్ ధాఢె, విక్కీ ఒస్త్వాల్, హితేశ్ వాలుంజ్, ప్రశాంత్ సోలంకి, రాజ్‌వర్ధన్ హంగార్‌గేకర్.

కరువానాకు గుకేశ్ షాక్

సెయింట్ లూయిస్ (అమెరికా): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌లో భారత స్టార్ దొమ్మరాజు గుకేశ్ చివరి మూడు రౌండ్‌లలో రాణించాడు. ర్యాపిడ్ విభాగం పోటీలు ముగిశాక 10 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. లీనియర్ డొమింగెజ్ (అమెరికా)తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో గుకేశ్ 45 ఎత్తుల్లో ఓడిపోయాడు. ఈ ఓటమి నుంచి వెంటనే కోలుకున్న గుకేశ్ ఎనిమిదో రౌండ్ గేమ్‌లో 45 ఎత్తుల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ వెస్లీ సో (అమెరికా)పై గెలిచాడు. అనంతరం ప్రపంచ 6వ ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన చివరిదైన తొమ్మిదో గేమ్‌లో గుకేశ్ 89 ఎత్తుల్లో సంచలన విజయం సాధించాడు. క్లాసికల్ ఫార్మాట్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 6వ స్థానంలో ఉన్న గుకేశ్... ర్యాపిడ్ ఫార్మాట్‌లో 27వ ర్యాంక్‌లో, బ్లిట్జ్ ఫార్మాట్‌లో 93వ ర్యాంక్‌లో ఉన్నాడు. ర్యాపిడ్ విభాగం గేమ్‌లు ముగియడంతో... ఇక బ్లిట్జ్ ఫార్మాట్‌లో 18 గేమ్‌లు జరుగుతాయి.



డీగో జోటా కుటుంబానికి చెల్సీ క్లబ్ సాయం



లండన్: ఇంగ్లండ్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) విఖ్యాత ఫుట్‌బాల్ క్లబ్ చెల్సీ పెద్ద మనసు చాటుకుంది. గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోర్చుగల్ యువ మిడ్‌ఫీల్డర్, లివర్‌పూల్ క్లబ్ ఫార్వర్డ్ డీగో జోటా కుటుంబానికి ఆర్థిక చేయూత ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ఏడాది జరిగిన క్లబ్ వరల్డ్‌కప్ ఫైనల్లో చెల్సీ జట్టు 3–0తో యూఈఎఫ్ఏ చాంపియన్ పారిస్ సెయింట్ జర్మయిన్ (పీఎస్‌జీ)పై ఘనవిజయం సాధించింది. దీంతో క్లబ్‌కు ప్రైజ్‌మనీతో పాటు బోనస్ కలిపి మొత్తం 11.4 మిలియన్ డాలర్లు (సుమారు రూ.100 కోట్లు) లభించాయి. ఈ మొత్తాన్ని ఆటగాళ్లంతా సమాన భాగాలు చేశారు. ఇందులో నుంచి 5 లక్షల డాలర్లు (రూ.4.38 కోట్లు) మృతి చెందిన లివర్‌పూల్ క్లబ్ ప్లేయర్ డీగో జోటా కుటుంబసభ్యులకు ఇచ్చేందుకు చెల్సీ సిద్ధమైంది. ఈ మేరకు చెల్సీ క్లబ్ గురువారం అధికారికంగా ప్రకటించింది. పోర్చుగల్‌కు చెందిన జోటా పావోస్ డి ఫెరీరాతో ఫుట్‌బాల్ కెరీర్‌ను ప్రారంభించాడు. తర్వాత 2016లో అట్లెటికో మాడ్రిడ్‌తో జట్టు కట్టాక కెరీర్‌లో ఊపందుకున్నాడు. ప్రీమియర్ లీగ్‌లో వాల్వ్‌ర్‌హాంప్టన్ వాండరర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత 2020 నుంచి లివర్‌పూల్ జట్టుకు ఆడుతున్నాడు. 2024–2025 ఇంగ్లండ్ ప్రీమియర్ లీగ్ సీజన్‌లో లివర్‌పూల్ చాంపియన్‌గా నిలిచింది.

'కౌంటీ కల నెరవేరింది'

తిలక్ వర్మ



హైదరాబాద్: కౌంటీ క్రికెట్‌లో హాంప్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం ద్వారా ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నట్లు టీమిండియా ప్లేయర్, హైదరాబాదీ క్రికెటర్ ఠాకూర్ తిలక్‌వర్మ పేర్కొన్నాడు. అక్కడ నేర్చుకున్న పాఠాలు... జీవిత కాలం పాటించనున్నట్లు వెల్లడించాడు. భారత జాతీయ జట్టు తరఫున 4 వన్డేలు, 25 టి20లు ఆడిన తిలక్ వర్మ... ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టులో కీలక ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. 'కెరీర్ ప్రారంభించిన సమయంలో ఏదో ఒక రోజు కౌంటీ క్రికెట్ ఆడాలనుకున్నా. నా కల ఇప్పుడు నెరవేరింది. ఈ ఏడాది హాంప్‌షైర్ తరఫున కౌంటీ అరంగేట్రం చేయడం ఆనందంగా ఉంది. సుదీర్ఘ ఫార్మాట్‌తో పాటు, పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు సైతం ఆడాను. కేవలం ఆటలోనే కాకుండా వ్యక్తిగతంగానూ ఎన్నో విషయాలు నేర్చుకున్నా. వాటిని కెరీర్ ఆసాంతం అనుసరిస్తా. హాంప్‌షైర్ యాజమాన్యానికి ధన్యవాదాలు' అని తిలక్ వర్మ గురువారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించాడు. ఈ సీజన్‌లో హాంప్‌షైర్ తరఫున మొత్తం 7 మ్యాచ్‌లాడిన తిలక్ 412 పరుగులు చేశాడు. అందులో 2 సెంచరీలు, 2 హాఫ్‌సెంచరీలు ఉన్నాయి. తన బౌలింగ్‌తో ఒక వికెట్ కూడా పడగొట్టాడు. మరోవైపు హాంప్‌షైర్ కూడా తిలక్‌పై ప్రశంసలు కురిపించింది. 'సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడి తొలి శతకం హాంప్‌షైర్ జట్టు తరఫున నమోదైంది. మేం అంచనా వేసిన దానికంటే అతడు ఎంతో మెరుగ్గా ఆడాడు, తిలక్‌లో అపార ప్రతిభ ఉంది. గణాంకాలు పక్కనపెడితే అతడు జట్టుకు చేకూర్చిన బలం వెలకట్టలేనిది' అని హాంప్‌షైర్ క్లబ్ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో తిలక్ వర్మ సౌత్ జోన్ జట్టుకు సారథిగా వ్యవహరించనున్నాడు. ఈ నెల 28 నుంచి బెంగళూరు వేదికగా జరగనున్న ఈ జోనల్ టోర్నీతో దేశవాళీ సీజన్ ప్రారంభం కానుంది. వచ్చే నెల యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా జరగనున్న ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో బరిలోకి దిగే భారత జట్టులో తిలక్‌కు చోటు దక్కడం దాదాపు ఖాయమే!


శ్రీనగర్‌లోని దాల్ లేక్‌లో గురువారం సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బోటు ర్యాలీ


పశ్చిమబెంగాల్‌లోని నదియాలో పొలం గట్లపై జాతీయ జెండాలతో మహిళలు



న్యూఢిల్లీలో జాతీయ పతాకాన్ని పట్టుకున్న వానరం

సీఎం యోగిని ప్రశంసించిన ఫలితం
ఎస్పీ ఎమ్మెల్యేపై పార్టీ బహిష్కరణ వేటు



లక్నో: ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ప్రశంసించిన సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే పూజాపాల్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీ వ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడుతున్నందునే బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో 24 గంటల మారథాన్ చర్చ సందర్భంగా ఎస్పీ ఎమ్మెల్యే పూజా పాల్ మాట్లాడుతూ తన భర్తను చంపిన అతిక్ అహ్మద్‌పై చర్యలు తీసుకున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. 'నా భర్తను ఎలా చంపారో, ఎవరు చంపారో అందరికీ తెలుసు. ఎవరూ విననప్పుడు నా మాట విన్న ముఖ్యమంత్రికి నేను కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. ప్రయాగ్‌రాజ్‌లో నాలాంటి చాలా మంది మహిళలకు ఆయన న్యాయం చేశారు. నేరస్తులను శిక్షించారు. ఈ రోజు రాష్ట్రం మొత్తం ముఖ్యమంత్రి వైపు నమ్మకంగా చూస్తోంది'అని పూజాపాల్ వ్యాఖ్యానించారు. 'నా భర్తను చంపిన అతిక్ అహ్మద్‌ను ముఖ్యమంత్రి మట్టిలో కలిపేసే పనిచేశారు. నేను ఈ పోరాటంలో అలసిపోతున్నప్పుడు సీఎం యోగి ఆదిత్యనాథ్ నాకు న్యాయం చేశారు'అని ఆమె ప్రశంసించారు. ఆమె వ్యాఖ్యలు సమాజ్‌వాదీ పార్టీలో తీవ్ర నిరసనలకు దారితీశాయి. చీఫ్ విప్ కమల్ అక్తర్ ఆమె ప్రకటనను వ్యక్తిగత విషయంగా అభివర్ణించారు. పార్టీని విభేదిస్తున్నప్పుడు అందులో ఉండకూడదనని వ్యాఖ్యానించారు. అయితే.. కొన్ని గంటల్లోనే పూజా పాల్‌పై పార్టీ కఠిన చర్య తీసుకుంది. ఆమెను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ఎస్పీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సంతకం చేసిన లేఖ బయటికి వచ్చింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం కారణాంగానే ఆమెను తొలగిస్తున్నట్టు పేర్కొన్నారు. ముందే హెచ్చరించినప్పటికీ, పూజా పాల్ తన కార్యకలాపాలను ఆపలేదని, దీనివల్ల పార్టీకి నష్టం కలిగిందని లేఖలో వెల్లడించారు. ఆమెను పార్టీలోని అన్ని పదవుల నుంచి తొలగిస్తున్నామని, ఇకపై ఎస్పీ కార్యక్రమాలు, సమావేశాలకు ఆహ్వానించబోమని కూడా స్పష్టం చేశారు.

రాజు పాల్ హత్య...

పూజా పాల్ భర్త, బహుజన సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అయిన రాజు పాల్.. 2005 జనవరిలో తన వివాహమైన తొమ్మిది రోజులకే హత్యకు గురయ్యారు. అలహాబాద్ వెస్ట్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికలో అతిక్ అహ్మద్ సోదరుడు అష్రఫ్ అహ్మద్‌ను ఆయన ఓడించారు. అయితే.. తరువాత అహ్మద్, అష్రఫ్‌లను వేర్వేరు కేసులో దోషులుగా నిర్ధారించి జైల్లో పెట్టారు. 2023 ఏప్రిల్ 15న రాత్రి, అతిక్ అహ్మద్, అతని సోదరుడు అష్రఫ్‌లను సాధారణ వైద్య పరీక్ష కోసమని ప్రయాగ్‌రాజ్‌లోని కోల్విన్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. రాత్రి 10:36 గంటల ప్రాంతంలో, పోలీసు ఎస్కార్ట్‌లో మీడియాతో మాట్లాడుతుండగా, జర్నలిస్టులుగా నటిస్తున్న ముగ్గురు దుండగులు పాయింట్-బ్లాంక్ రేంజ్ నుండి కాల్పులు జరిపారు. ఇద్దరు సోదరులు అక్కడికక్కడే మరణించారు. దాడి చేసిన వారిని వెంటనే పోలీసులు అరెస్టు చేశారు.

50 ఏళ్లైనా చెక్కు చెదరని రోడ్డు

పుణేలోని ఈ రోడ్డు పౌర ఇంజనీరింగ్ అద్భుతం

ఈ రోజు వేస్తే.. నెల రోజుల తరువాత గుంతలు. ఇది ఇటీవలి కాలంలో రోడ్ల దుస్థితి. కానీ.. ఆ రోడ్డు వేసిన 50 ఏళ్లకు కూడా చెక్కు చెదరలేదు. 35 ఏళ్ల తరువాత ఒక్కసారి మాత్రమే మళ్లీ తారు వేశారంతే. కేవలం పదేళ్ల వారంటీతో వేసిన రోడ్డు 50 ఏళ్లయినా రిపేరుకు రాకపోవడానికి కారణమేంటి? అసలు ఒక రోడ్డు అన్నేళ్లు గుంతలు పడకుండా ఎలా ఉంటుంది? వేసిన కొద్ది రోజులకే గుంతలు పడేలా రోడ్లేస్తున్న ప్రస్తుత కాంట్రాక్టర్లు, నేతల్ని సిగ్గు పడేలా చేస్తున్న ఆ రోడ్డు ఎక్కడ ఉంది? ఇవన్నీ తెలియాలంటే.. మీరు పుణేకి వెళ్లాల్సిందే. ఆ రోడ్డు.. పుణేలోని జంగ్లీ మహరాజ్ రోడ్డు. దీన్ని బ్లాక్ పాంథర్ లైన్‌గా కూడా పిలుచుకుంటారు. 1976లో 2.5 కిలోమీటర్ల విస్తీర్ణంలో వేశారు. వేసేనాటికి పదేళ్లుంటే చాలనుకున్నారు. కానీ.. కొత్తగా నిర్మించిన రోడ్లు, వంతెనలు కూలిపోతున్నప్పటికీ, దాదాపు 50 ఏళ్ల కిందట నిర్మించిన రోడ్డు మాత్రం ఒక ప్రత్యేకమైన పౌర ఇంజనీరింగ్ అద్భుతంగా నిలిచింది. అయితే.. చెక్కు చెదరకుండా ఉన్నప్పటికీ.. 2014లో మరోసారి తారు వేశారు.

పుణేలోని జంగ్లీ మహరాజ్ రోడ్డులో ప్రసిద్ధ రెస్టారెంట్లు, కొన్ని ముఖ్యమైన దేవాలయాలున్నాయి. రోడ్డు ఎంత బాగుంటుందంటే.. తమ యవ్వనంలో రాత్రి పూట రేస్ ట్రాక్‌గా ఉపయోగించుకునేవాళ్లమని చెబుతున్నారు స్థానికుడు 70 ఏళ్ల ఉపేంద్ర లక్ష్మేశ్వర్. 'ప్రారంభించిన మూడు నెలలకే కర్ణాటకలోని రూ. 6.5 కోట్ల చిక్కోడి వంతెన కూలిపోయింది', 'ప్రారంభించిన మూడు నెలలకే ఢిల్లీ విమానాశ్రయ పైకప్పు గుంతలు', 'గురుగ్రామ్‌లో రోడ్డు గుంతలో భారీ ట్రక్కు దిగబడింది'వంటి కని, వినిపిస్తున్న ఈ కాలంలో నాణ్యమైన మౌలిక సదుపాయాలకు ఇదో మచ్చుతునక అంటారు అతని కొడుకు 40 ఏళ్ల సిద్ధార్థ్ లక్ష్మేశ్వర్. మిగిలిన రోడ్ల నిర్మాణంలో ఈ బ్లాక్ పాంథర్ లైన్ నిర్మాణాన్ని ఎందుకు అనుసరించలేదనేది స్థానికుల ప్రశ్న.

విశ్వాత్మక్ గురుదేవ్ అని కూడా పిలుచుకునే జంగ్లి మహరాజ్ 1818లో బరోడాలో (ఇప్పుడు గుజరాత్‌లోని వడోదర) జన్మించారు. పుణేలోని శివాజీనగర్‌లో ఉన్న దట్టమైన భంబుర్డే అడవులలో ధ్యానం చేశారు. అక్కడే ఇప్పుడు రోడ్డు ఉంది. 1972లో మహారాష్ట్ర తీవ్రమైన కరువును ఎదుర్కొంది. ఆ తర్వాత 1973లో వరదలు పుణే రోడ్లను ధ్వంసం చేశాయి. అయితే ముంబై రోడ్లు మాత్రం ఆ వరదలను తట్టుకున్నాయి. అప్పట్లో 21 ఏళ్ల కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ అయిన శ్రీకాంత్ శిరోలే దీని గురించి ఆరా తీశారు. మన్నికైన రోడ్ల కోసం అధునాతన హాట్ మిక్స్ టెక్నాలజీని ఉపయోగించిన పార్సీ యాజమాన్యంలోని ముంబై కంపెనీ రెకొండో వేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. పుణేలోని రోడ్లను అదే కంపెనీకి అప్పజెప్పారు. రోడ్డు 10 సంవత్సరాల పాటు గుంతలు లేకుండా ఉంటుందని, ఆలోపు ఏవైనా మరమ్మతులు వస్తే ఎటువంటి ఖర్చు లేకుండా చేస్తామనే హామీతో వేశారు. 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ రోడ్డును 1976 జనవరి 1న ప్రారంభించారు. ఆ రోడ్డు పూర్తిగా చెక్కుచెదరకుండా ఉంది. 2014లో పుణే స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా రోడ్డును పూర్తిగా మార్చారు. సైకిల్ ట్రాక్, విశాలమైన కాలిబాటలు, మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రీకౌంట్‌తో మారిన హరియాణా సర్పంచ్ ఎన్నిక ఫలితం

సుప్రీంకోర్టు చొరవతో ఈవీఎంల ఓట్ల లెక్కింపు

న్యూఢిల్లీ: హరియాణాలోని పానీపట్ జిల్లా బానా లాఖా గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో తానే గెలిచానని సుప్రీంకోర్టును ఆశ్రయించిన మోహిత్ కుమార్ అనే అభ్యర్థికి ఎట్టకేలకు భారీ ఊరట లభించింది. మూడేళ్ల క్రితం నాటి సర్పంచ్ ఎన్నికల్లో అతనే గెలిచాడని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ప్రకటించింది. ఒక్క బూత్‌లో కాకుండా అన్ని బూత్‌లలోని ఈవీఎంల ఓట్లను రీకౌంటింగ్ చేయడంతో అసలైన విజేత ఎవరనేది స్పష్టమైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2022 నవంబర్ రెండో తేదీన సర్పంచ్ ఎన్నికలు జరగ్గా తర్వాత ఓట్లు లెక్కించి కుల్దీప్ సింగ్‌ను విజేతగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని అదనపు జిల్లా జడ్జి(సీనియర్‌డివిజన్)/ఎలక్షన్ ట్రిబ్యూనల్‌లో అభ్యర్థి మోహిత్ సవాల్ చేశారు. అయితే వివాదాస్పదంగా మారిన కేవలం 69వ నంబర్ బూత్‌లోని పోలైన ఓట్లను మాత్రమే లెక్కించేందుకు ట్రిబ్యూనల్ అనుమతి మంజూరుచేసింది. దీంతో మోహిత్ పంజాబ్, హరియాణా హైకోర్టును ఆశ్రయించారు. ఒక్క బూత్‌లో రీకౌంటింగ్ సహేతుకం కాదంటూనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మోహిత్‌కు హైకోర్టు సూచించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో కేసు వేశారు. దీంతో అన్ని బూత్‌లలోని వినియోగించిన ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను రీకౌంటింగ్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వీడియోగ్రఫీ తీస్తూ అధికారుల సమక్షంలో ఓట్లు లెక్కించారు. దీంతో కుల్దీప్‌కు 1,000 ఓట్లు, మోహిత్‌కు 1,051 ఓట్లు పడినట్లు ఫలితమొచ్చింది. రెండ్రోజుల్లో మోహిత్ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టేలా ఆదేశాలివ్వాలని డెప్యూటీ కమిషనర్/ఎలక్షన్ ఆఫీసర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఓట్ల చోరీపై ఇక ప్రత్యక్ష యుద్ధం: రాహుల్

న్యూఢిల్లీ: దేశంలో ఓట్ల చోరీపై తమ ఆందోళన అనేది కేవలం రాజకీయ అంశం కాదని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, 'ఒక్కరికి ఒక ఓటు'అనే విధానాన్ని కాపాడుకొనేందుకు జరుగుతున్న నిర్ణయాత్మక పోరాటం అని స్పష్టంచేశారు. 'ఓటర్ అధికార్ యాత్ర'ద్వారా ఓట్ల చోరీపై బిహార్ గడ్డపైనుంచే ప్రత్యక్ష యుద్ధం ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. ఈ మేరకు రాహుల్ గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. దేశవ్యాప్తంగా స్వేచ్ఛమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా కోసం తమ పార్టీ పోరాడుతోందని ఉద్ఘాటించారు. ఈ నెల 17వ తేదీ నుంచి ఓటర్ అధికార్ యాత్ర ప్రారంభమవుతుందని, యువత, కార్మికులు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఇదొ క ప్రజా ఉద్యమం అని పేర్కొన్నారు. ఓట్ల దొంగల ను ఎన్నికల్లో ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఓట్ల చోరు లు ఓడిపోతేనే ప్రజలకు, రాజ్యాంగానికి విజయం లభిస్తుందన్నారు. ఓటర్ అధికార్ యాత్రకు సంబంధించిన ఓ వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియాను షేర్ చేశారు.

ఆలయ నిర్వాహకులే పూడ్చాలని ఆదేశించారు

మాజీ పారిశుద్ధ్యకార్మికుని సంచలన ఆరోపణ

ధర్మస్థల వివాదంలో కొత్త అంశాలు వెలుగులోకి

బెంగళూరు: కర్ణాటకలో అత్యంత వివాదాస్పదంగా మారిన మృతదేహాల పూడ్చివేత ఉదంతంలో ధర్మస్థల ఆలయ నిర్వాహకులే గుర్తుతెలియని మృతదేహాలను అటవీ ప్రాంతాల్లో పూడ్చిపెట్టాలని తనను ఆదేశించారని మాజీ పారిశుద్ధ్యకార్మికుడు భీమ తాజాగా ప్రకటించారు. ఇండియాటుడేకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో భీమ ఇలాంటి సంచలన విషయాలను తొలిసారిగా పంచుకున్నారు. ''నేను, నాతోపాటు మరికొందరం కలిసి డజన్ల కొద్దీ మృతదేహాలను 1995 నుంచి 2014కాలంలో అటవీ ప్రాంతాల్లో వేర్వేరు చోట్ల పూడ్చిపెట్టాం. మృతుల్లో చాలావరకు మహిళలు, చిన్నారులే. ఆనాడు పారిశుద్ధ్యకార్మికునిగా పనిచేశా. అయితే మృతదేహాలను పూడ్చిపెట్టాలని స్థానిక ప్రభుత్వ యంత్రాంగం నుంచిగానీ గ్రామపంచాయితీ అధికారులుగానీ ఆదేశించలేదు. కేవలం ధర్మస్థల ఆలయ సమాచార కేంద్రం నిర్వాహకులు, అధికారులే మాకు ఈ ఆదేశాలిచ్చారు. మేం ఏ ఒక్క మృతదేహాన్ని స్మశానవాటికలో ఖననంచేయలేదు. అన్నింటినీ అడవిలోనే పాతిపెట్టాం. పాత రోడ్లు, నదీ పరివాహక ప్రాంతాల్లో పూడ్చిపెట్టాం. బాహుబలి కొండల్లో ఒక మహిళను పూడ్చిపెట్టాం. నేత్రావతి స్నానఘట్టం సమీపంలో ఏకంగా 70 మృతదేహాలను పాతిపెట్టాం. ఇప్పటికే అధికారులు తవ్వకాలు జరిపిన 13వ చోట అయితే నాకు గుర్తుండి దాదాపు 70, 80 మృతదేహాలను పూడ్చిపెట్టాం. కొన్ని సార్లు పూడ్చేటప్పుడు స్థానికులు మమ్మల్ని గమనించారు. కానీ ఎవరూ మాకు అడ్డుచెప్పలేదు'అని ప్రజావేగుగా మారిన భీమ చెప్పారు.

> **70 శవాలను నేనే పూడ్చా**
>
> ''దాదాపు 70, 80 మృతదేహాలను స్వయంగా నేనే పూడ్చిపెట్టా. కొన్నింటిని నేలలో చాలా లోతులో పూడ్చిపెట్టాం. మరికొన్నింటిని కొండల మీద పాతిపెట్టాం. ఆలయ ఇన్ఫర్మేషన్ సెంటర్ యాజమాన్యం సూచించిన ప్రాంతాల్లో మాత్రమే శవాలను పూడ్చిపెట్టాం. ఆలయ మేనేజర్ ఎప్పుడూ నన్ను నేరుగా కలవలేదు. రూమ్ బాయ్ ద్వారా మాకు ఆదేశాలు అందేవి. వాటిని మేం అమలుచేసేవాళ్లం. మేం పూడ్చిన ప్రాంతాల్లోనే భవన నిర్మాణాలు జరిగాయి. అందుకే సిట్ తవ్వకాలు జరిపిన చోట్ల మృతదేహాల ఆనవాళ్లు లభించట్లేదేమో. పట్టపగలే మేం మృతదేహాలను పూడ్చాం''అని భీమ చెప్పారు.

లైంగిక వేధింపుల గుర్తులు

''మృతదేహాలను చూస్తే హింసకు, లైంగిక వేధింపులకు గురైనట్లు స్పష్టంగా తెలిసేది. మృతదేహాలపై గాయాలైన గుర్తులుండేవి. హింసించి చంపేశారని అర్థమయ్యేది. కానీ వాస్తవంగా లైంగిక వేధింపులు జరిగాయో లేదో వైద్యనిపుణులే చెప్పగలరు'' అని భీమ అన్నారు. ''చిన్నారుల మొదలు వృద్ధుల దాకా అన్ని వయసుల వాళ్ల మృతదేహాలను మేం పూడ్చిపెట్టాం. వంద మృతదేహాల్లో దాదాపు 90 దాకా మహిళలవే. అడవిలో వర్షాల కారణంగా నేల కోతకు గురవ్వడం, అటవీ ప్రాంతందాకా నివాస భవన నిర్మాణాలు జరగడంతో ఇప్పుడు కొన్ని పూడ్చిన స్థలాలను గుర్తుపట్టడం కష్టమే. గతంలో నేను గుర్తుపట్టడానికి అక్కడో రోడ్డు ఉండేది. జేసీబీ తవ్వకాలతో ఇప్పుడా రహదారి మార్గం గుర్తించలేని పరిస్థితి తలెత్తింది. గతంలో కొన్ని చోట్ల చెట్లు తక్కువ ఉండేవి. ఇప్పుడు బాగా చెట్లు పెరిగి ఆ ప్రాంతం గుర్తుపట్టలేనంతగా మారిపోయింది''అని అన్నారు.

నేను సిట్‌ను నమ్మినా వాళ్లు నన్ను నమ్మట్లేరు

''ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణను నేను పూర్తిగా నమ్ముతున్నా. కానీ సిట్ అధికారులు నేను చెప్పేది విశ్వసించట్లేరు. వాళ్ల దర్యాప్తు ధోరణి చూస్తుంటే నాకు విసుగొస్తోంది. నాకు గుర్తున్నమేరకు ఆయా చోట్లను చూపిస్తున్నా. సిట్ అధికారులు పైపైన తవ్వేసి ఏమీ దొరకట్లేదని నాపై నమ్మకం పోగొట్టుకుంటున్నారు. గుర్తుపట్టలేనంతగా మారిన ఆయా ప్రాంతాల్లో మరింత విస్తృతస్థాయిలో తవ్వకాలు జరిపితే ఆధారాలు లభిస్తాయి. 13వ నంబర్ స్పాట్‌సహా కనీసం మరో నాలుగైదు చోట్ల తవ్వాల్సిందే. నాతోపాటు మృతదేహాలు పూడ్చినవాళ్లను సిట్ రప్పిస్తే ఈ వెతుకులాట సులభమవుతుంది. పశ్చాత్తాపంతోనే రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ధర్మస్థలకు వచ్చి పచ్చి నిజాలు బయటపెట్టా. కలలో ఎప్పుడూ అస్థిపంజరాలే కనిపించేవి. అనామకులను పూడ్చిపెట్టానన్న పాపభీతి నన్ను వెంటాడింది. ఆ భయం, భారం తగ్గించుకునేందుకు మీడియా ముందుకొచ్చి జరిగిందంతా చెబుతున్నా. పూడ్చిన కళేబరాలకు ఇకనైనా గౌరవప్రదంగా మర్యాదపూర్వకంగా అంతిమసంస్కారాలు జరగాలని ఆశిస్తున్నా. ధర్మస్థల ఆలయ పరువును మంటగలపడం నా ఉద్దేశం కానేకాదు. నేనెక్కిడికీ పారిపోవాల్సిన అవసరం లేదు. పూడ్చిన ప్రాంతాల గుర్తింపునకు సాయపడతా. తర్వాత నా స్వస్థలానికి వెళ్లిపోతా. మృతదేహాలపై ఉండే బంగారు ఆభరణాలను నేను దొంగతనం చేశానన్న ఆరోపణల్లో నిజం లేదు. బంగారమే దోచేస్తే ఇన్నాళ్లూ పారిశుద్ధ్యకార్మికునిగా బతుకీడ్చాలిన అగత్యమెందుకు?. నేను అలాంటి తప్పుడు పనులు చేయను. నేను హిందువును. అందులోనూ షెడ్యూల్డ్ కులస్తుడను''అని భీమ అన్నారు.

ఒకరు దాడికి సిద్ధంగా ఉండగా.. మరొకరు దొంగతనం..

ఇండోర్‌లో మాజీ న్యాయమూర్తి ఇంట్లో దోపిడీ

ఇండోర్: ముఖాలకు ముసుగులు, చేతులకు గ్లోవ్స్ ధరించిన ముగ్గురు దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. ఏకంగా బెడ్‌రూమ్‌లోకి వెళ్లారు. బెడ్‌మీద నిద్రపోయిన వ్యక్తి లేస్తే.. కొట్టడానికి సిద్ధంగా ఒకరు చేతిలో రాడ్ పట్టుకుని ఉండగా.. మరొకరు బీరువాలో ఉన్న సొమ్మును దొంగిలించారు. ఇంకొకరు డోర్ దగ్గర కాపలాగా ఉన్నారు. దాదాపు 20 నిమిషాల పాటు ప్రశాంతంగా ఇంటిని దోచుకున్నారు. అయితే.. హెచ్చరిక అలారం మోగినప్పటికీ ఇంట్లో ఉన్న వ్యక్తి నిద్ర లేవలేదు. దుండగులు రూ.లక్షల నగదు, విలువైన వస్తువులను తీసుకెళ్లారు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గౌహతి హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రమేష్ గార్గ్ ఇంట్లో జరిగిన దోపిడీ. ఈ ఘటనంతా ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డైంది. దోపిడీ జరిగిన సమయంలో అతని కుటుంబం గాఢ నిద్రలో ఉంది. ఈ సంఘటన రక్షా బంధన్ రోజున జరిగింది. అదే రోజు సమీపంలోని అనేక ప్రాంతాల్లో దోపిడీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌లను స్వాధీనం చేసుకోగా విషయం వెలుగులోకి వచ్చింది. అన్ని చోట్లా దొంగలు ముసుగులు, చేతులకు గ్లోవ్స్ ధరించి ఉన్నారు. దొంగతనాలు చాలా పద్ధతిగా చేసినట్లు కనిపిస్తోంది. దీంతో.. వీటిపై దర్యాప్తు చేయడానికి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

అంతా అధికారుల నిర్వాకమే

వారి నిర్లక్ష్యం వల్లే ఢిల్లీలో వీధి కుక్కల సమస్య

- సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఆగ్రహం
- తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వీధి కుక్కల సమస్యకు స్థానిక అధికారుల నిర్లక్ష్యమే కారణమని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. శునకాల నియంత్రణకు వారి చేసిందేమీ లేదని, అందుకే పరిస్థితి ఇక్కడికి దాకా వచ్చిందని మండిపడింది. వీధి శునకాల అంశంపై సుప్రీంకోర్టుకు సంబంధించిన మరో ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై ప్రత్యేక త్రిసభ్య ధర్మాసనం గురువారం సుమోటోగా విచారణ చేపట్టింది. ఇదే వ్యవహారానికి సంబంధించిన ఇతర పిటిషన్లపైనా విచారణ జరిపింది. జస్టిస్ విక్రం నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాతో కూడిన ఈ ధర్మాసనం ఢిల్లీలో వీధి శునకాల సమస్యపై ఆందోళన వ్యక్తం చేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ లాయర్ కపిల్ సిబల్, ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఢిల్లీలోని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలంటూ జస్టిస్ జె.బి.పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 11న ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని కపిల్ సిబల్ కోరారు. దీనిపై త్రిసభ్య ధర్మాసనం స్పందిస్తూ.. మొత్తం సమస్యకు స్థానిక అధికారులే కారణమని ఆక్షేపించింది. ''పార్లమెంట్‌లో చట్టాలు చేస్తారు. నిబంధనలు తీసుకొస్తారు. కానీ, వాటిని అమలు చేయడం మర్చిపోతారు. దానివల్లే ఇలాంటి సమస్యలు వస్తుంటాయి. శునకాల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు శునకాలను కూడా గౌరవంగా చూడాలని జంతు ప్రేమికులు కోరుతుంటారు. కుక్కలను కాపాడాలని ఎన్జీవోలు డిమాండ్ చేస్తున్నాయి. జంతు జననాల నియంత్రణ నిబంధనల అమలు కోసం ఎన్జీవోలు ఏనాడైనా కృషి చేశాయా? యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా గానీ, స్థానిక అధికార యంత్రాంగం గానీ, ప్రభుత్వం గానీ ఏమీ చేయలేకపోయాయి. కోర్టు దాకా వచ్చేవారు శునకాల విషయంలో బాధ్యత కూడా తీసుకోవాలి. కుక్కల దాడిలో ఎంతోమంది చనిపోతున్నారు. ఇది కచ్చితంగా పరిష్కరించాల్సిన సమస్య. జంతువులను ద్వేషించేవారు ఎవరూ లేరు. 100 రకాల పాముల్లో నాలుగు మాత్రమే విషపూరితమైనవి. అలా అని చెప్పి పాములను తెచ్చి ఇంట్లో పెట్టుకోలేం కదా! కుక్కలను చంపాలని ఎవరూ చెప్పడం లేదు. కానీ, వాటిని మనుషుల నివాసాలకు దూరంగా ఉంచాల్సిన అవసరం ఉంది''అని త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. తమ ఉత్తర్వును రిజర్వ్ చేసింది.

ఆపరేషన్ సిందూర్ యోధులకు
వీర్‌చక్ర పురస్కారాలు

వాయుసేనలో తొమ్మిది మందికి, ఆర్మీలో నలుగురికి వీర్‌చక్ర ప్రకటించిన రాష్ట్రపతి

వింగ్ కమాండర్ అభిమన్యు సింగ్‌కు శౌర్య చక్ర



న్యూఢిల్లీ: ముష్కరమూకల స్థావరాలను నేలమట్టంచేసి భారత సైనిక సత్తాను చాటిన ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా అమలుచేసిన తొమ్మిది మంది వాయుసేన పైలెట్లకు భారత ప్రభుత్వం వీర్‌చక్ర పురస్కారం ప్రకటించింది. సర్వసైన్యాధ్యక్ష హోదాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పలువురికి గ్యాలంట్రీ అవార్డ్‌లను ప్రకటించారు. యుద్ధకాలంలో ఇచ్చే మూడో అత్యున్నత గ్యాలంట్రీ అవార్డ్ అయిన వీర్‌చక్రను వాయుసేనకు చెందిన తొమ్మిది మంది పైలెట్లకు ప్రకటించారు. గ్రూప్ కెప్టెన్లు రంజిత్ సింగ్ సిధూ, మనీశ్ అరోరా, అనిమేశ్ పట్నీ, కునాల్ కల్రాలకు వీర్‌చక్ర ప్రకటించారు. వింగ్ కమాండర్ జోయ్ చంద్ర, స్క్వాడ్రన్ లీడర్లు సర్థక్ కుమార్, సిద్ధాంత్ సింగ్, రిజ్వాన్ మాలిక్, ఫ్లయిట్ లెఫ్టినెంట్ ఏఎస్ ఠాకూర్‌లకూ వీర్‌చక్ర ప్రకటించారు. ఆర్మీ తరఫున కల్నల్ కోశాంగ్ లాంబా, లెఫ్టినెంట్ కల్నల్ సుశీల్ బిష్ట్, నాయిబ్ సుబేదార్ సతీశ్ కుమార్, రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌లకూ వీర్‌చక్ర దక్కింది. యుద్ధకాల గ్యాలంట్రీ అవార్డుల్లో పరమ్ వీర్‌చక్ర, మహావీర్ చక్ర తర్వాత వీర్‌చక్రను మూడో అత్యున్నత అవార్డ్‌గా పరిగణిస్తారు. గ్యాలంట్రీ అవార్డ్‌ల జాబితాను గురువారం మోదీ ప్రభుత్వం విడుదలచేసింది. మేలో పాక్‌నుంచి దూసుకొచ్చిన క్షిపణులు, డ్రోన్లను ఎస్-400 గగనతల రక్షణవ్యవస్థ సాయంతో నేలకూల్చిన భారతవాయుసేన సిబ్బందికి సైతం గ్యాలంట్రీ అవార్డ్‌లు దక్కాయి. మరికొందరికి సర్వోత్తమ్ యుద్ధ సేవా మెడల్లను ప్రకటించారు. పాక్‌లోని లష్కరే తోయిబా ఉగ్రస్థావరాలను నేలమట్టంచేసిన సౌత్ వెస్టర్న్ ఎయిర్ కమాండ్, వెస్టర్న్ ఎయిర్ కమాండ్‌లకు సారథ్యం వహించిన ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్, ఎయిర్ మార్షల్ జీతేంద్ర మిశ్రాలకూ సర్వోత్తమ్ యుద్ధసేవా మెడల్‌ను ప్రకటించారు. కేవలం వింగ్ కమాండర్ అభిమన్యు సింగ్‌కు మాత్రమే శౌర్య చక్ర ఇచ్చారు. మొత్తంగా భారతవాయుసేన నుంచి నలుగురికి సర్వోత్తమ్ యుద్ధ సేవా మెడల్, నలుగురికి ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్, తొమ్మిది మందికి వీర్ చక్ర, ఒకరికి శౌర్య చక్ర, 13 మందికి యుద్ధ సేవా మెడళ్లు, 26 మందికి యువసేవా మెడళ్లు, 162 మందికి ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నందుకు 'మెన్షన్-ఇన్-డెస్పాచెస్' దక్కాయి. రాష్ట్రపతి ముర్ము మొత్తంగా 127 గ్యాలంట్రీ అవార్డ్‌లు ప్రకటించారు.

భారతీయ గ్రీన్‌కార్డ్ దరఖాస్తుదారులకు స్వల్ప ఊరట

వాషింగ్టన్: ఉపాది ఆధారిత(ఈబీ) కేటగిరీలో తమ కుటుంబసభ్యులకు గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసుకునే భారతీయ గ్రీన్‌కార్డ్‌దారులకు అమెరికా ప్రభుత్వం స్వల్ప ఊరట అందించింది. తమ జీవితభాగస్వామి, 21 ఏళ్ల వయసులోపు సంతానానికి సైతం గ్రీన్‌కార్డ్ రావాలని ఆశించే భారతీయ గ్రీన్‌కార్డుదారులు సమర్పించే దరఖాస్తులకు పరిశీలన గడువును పొడిగించారు. సాధారణంగా ఏప్రిల్ ఒకటో తేదీలోపు తేదీని కటాఫ్ తేదీగా పరిగణిస్తారు. కానీ ఈసారి జూన్ ఒకటోతేదీని కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుంటామని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. గడువు పొడిగించిన నేపథ్యంలో కాస్త ఆలస్యమైనాసరే అర్హత గల భారతీయ గ్రీన్‌కార్డ్‌దారులు తమ కుటుంబసభ్యుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లభించింది. ఉపాధి ఆధారిత(ఈబీ) కేటగిరీ కింద వచ్చే భారతీయ దరఖాస్తులను ఈబీ-2, ఈబీ-3 దరఖాస్తులుగా వ్యవహరిస్తారు. జీవితభాగస్వామి, 21ఏళ్లలోపు పెళ్లికాని తమ సంతానం కోసం ఎఫ్2ఏ కేటగిరీ కింద భారతీయులు దరఖాస్తుచేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులకు గడువు తేదీ ఏప్రిల్ ఒకటో తేదీనే ముగుస్తున్నప్పటికీ భారతీయ గ్రీన్‌కార్డ్‌దారులకు మాత్రం జూన్ ఒకటో తేదీదాకా అనుమతిస్తున్నట్లు 'యూఎస్ వీసా బులెటిన్, సెప్టెంబర్-2025'పేర్కొంది. 2025 ఏడాదికిగాను కుటుంబ ఆధారిత గ్రీన్‌కార్డ్‌లను 2,26,000కు పరిమితం చేశారు. ఉపాధి ఆధారిత(ఈబీ) కేటగిరీలో గ్రీన్‌కార్డ్‌లకు సైతం 1,50,037గా పరిమితి విధించారు. ఇక వీసాల విషయానికొస్తే మొత్తం వీసాల్లో ప్రతి దేశం తమ కోటా కింద 7 శాతం వరకు అంటే దాదాపు 26,323 వరకు వీసాలు పొందొచ్చు. డిపెండెంట్ వీసా అనేది ప్రతీదేశానికి గరిష్ఠంగా 2 శాతమే ఇస్తారు. చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ తరహాలో భారత్‌కు సైతం దేశాలవారీ కోటా కిందే వీసాలు దక్కుతున్నాయి. మరోవైపు సెప్టెంబర్ 30వ తేదీలోపు డైవర్సిటీ ఇమిగ్రేషన్ వీసా కోసం దరఖాస్తుచేసుకోవాలని వీసా బులెటిన్‌లో అమెరికా ప్రభుత్వం పేర్కొంది. లాటరీ విధానంలో ప్రతి ఏటా 55,000 మందికి ఈ వీసాలను అందజేస్తారు. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, చైనా, బ్రెజిల్, నైజీరియాసహా 20 దేశాలకు చెందిన వారికి మాత్రమే ఈ వీసా ఇస్తారు.

భారతదేశం.. రాష్ట్రాల యూనియన్



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత భూభాగం - భారత యూనియన్

రాష్ట్రాల ఏర్పాటు-పునర్ వ్యవస్థీకరణ

భారత దేశంలో సమాఖ్య వ్యవస్థ ఉంది. కేంద్ర, రాష్ట్రాలు రాజ్యాంగ పరంగా అధికార విభజన సూత్రం ఆధారంగా పనిచేస్తాయి. సమాఖ్య, రాష్ట్రాల ఏర్పాటు, పునర్ వ్యవస్థీకరణ తదితర అంశాలను ఒకటో భాగంలో ప్రకరణలు 1 నుంచి 4 వరకు ప్రస్తావించారు.

భారత భూభాగం

ప్రకరణ-1

ఈ ప్రకరణ ప్రకారం, భారత భూభాగం అంటే రాష్ట్రాల సరిహద్దులు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వం సముపార్జించిన ఇతర భూభాగాలు ఉంటాయి.

భారత భూభాగం అనే భావన విస్తృతమైంది. భారత సార్వభౌమాధికారం ఏ విధంగా విస్తరించి ఉంటుందో తెలుపుతుంది. భారత సార్వభౌమాధికారం భౌగోళిక ప్రాంతాలకే పరిమితం కాదు. భారత సముద్ర ప్రాదేశిక జలాలు 12 నాటికల్ మైళ్ల వరకు, విశిష్ట ఆర్థిక మండళ్లు 200 నాటికల్ మైళ్ల వరకు, అలాగే భారత అంతరిక్ష సరిహద్దులకూ సార్వభౌమాధికారం వర్తిస్తుంది.

భారత యూనియన్

ఇందులో రాష్ట్రాలు మాత్రమే ఉంటాయి. రాష్ట్రాలు సమాఖ్యలో అంతర్భాగంగా ఉంటూ నిర్ణీత అధికారాలను కలిగి ఉంటాయి. ఈ పదం కేంద్ర రాష్ట్ర సంబంధాలను సూచిస్తుంది.

రాష్ట్రాల సమ్మేళనం

భారత రాజ్యాంగం, ఒకటో ప్రకరణలో భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొంది. సమాఖ్య అనే పదాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. కెనడా సమాఖ్యను స్ఫూర్తిగా తీసుకుని యూనియన్ అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చారు.

భారత సమాఖ్య అమెరికాలా రాష్ట్రాల మధ్య ఒప్పందం ద్వారా ఏర్పడలేదు. అలాగే కెనడా మాదిరిగా ఏకకేంద్ర రాజ్యం సమాఖ్యగా విభజితమవలేదు. భారత సమాఖ్య ఒక ప్రత్యేక పద్ధతిలో ఏర్పడింది.

కేంద్ర రాష్ట్రాల మధ్య ఒప్పందం లేదు. కాబట్టి యూనియన్ నుంచి రాష్ట్రాలు విడిపోలేదు. అమెరికా సమాఖ్యలో ప్రారంభంలో రాష్ట్రాలకు కేంద్రం నుంచి విడిపోయే హక్కు ఉండేది. అయితే ఆ హక్కును తర్వాత రద్దు చేశారు.

కాబట్టి భారత సమాఖ్యను విచ్ఛిన్నం కాగల రాష్ట్రాల, అవిచ్ఛిన్న యూనియన్ (ఇన్ డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ డెస్ట్రక్టిబుల్ స్టేట్స్)గా పేర్కొంటారు. అమెరికాను ఇన్‌డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ ఇన్‌డెస్ట్రక్టిబుల్ స్టేట్స్‌గా పేర్కొంటారు.

ప్రకరణ-2

ఈ ప్రకరణ ప్రకారం పార్లమెంటు ఒక చట్టం ద్వారా కొత్త ప్రాంతాలను చేర్చుకోవచ్చు, ఇతర దేశాలకు బదిలీ చేయవచ్చు. ఈ అధికారం భారత భూభాగంలో లేని అంశాలకు వర్తిస్తుంది. ఈ అధికారం పార్లమెంటుకు సంబంధించినదైనా అంతర్జాతీయ ఒప్పందాలకు లోబడి ఉంటుంది.

వివరణ..

విదేశీ భూభాగాలను భారతదేశంలో చేర్చుకున్నప్పుడు పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలి.

ఉదాహరణ: 1961లో గోవాను భారత్‌లో కలిపినప్పుడు 12వ రాజ్యాంగ సవరణ చేశారు. అలాగే పాండిచ్చేరికి సంబంధించి 1962లో 14వ రాజ్యాంగ సవరణ చేశారు. 1975లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను భారత రాష్ట్రంగా చేర్చుకున్నారు.

ప్రకరణ-3

ఇందులో కింది అంశాలు ఉన్నాయి.

- కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం.
- రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలను కలిపి నూతన రాష్ట్రం ఏర్పాటు.(ఆంధ్ర రాష్ట్రం, హైదరాబాద్ కలయికతో 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు). అలాగే రాష్ట్రాన్ని విడగొట్టి కొత్త రాష్ట్రం ఏర్పాటు చేయడం. (2014 జూన్‌లో ఏర్పడిన తెలంగాణ)
- రాష్ట్ర విస్తీర్ణాన్ని పెంచవచ్చు.
- రాష్ట్ర విస్తీర్ణాన్ని తగ్గించవచ్చు.
- రాష్ట్ర సరిహద్దులను సవరించవచ్చు.
- రాష్ట్రాల పేర్లను మార్చవచ్చు.

రాష్ట్రాల ఏర్పాటు - ప్రక్రియ- పద్ధతి

ప్రకరణ 3లో పేర్కొన్న అన్ని అంశాలకు ఒకే ప్రక్రియ ఉంటుంది.

- పై అంశాలకు సంబంధించిన బిల్లును పార్లమెంటులోని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.

వివరణ..

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లులో ఆర్థిక వనరుల పంపకాలు ఉంటే అది స్పెషల్ కేటగిరీ బిల్లు అవుతుంది. అలాంటి సందర్భాల్లో బిల్లును లోక్‌సభలోనే ప్రతిపాదించాలి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఈ వివాదాన్ని గమనించవచ్చు.

- పై బిల్లులను రాష్ట్రపతి పూర్వ అనుమతితోనే ప్రవేశపెట్టాలి.
- ఈ షరతును 1955లో అయిదో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.
- సంబంధిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే ప్రభావితమవుతున్న రాష్ట్ర శాసనసభల అభిప్రాయాన్ని రాష్ట్రపతి కోరతారు.
- సంబంధిత రాష్ట్ర శాసనసభ రాష్ట్రపతి సూచించిన నిర్ణీత సమయంలోనే తమ అభిప్రాయాన్ని తెలపాలి.
- రాష్ట్ర శాసనసభలు వ్యక్తీకరించిన అభిప్రాయాలను పార్లమెంటు పరిగణలోకి తీసుకోవచ్చు లేదా తీసుకోకపోవచ్చు.

వివరణ..

1966లో పంజాబ్ నుంచి హర్యానా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినప్పుడు పంజాబ్‌లో రాష్ట్రపతి పాలన, విధానసభ సుప్తచేతనావస్థలో ఉండటం వల్ల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి నివేదించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును శాసనసభ తిరస్కరించింది.

- పార్లమెంటు ఉభయసభలు సంబంధిత బిల్లును సాధారణ మెజారిటీతో వేర్వేరుగా ఆమోదించాలి. ఉభయసభల మధ్య ప్రతిష్టంభన ఏర్పడితే, సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. బిల్లు వీగిపోతుంది.
- బిల్లును రాష్ట్రపతి తప్పని సరిగా ఆమోదించాలి. పునఃపరిశీలనకు అవకాశం లేదు.
- రాష్ట్రపతి ఆమోదం తెలిపితే బిల్లు చట్టంగా మారుతుంది. దీంతో ప్రక్రియ పూర్తి అవుతుంది.
- కొత్త రాష్ట్రం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనేది కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. దీన్ని అపాయింటెడ్ డేట్ అంటారు.

ప్రకరణ-4

ఈ ప్రకరణ సంబంధిత తదుపరి పరిణామాలను వివరిస్తుంది. ప్రకరణ 2, 3 ప్రకారం ఏదైనా సవరణ చేసినప్పుడు 1, 4 షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలను కూడా తదనుగుణంగా మార్చాలి. దీనికోసం పార్లమెంటు ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం లేదు. ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా, తదనుగుణంగా 1, 4 షెడ్యూల్‌లోని అంశాలు కూడా మార్పునకు గురవుతాయి.

వివరణ

ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా దాన్ని రాజ్యాంగ సవరణగా పరిగణించరు. ఈ అంశాన్ని ప్రకరణ 4(2)లో స్పష్టంగా పేర్కొన్నారు. రాష్ట్రాల ఏర్పాటు, పునర్‌వ్యవస్థీకరణ, ఇతర అంశాలకు రాజ్యాంగ సవరణ తప్పనిసరి కాదు.

వివాదాలు- సుప్రీంకోర్టు తీర్పులు

బెరుబారి యూనియన్ వివాదం-1960

ప్రకరణ 3 ప్రకారం, రాష్ట్రాల సరిహద్దును కుదించే అధికారం పార్లమెంటుకు ఉంది. అయితే ఒక రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేసే అధికారం ఉందా? అనే వివాదం తలెత్తింది. దీనికి సంబంధించి రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరారు. ఈ వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ, రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేయాలంటే ప్రకరణ 368 ప్రకారం పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలని పేర్కొంది. అయితే, అంతర్గతంగా బదిలీ చేసేందుకు సాధారణ మెజారిటీ సరిపోతుంది.

గమనిక: బెరుబారి అనేది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఒక ప్రాంతం. 9 చదరపు మైళ్ల విస్తీర్ణంతో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా పాకిస్తాన్‌కు కొంత భాగాన్ని బదిలీ చేసింది.

బాబూలాల్ మారాండీవర్సెస్ ముంబై స్టేట్ కేస్ (1960)

రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును ఒక్క పర్యాయం మాత్రమే సంబంధిత రాష్ట్ర శాసనసభల అభిప్రాయానికి నివేదిస్తారు. ఒక వేళ ఆ బిల్లులో తర్వాత చేసిన మార్పులకు సంబంధించి మరోసారి రాష్ట్ర పరిశీలనకు పంపాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. **ఉదాహరణ:** తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లాలోని పోలవరం కింది 7 ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించడం.

స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1982)

భారత రాజ్యాంగం నిర్దిష్టమైన సమాఖ్య వ్యవస్థను ఏర్పరచలేదు. నిర్మాణపరంగా సమాఖ్య అయినప్పటికీ ఇది సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాల మిశ్రమంగా పేర్కొంది.

ముళ్ల పెరియార్ పర్యావరణ వివాదం (2006)

నదీజలాల పంపిణీ విషయంపై చట్టాలను చేసే అధికారం రాష్ట్ర శాసనసభకు ఉండదు. ఈ అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుందని సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు చెప్పింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి రెండు రకాల రాజకీయ భాగాలు ఉండేవి.

1. నేరుగా బ్రిటిష్ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న భాగాలు.
2. బ్రిటిష్ సార్వభౌమాధికారం కింద పనిచేసే సంస్థానాలు (స్వదేశీ సంస్థానాలు).

ఆనాడు దేశంలో 552 స్వదేశీ సంస్థానాలు ఉండేవి. బ్రిటిషువారు ప్రకటించిన విలీన ఒప్పందం ప్రకారం 549 స్వదేశీ సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనం అయ్యాయి కానీ హైదరాబాద్, జునాగఢ్, కశ్మీర్ సంస్థానాలు విలీనాన్ని వ్యతిరేకించాయి. కశ్మీర్ భారత్‌లో విలీన ఒప్పందం ద్వారా అంతర్భాగం అయింది. ప్రజాభిప్రాయం ద్వారా జునాగఢ్ భారత్‌లో కలిసిపోయింది. ప్రజాభిప్రాయం ద్వారా కలిసిన మొదటి, చివరి సంస్థానం ఇదే. హైదరాబాద్ సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో అనే పోలీసు చర్య (సైనిక చర్య) ద్వారా విలీనం చేశారు.

1950 నాటికి రాజ్యాంగం ప్రకారం నాలుగు రకాల రాష్ట్రాలు అమలులో ఉండేవి. వీటిని పార్ట్-ఎ, బి, సి, డిగా వర్గీకరించారు. పార్ట్-ఎలో బ్రిటిష్ పాలిత గవర్నర్ ప్రావిన్స్‌లు 9 ఉండేవి. పార్ట్-బిలో శాసనసభ కలిగిన స్వదేశీ సంస్థానాలు 9, పార్ట్-సిలో చీఫ్ కమిషనర్ ప్రాంతాలు 10, పార్ట్-డిలో అండమాన్ నికోబార్ దీవులు ఉండేవి.

నేపథ్యం..

భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే ఉండేది. ఈ డిమాండు మొట్టమొదటి సారి తెరపైకి తెచ్చింది తెలుగువారే.

గమనిక: స్వాతంత్ర్యం రాక ముందు భాషా ప్రాతిపదికన ఏర్పడిన మొదటి రాష్ట్రం ఒడిశా.

- 1913లో బాపట్లలో జరిగిన ఆంధ్రమహాసభ ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు డిమాండ్ చేసింది.
- 1927లో కాంగ్రెస్ సమావేశం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థిస్తూ తీర్మానం చేసింది.
- 1931లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి గాంధీ హాజరైన సందర్భంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండుపై చర్చించాలని భోగరాజు పట్టాభి సీతారామయ్య ప్రతిపాదించారు.

1937లో రాయలసీమ, ఆంధ్ర నాయకుల మధ్య కాశీనాథుని నాగేశ్వరరావు నివాసంలో ఒక ఒప్పందం కుదిరింది. కాశీనాథుని నివాసం పేరు శ్రీభాగ్ కాబట్టి దీన్ని శ్రీభాగ్ ఒప్పందం అంటారు. స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసే సందర్భంలో మద్రాసు, ఆంధ్ర నాయకుల మధ్య తలెత్తిన వివాదాలు ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు బలమైన కారణాలుగా చెప్పొచ్చు.

థార్ కమిషన్ -1948

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుపై పరిశీలనకు రాజ్యాంగ పరిషత్తు 1948లో ఉత్తరప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.కె.థార్ నాయకత్వంలో ఇద్దరు సభ్యులతో (పన్నాలాల్, జగత్ నారాయణ్ లాల్) ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ కేవలం భాషా ప్రాతిపదిక పైన రాష్ట్రాలు ఏర్పాటు చేయడాన్ని తిరస్కరించింది. పరిపాలనా సౌలభ్య ప్రాతిపదికపైనే రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.

జె.వి.పి. కమిటీ

థార్ కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా చెలరేగిన ఆందోళనను విరమింపజేయడానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 1948 డిసెంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య సభ్యులుగా ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ కూడా దేశం మొత్తం మీద రాష్ట్రాల పునర్‌నిర్మాణాన్ని వాయిదా వేయాలని, ఆంధ్ర రాష్ట్రాన్ని మాత్రం దానికి మినహాయింపుగా భావించాలని నివేదించింది.

1952 ఆగస్టు 15 నుంచి 35 రోజుల పాటు గొల్లపూడి సీతారామయ్య శాస్త్రి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. 35 రోజుల తర్వాత ఆచార్య వినోభా భావే అతడి నిరాహారదీక్షను విరమింపజేశారు.

1952 అక్టోబర్ 19 నుంచి మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. దీక్ష 50వ రోజుకు చేరుకున్న సందర్భంగా మద్రాసును సందర్శించిన జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కానీ పొట్టి శ్రీరాములు తన దీక్షను కొనసాగించారు. 58వ రోజున డిసెంబర్ 15న ఆయన అమరుడయ్యారు. పొట్టి శ్రీరాములు మృతితో హింసాత్మక సంఘటనలు చెలరేగాయి. దీంతో 1952 డిసెంబర్ 19న పార్లమెంటులో నెహ్రూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును ప్రకటించారు.

శీతల ప్రాంతాల్లో ఉపయోగించే ఉష్ణమాపకం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

ఉష్ణం

ఉష్ణం ఒక శక్తి స్వరూపం. ఇది ఎల్లప్పుడూ అధిక ఉష్ణోగ్రత ఉన్న వస్తువు నుంచి అల్ప ఉష్ణోగ్రత ఉన్న వస్తువు వైపు ప్రయాణిస్తుంది.

ప్రమాణాలు: ఎర్గ్, జౌల్, కెలోరీ

- ఒక వస్తువు ఉష్ణాన్ని అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'కెలోరీమెట్రీ' అంటారు.
- వస్తువు నుంచి వెలువడే ఉష్ణరాశిని కొలవడానికి బాంబ్ కెలోరీ మీటర్‌ను వాడతారు.

ఉష్ణ ప్రసారం

అధిక ఉష్ణోగ్రత ఉన్న వస్తువు నుంచి అల్ప ఉష్ణోగ్రత ఉన్న వస్తువులోకి ఉష్ణం ప్రయాణించడాన్ని ఉష్ణ ప్రసారం అంటారు. ఇది మూడు పద్ధతుల్లో జరుగుతుంది.

- ఉష్ణ వహనం
- ఉష్ణ సంవహనం
- ఉష్ణ వికిరణం

ఉష్ణ వహనం:
ఒక పదార్థం లేదా వస్తువులోని కణాలు లేదా అణువులు ఎలాంటి స్థానాంతర చలనం చెందకుండా ఉష్ణప్రసారం జరగడాన్ని ఉష్ణ వహనం అంటారు.

ఉదాహరణ: అన్ని ఘన పదార్థాలు, ద్రవస్థితిలో ఉన్న పాదరసం.

ధర్మాలు:

- ఈ ప్రక్రియలో ఉష్ణ ప్రసారం ఆలస్యంగా జరుగుతుంది.
- ఉష్ణ ప్రసారం జరుగుతున్నప్పుడు కణాలకు ఎలాంటి స్థానభ్రంశం ఉండదు.
- ఈ పద్ధతిలో ఉష్ణప్రసారం జరుగుతున్నప్పుడు యానకం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

ఉష్ణ సంవహనం:
ఒక వస్తువు లేదా పదార్థంలోని అణువులు లేదా కణాల స్థానాంతర చలనం వల్ల ఉష్ణప్రసారం జరిగే పద్ధతిని ఉష్ణ సంవహనం అంటారు.

ఉదాహరణ: అన్ని ద్రవ పదార్థాలు (పాదరసం మినహా), వాయు పదార్థాలు.

ధర్మాలు:

- ఈ ప్రక్రియలో కూడా ఉష్ణ ప్రసారం ఆలస్యంగా జరుగుతుంది.
- ఈ పద్ధతిలో కణాలు స్థానాంతరం చెందుతాయి.
- యానకం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

అనువర్తనాలు:

- ఉష్ణ సంవహనం సూత్రం ఆధారంగా పొగ గొట్టాలు, పరిశ్రమల్లో చిమ్నీలు, వెంటిలేటర్లు మొదలైనవి పనిచేస్తాయి.
- భూ పవనాలు, సముద్ర పవనాలు అనేవి కూడా ఉష్ణ సంవహన ధర్మం ఆధారంగా ఏర్పడతాయి. పూర్వకాలంలో తెరచాపలను ఉపయోగించి సముద్ర పవనాల సహా యంతో సరుకులను రవాణా చేసి వ్యాపారం నిర్వహించేవారు. కాబట్టి ఈ సముద్ర పవనాలను వ్యాపార పవనాలు అంటారు.

ఉష్ణ వికిరణం:
యానకంతో నిమిత్తం లేకుండా ఉష్ణ ప్రసారం జరిగే పద్ధతిని ఉష్ణ వికిరణం అంటారు.

ఉదాహరణలు:

- సూర్యుడి నుంచి బయలుదేరిన కాంతి కిరణాలు శూన్యం ద్వారా ప్రసరిస్తూ భూవాతావరణ పొరల్లోకి ప్రవేశించి భూమికి చేరతాయి.
- ఈ విశ్వంలో నక్షత్రాల మధ్య ఉష్ణప్రసారం వికిరణ పద్ధతిలో జరుగుతుంది.
- మండుతున్న జ్వాలకు కొంత దూరంలో ఉన్న వ్యక్తి ఉష్ణశక్తిని వికిరణ రూపంలో పొందుతాడు.

ధర్మాలు:

- ఇది చాలా వేగంగా జరిగే ప్రక్రియ.
- ఈ పద్ధతిలో యానకం ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది.

గమనిక: ఉష్ణవహనం, సంవహన ప్రక్రియల్లో ఉష్ణ ప్రసారం చాలా మెల్లగా జరుగుతుంది. కానీ వికిరణ పద్ధతిలో కాంతి వేగానికి($3\times10^{8}\ ms^{-1}$) సమానమైన వేగంతో ఉష్ణ ప్రసారం జరుగుతుంది.

అనువర్తనాలు:

- ఒక పాత్రలోని వేడి ద్రవాన్ని స్టీలు చెంచాతో తిప్పినప్పుడు ఆ చెంచా వేడెక్కుతుంది. దీనికి కారణం ఉష్ణ వహన ప్రక్రియ.
- ఒక రాగి పాత్ర(ఉష్ణవాహక పదార్థం)లో వేడి ద్రవాన్ని నింపి చెక్క బల్ల(ఉష్ణబంధకం)పై ఉంచినప్పుడు ఆ ద్రవం ఉష్ణాన్ని పరిసరాల్లోని గాలికి కోల్పోయి చల్లబడుతుంది. అంటే ఉష్ణ సంవహన పద్ధతి ద్వారా వేడి ద్రవం తన ఉష్ణాన్ని కోల్పోయి చల్లారుతుంది.
- ఒకవేళ ఈ వేడి పాత్రను ఇనుప బల్లపై ఉంచినప్పుడు ఉష్ణ వహనం(ఇనుప బల్ల), ఉష్ణ సంవహనం(గాలి) పద్ధతుల ద్వారా ద్రవం చల్లారుతుంది.
- భూగోళం.. ఉష్ణ వహనం, ఉష్ణసంవహనం, ఉష్ణవికిరణం పద్ధతుల్లో వేడెక్కుతుంది.

థర్మాస్ ఫ్లాస్క్ (శూన్యనాళిక ఫ్లాస్క్)

థర్మాస్‌ఫ్లాస్క్‌ను సర్ జేమ్స్ డివర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీనిలో వేర్వేరు వ్యాసాలున్న రెండు గాజు నాళాలను ఒకదానిలో మరొకదాన్ని అమరుస్తారు. ఈ గాజు నాళాల అవతలి వైపు సిల్వర్ బ్రోమైడ్ అనే రసాయన పదార్థంతో పూత పూస్తారు. ఈ రెండు నాళాల మధ్యలో శూన్యం ఉండేట్లు చేసి వీటిని ఉష్ణబంధక పదార్థమైన ప్లాస్టిక్ డబ్బాలో అమర్చుతారు.

థర్మాస్‌ఫ్లాస్క్‌లో నింపిన వేడి ద్రవం ఉష్ణ వహనం, సంవహనం, ఉష్ణ వికిరణం అనే మూడు పద్ధతుల్లో కూడా ఉష్ణాన్ని కోల్పోదు. అందువల్ల కొంత సేపటి వరకు ద్రవం వేడిగా ఉంటుంది. అనంతరం ద్రవం ఉష్ణశక్తి యాంత్రిక శక్తిగా మారి క్రమంగా చల్లబడుతుంది.

గమనిక: వస్తువు ఉష్ణాన్ని కోల్పోవడం లేదా గ్రహించడం అనేది దాని స్వభావం, ఉపరితల వైశాల్యంపై ఆధారపడి ఉంటుంది.

- బావిలోని నీటి ఉపరితల వైశాల్యం కంటే చెరువులోని నీటి ఉపరితల వైశాల్యం ఎక్కువ. అందువల్ల చెరువు గ్రహించే, కోల్పోయే ఉష్ణరాశి ఎక్కువ.
- చలి ప్రదేశంలో ఉన్న జంతువులు శరీరాన్ని ముడుచుకోవడం ద్వారా తమలోని ఉష్ణాన్ని కోల్పోకుండా కాపాడుకుంటాయి.

పదార్థాలు - రకాలు

ఉష్ణాన్ని తమ ద్వారా ప్రసారం చేసే ధర్మం ఆధారంగా పదార్థాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

ఉష్ణ వాహకాలు: ఈ పదార్థాల ద్వారా ఉష్ణ ప్రసారం జరుగుతుంది.

ఉదాహరణ: లోహాల్లో అత్యుత్తమ ఉష్ణవాహక పదార్థం వెండి. తర్వాత రాగి, అల్యూమినియం, ఇనుము, పాదరసం, ఉక్కు మొదలైనవి ఉత్తమ ఉష్ణ వాహకాలు.

ఉష్ణ బంధకాలు: ఈ పదార్థాల ద్వారా ఉష్ణ ప్రసారం జరగదు.

ఉదాహరణ: అత్యుత్తమ ఉష్ణబంధక పదార్థం వజ్రం. తర్వాత ప్లాస్టిక్ వస్తువులు, రబ్బరు, చెక్కదిమ్మె, దూది, దుస్తులు, కాగితం, థర్మోకోల్ మొదలైనవి ఉత్తమ ఉష్ణ బంధకాలు.

- వంటపాత్రల తయారీకి ఉష్ణ వాహక పదార్థాలను వాడతారు. వాటి పిడుల తయారీకి మాత్రం ఉష్ణ బంధక పదార్థాలను వినియోగిస్తారు.
- నీరు, గాలి అధమ ఉష్ణ వాహకాలు.
- మంచు, మానవ శరీరం మంచి విద్యుత్ వాహకాలు. కానీ ఉష్ణం దృష్ట్యా బంధక ధర్మాన్ని ప్రదర్శిస్తాయి.

ఉష్ణోగ్రత

ఒక వస్తువు ఉష్ణ తీవ్రత(చల్లదనం లేదా వెచ్చదనం)ను ఉష్ణోగ్రత అంటారు.

ప్రమాణాలు:

- సెల్సియస్ లేదా సెంటీగ్రేడ్ (°C)
- ఫారన్‌హీట్ (F)
- కెల్విన్- K(అంతర్జాతీయ ప్రమాణం)
- రేమర్
- రాంకైన్
- ప్రస్తుతం రేమర్, రాంకైన్ ప్రమాణాలను ఉపయోగించడం లేదు.
- సెంటీగ్రేడ్, ఫారన్‌హీట్, కెల్విన్ ప్రమాణాల మధ్య సంబంధం.

$$\frac{C-0}{100}=\frac{F-32}{180}=\frac{K-273}{100}$$

ఉష్ణ మాపకాలను స్తూపాకారంలో నిర్మించడం వల్ల వాటి సున్నితత్వం పెరిగి కచ్చితమైన రీడింగ్‌లను సూచిస్తాయి.

- సెల్సియస్‌లు, ఫారన్‌హీట్‌లు ఒకదానితో ఒకటి ఏకీభవించే రీడింగ్ – 40.

$C = F = x$ అనుకుంటే

$$\frac{C-0}{100}=\frac{F-32}{180}$$

$$\frac{x}{100_5}=\frac{x-32}{180_9}$$

$$10x-320=18x$$

$$8x=-320$$

$$x=-40$$

సెల్సియస్, కెల్విన్‌ల మధ్య సంబంధం:

$$\frac{C-0}{100}=\frac{K-273}{100}$$

$$C=K-273$$

$$\boxed{K=(C+273)\ \text{Kelvins}}$$

i) మంచు ఉష్ణోగ్రతను కెల్విన్‌లలో తెలిపినప్పుడు..

$$=(°C+273)$$
$$=0°C+273=273K$$

ii) నీటి ఆవిరి ఉష్ణోగ్రత 100°C, చంద్రుడిపై పగటి సగటు ఉష్ణోగ్రత 100°C అనుకుంటే అవి కెల్విన్‌లలో..

$$=100°C+273=373\ K$$

iii) నీటి అసంగత వ్యాకోచ ఉష్ణోగ్రత 4°C అయితే కెల్విన్‌లలో..

$$=°C+273$$
$$=4°C+273$$
$$=277\ \text{Kelvins}$$

iv) ఆరోగ్యవంతుడైన మానవుడి శరీర ఉష్ణోగ్రత 37°C అయితే కెల్విన్‌లలో..

$$=°C+273$$
$$=37°C+273$$
$$=310\ \text{Kelvins}$$

v) పాల పాశ్చరైజేషన్ ఉష్ణోగ్రత 67°C. ఈ విలువ కెల్విన్‌లలో..

$$K=°C+273$$
$$K=67°C+273$$
$$K=340\ \text{Kelvins}$$

vi) గది ఉష్ణోగ్రత(25°C) వద్ద ఒక పాత్రలో బంధించి ఉన్న వాయువులు −273°Cకు చల్లార్చినప్పుడు ద్రవాలుగా మారి పీడనం శూన్యమవుతుంది.

−273°C కెల్విన్‌లలో..

$$K=°C+273$$
$$K=-273+273$$

K= 0 Kelvin (పరమశూన్య ఉష్ణోగ్రత)

ఉష్ణమాపకాలు- రకాలు

ఒక వస్తువు ఉష్ణోగ్రతను కొలవడానికి ఉష్ణమాపకాన్ని ఉపయోగిస్తారు. దీన్ని 16వ శతాబ్దంలో గెలీలియో కనుగొన్నాడు.

ఘన పదార్థ ఉష్ణ మాపకాలు

ఘన పదార్థాలను వేడిచేసినప్పుడు అవి వ్యాకోచిస్తాయి. ఈ సూత్రం ఆధారంగా ఈ ఉష్ణ మాపకాలు పనిచేస్తాయి. అయితే భిన్నమైన ఘన పదార్థాల ఉష్ణ వ్యాకోచాలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ఇలాంటి ఉష్ణ మాపకాలను ఉపయోగించి వస్తువుల ఉష్ణోగ్రతలను కచ్చితంగా కొలవడం సాధ్యం కాదు. అందువల్ల ఇలాంటి మాపకాల్ని ప్రస్తుతం ఉపయోగించడం లేదు.

ద్రవ పదార్థ ఉష్ణ మాపకాలు

ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు వాటి ఘన పరిమాణాలు వ్యాకోచిస్తాయి. ఈ సూత్రం ఆధారంగా ద్రవ పదార్థ ఉష్ణమాపకాలు పనిచేస్తాయి. వీటిలో పాదరసం, ఆల్కహాల్ లేదా నీటిని ఉపయోగిస్తారు.

- శీతల ప్రాంతాల్లో వస్తువుల ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగించే ఉష్ణమాపకాన్ని క్రయోమీటర్ (Cryometer) అంటారు. సాధారణంగా వీటిలో ఆల్కహాల్ ఉష్ణమాపకాలను ఉపయోగిస్తారు.
- నీటి విశిష్టోష్ణం ఎక్కువ ఉండి, ఆలస్యంగా వేడెక్కి, ఆలస్యంగా చల్లబడే గుణాన్ని కలిగి ఉండటం వల్ల వాహనాల రేడియేటర్లలో కూలెంట్ (శీతలీకరణి)గా నీటిని ఉపయోగిస్తారు.

ద్రవ పదార్థ ఉష్ణమాపకాల్లో నీటికి బదులుగా పాదరసాన్ని ఉపయోగించడానికి కారణాలు..

పాదరసం	నీరు
పాదరసం సంకోచ, వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉంటాయి.	నీటి సంకోచ, వ్యాకోచాలు సమానంగా ఉండవు.
పాదరసం.. మాపకాల గోడలకు టుకోదు.	నీటి అణువులు మాపకాల గోడలకు అంటుకుంటాయి.
స్వభావరీత్యా పాదరసం వెండిలా మెరుస్తుంది. అందువల్ల రీడింగ్‌లను కచ్చితంగా గుర్తించవచ్చు.	నీటికి రంగు ఉండదు. కాబట్టి రీడింగ్‌లను కచ్చితంగా కొలవడం సాధ్యం కాదు.
అన్ని ద్రవపదార్థాలతో పోల్చినప్పుడు పాదరసం విశిష్టోష్ణం కనిష్టం. కాబట్టి ఇది త్వరగా వేడెక్కి త్వరగా చల్లబడుతుంది.	నీటి విశిష్టోష్ణం అన్ని ద్రవపదార్థాల కంటే ఎక్కువ. అందువల్ల ఆలస్యంగా వేడెక్కి, ఆలస్యంగా చల్లారుతుంది.

సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టిందెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

అసఫ్‌జాహీలు

మొగల్ సామ్రాజ్యానికి జాగీర్దార్‌గా హైదరాబాద్‌లో అసఫ్ జాహీ వంశం ప్రారంభమైంది. మొదటి అసఫ్ జా మరణానంతరం ఈ రాజ్యం స్వతంత్రత కోల్పోతూ వచ్చింది. మహారాష్ట్రుల నుంచి రక్షణ కోసం ఆంగ్లేయులతో ఒప్పందం చేసుకోవడానికి నిజాం అలీ ప్రయత్నించాడు. కానీ 1763లో మూడో కర్ణాటక యుద్ధ వ్యవహారాల్లో తలమునకలై ఉన్న బ్రిటిషర్లు నిజాం అలీ ప్రతిపాదనలను అంగీకరించలేదు.

- ఉత్తర సర్కారులన్నింటినీ బ్రిటిషర్లకు ఇచ్చేలా మొగల్ చక్రవర్తి 'షా ఆలం' నుంచి 1765లో రాబర్ట్ క్లైవ్ ఒక ఫర్మానా పొందాడు.
- భారతదేశం నుంచి ఫ్రెంచి వారిని తరిమివేసే ఉద్దేశంతో లార్డ్ వెల్లస్లీ దేశంలో సైన్య సహకార ఒప్పందం ప్రవేశపెట్టాడు. దీనిపై హైదరాబాద్ నిజాం అలీ మొదట సంతకం చేశాడు. దీని ప్రకారం నిజాం అలీ రాజ్యంలో బ్రిటిష్ సైన్యం శాశ్వతంగా ఉండే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఈ సైన్యానికి జీతాలు ఇవ్వడానికి దత్త మండలాలు ఇచ్చారు. బ్రిటిష్ ప్రతినిధి నిజాం అలీ ఆస్థానంలో నివాసం ఉన్నాడు.
- సికిందర్ జాతో 1800లో సైన్య సహకార ఒప్పందంపై మరోసారి సంతకం చేయించారు. దీంతో నిజాం అధికారాలు ఈస్టిండియా కంపెనీ పరిధిలోకి వెళ్లిపోయాయి. కంపెనీ చేతుల్లో నిజాం కీలుబొమ్మగా మారాడు.
- కంపెనీకి తెలియకుండా ఇతర పాలకులతో ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవడానికి నిజాంకు వీల్లేకుండా పోయింది. అంతరంగిక వ్యవహారాల్లోనూ నిజాం అధికారాలకు పరిమితులు విధించారు.
- తన సొంత ప్రధాని లేదా దివాన్‌ను నియమించడానికి కూడా కంపెనీ అనుమతిని పొందాల్సిన పరిస్థితి నిజాంకు ఏర్పడింది.
- రెండో ఆంగ్లో - మహారాష్ట్ర యుద్ధంలో కంపెనీకి నిజాం పూర్తి సహకారం అందించలేదు. దీన్ని తీవ్రంగా భావించిన గవర్నర్ జనరల్ వెల్లస్లీ 1803లో నిజాంతో బలవంతంగా మరో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఒప్పందం ప్రకారం యుద్ధ సమయాల్లో నిజాం సైన్యాన్నంతా కంపెనీ ఆధీనంలో ఉంచాలి.

హైదరాబాద్‌లోని బ్రిటిష్ ప్రతినిధి 'మీర్ ఆలం'ను దివాన్‌గా నియమించాల్సిందిగా నిజాంకు వెల్లస్లీ సిఫార్సు చేశాడు. దీంతో కంపెనీకి నమ్మకస్థుడైన మీర్ ఆలంను నిజాం అయిష్టంగానే దివాన్‌గా నియమించాడు. మీర్ ఆలం పెత్తనాన్ని అదుపు చేయడానికి సికిందర్ జా తన స్నేహితుడైన మహిపతి రామ్‌ను పేష్కారు (డిప్యూటీ దివాన్)గా నియమించడానికి ప్రయత్నించాడు. బ్రిటిష్ ప్రతినిధి కెప్టెన్ సైడన్ హాం 'మహిపతి రామ్'ను కాకుండా రాజా చందులాల్‌ను పేష్కారుగా నియమించాడు. 1810లో సైడన్ హాం పదవీ విరమణ చేసిన తర్వాత చందూలాల్‌ను దెబ్బతీయాలని నిజాం ప్రయత్నించాడు. పదవి స్వీకరించినప్పటి నుంచి ప్రభుత్వ లెక్కలను చూపమని 1806లో నిజాం చందూలాల్‌ను అడిగాడు. ఈస్టిండియా కంపెనీ చందూలాల్‌ను ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. బ్రిటిష్ నూతన ప్రతినిధి హెన్రీ రస్సెల్ 1811లో నిజాంను కలిసి చందూలాల్ పట్ల నిరాదరణకు తన నిరసన తెలిపాడు. తన పరిస్థితిని గుర్తించిన నిజాం సికిందర్ జా ప్రభుత్వ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనడం మానేశాడు. దీంతో 1811 నుంచి బ్రిటిష్ ప్రతినిధి నిజమైన పాలకుడయ్యాడు.

నిజాం రాజ్యంలో అరాచక పరిస్థితులను చక్కదిద్దడానికి బ్రిటిష్ ప్రభుత్వ అనుమతితో హెన్రీ రస్సెల్ హైదరాబాద్‌లో నూతన సైన్యాన్ని ఏర్పాటు చేశాడు. దీన్నే రస్సెల్ బ్రిగేడ్ లేదా రస్సెల్ సైన్యం అంటారు. ఇదే తర్వాతి కాలంలో హైదరాబాద్ 'కాంటిజెంట్' సైన్యంగా మారింది. స్థానిక పిండారీలు, బిల్లులు, జమీందార్ల ఆగడాలను అణచివేసి రాజ్యంలో శాంతి భద్రతలు కాపాడారు. 1860, 1867లో మొదటి సాలార్జంగ్‌ను పదవి నుంచి తొలగించడానికి నిజాం యత్నించాడు. కానీ హైదరాబాద్‌లోని బ్రిటిష్ ప్రతినిధులు అతడి పదవిని రక్షించారు. 1860లో హైదరాబాద్‌లోని బ్రిటిష్ ప్రతినిధి కల్నల్ డేవిడ్‌సన్ జోక్యం చేసుకోవడంతో నిజాం మొదటి సాలార్జంగ్‌ను పదవి నుంచి తొలగించలేకపోయాడు. 1867లో బ్రిటిష్ ప్రతినిధి యూల్ సహాయంతో సాలార్జంగ్ తన పదవిని నిలుపుకున్నాడు.


> సిపాయిల తిరుగుబాటు సమయంలో నిజాం తీసుకున్న నిర్ణయం వల్ల ఉత్తర భారతదేశ విప్లవ జ్వాలలు దక్షిణానికి వ్యాపించకుండా నిలిచిపోయాయి. నిజాం కలసి వస్తే ప్రజలు పెద్ద సంఖ్యలో తిరుగుబాటులో పాల్గొనేవారు. ఉత్తర భారతదేశంలో నానాసాహెబ్ పీష్వా లాంటి ప్రముఖుల నాయకత్వంలో తిరుగుబాటు కొనసాగింది. ఢిల్లీలో ఉద్యమం చెలరేగిన వార్త హైదరాబాద్ చేరగానే నగర ప్రజల్లో భావోద్వేగాలు ఎక్కువయ్యాయి. మసీదు గోడలపై, ప్రముఖ కూడళ్ల వద్ద ప్రకటనలు వెలిశాయి. ఢిల్లీ పాదుషా లేదా ఇస్లాం మతం పేరు మీద తిరుగుబాటు లేవదీయాలని ప్రజలు నిజాంను కోరారు. వారు 'అల్లా, ప్రవక్త ఆశీస్సులు అఫ్జలుద్దౌలాకు ఉన్నాయి. భయపడొద్దు' అని నినదించారు.

సిపాయిల తిరుగుబాటు

1857లో చెలరేగిన సిపాయిల తిరుగుబాటు ఆంగ్ల ప్రభుత్వ పునాదులను కదిలించింది. ఉత్తర భారతదేశంలో.. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో ఈ తిరుగుబాటు తీవ్ర స్థాయిలో జరిగింది. సిపాయిల తిరుగుబాటు ప్రభావం దక్షిణ భారతంలోని ఆంధ్ర ప్రాంతం కంటే హైదరాబాద్ సంస్థానం, ఇక్కడి ప్రజలపై ఎక్కువగా ఉంది. హైదరాబాద్ సంస్థానంలో ముస్లింల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. సహజంగానే వీరు ఉత్తర భారతదేశంలోని ముస్లిం తిరుగుబాటుదారుల వైపు మొగ్గు చూపారు.

హైదరాబాద్ నిజాం, అతడి ప్రధానమంత్రి సాలార్జంగ్ బ్రిటిషర్లకు విధేయులుగా ఉండేవారు. అయినప్పటికీ ముస్లింలలోని కొన్ని వర్గాలు ఉత్తర భారతదేశంలోని తిరుగుబాటుదారులకు మద్దతు పలికాయి. వాస్తవానికి హైదరాబాద్ రాజ్యంలో బ్రిటిషర్లపై వ్యతిరేకత అంతకు ముందు నుంచే ఉంది. ఈస్టిండియా కంపెనీ 1789లో నిజాంతో సైన్య సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నప్పటి నుంచే బ్రిటిషర్లపై వ్యతిరేకత మొదలైంది.

- 1839 నాటికి ఈ వ్యతిరేకత వహాబీ ఉద్యమంగా రూపొందింది. బ్రిటిష్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి తీవ్రంగా ప్రయత్నించారు.
- 1839లో ఉత్తర భారతదేశం నుంచి వహాబీలు హైదరాబాద్‌కు వచ్చి బ్రిటిషర్లపై 'జిహాద్' ప్రకటించాలని బోధించారు. ఈ ఉద్యమకారులకు హైదరాబాద్ నిజాం నసీరుద్దౌలా సోదరుడైన ముబారిజుద్దౌలా ప్రోత్సాహం, మద్దతు లభించాయి.
- 'ముబారిజుద్దౌలాకు దేశ బహిష్కారం విధించకుంటే ఇరవై వేల మంది వహాబీ ఉద్యమకారులను ఎదుర్కోవడం కష్టమవుతుంది' అని బ్రిటిష్ రెసిడెంట్ పేర్కొన్నాడు. దీని ఆధారంగా ఈ ఉద్యమ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.
- ముబారిజుద్దౌలాను బహిష్కరించకుండా అరెస్ట్ చేసి కోటలో బంధించారు. ఇతడిని తెలంగాణలో తొలి స్వాతంత్ర్య సమరయోధుడిగా పేర్కొనవచ్చు.
- వహాబీలతో రహస్య మంతనాలు జరుపుతున్నాడనే కారణంతో కర్నూలు జాగీర్దారు గులాం రసూల్ ఖాన్‌ను తిరుచునాపల్లి జైలుకు పంపారు. కర్నూలు జాగీర్‌ను బ్రిటిష్ ఇండియాలో కలిపారు.
- వహాబీ ఉద్యమం 1857 సిపాయిల తిరుగుబాటుకు స్ఫూర్తినిచ్చింది.
- హైదరాబాద్‌లో శాశ్వత నివాసం ఉన్న బ్రిటిష్ సైన్యం కోసం బీరారు, రాయచూర్, ఉస్మానాబాద్ జిల్లాలను నిజాం బలవంతంగా కంపెనీకి స్వాధీనం చేయడంతో బ్రిటిషర్లపై వ్యతిరేకత మరింత పెరిగింది.



- 1855లో బొల్లారం కంటోన్మెంట్‌లో క్రైస్తవ మతంలోకి మారిన ముస్లింలు, ఇస్లాం మతాన్ని విమర్శించడం కూడా హైదరాబాద్‌లో సిపాయిల తిరుగుబాటుకు కారణమైంది.
- 1857 మే 10న మీరట్ వద్ద సిపాయిలు తిరుగుబాటు చేసినప్పుడు బ్రిటిషర్లపై ఉన్న వ్యతిరేకత బహిర్గతమైంది.
- హైదరాబాద్ నిజాం కూడా బ్రిటిషర్లపై సాగే తిరుగుబాటులో పాల్గొనాలని ప్రజలు ఆశించారు. కానీ అది నెరవేరలేదు.
- 1857 తిరుగుబాటు ప్రారంభమైన వారంలోనే 1857 మే 16న నసీరుద్దౌలా మరణించడంతో అతడి కుమారుడు అఫ్జలుద్దౌలా నిజాం పదవిని చేపట్టాడు.
- నవాబ్ అఫ్జలుద్దౌలా, అతడి ప్రధాని మొదటి సాలార్జంగ్ బ్రిటిషర్లకు అనుకూలంగా ఉన్నారు.
- ఉద్యమాల వల్ల నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో హైదరాబాద్ సంస్థానం ప్రాముఖ్యం, నిజాం స్నేహానికి ఉన్న విలువను బ్రిటిషర్లు కూడా గుర్తించారు.
- బొంబాయి రాష్ట్ర గవర్నర్ 'ఈ తిరుగుబాటుకు నిజాం సహకరిస్తే, మనం సర్వస్వం కోల్పోయినట్లే' అని గవర్నర్ జనరల్‌కు లేఖ రాశాడు.
- బ్రిటిషర్లపై తిరుగుబాటుకు ప్రజలను ప్రోత్సహించడంలో మౌల్వీ ఇబ్రహీం ప్రముఖ పాత్ర పోషించాడు. ఈ తిరుగుబాటులో సికింద్రాబాద్, బొల్లారంలోని సైన్యం కూడా పాల్గొంటుందని ప్రజలకు తెలియజేశాడు.
- అల్లావుద్దీన్ లాంటి ముస్లిం మౌల్వీలు హైదరాబాద్ మక్కా మసీదు వద్ద ఇచ్చిన ఉపన్యాసాల్లో, బ్రిటిషర్లను ఇస్లాం మత శత్రువులుగా చిత్రించారు. వారిని దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

సంస్థాన దళాల తిరుగుబాటు

ఔరంగాబాద్ వద్ద ఉన్న హైదరాబాద్ సంస్థానానికి చెందిన ఒకటో, రెండో అశ్విక దళాలు 'మా మతం వారిపై మేం యుద్ధం చేయబోము' అని ప్రకటించాయి. సంస్థానం సరిహద్దు వెలుపలికి వెళ్లేందుకు నిరాకరించాయి. ఔరంగాబాద్‌లో ఈ అశ్విక దళాల తిరుగుబాటుకు జమేదార్ అమీర్ ఖాన్, డఫేదార్ మీర్ ఫిదా అలీ నాయకత్వం వహించారు.

- మీర్ ఫిదా అలీని అధికారులు నిర్బంధించి, సైనిక న్యాయస్థానంలో విచారించి ఉరితీశారు. అతడికి సహాయం చేసిన చాలా మందిని అరెస్టు చేశారు.
- ఒకటో అశ్విక దళం సైనికులను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఔరంగాబాద్‌లో తిరుగుబాటును సులభంగా అణచివేశారు.
- బుల్దానా వద్ద ఉన్న హైదరాబాద్ కాంటిజెంట్ దళాలు కూడా ఈ తిరుగుబాటు ప్రభావానికి లోనయ్యాయి. ఈ సైన్యంలోని చాలామందిని నిర్బంధించారు.
- బుల్దానా వద్ద ఉన్న దళాల నుంచి తప్పించుకొని పారిపోయిన కొంతమంది జమేదార్ ఛీదా ఖాన్ నాయకత్వంలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఛీదాఖాన్‌ను పట్టుకొని అప్పగించిన వారికి హైదరాబాద్ ప్రభుత్వం రూ. 3 వేల బహుమతి ప్రకటించింది.
- ఛీదాఖాన్ సిపాయిలతో హైదరాబాద్‌లో అడుగు పెట్టగానే అరెస్ట్ చేశారు. ఇది మరింత ఉద్రిక్తతకు కారణమైంది.


తుర్రేబాజ్‌ఖాన్ పాత్ర

1857 జూలై 17న మక్కా మసీదు వద్ద ప్రజలు సమావేశమై ఛీదాఖాన్, అతడి అనుచరులను విడుదల చేయాల్సిందిగా నిజాంను అర్థించడానికి నలుగురు మౌల్వీలను పంపాలని తీర్మానించారు. ఈ సమావేశం గురించి తెలిసిన సాలార్జంగ్ అరబ్బీ అంగరక్షక దళాన్ని మక్కా మసీదు వద్దకు పంపాడు. అక్కడ ఉన్న వారిని ఈ దళాలు చెదరగొట్టాయి. తుర్రేబాజ్‌ఖాన్, మౌల్వీ అల్లా ఉద్దీన్ నాయకత్వంలో 500 మంది రోహిల్లాలు సుల్తాన్ బజార్‌లోని బ్రిటిష్ రెసిడెంట్ భవనంపై అదే రోజు సాయంత్రం దాడి చేశారు. రెసిడెన్సీ రక్షణ బాధ్యతను మేజర్ హెచ్‌సీ బ్రిగ్స్‌కు అప్పగించారు. ఈ దాడిలో రోహిల్లాలు వీరోచితంగా తెల్లవారుజామున నాలుగు గంటల వరకు పోరాడినా ఫలితం దక్కలేదు. రెసిడెన్సీపై జరిగిన దాడికి నాయకత్వం వహించిన తుర్రేబాజ్‌ఖాన్ తప్పించుకునే ప్రయత్నంలో ఉండగా మొగల్‌గూడ వద్ద అరెస్ట్ చేశారు. రెసిడెన్సీపై దాడికి తానే పూర్తి బాధ్యుడినని అతడు ఒప్పుకున్నాడు. బ్రిటిషర్లను భారతదేశం నుంచి తరిమివేయడానికి మత విశ్వాసంతో తిరుగుబాటు చేశానని ప్రకటించాడు. తుర్రేబాజ్‌ఖాన్‌పై విచారణ జరిపి అతడికి యావజ్జీవ దేశాంతరవాస శిక్ష విధించారు. తుర్రేబాజ్‌ఖాన్ 1859 జనవరి 18న జైలు నుంచి తప్పించుకున్నాడు. అతడిని పట్టుకోవడానికి సాయపడినవారికి రూ. 5 వేల బహుమతిని ప్రకటించారు. కుర్బాన్ అలీ అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా తూప్రాన్ గ్రామం వద్ద తుర్రేబాజ్‌ఖాన్‌ను ప్రభుత్వం అరెస్ట్ చేయడానికి ప్రయత్నించింది. తప్పించుకునే క్రమంలో బ్రిటిష్ సైనికులు జరిపిన కాల్పుల్లో తుర్రేబాజ్‌ఖాన్ మరణించాడు. అతడి శవాన్ని సుల్తాన్ బజార్‌లో వేలాడదీశారు.

- మౌల్వీ అల్లావుద్దీన్ హైదరాబాద్ నుంచి బెంగళూరుకు పారిపోయాడు. తర్వాత అతణ్ని మంగళపల్లి వద్ద అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చి విచారించి అండమాన్ ద్వీపానికి పంపించారు. 1884లో అతడు అండమాన్ జైల్లోనే మరణించాడు.
- కొలస జాగీర్దారు రాజా దీప్‌సింగ్ కొంతమంది జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారీలను కూడగట్టి కొలస్ కోటను గెరిల్లా శిక్షణ కేంద్రంగా మార్చి బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటు చేశాడు. దీంతో బ్రిటిషర్లు అతడిని అరెస్ట్ చేసి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. ఆయన జాగీర్‌ను రద్దు చేశారు. చివరికి కొలస పట్వారీ రంగారావును అండమాన్‌కు పంపడంతో 1859 నాటికి కొలసలో అల్లర్లు సద్దుమణిగాయి.
- 1859 మార్చి 25న గవర్నర్ జనరల్ తరఫున కల్నల్ డేవిడ్‌సన్ నిజాంకు కానుకలు ఇవ్వడానికి వెళ్లాడు. సాలార్జంగ్‌తో తిరిగి వస్తుండగా రోహిల్‌ఖండ్ పఠాన్ జహంగీర్ ఖాన్ వీరిపై దాడి చేశాడు. దాడి నుంచి వారు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. కానీ జహంగీర్ ఖాన్ ప్రాణాలు కోల్పోయాడు. బ్రిటిషర్లను ఎదిరించిన అజ్మత్‌సింగ్, మీర్జా చంద్, బాజీఖాన్, మౌల్వీ ఇబ్రహీంను కూడా జైలుకు పంపారు.
- ఆదిలాబాద్‌లోని నిర్మల్‌లో 1860లో రాంజీ గోండ్ నాయత్వంలో 300 మంది గోండులు, 200 మంది రోహిల్లాలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. బ్రిటిష్ సైన్యం వీరందరినీ కాల్చి చంపింది.

A computer-intensive problem runs on..

CLASSIFICATION OF COMPUTERS



DIGITAL COMPUTER

A computer that performs calculations and logical operations with quantities represented as digits, usually in the binary number system.

(i) **CLASSIFICATION BASED ON PURPOSE:**

General purpose computers: These are designed to perform a range of tasks. They have the ability to store numerous programs, but lack in speed and efficiency.

Specific purpose computers: These are designed to handle a specific problem or to perform a specific task. A set of instructions is built into the machine.

(ii) **CLASSIFICATION BASED ON SIZE AND PERFORMANCE WISE:**

EMBEDDED COMPUTERS

It is a computer system with a dedicated function within a larger mechanical or electrical system, often with real-time computing constraints. Embedded systems are commonly found in consumer, cooking, industrial, automotive, medical, commercial and military applications such as microwave ovens, washing machines and dishwashers, include embedded systems to provide flexibility, efficiency and features.

MICRO COMPUTER OR PERSONAL COMPUTER

- **Desktop Computer:** a personal or micro-mini computer sufficient to fit on a desk.
- **Laptop Computer:** a portable computer complete with an integrated screen and keyboard. It is generally smaller in size than a desktop computer and larger than a notebook computer.
- **Palmtop Computer/ Digital Diary /Notebook /PDAs:** a hand-sized computer. Palmtops have no keyboard but the screen serves both as an input and output device.
- **Workstations**

A terminal or desktop computer in a network. In this context, workstation is just a generic term for a user's machine (client machine) in contrast to a "server" or "mainframe."

BANK EXAMS

COMPUTER AWARENESS

Mini Computer

It is a midsize computer in size and power, minicomputers lie between workstations and mainframes in general, a minicomputer is a multiprocessing system capable of supporting from 4 to about 200 users simultaneously.

Mainframe Computer

A very large and expensive computer capable of supporting hundreds, or even thousands, of users simultaneously. In some ways, mainframes are more powerful than supercomputers because they support more simultaneous programs. These are mainly used servers in banks.

Super Computer

The fastest and most powerful type of computer Supercomputers are very expensive and are employed for specialized applications that require immense amounts of mathematical calculations. For example, weather forecasting requires a supercomputer. Other uses of supercomputers include animated graphics, fluid dynamic calculations, nuclear energy research, and petroleum exploration.

ANALOG COMPUTER

An analog computer (spelt analogue in British English) is a form of computer that uses continuous physical phenomena such as electrical, mechanical, or hydraulic quantities to model the problem being solved

Hybrid Computer (Analog + Digital)

A combination of computers those are capable of inputting and outputting in both digital and analog signals. A hybrid computer system setup offers a cost effective method of performing complex simulations.

MODEL BITS

1. The product of two binary numbers (1011) and (1001) is____
   1) 1011001 2) 1010100
   3) 1100011 4) 100110
   5) None of these
2. MS -DOS is usually supplied on a
   1) Hard disk
   2) floppy disk or diskettes
   3) CD ROM 4) Cartridge tape
   5) None of these
3. When a key is pressed on the keyboard, which standard is used for converting the keystroke into the corresponding bits?
   1) EBCDIC 2) ASCII
   3) ANSI 4) ISO
   5) None of these
4. A thing present in real world in physical form is called ____
   1) DBMS 2) Keywords
   3) Modulation 4) Entity
   5) None of these
5. Programming language built into user programs such as Word and Excel are known as____?
   1) 4GLs
   2) Visual programming languages
   3) Object-oriented languages
   4) Macro languages
   5) None of these
6. A program that generally has more user-friendly interface than a DBMS is called a ____?
   1) form 2) repository
   3) back end 4) front end
   5) None of these
7. Antivirus software is an example of____
   1) a security utility
   2) an operating system
   3) business software
   4) an office suite
   5) None of these
8. System software is the set of programs that enables your computer's hardware devices and ____ software to work together.
   1) application 2) processing
   3) utility 4) management
   5) None of these
9. In a ring topology, the computer in possession of the______ can trasmit data.
   1) packet 2) token
   3) access method 4) data
   5) None of these
10. A computer-intensive problem runs on a ____.
    1) supercomputer
    2) mainframe 3) server
    4) super PC 5) None of these
11. The term _____ designates equipment that might be added to a computer system to enhance its functionality.
    1) peripheral device
    2) system add-one 3) disk pack
    4) digital device 5) None of these
12. A collection of interrelated files in a computer is a _____.
    1) file manager 2) field
    3) database 4) record
    5) None of these
13. When installing _____, the user must copy and usually decompress program files from a CD-ROM or other medium to the hard disk.
    1) programming software
    2) applications software
    3) applications hardware
    4) system hardware
    5) None of these
14. ____is the ability of an operating system to control the activities of multiple programs at the same time.
    1) Multitasking 2) Streamlining
    3) Multiuser 4) Simulation
    5) None of these
15. Which of the following computer language is a mathematically oriented languages used for scientific problems?
    1) FORTRAN 2) COBOL
    3) LISP 4) PROLOG
    5) APPLE
16. Which of the following terms is just the connection of personal networks that can be joined together?
    1) Virtual private network
    2) Internet 3) Intranet
    4) Extranet 5) None of these
17. For large network which topology is used?
    1) Star 2) Ring 3) Bus
    4) Mesh 5) None of these
18. A special high-speed line used by large corporations to support digital communications is known as:
    1) Satellite/ Air connection service lines
    2) Cable modems
    3) Digital subscriber lines
    4) T1, T2, T3 and T4 lines
    5) None of the above
19. A language that refers to the way people think mathematically is called as ____
    1) Functional language
    2) Cross-platform language
    3) Event driven programming language
    4) Object oriented language
    5) None of these
20. When you are typing the text in a document, you would need to hit the enter key at the end of every ______.
    1) line 2) sentence
    3) paragraph 4) word 5) file
21. _____ displays each slide of the PPT as a thumbnail and is used to re-arrange them.
    1) Slide Show
    2) Slide Display
    3) Slide Design
    4) Slide Layout
    5) Slide Sorter

KEY

1) 3	2) 2	3) 3	4) 4	5) 2
6) 4	7) 1	8) 1	9) 2	10) 1
11) 1	12) 3	13) 2	14) 1	15) 1
16) 3	17) 4	18) 4	19) 1	20) 3
21) 5				